సాహిత్య
సమాలోచనము



సాహిత్యాచార్య, ఆంధ్ర ఆర్నాల్డు
శ్రీ పిల్లలమఱ్ఱి
వేంకట హనుమంతరావు, ఎం. ఏ.
ఆంధ్రోపన్యాసకులు : హిందూ కళాశాల



శారదాపీఠము : గుంటూరు

Text for B. A. Degree Exam. 1961 to '63 Andhra University

శ్రీ పిల్లలమర్రి వారి

సాహిత్య సమాలోచనము

మూలకు ఉపాయలు



This SAHITYA SAMALOCHANAMU
has been formerly a Text-Book
for "Bhasha praveena", Andhra University,
for 'Visarada', Andhra Saraswata Parishad,
for B. A. Cutack University,
for B. A. Spl. Telugu. Osmania University,
for Vidwan & Inter Spl. Telugu, Madras University.



ప్రథమ ముద్రణము, మే 1946
ద్వితీయ ముద్రణము, మే 1954
తృతీయ ముద్రణము, జనవరి 1959
చతుర్థ ముద్రణము, నవంబరు 1960



ప్రకాశకులు
శ్రీ పిల్లలమర్రి వేంకట సుబ్రహ్మణ్యం
పుణ్యధామం : పట్టాభిపురం : గుంటూరు—2.

శ్రీకారము

సాహిత్య మాలోచనాత్మక మను ప్రామాణికసూక్తి నన్ను సాహిత్య సమాలోచనమునకుఁ బ్రేరేచినది.

ఆ శారదాదేవి కటాక్షము, నా పూర్వజన్మ సుకృతము లొనగూడి సాహిత్యామృతాస్వాదన ప్రతిపాదనములు నా తపస్యలై నిలిచినవి!

ఇందలి వ్యాసములు 1937- 946 సంవత్సరముల మధ్యకాల మందుఁ బత్రికా ముఖమున, నాకాశవాణీ ముఖమున, విశిష్టసాహిత్య సభావేదికా ముఖమునను నేను జేసిన కొన్ని యుపన్యాసములు, కొలఁది మార్పులతోఁ జేర్పులతో నిట్టి గ్రంధరూపము దాల్చినవి.

సంస్కృతాంగ్లాలంకారిక మత సమన్వయమును సాధింపఁబూనిన కొలఁది యాంధ్ర గ్రందములలో నిది ప్రథమ శ్రేణికిఁ జెందియుండుట నా యదృష్టము. ఇయ్యది సాహిత్యసూత్ర గ్రంథనమునందు నాంధ్ర సాహిత్యప్రక్రియా స్వరూప నిరూపణమందు సంగ్రహరూపమున వెలువడిన ప్రథమ గ్రంథమగుటయు నాకు గర్వకారణము.

[illegible] కాలమునం బ్రత్యేక [illegible] నా వ్యాఖ్యములం [illegible] వారి [illegible] యున్నవి.

ఈ 'సాహిత్య సమాలోచనము' [illegible] పక్షమున 1946 లో [illegible] శ్రీ ఆంజనేయ స్వామివారి [illegible] శ్రీ [illegible] శాస్త్రిగారు సభాపతులుగా, శ్రీ [illegible] విద్యార్థి [illegible] లాంఛనములతో [illegible] మహోత్తములునైన బ్రహ్మశ్రీ [illegible] కరగ్రహణము [illegible] సహృదయులు గౌరవముతో [illegible] "ప్రవేశిక" [illegible] కొన్నది.

ఆంధ్ర, మద్రాసు, కటక్, ఉస్మానియా విశ్వకళాపరిషత్తులలో నిది [illegible] ముద్రణము పొందెను. యీ [illegible] ఈ గ్రంథము నాచేఁ బరిష్కృతమై [illegible] ముద్రణము పొందుచున్నందులకు సంతసించుచున్నాను. నా [illegible] సాహిత్య [illegible] దోహద మొనరించిన [illegible] అన్నదా [illegible] శ్రీ [illegible] లక్ష్మీకాంత మహోదయులకు, [illegible] కృతజ్ఞతాంజలి నివేదించుచున్నాను.

[illegible] [illegible] తనయుఁడు,

21 నవంబరు, 1960 పిల్లలమఱ్ఱి వేంకట హనుమంత రావు

ప్రవేశిక

ఆధునికాంధ్ర వాఙ్మయప్రపంచములో గ్రంథమునకు తత్కర్త వరించిన వారొకరు పీఠిక వ్రాయుట నూతనాచారము. సాహిత్యము నా కర్మక్షేత్రము కాకపోయినను ఏతద్గ్రంథకర్త అట్టిభారమును ఆదరముతో నామీద మోపినపుడు మైత్రిని పురస్కరించుకొని కాదనలేక పోయినాను. నేనిందు వెల్లడించుభావములు సాహితీపరుల యామోదమును పడయనిచో అట్టివి ప్రవచించుట కధికారము లేనివాడ నగుటచేత తప్పక వారు నన్ను మన్నింపగలరు.

పూర్వోక్త నూతనాచారము ప్రాయికముగా గ్రంథకర్తను పాఠకలోకమున కెఱుకపఱచి, తన్మూలమున వారి యాదరాభిమానములను గ్రంథకర్తకును, గ్రంథమునకు సంతరించుటకు కావచ్చును. ఇది సరియైన యభిప్రాయ మనుకొన్నను ఏతద్గ్రంథకర్త శ్రీ పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు గారిని గుఱించి నేను పాఠకలోకమునకు క్రొత్తగ పరిచయము చేయవలసిన యావశ్యకము కాన్పింపదు. సాహిత్యరంగమున లబ్ధప్రతిష్ఠులును, సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్యవిశారదులు నైన శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్యుల వారికి వీరు జామాత. వారితోడి సంబంధము శ్రీ హనుమంతరావు గారి సాహిత్యకృషికి దోహద మిచ్చియుండు నని నాతలంపు. ఈ సంబంధమువలననే కాక ఇతరవిధమునను శ్రీ హనుమంతరావు గారు సాహితీసంపన్నులు. పిల్లలమఱ్ఱి

వారియల్లు—ఇప్పటికీ ఉన్నారే. కాని - ప్రాచ్యమును చదివియుండి దాపికి మేకదా! ఈ యువసాహితీపరులు రచియించిన గేయములును, కథలును, వ్యాసములును, విశాలాంధ్ర సాధనసమితి పక్షమున ప్రకటితములైన గ్రంథములును ఈనాటికే ఆంధ్రపాఠకలోకమున ప్రచారముపొంది బుధజనమున కానందమును గూర్చుచున్నవి.

ఈ 'సాహిత్యసమాలోచనము' శ్రీ హనుమంతరావుగారు ఆంధ్రశారదా పీఠమునకు సమర్పించిన క్రొత్తకానుకయగును. సాహిత్య విషయములను గురించియు, ఆంధ్రసాహిత్యమును గురించియు అప్పుడప్పుడు హైదరాబాదు, మద్రాసు రేడియోకేంద్రములనుండి 'ప్రసారితము'లైన ప్రసంగములును, వేఱు వేఱు తెలుగుపత్రికలకు వ్రాసిన వ్యాసములును, వీని కొక చక్కని క్రమము నిడి, ఆంధ్రసాహిత్యవికాసము చక్కగా బోధపడుటకు నూతనముగా రచియించిన రెండుమూడు వ్యాసములను కలియజేర్చి ఈ 'సాహిత్య సమాలోచన' మను గ్రంథము కూర్పబడినది. ఇందలి మూడుభాగములలో మొదటి భాగమునందలి సాహిత్యవిషయములు సిద్ధాంతరూపమైనవి: రెండవ భాగమున గ్రంథకర్త పదకవిత్వ, ప్రబంధవాఙ్మయ, రూపకవికాసాదులను గురించి చేసిన చక్కనివిమర్శలున్నవి. మూడవభాగమునందలి ఆంధ్రసాహిత్య పరిణామ వ్యాస మొక యపూర్వోపన్యాసము. ఇందు ఆంధ్రసాహిత్యపరిణామము దిఙ్మాత్రముగ సూచితమైనది. పూర్వోక్తవిషయముల ననుసరించి ఇది యొక యపూర్వగ్రంథ మనుటకు సందియము లేదు. ఈ 'సాహిత్య సమాలోచనము' వాస్తవమునకు లక్ష్యలక్షణసమన్వితమైన ఆంధ్రసాహిత్య చరిత్రమన్నను అత్యుక్తి కాదు. ఆంధ్రసాహిత్య పఠనాభిలాషులకు ఉపయోగకరముగ నుండునట్లు ఏతద్గ్రంథాంతమున చేర్పబడిన గ్రంథనామసూచిక ఈ గ్రంథోపయోగము విలువను హెచ్చించుచున్నది. నేడిట్టి గ్రంథము నావశ్యకత ఎక్కువగ గలదు. ప్రాచీనాంధ్ర సాహిత్య పరిచయము గలవారిసంఖ్య నాటికినాడు క్షీణించుచున్నది. అందువలన మన ప్రాచీన సాహిత్యసిద్ధాంతములను గురించియు, సంప్రదాయములను గురించియు దెలిసినవారు చాల కొద్దిమంది.

నేటి కాలపరిస్థితులకు దగినట్లు ఆంధ్రసాహిత్య రంగమునను ప్రకృతమున గొప్ప గాలిమార్పులు వీచుచున్నవి. సాహిత్యతత్త్వ, స్వభావ, ప్రయోజ

నముల విషయమున పత్రికలలో నేడు వాద ప్రతివాదములు సాగుచున్నవి. ఈవాద ప్రతివాదములను పరిశీలించినచో ఈప్రశ్నలు నేడేపుట్టినవా? ఇదివఱకు సాహిత్యమే లేదా? సాహిత్యసృష్టికి నేటినుండియే యారంభమా యనిపించుచున్నది.

ఒకవిధముగ జూచినయెడల మన తెనుగుసాహిత్యమున పునస్సృష్టికిపుడు మొదలనుట సత్యమే కావచ్చును. 'కావ్యం యశసే౽ర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే, సద్యఃపరనిర్వృతయే కాంతా సమ్మితతయోపదేశయుజే' అని వందలకొలది సంవత్సరములనుండి ప్రవచింపబడుచు వచ్చిన కావ్య ప్రయోజన నిర్వచనము నింతవఱకు కవిపండితలోక మాదరించి గౌరవించినను ఆధునికులు కొందఱు అజ్ఞతనైననేమి, విజ్ఞతనైననేమి దీని ననాదరించి క్రొత్త నిర్వచనములను జేయుచు క్రొత్త సిద్ధాంతములను ప్రతిపాదించుచున్నారు. రాజకీయ, సాంఘిక ఆర్థిక సిద్ధాంతములవలననే ఇవియు నేటి సాహితీపరుల హృదయములలో కలకలమును రేపి సంఘమును కల్లోలపఱుచుచున్నవి. కవిత్వమన్న నేమి, ఎందుకు, ఎవరికొఱకు, కళాప్రయోజనమేమి, ఎవరికొరకు అను ప్రశ్నములు చాలచోట్ల నేడు తఱచుగ వినవచ్చుచున్నవి. ప్రాచీనతమీద నొకవిధమైన యసంతృప్తి, నవ్యకావ్యసృష్టికి ఒకవిధమైన తహతహ అట్లు ప్రశ్నించువారిలో ఒకప్పుడు కాకున్నమానె వేఱొకప్పుడయినను గోచరింపక పోవు. ఈ ప్రశ్న అర్థరహితములైనవని త్రోసిపుచ్చుటకంటె వానిని సానుభూతితో నవబోధము చేసికొని వానికీయవలసిన సమాధానములను గుఱించి మననము చేయుట శ్రేయస్కరమును, వివేకలక్షణమును. జాతీయ జీవితమునకు సంబంధించిన ప్రతివిషయమును తర్కవితర్కములకు లోనై ప్రశ్నార్థకముగ పరిణమించుచున్న యీ విషమకాలమున చారిత్రకముగ మన సాహిత్య పరిణామమును పరిశీలించినపుడు కాని సాహిత్యరంగమునందలి నేటి యలజడికి కారణము సుబోధము కాజాలదు.

సాహిత్యము ప్రాచీనకాలమున ప్రధానముగ బ్రాహ్మణాధీనము. అధ్యయన, అధ్యాపనములు బ్రాహ్మణుల ప్రధానవృత్తులు. సాహిత్యస్రష్టలును వారే. అటువెనుక కొంతకాలమునకు గాని క్షత్రియులు సాహిత్యరంగమున ప్రవేశింపలేదు. మనయిప్పటి పురాణవాఙ్మయము ప్రధానముగ క్షత్రియోపజ్ఞ

మన ప్రాచ్యపరిశోధక పండితులవారిని. స్తుతియుక్తిజ్ఞులైన భావకులు, కావ్యనిర్మాతలుగను, కవిపోషకులుగను, వానికెక్కినవారనేకులు గలరు. వారిట్టిసాహిత్యమును సృష్టించినను ఆంతకుపూర్వము భారతలోకవ్యవహార మున నుండిన సాహిత్య శాస్త్ర సూత్రముల ననుసరించక గౌరవించి యనుస రింపనుగానే చేయుచుండిరి. వారికి నేటి నిమ్నదేశ ప్రసారితమైన సాంస్కృతికదృష్టి, శాస్త్రకదృష్టి, వేదవేదాంగ విజ్ఞానము, విశేషజ్ఞానము నైన బ్రాహ్మణులకే సంఘమునను సాహిత్యరంగమునను గూడ నాగా నోన్నతస్థానము నిచ్చి హిందూసామాజికీ లితర్నలైనవారిని కూడ, రాను రాను కేవలము కావ్యానిర్వయనమునకే కాదు కావ్యసృష్టికి నుపక్రమించి సాహిత్యకృషి సాగించిరి. ఇట్టికృషియనబేశమున దాయిదాదువందలసంవత్సరములకుపూర్వమే యారంభమయినది. అయినను సాహిత్యరంగమున ప్రవేశించిన బ్రాహ్మణేతరుల సంఖ్య కనుపడమినము. వారిసంఖ్య వ్రేళ్లమీద లెక్కపెట్టదగి యుండుటకు అప్పటి సాంఘిక రాజకీయ ఆర్థికపరిస్థితులే కారణము. ఇట్టివారిలో కావ్య రచనమునకు గడంగినవారిసంఖ్య మరియు నల్పము. ప్రాచీన లక్షణకర్తలును, ఆలంకారికులును చూపినత్రోవ ననుసరించి వీరలు భారతీయసాహిత్యసంప్ర దాయానుగుణముగ కావ్యము వ్రాసిరి. కొందరికి నూతనులైన సాహితీపరుల సాహిత్యసిద్ధాంతములు నచ్చక కావ్యములు వ్రాసిరి. ఒకొక పెద్దరాచబాట పడి పోయినదేసాదో వేదశాస్త్రలక్షణపూర్వము కావ్యరచనానిపుణులైన కవులును, పండితులును నలిగి నట్టు మెట్టలేని యా ప్రాతరాచబాటను గతానుగతికముగ పోయినవారే; పోవుచున్నవారే. దానిని విడిచిపోక్కొ నిశిష్టసృష్టి గావించు టకు ప్రతిభావంతులైనవారిలోనెక్కొ నెమ్మదియు జాలము సాహసమును లేదు.

కాని కాలము మారినది. ఇరువదియవశతాబ్ది ప్రారంభమున దేశ కాల పరి స్థితులలో మార్పులనేకము వచ్చినవి. భారతీయులు స్వాతంత్ర్య విరహితులై నారు. పూర్వపు మా విద్యల నాదరించి పోషించు దేశీయప్రభువుల పరిపాలన మంతరించినది. విజాతీయ భిన్నసంస్కృతి సభ్యతలుగల బ్రిటీషువారు మనకు ప్రభువులైనారు. మనము వారికి దాసుల మయినాము. మన విద్యాపద్ధతులు పూర్వమునకు పూర్తిగ మారినవి. ఉన్నతపాఠశాలలలోను విశ్వవిద్యాలయ ములలోను గూడ విద్యనేర్పు భాష ఆంగ్లమైనది. ఆంగ్లవిద్యా వ్యాపనము

హెచ్చినది. రాజభాష ఆంగ్లము. ఆంగ్లభాషాద్వారమున మనకు యూరోపియ సాహిత్యములతో సన్నిహిత సంబంధము కలిగినది. భారతీయ విజ్ఞాన పేటికయైన సంస్కృతము ప్రచారము లేకపోయినను సంస్కృతమున నున్న వేదశాస్త్ర కావ్యలక్షణ గ్రంథాదులు యూరోపియ దేశభాషాగ్రంథముల వలెనే ఆంగ్లమునకును పరివర్తితములై నేడున్నత విద్యాభ్యాసముచేయు నెల్ల వర్ణములవారికి నందుబాటులోనికి వచ్చినవి. ఒక్క భారతీయ సంస్కృత విజ్ఞానము మాత్రమే కాక ప్రపంచమున వేలువేలు దేశములందలి యుత్తమ సాహిత్య విజ్ఞానము సైతము ఈవర్ణ మావర్ణ మనక ఉన్నతవిద్య నభ్యసించు వారి కెల్లరకు లభించుచున్నది. పొగయోడ, ధూమశకటము, విమానము, రేడియో, వైర్లెస్ వచ్చి నేడు ప్రాతప్రపంచమునకు, క్రొత్తప్రపంచమునకు, ఖండములకు ఖండములకు, దేశములకు దేశములకుగల దూరమును కత్తిరించివైచి ఒండొంటిని మనయింటి ముంగిలికి, మనయింటికే తెచ్చిపెట్టుచున్నవి. ప్రపంచమునం దేక్షణమున నెచ్చట మేధావులైన శాస్త్రవేత్త లేక్రొత్తవిషయమును గనిపట్టినను క్రొత్తసిద్ధాంతము ప్రతిపాదించినను, ప్రతిభావంతులైన సాహిత్య విశారదులు తమ ప్రజ్ఞజూపి ఏ నూతన సాహిత్యకృతుల వెలయించినను, ఏ యపూర్వగ్రంథమును రచించినను మఱుక్షణముననే వానిని వినగలుగుచున్నాము; తెలిసికొనగలుగుచున్నాము; చదువగలుగుచున్నాము. దేశభాషల లోనికి శాస్త్రవిజ్ఞానము, ఈయుత్తమ కావ్యవిజ్ఞానము అనూదితమై పత్రికల ద్వారా, రేడియోద్వారా గ్రంథములద్వారా జనులకు లభించుచుండుటచేత నేడు కావ్యరచనాధురీణు డొక్కడే కాదు, విద్యార్థి డొక్కడే కాదు, సామాన్యమానవుడుకూడ నఖిలప్రపంచ సంబంధి యగుచున్నాడు. ప్రపంచమున నేమూలమూల ప్రచలితములగుచున్న భావములైనను సరే, సిద్ధాంతములైనను సరే, అతని హృదయము నుద్రేకపఱచుచున్నవి; అతని మనసులో నూతనభావములను ప్రేరేపుచున్నవి. అతడు అమెరికా సాహిత్యమునందలి క్రొత్తపోకడలను గమనింపగలుగుచున్నాడు. జర్మనీ సాహిత్యమునందలి జగ్గునిగ్గులు పరిశీలింప గలుగుచున్నాడు. బ్రిటను, ఫ్రాన్సు, రష్యా దేశములలో బుట్టిన మహాకావ్యములను, నాటకములను జదివి యానందించుచున్నాడు; చైనా, జపాను సాహిత్యములను విమర్శించుచున్నాడు; సంస్కృతము నేర్వకయే ప్రాచీనభారతీయ శాస్త్ర కావ్యకళా సిద్ధాంతములను

పరామర్శించుకొనుచున్నారు. నేడు లభ్యమగుచున్న అఖిల ప్రపంచ విజ్ఞానజన్యమగు నూతనసృష్టితో తన పూర్వపు సాహిత్యమును, సాహిత్యరీతులను, సంఘమును, ఆచారములను—సమస్తమును అన్వేషణజ్యోతిని వెలిగించి గుణదోష పరిశీలనము చేసికొనుచున్నారు. ఇటువంటిస్థానము నేడొక్క యాంధ్రదేశమున కాదు, ఒక్క భారతదేశమున నేకాదు. సమస్త విశ్వమానవ ప్రపంచమునను కులములకు కులములకు, సంఘములకు సంఘములకు, జాతులకు జాతులకు మధ్యగల కృత్రిమావరణములు, సరిహద్దులు, పట్టింపులు నన్నియు క్రమముగా పడిపోయి విరిగిపోయి అతిసృష్టి ప్రసారసంగమము అత్యధికముగ విస్తరిల్ల ఆంధ్రుడను నేను విశ్వమానవ కుటుంబమున నొక్కడనై తత్కుటుంబ కష్టసుఖములలో సమభాగి నగుచున్నాడు. నేడు ప్రపంచమునందలి వేలువేలు జాతులన్నియు కలసి, ఏకైక మానవసంఘముగ ముడిపడి యొక్క మూసలో, నొక్క పోతలో నైక్యత భజించుచు క్రొత్తరీతులకు క్రొత్తమార్పులకులోనయి ఒక మహాసమిష్టి మానవకుటుంబముగ పరిణమించుచున్నవి. వివిధ జాతుల సాహిత్యతరంగాలు జాతిదారి నొకటి యొరసికొని ప్రవహించుచు, విశ్వమానవ సాహిత్యసాగరమునకు బాటలు దిద్దుచున్నవి. నూతన ప్రపంచశక్తి తరంగడోలికల నూయెలలూగుచు నాతనిహృదయ ముద్రిక్తమై విభ్రమము నొందుచున్నది. జాతీయ జీవనమునకు సంబంధించిన ప్రతివిషయము నూతన విజ్ఞానబల ప్రాభవ వైభవమున కిచ్చుపడుచున్న యాతనికి ప్రశ్నార్థకముగనే కనబట్టుచున్నది. జాతీయమా విజాతీయమా, సనాతనమా అధునాతనమా, వైయక్తికమా సాంఘికమా, ప్రాచీనాదర్శమా నవీనదర్శనమా అంతయు సందేహమే. అంతయు నవమానమే. ఈ ప్రశ్నలు విమర్శ జిజ్ఞాసాజన్యములు. ఎఱుకయే విజ్ఞానము. విజ్ఞానమే శక్తి. ఈ విమర్శను, ఈ జిజ్ఞాసను, ఈ విజ్ఞానబలమును కాదని త్రోసివేయుట శక్యమా, యుక్తమా?

నేటిదొకనొప్పు కలబోత. మహాసాంకర్యము. మన ప్రాచీన ఆచారములు మాఱినవి, అభ్యాసములుమాఱినవి, మతవిశ్వాసములుమాఱుచున్నవి, సంఘము మాఱుచున్నది. నూతన భౌతికశాస్త్ర విజ్ఞానాభివృద్ధితో సమస్తమును మాఱుచున్నది. అంచనకు విప్లవకరమైన మార్పు. నేడు కాలస్వభావమే మార్పు. ప్రపంచము మారుచున్నది. మనమిప్పుడు ఒకక్రొత్త ప్రపంచము వీధివాకిట

మన్నాము. నూతనప్రపంచ జీవితమున కనువుగ మనసమస్తమును సరిదిద్దుకొనవలసిన యావశ్యకత కలదు. అట్లే మనసాహిత్యమునను, సాంఘికధర్మాచర్యము లందును, అందువలననే నేడు సాహిత్యప్రయోజనమును గురించి సాహిత్య భావమును గురించి, ఇంకననేక విషయములను గురించి గాలిదుమారములు రేగుచున్నవి.

మన జీవితమునకు సంబంధించిన ఇతర రంగములందు వలెనే మనసాహిత్యరంగమునను అరాజకము ప్రబలినది; పూర్వపుసిద్ధాంతములు, ప్రాచీనసూత్రములు పనికిరావు; అవలంబనీయములైన నూతనసిద్ధాంతములేవో, నూతన సాహిత్యధర్మములేవో తెలియరావు. పూర్వపువన్నియు శిథిలములైనవి; నూతన నిర్మాణ సూత్రములు కాని పథకము కాని విశదముగ గోచరించుట లేదు. నేటి ఆంధ్రసాహిత్య స్వరూపమిది; దానిలో యువజనుల ఉద్రిక్తహృదయముల లోని భావములు తొణికిసలాడుచున్నవి. నూతన సాహిత్యరచనాప్రయత్నమున క్రొత్తతీర్పులు తీర్చవలెనని క్రొత్తపోకడలు పోవలెనని రచయితల యుత్కంఠ కానవచ్చుచున్నది. నూతన విజ్ఞానబలమున క్రొత్తసాంఘిక ధర్మసూత్రములను వేయవలెనని రచయితలకు గల కుతూహలమును గోచరించుచున్నది. అయినను ఒక్కటి చెప్పక తీరదు. నేడు తెలుగురచనలు చేయువారిలో అనేకులు ప్రాచీన ఆంధ్రసాహిత్యపు తీరు తెన్ను లెఱుగని వట్టి యుత్సాహపరులే. ఎంతటి ప్రపంచవిజ్ఞాన సంపన్నులమైనను మనము ఆంధ్రులమే. విజ్ఞాన మెక్కువయినదని మానవజాతియు మాఱదు; భావయుమాఱదు. నేటి నుండియే మనసాహిత్యము ప్రారంభముకాదు. మనకు సహస్రాబ్దుల తరబడిగ వచ్చు సంస్కృతియు గలదు. చరిత్రమును గలదు. ఈ సంప్రదాయములను, సాహిత్య, చరిత్రములను మనము చక్కగ దెలిసికొని చేసిననాడు కాని నూతన దృష్టికిబలము, తేజము, ప్రాభవము ఉండదు. నూతనకార్యరచన చేయువానికి ప్రాచీనసాహిత్య సంప్రదాయజ్ఞాన మత్యంతావశ్యకము. తెలుగునుడికారము పలుకులపొందిక, శబ్దముల స్నేహవిరోధములు, రీతులసొగసు, శయ్యల సొంపు—ఈ మొదలగునవి తెలిపినాడు కాని కావ్యరచనాకీలకము దొరకదు; నూతననిర్మాణదక్షత కుదరదు. పద్యములల్లుట కవిత్వముకానట్లే జిగిబిగి లేని వట్టి శుష్కపదములకూర్పు సాహిత్యముకానేరదు. నేడు వెలువడు

మన కావ్యములు చెక్కుటలు ఛందః ప్రస్తారపు కూర్పులును, పదముల తీర్పులు నున్నవి. కాని కవితాగుణము, శిల్పము, రసస్నిగ్ధత లేవు.

ఉత్తమకావ్యము ఉత్కృష్టమైన కళారచన. అది సార్వజనీనము, సార్వకాలికము ధర్మవిశిష్టమయినది. అందువలననే ఉత్తమకావ్యములు వందలకొలది యేండ్ల క్రిందట విరచింపబడినను అవి నేటికిని నవ్యనూతనములై మనలనలరించి మనకానందమును గూర్చుచున్నవి. ఏదేశమునందలి యుత్తమకావ్యమయినను మనభాషలోనికి అనువదితమై వచ్చినప్పుడు అది దేశ, జాతి, మత విభేదముల కతీతమైనదై మన కానందానుభవమును కలిగించుచున్నవి. ఏదేశమున గాని, ఏకాలమున గాని ఉత్తమసాహిత్యలక్షణ మిట్టిదే. ఈదృష్టితో జూచి నప్పు డుత్తమసాహిత్యమునకు ప్రాచీన, నవీన భేదములును లేవు. స్వజాతి, విజాతి భేదములును లేవు. అట్టియుత్తమ సాహిత్యసృష్టియే మన లక్ష్యముగ నుండవలెను. నవ్యసాహిత్యప్రయత్నము లట్టియుత్తమ సాహిత్యసృష్టికి దారి తీయగలిగినచో సార్థకము. హృదయము విశాలమై, విజ్ఞానసంభరితమై పరి పక్వస్థితి పొందిన కవిప్రతిభాదీప్తులైన నట్టి కావ్యసృష్టిలో నిల్చియుండగలదు.

నవీన సాహిత్యసృష్టికి గడంగుచున్న ఆంధ్ర యువకులకు ప్రాచీన సాహిత్య సంప్రదాయరీతులను దెలిపి శ్రీ పిల్లలమర్రి వేంకట హనుమంత రావుగారి 'సాహిత్యసమాలోచనము' ఉపకారకము కాగలదని నాతలంపు. శ్రీ హనుమంతరావుగారు ఇంకను అనేకగ్రంథములను రచియించి సాహిత్య కృషిచేసి యశస్సు సముపార్జింతురుగాక యని కోరుచున్నాను.

1946 మల్లంపల్లి సోమశేఖర శర్మ,
మద్రాసు ఆంధ్ర సాహిత్య పరిషత్ అధ్యక్షుడు.



సంస్కృతాంధ్రాంగ్ల భాషా కోవిదులు
విమర్శకాగ్రేసరులు, చరిత్ర రచనా చతురులు
"ఆంధ్ర సాహిత్య పితామహులు"
మహోపాధ్యాయులు, మద్గురూత్తములు


స్వర్గీయ

కురుగంటి సీతారామ భట్టాచార్యుల వారికి

ఈ సాహిత్య సమాలోచన మంకితము



శ్రీ పిల్లలమర్రి రాము



గుంటూరు మండలము: బ్రాహ్మణకోడూరులో జననము 31-12-1918; తల్లి [illegible]; తండ్రి సుబ్రహ్మణ్యం. సికిందరాబాదు మహబూబు కాలేజి, హైదరాబాదు నిజాం కాలేజి, ఆంధ్ర విశ్వవిద్యాలయములలో విద్యాభ్యాసము. తెలుగు భాషా సాహిత్యాలందు ఆనర్సు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత. ఎం. ఏ. పట్టా స్వీకారము. హైదరాబాదు ప్రభుత్వ సమాచారశాఖలో ద్విభాషిగా కొలది కాలము; గుంటూరు హిందూ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా 1943 నుండి. [illegible] '[illegible]', 'ఆంధ్ర [illegible]' బిరుద స్వీకారము. కవిగా, కథకుండుగా, నాటకకారుడుగా, విమర్శకుండుగా, సహృదయుండుగా, పాత్రికేయుండుగా, చారిత్రకుండుగా, వక్తగా, దేశికుండుగా, [illegible]గా, నటుండుగా, సంపాదకుండుగా, బహుగ్రంథకర్తగా, అధ్యాపకుండుగా, బహుముఖ ప్రతిభా ప్రశస్తి. సికిందరాబాదు సారస్వత సమితి వ్యవస్థాపకత్వము; వార్తాపత్రిక శాఖా నిర్వహణము; గుంటూరు నవ్య సారస్వత సమితి, [illegible], ఆంధ్ర సాహిత్య మండలి, జ్యోత్స్నా సమితుల సంస్థాపకత్వము: సాహితీసమితి, హైదరాబాదు ఆంధ్ర సాహిత్య పరిషత్తు, నవ్యసాహిత్య పరిషత్తు, [illegible], నవ్యసాహితీ సమితుల సభ్యత్వము. జ్యోత్స్నా సమితి [illegible]. [illegible] కులపతి.

సాహిత్య సమాలోచనము

శ్రీ పిల్లలమఱ్ఱి కృతి

సాహిత్య సమాలోచనము

[illegible]



శాస్త్ర గ్రహణము

ప్రత్యక్ష స్వరూపము

స్థూల పరిశీలనము

౨౯.

ప్రథమప్రకరణము

సాహిత్యోద్దేశము

మన నిత్యవ్యవహారములో సాహిత్యము - సారస్వతము - వాఙ్మయము - అను పదములు సమానార్థక పదములుగాఁ బ్రయోగింపఁబడుచున్నవి. కాని యీ మూఁడు పదముల యర్థములలో వ్యత్యాసము కలదని పరిశీలించి తెలిసికొనఁ గల్గుదుము. “సాహిత్య” మనునది దేశకాలపరిమితము గాక, సర్వకాల సర్వదేశీయముగానుండి విశ్వశ్రేయస్సును గోరి నిర్మింపఁబడిన కావ్యసంచయమునకుఁ జెందును. “సారస్వత” మనునది యతివి శిష్టమైన సకల విద్యా శాస్త్ర కళాదులకు వర్తించును. “వాఙ్మయ” మనఁగా వాక్కుయొక్క వికారము; అనఁగా లిఖితాలిఖితభాషణాది సమస్తవాగ్వ్యవహారములకును వాఙ్మయ మను పదము చెల్లును; ఇది సర్వసాధారణమైన పదము. సాహిత్యము - సారస్వతము - వాఙ్మయము:♦ ఇవి యుత్తరోత్తర విశాలములైనవి. ఈ మూఁడును నొక్కే కేంద్రముగల మూఁడు వలయముల వంటివి. సాహిత్యము పరిమిత వలయము; దీనిని సారస్వత వలయము చుట్టినది; ఈ రెంటినిఁ జుట్టినది వాఙ్మయ వలయము. సాహిత్యమును సారస్వతమును వాఙ్మయ మని పిలువవచ్చును. కాని సారస్వత వాఙ్మయము లనునవి సాహిత్యమునకు వర్తింపవు.

♦ చూ: భారతి సంచికలో “సాహిత్యము - సారస్వతము - వాఙ్మయము” అనెడి వ్యాసము. (సర్వజిత్తు - అధిక శ్రావణము)

౩. ఉద్దేశానుసారము: ప్రతివస్తువునకుఁ గార్యకారణ సామాన్యము గలదు. ఘటమునకు మృత్తిక కారణము; అట్లే మానవ ప్రతి విషయమునకును కార్యకారణభావమున్నది. మానవుఁ డేకార్యము నిర్వహించినను దాని వెనుక నొక యాలోచన యుండితీరును. ఈ యాలోచనమునే యుద్దేశమని, కారణమనియు నందురు; ఇది పునాదివంటిది. ఒక యుద్దేశమును పురస్కరించుకొని మానవుఁ డొక కార్యము నిర్వహించును. అది ప్రారంభించిన యా యుద్దేశము పరిణామఫలముగాఁ దిరిగి ప్రతిఫలించును. ఉద్దేశము – కార్యము – పరిణామము: ఇది క్రమము. దీనిలో నుద్దేశము ఫలించినను పరిణామమునకేలన మాత్రే దానిని సంకల్పింపవచ్చును. కాని, కార్యమునుబట్టి దాని నెంచుకొనవచ్చును. ఈవిధముగా నుద్దేశ కార్య పరిణామము లొకదానికొకటి యనుబంధము లగుచున్నవి.

కావున, సాహిత్యోద్దేశ మిప్పుడు ప్రస్తుతవిషయము. సాహిత్యము 'సత్యం, శివం, సుందరం' అను త్రిమూర్తియముల సమిష్టిరూపమైనది. సాహిత్యమునకుఁ గవి – విమర్శకులు ప్రవర్తకులు. సౌందర్యద్రష్టయు స్రష్టయుఁ గవి. దీననే లాక్షణికు లాతనిని 'కవిబ్రహ్మ' యనినారు. విమర్శకుఁ డేతద్వ్యాఖ్యాత. సాహిత్య మొక సాధన ద్రవ్యము. ఇతరేతర ద్రవ్యముల వలెనే కొంతట కొంతటి యుపకారము మానవునకు వలెనే సాహిత్య ద్రవ్యమున పరసాక్షాత్కారమున కంతటి యుపకారము వలసి యున్నది. సహృదయత్వము, రసజ్ఞత, వ్యుత్పన్నతలు సాహిత్యారాధనమున కుపకరణములు.

సహృదయత్వ మనఁగా హృదయము గలిగియుండుట యని సామాన్యార్థము. ప్రతిమానవునకు హృదయ మున్నది: కాని యదియున్నట్టుల తెలియువాఁడే సహృదయుఁడు: అనఁగా 'సాత్త్వ కేవలనోన్ముఖమైన యంతరంగము' కలవాఁడు. నిష్పాక్షికముగా, నిష్కళంకముగా స్వానుభూతితో నాయా వాతావరణములయందు సంచరింపఁగలిగి యాయా పాత్రలనుగాని, విషయములను గాని యవలోకించి తత్తదనుగుణముగా స్పందించు హృదయము కల్గియుండుట.

రసజ్ఞత యనఁగా రసము నెఱుఁగుట యని వాచ్యార్థము: అనఁగా 'విభావానుభావ సాత్త్విక వ్యభిచారిభావ సంయోగ' ఫలితముగాఁ బర్యవసించు రసస్వరూపమును తెలియుట. విభావాదికముల నెఱిఁగి కదా యాయా భావములకుఁ దత్తదనుగుణముగా సంచలనముఁ బొందువాఁడను రసజ్ఞుఁడే. లక్షణాదికము నెఱిఁగియు రసజ్ఞులు కానివారున్నారు.

ఇఁక వ్యుత్పన్నత యనఁగా లోకశాస్త్రానుభవముతోఁ గూడిన పాండితి. పరిజ్ఞానము సమకూర్చుకొనుటలో దేశాటనము, బహుకావ్యపఠనము, సంప్రదాయజ్ఞులైన మహాత్ముల సాంగత్యము మున్నగునవి తోడ్పడవలెను. ఇన్నింటితో నుదయించిన సంస్కారమే వ్యుత్పన్నత యగును. ఇన్ని కల్గియు సంస్కారముఁ బొందనివా రున్నారు.

ఈ యుపకరణములతోడనే సాహిత్యారాధనమునకుఁ బూనుకొనవలెను. అప్పుడే సాహిత్యోద్దేశమును గ్రహింపవచ్చును. ఎంతవఱకీ యుపకరణములు లేక పరిశీలించుచుందుమో యంత

నిజము. సాహిత్యోద్దేశము [illegible] వేదము [illegible] [illegible] సాహిత్య [illegible] సాహిత్యోద్దేశ [illegible] సాహిత్య [illegible] జనిత. [illegible] ముః.

సాహిత్యోద్దేశ [illegible] కాలము లేదు. [illegible] దేశము లేదు. [illegible]. కవిత్వోద్దేశ [illegible] బ్రహ్మ [illegible]. [illegible] సాహిత్యోద్దేశము [illegible] బ్రహ్మ [illegible] సంధానుభవ మగును. '[illegible]' అను [illegible] వాక్యము [illegible]ముకు, సాహిత్యము నకుఁ [illegible]. ఋషి [illegible] వాక్యము బ్రహ్మానంద సాక్షా[illegible]ము. [illegible] పాసువ్రులకుఁ కవివాక్య మట్టి [illegible]. [illegible] ఋషి[illegible]. కావుననే పూర్వులు 'నానృషిః కురుతే కావ్యం' అనినారు.

వేదాది [illegible] కెల్లనేక [illegible] లనుగమ్యమానములై [illegible] మానము [illegible]. [illegible] సాహిత్య[illegible]నములో లక్ష్యమును [illegible] లా[illegible] యుగములలో ననుగమ్యమానములైనవి. [illegible] మార్గములే [illegible] కాలానుగుణ[illegible] నిర్మించిన [illegible]ములపరిణామములు.

వైదిక వాఙ్మయము [illegible] పురాణ[illegible] [illegible]ముకు [illegible]. శైవ వైష్ణవ సంఘర్షణ [illegible] శైవ [illegible] వైష్ణవ [illegible]ములని [illegible]. అనుకరణ సాహిత్య [illegible] ప్రబంధ [illegible]

దారితీసినది. [illegible] ప్రత్యేకించి [illegible]
[illegible] గారింపుము. ప్రాచ్యసాహిత్య శాస్త్రములన్నిం
ప్రయోజనము లేకపోవుటవలన కేమి, కాలావధిలో నిలవ
కేమి. సామాన్యజనుల కందుబాటులో సాహిత్యమునుంచవలె
ననుట దేశమే సత్సాహిత్యోద్దేశమునకు మూలము. ఈవిధ
ముగా [illegible] సాహిత్యము [illegible]
[illegible] గ్రహించినది.

ప్రాచీన లాక్షణికుల సాహిత్యోద్దేశ మిందుకే [illegible]
ము: సత్సంతానములలో గావ్యము శాశ్వతమైనది. లాక్ష
ణికుడు 'విశ్వశ్రేయః కావ్యమ్' అనినాడు: అనగా నందు
సార్వజనీనత యుండవలెనని సూచ్యార్థము. 'వ్యవహారవిదే
శివేతరక్షతయే సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మితతయోప
దేశయుజే' అనుటలో నాతడు విశ్వశ్రేయస్సెట్లు కలుగజేయ
వచ్చునో లక్ష్యీకరించినాడు! కావ్యాత్మను మీమాంస చేసి
రించి లాక్షణికులు రసానందానుభవమునకు గావ్య మందలి
వివిధాంశములను బ్రత్యక్షీకరించినారు. అవియే రస, అలంకార,
గుణ, రీతి, ధ్వని, వక్రోక్తి, అనుమాన, ఔచిత్యములు. లక్ష్య
మొక్కటియే నాటికి నేటికి; కాని దానిని సమీపించుమార్గ
ములు మాత్రము భిన్నములు!

కవితాలక్ష్యమును సాధించుటకు గర్మ, జ్ఞాన, భక్తి
మార్గము లుద్దేశింపబడినవి. ఆత్మానందమే పరమోత్కృష్ట
మైన కవితాధర్మము. తదానంద సంధానమునకే యీ మార్గ
ములు. సాహిత్య మీ త్రిమార్గాశ్రయము : ప్రభు, సుహృ,

కాంతా సమ్మితములని లాక్షణికులు వ్యపదేశించినారు: వేదములు కర్మను విధించునవి. పురాణములు ధర్మపథముల నడచినవారిని గూర్చి నివేదించును. కర్తవ్య ధర్మముల నిరూపించును. ఫలాపేక్షలో మనుజునకు నుత్సాహమును గల్పించునవి. కావ్యము లోకము శోకవిధముగ వర్ణించి మురిపించునది. అయ్యది కాంతావాక్యమువలె సుస్మితముగ, సుకుమారముగ, లలితముగ, వ్యంగ్యమాత్రవిలాసముతో సంస్కరించునది!

సాహిత్యము సౌందర్యమూర్తి. సౌందర్యావిష్కరణ సాధనములు సహృదయ వేద్యములు. సాహిత్యోపాసనమే యాత్మోపాసనము. అది సౌందర్యోపాసనము. రససిద్ధి సౌందర్యసాక్షాత్కారమే మోక్షఫలము. అయ్యది యలౌకికానంద స్వరూపము: అనిర్వచనీయమైనది. ఇట్టి యానందము సాక్షాత్తుగ ననుభవింపజేయునది.

సాహిత్యము రాజస తామస వృత్తులను లయమొనరించి శుద్ధసత్త్వమును బ్రకాశింపజేసి తన్మూలమున సౌందర్యాలోకనమున కర్హత నిచ్చునది. సాహిత్యము నిరంతర భావనా విశేషముచే బ్రహ్మానంద సహోదరమగు నానందము నాస్వాదింపజేయునది. నిత్యచైతన్యము గలిగినట్టి, శుభప్రదమైనట్టి రసానుభవమును గల్గించి మనోనేత్రమునకు దివ్య సాక్షాత్కారము గల్గించునది సాహిత్యము!

ఇట్టి పరమోత్కృష్టోద్దేశము గలది సాహిత్యము. అందుచేతనే యిది మధుర రసస్యందమైనది!

(6—6—1944 తేదీన హైదరాబాదు రేడియో నిలయమునుండి చేసిన ప్రసంగము. సికిందరాబాదు సాధన సమితివారి 'సాహితీ విపణి'లోఁ బ్రకటితము.)

౨

మాటలలో భావార్థములు

«ఇదమంధం తమః కృత్స్నం జాయేత భువనత్రయమ్
యది శబ్దాహ్వయం జ్యోతి రాసంసారం న దీప్యతే»

అని శబ్దమునుగూర్చి లాక్షణికుఁడైన దండి వచనము. శబ్దమను జ్యోతి లేకున్న నంధతమస్సులతో ముల్లోకములు నిండి యుండెడివని తాత్పర్యము. శబ్దమున కంతటి విలువయున్నది. నాద శ్రుతి మార్గములని శబ్దము త్రిగుణాత్మకమైనది.

"భావః కవే రభిప్రాయః కావ్యేవాసిద్ధి సంస్థితః" అని భావమునుగూర్చి యొకాని వచనమే. కావ్యగతమైన కవి యభిప్రాయము భావ మని నుడివినారు. భావ మను పద మనేక పదార్థములకుఁ జెందియున్నది. స్థితి, మత, తాత్పర్య, ఇంగితాది వివిధావస్థల కీపదము వర్తించుచున్నది. ఇట్లే యర్థ మను పదము హేతు, ఇచ్ఛా, ప్రయోజన, ఆకూతాది వివిధావస్థలకు సరిపోవుచున్నది.

కాఁగా భావార్థములు శబ్దము నాశ్రయించినవి. శబ్దము లేనిదే యర్థము లేదు; భావ మంతకన్నను లేదు. అట్లే భావములేక శబ్దమునకు స్థితిలేదు; అర్థము గాకపోయిన భావము స్ఫురింపదు. ఇవ్విధముగా శబ్దార్థభావములన్యోన్యాశ్రయములు. శబ్దార్థములు పార్వతీ పరమేశ్వర (ప్రకృతీ పురుష) సంబంధము కలవిగా కవి కాళిదాసునిసూక్తి.

తాని భావాంశముల కంటె ముఖ్య[illegible] [illegible] నానుడి. [illegible] రసము; అది [illegible] [illegible] [illegible] [illegible] భావ[illegible] [illegible] కనుక [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ముఖ్యము.

భావ [illegible] [illegible] ముఖ్యమైనది. [illegible] [illegible] [illegible] భావమును భావించిన [illegible] ము [illegible] లను [illegible] [illegible]. ఒక [illegible] [illegible] భావమును [illegible] పదములు [illegible] కరింప [illegible] [illegible]. [illegible] పదములను [illegible] [illegible] [illegible] [illegible] విచారించు [illegible]. [illegible] [illegible] ప్రాధాన్యము, పాత్రముల [illegible] [illegible]ములతో సమన్వయించుకొని సమూహముగా విచారించినప్పుడు వస్తు విశేషము భావము. భావము [illegible] [illegible] [illegible] [illegible]. [illegible]దిగుణములు వస్త్ర లముల వంటివి.

ఉదాహరణమునకు కొంత పద్యము: భారత సభాపర్వములో [illegible] [illegible] శిశుపాలుని గూర్చి యనిన పద్యము [illegible].

"[illegible] [illegible], శిశుపాలు[illegible], [illegible]; లేని నేల భూపాలక [illegible] [illegible]! [illegible] [illegible] [illegible] [illegible] [illegible]! [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]!"

(సభాపర్వము, ద్వి. ఆ. 22 ప.)

అచ్యుతు నర్చితుఁ జేయఁగా శిశుపాలుఁడు ధర్మరాజు నాక్షేపించుట, అందులకుఁ బ్రియవచనములతో శిశుపాలుని ధర్మజుఁ డనునయించుట లిందు ముందుగాఁ దెలియవలయును. ఆ పిమ్మటగాని పద్యములలోని భీష్ముని వచన మన్వయముగాదు. పద్యములలో 'శిశుపాలుఁడు బాలుఁడు' అనినపుడు శిశుపాలుఁ డమాయకుఁడనియు, అల్పుఁడనియు, సదసద్వివేచనాజ్ఞాన శూన్యుఁడనియు నర్థాంతరమగు భావము. 'నీకు' అనినపుడు— సర్వధర్మకోవిదుఁడు, నీతి విచక్షణుఁడు, న్యాయ్యపరిపాలకుఁడు నగు నంతటి గొప్పవాఁడైన ధర్మరాజునకు—అని భావము. అంత నుదాత్తగుణప్రపూర్ణున కింతటి యవనీతిపరునితో మాటలతో నిమిత్తమేమి?—అని యన్వయము. తుది రెండు పాదములకు—నెంత విశదీకరించినను ధర్మపరిపాలనా శక్తి యట్టి నీచున కలవడునా యనియు, నేల యీ కాలయాపన మనియు భావము. వానిమనసా? కలుషితము; బుద్ధియా? యంధము; శీలమా? కలహాయుతము. ఈవిధముగా భావమర్థాంతరము. అట్టివానికిధర్మబోధ తలకెక్కదని భావము.

భావము కవి హృదయగతమైనది. కవి హృదయము సహృదయుఁడైన రసజ్ఞునకే వేద్యము. కవి హృదయసదృశమైన హృదయము కలవాఁడు సహృదయుఁడు. కావున భావము సాహిత్య తత్త్వముపై నాధారపడినది. ఉత్తమ భావాధికారము కలిగినవానిని సాహితీపరుఁ డందుము.

కవి భావించినది భావమని తెలిసికొంటిమి. భావించుట యనఁగా నిరంతరాలోచనముచే సాధితమైన యొకానొక

ప్రధానవిశేషము. 'ఆత్మతో సంభాషించుటయే భావించుట' యని యొక పాశ్చాత్యుని నిర్వచనము. కవి యాలోచనముచే మథించి, గ్రహించిన దర్శించినయొక రసమయగోళము భావము. మహోన్నతభావము లన్నియు హృదయాంతరాళములనుండి ప్రవహించును. హృదయమార్దవమై, రసగ్రహణ గుణసమన్వితమై, [illegible] చేయు సున్నితయంత్రమై వర్తిల్లును. సమస్త కలుషములు హృదయములో స్వచ్ఛఫలకమందువలెఁ బ్రతిఫలింపఁగలవు. సుసంస్కృతమై, శ్రేయోదాయకమై, సమగ్రమై, సుందరమై, సత్యమై, భావము పరిష్కృతమగుట హృదయమందే!

ఇక నర్థములు మువ్విధములని లాక్షణికుని సూత్రము. శబ్దమునకున్న అభిధ, లక్షణ, వ్యంజన వృత్తులను బురస్కరించుకొని వచ్చునవే వాచ్య, లక్ష్య, వ్యంగ్యార్థములు. వాచ్యార్థ మనఁగా శబ్దము పఠించినపుడు సూటిగా వచ్చు నర్థము. శబ్ద మర్థమునకు సంకేతము. శబ్దోచ్చారణము వలనఁ బ్రత్యక్షమైన వాచ్యార్థము మన కొక వస్తువిశేషము నెదుట సాక్షాత్కరింపఁజేయును. ఉదాహరణమునకు 'గోవు' అనినంతనే శబ్దమునకున్న ప్రతిమానము ద్యోతకమగును గదా! ఇట్టిదే వాచ్యార్థము.

వాచ్యార్థము [illegible]ముంచి, యా[illegible]దేశమైన యర్థమును ప్రదానమగునది లక్ష్యార్థము. ఉదాహరణమునకు '[illegible] మార్గములో చెట్టు వున్నది' అనినపుడు మార్గమధ్యప్రదేశములో గమన నిరోధము గల్గించుచుఁ జెట్టు

ప్రసన్నమైన వాచ్యార్థము. 'మార్గములో' అనఁగా 'మార్గము ప్రక్కన' యనిగదా వక్తృగభిప్రాయము! ఇట్టిదే లక్ష్యార్థము.

వాచ్యార్థమువలె సూటియైనది కాక, లక్ష్యార్థమువలె సామీప్యమునుగాక, వాచ్యార్థమునకు వ్యతిరేకార్థస్ఫురణము కలిగించునది వ్యంగ్యార్థము. ఉదాహరణమునకుఁ గళాపూర్ణోదయములో సుగాత్రికి సఖు లుపాయములఁ జెప్పు సందర్భమున—

"దంపతు లిరువురును వివేకు లేమి చెప్ప" (చ.అ. 65ప.) అను పాదములో 'వివేకు' లనఁగా 'అవివేకు' లనిగదా సఖుల యుద్దేశము! ఇదియే వ్యంగ్యార్థము. ఈ వ్యంగ్యమందే భావ సౌకుమార్యమును గమనించుటకుఁ గాని, నిశితబోధనా విధాన మనుగమించుటకుఁగాని శక్తి యున్నట్లు కనిపెట్టి కావ్యలాక్షణికులు దీనికిఁ గావ్యమునందుఁ బ్రాధాన్య మిచ్చినారు.

ఇట్లే భావ మను పదమునుగూడ ననేకరీతుల లాక్షణికులు ప్రయోగించినారు. వ్యాకరణములో భావ మనఁగా ధాత్వర్థము. రసప్రకరణలో విభావ, అనుభావ, సాత్త్విక వ్యభిచారీభావము లని కన్పించుచున్నవి. ఇవి యన్నియుఁ బరస్పర భిన్నము లనియు, నన్నియుఁ గ్రమావస్థల కుపకరించునవనియుఁ దుదకు రసములోఁ బర్యవసించునవనియుఁ దెలియును. ఈ రసభావమునకే లాక్షణికులు గౌరవమిచ్చినారు.

ఈ విధముగా భావార్థముల కన్యోన్య సంబంధము సూక్ష్మాతిసూక్ష్మమైన యంతరములు గలవు. మాటల నాశ్రయించినవి యర్థభావములు. మాటలలోని యింద్రజాల

మనినప్రాస - కారణము గన్పింపకయే ఫల మభివ్యక్తమగునట్లు, తత్ఫలముగా చక్కిలిగింత కలుగుచున్న ట్లభిప్రాయము. ఇంద్రజాలములో ఫల మభివ్యక్తమగును గాని కారణజాతము బుద్ధి కందదు.

మాటల యింద్రజాలము మాటలలోనే లేదు. వాని ప్రయోగములోనున్న వైవిధ్యములో, సౌకుమార్యములో, వైచిత్రిలో నున్నట్లు గనుపించెను. ఆయా మాటలకు వాని ప్రత్యేకత యుండనే యున్నది. వేని యర్థము వానిదే. మాటల యింద్రజాలము కవిత్వమునకుఁ జెందినదే కాని శుష్కమగు వచనమునకు దాని నాపాదించిన దాని గతి కద్దుతగిలి నట్లగును. నిత్య వ్యవహారములో మాటల యింద్రజాలమును గల్పించినచో నది కవిత్వసంబంధమే యగును.

శ్రవణపేయముగాఁ గొన్ని మాటల కూర్పులుండును. 'కీర్తన పాత్ర చిత్ర మ్మదుకీర్తి కలాకలన ప్రవీణతక్' అని నపుడు రేఫ ఫానుప్రాస్యమును, "చెందొవ విందు మందువలెఁ జిందు మరందమగ" అనినప్రాస బిందుపూర్వక దకార పౌనః పున్యమును శ్రవణానందమును గలుగఁజేసినవి. ఇట్టి వానినే లాక్షణికులు శబ్దాలంకారముల క్రిందఁ బరిగణించినారు.

కాలగతినిబట్టి శబ్దము స్వరూపములో, నాదములో, నర్థములోను మార్పును జెందుచుండును. ఆచారవ్యవహారముల కనుగుణముగా శబ్దములు పూర్వ మెన్నెన్నియో యర్థములలోఁ బ్రయోగింపఁబడినవి. కాలపరిణామములో నవి గొన్ని యర్థములలోనే రూఢిజెందినవి. చీర యను శబ్దము

సామాన్య వస్త్ర విశేష మను నర్థమునుండి స్త్రీ ధరించు వస్త్రవిశేషములలో, "కైంకర్య" మను పదము "స్వామిసేవ" యను నర్థమునుండి 'సంగ్రహించుట' దానుదానిలో. 'కంపు' అను మాట 'గ్రంధ'మను నర్థమునుండి 'దుర్గంధ' మనుదానిలో రూఢ మగుచున్నవి.

శబ్ద స్వరూప మెఱుఁగని వారిచేగాని, విద్యాగంధము లేనివారిచేగాని యుచ్చరింపఁబడి కొన్ని శబ్దములు నాదమును గోల్పోవుచుండును. 'వెళ్ళు' అనుటకు 'ఎల్లు' అనియు 'గొప్పవారు' అనుటకు 'గొప్పోరు' అనియు, 'వన' అనుటకు 'గిన' అనియు, 'ఏమది' అనుటకు 'ఏంది' అనియుఁ బూర్వ నాదములు గోల్పోయి యటనట విన్పించుచుండును.

భిన్నప్రాంతములలో నొకేవస్తువును సూచించు పదములు భిన్నములుగానున్నవి. 'తాళము'నకు 'కప్ప'-వచ్చెడి'కి 'తొక్కు' - 'అగుట'కు 'సైసు' - 'గురువుగారు' నకు 'అయ్యవారు' లేక 'స్వామివారు' మున్నగు ప్రయోగము లిట్టివే !

వక్తృభావోద్వేగమును సూచించుట కుపయుక్తము లగుపదములు విచిత్రములుగా నుండును. 'మహాచెడ్డయిష్టము' అనినపుడు 'మహాచెడ్డ' అను పదములు వ్యస్తార్థములలో నిష్ప్రయోజనములు. కేవల ముద్వేగము, ఇచ్ఛలో పరాకోటిఁ దెలుపుటకుఁ బ్రయోగింపఁబడినవే కాని వేరు ప్రయోజనము వానికిలేదు. లోకములో 'పడిచస్తాడు' అనినపుడు, కావ్యములో 'ఈ వెడమాటల నను నేటికిఁ జంపెదరు' అనినపుడు 'చావు' అను శబ్దమునకుఁ బై విధముగనే

పృథక్త్వము నుండు.

శబ్దములు కొన్ని యితర శబ్దములతోఁ గూడినపుడు వింతమైన నూతనార్థములఁ బ్రసాదించును. 'పిడతమొహము' అనినపుడు విఫలమనోరథుఁడై నైరాశ్యదశను బొందినవాని ముఖవైఖరి సూచింపఁబడినది. ఇట్టివే 'చట్టిముక్కు', 'పనుగుకాలు' 'మట్టిబుఱ్ఱ' మొదలైనవి. వీనిని క్రమముగా నలంకారముల క్రిందఁ జేర్చినారు మన లాక్షణికులు.

ఇట నలంకారములఁగూర్చి స్వల్పముగాఁ జెప్పవలెను. అలంకారములు, శబ్దార్థాలంకారము లని రెండు విధములు. శబ్దాలంకారములో నాదమునకు గౌరవము. అర్థాలంకారములో భావమునకు గౌరవము. కవి తన కుపలభ్యమానము లైన పదముల నన్నిటిని వివిధావస్థలలో సంప్రతీకరించి తన మనోగతమైన యభిప్రాయమును వ్యక్తీకరించును. ముందు మనవిచేసినట్లుగా నాతని భావమును సంపూర్ణముగా నందించుటకు పదములు సరిపోవు. అప్పుడే యలంకారముల చెంతకుఁ బోవును. సాదృశ్యకల్పనము, ఇతర సన్నివేశ స్ఫురణము మున్నగునవి యాలంకారిక సామగ్రి. స్వీయానుభూతాంశమును పరులతో సమానముగా, సమగ్రముగా, పంచుకొనుటయే కవియొక్క నిరంతర సాధనము. కనుక భావవ్యక్తి నుపకరించునవే యర్థాలంకారములు. నాదవ్యక్తి కుపయోగపడునవి శబ్దాలంకారములు. రెంటికిని పరమార్థము మనోనుసంధానమే. ఒకటి హృదయగోచరము; రెండవది శ్రవణగోచరము.

కావ్యమునకు ముఖ్యాంగము లనఁదగు భావ వస్తు రచనములలో - రచనము శబ్దార్థ సమన్వితమైనది; వస్తువు లోకకావ్యములలో సిద్ధమైనది; భావము కవి మనోగతమైనది. మానవుని కొక్కనికే జంతుకోటిలో భావనాశక్తి యున్నది. ఇది యూతఁడు పెరిగిన కొలఁది, లోక కావ్యాది పరిశీలనము చేసినకొలఁది యభివృద్ధిపొందుచు నైశిత్యముఁబడయుచుండును. ప్రతి మానవుని కభిప్రాయము లుండును. కాని బంగారము పుటములోవలె వాని నాలోచనమను అగ్నిగుండమున ప్రేల్చిన గాని యవి భావములుగాఁ బరిణమింపవు. ఆలోచనాశక్తి కలిగి యర్థజ్ఞానము లేకపోయినచో గాలిలోఁ గత్తిసాము సేయుట వంటి దగును. బుద్ధిభావములు రథ్యసారథి సంబంధముగలవిగా వర్తిలవలెనని పెద్దల యభిభాషణము.

ఆ యుత్కృష్టభావమే, ఆ విశ్వసత్యమును బ్రకటించు కవితాభావమే ప్రపంచమును బాలించునది. మనోహరమైన మాటల నేరుకొని, స్ఫుటమైన యర్థములను బోసి సజీవముగాఁ జేసి, సుసంపన్నమైన భావమును బొదిగి కవి విశ్వమును బరిపాలించువాఁడు. నాదబ్రహ్మ సాక్షాత్కార మొందని పదసంపుటములు వ్యర్థములు. అశ్లేయర్థములేని శబ్దములు పడికట్టు ఱాళ్ళవంటివి. భావములేని శబ్దార్థములు 'భావజుఁడు లేని పాడుమేడ' వంటివి. కావున శబ్దము-అర్థము-భావము, యివి ఉత్తరోత్తర ప్రధానములు. భావము ప్రథమము ప్రభవించును; పిమ్మట సార్థకమైన శబ్దావతరణము జరుగును: కవి భావము నుండి యర్థము మీఁదగా శబ్దమునకుఁ బ్రయాణము చేయు

చుండును. సహృదయుఁడైన విమర్శకుఁడు శబ్దముల నుండి భావము కడకుఁ బ్రయాణ మొనర్చును.

భావప్రకాశమే కవి ప్రయత్నము. ఏతత్సత్య స్వరూప ప్రకటనమే విమర్శకుని బాధ్యత. శబ్దములోని నాద ప్రతిమార్థముల కంతరమైన భావముచేతనే ముల్లోకము లంధ తమస్సుల నుండి విడివడునది. అట్టి భావోదయమే జ్ఞానోదయము. ఐంద్రజాలికుని మాయలోఁబడక నిజతత్త్వ మెఱుఁగుటకై సంస్కారము బడసినవాఁడే మహాత్ముఁడు. శబ్దములో భావార్థముల నాతఁ డెఱుఁగఁ బ్రహ్మతత్త్వము నెఱుఁగఁగలఁడు. అట్టి జ్ఞానోదయమే జ్యోతిరావిర్భావము. అదియే విశ్వము నేలు పరంజ్యోతి!

"తమసో మా జ్యోతి ర్గమయ"

[మద్రాసు రేడియో కేంద్రము నుండి 2-3-1945 తేదీని నేను చేసిన ప్రసంగము.]

3
కవి - సమాజము

ఏ యుగములోనైన, నే దేశములోనైనఁ గవి మానవ ప్రియుఁడే. కవి ప్రజాపతితో సమానుఁడే కాక యొకొక్క సమయమున నాతని మించును గూడ. కవి తాను ప్రతిభావంతుఁడై, త్రికాలవేదియై సమస్త చరాచరప్రకృతిని నిశితముగాఁ బరిశీలించి, తా నందుండి విడిపోయి, దాని నాత్మతత్త్వముతో సమన్వయించుకొని యాధికారిక వచస్సును మధురముగా వెలువరించును. అతఁడు క్రాంతదర్శి. కావుననే కర్మసాక్షినిఁగూడఁ ద్రోసిపుచ్చు 'రవి గాననిచో కవిగాంచునే గదా' అనెడి లోకోక్తి పొసఁగినది. వర్తమానముతో భూత భవిష్యత్తుల సమన్వయించుట ప్రతిభావిశేషమే కాని వేరు కాదు. దూరదర్శనములో-లౌకికములైన, నిత్యనైమిత్తికములైన విషయములను శోధనము చేసి యుత్తమోపదేశముచే సంస్కరించుటలోఁ గవి ఋషితుల్యుఁడు.

కవికూడ లోకసంబంధియే. సామాన్య మానవుఁడే విధముగా నాహార విహారాదులలోఁ బాల్గొనునో యట్లే కవియును. కాని కవి లోకానుభవమును బొంది, యా లోకములోఁ దాను జూచిన సన్నివేశమును దన ప్రతిభచే నుదాత్తముచేసి, యందలి తాత్కాలికచైతన్యమును శోధనముచేసి శాశ్వత స్పందము నాపాదించును. కవి కార్యము విచిత్రమైనది. అసత్తు నుండి సత్తునకు, తమస్సు నుండి జ్యోతిర్లోకమునకు నడిపించు శక్తిమంతుఁడు కవి. సమాజములో సామా

న్యులు చూచుదృశ్యమునే తానును దర్శించును. కాని సామాన్యులవలెఁగాక యతఁడందలి పాత్రములతో లీనమొందును. ఆదృశ్యమాతని యంతరంగ భిత్తికయందు సంపూర్ణముగా ముద్రితమగునట్లు సాధనము సేయుచుండును. పునర్దర్శనముఁజేసి దాని నంతరంగమందు భావనిగ్రహముచే నిలుపుకొనును. తనకుఁ గలిగిన సంతోషము నానందముగను, దుఃఖమును కరుణముగను సంస్కార విశేషముచేఁ బరివర్తనము జేయును. అనఁగా కవి ప్రథమదశలో సాక్షియై, పిమ్మట ద్రష్టయగునన్నమాట. సామాన్య మానవులు సాక్షులు మాత్రమే.

కవి తాను దర్శించి నిగ్రహించి భావనచే దాని నొక రసగోళముగాఁ బునర్దర్శించిన తరువాత యితరుల కా రసానందానుభవమును భాసింపఁజేయుటకుఁ బ్రయత్నించును; ద్రష్టయైనపిమ్మట స్రష్టయగును. అనఁగా కవిత సృష్టియన్నమాట. ఉక్తివిశేషమే కవిత్వమన్నారు ప్రాచీనులు. ఉక్తివైచిత్రి బొసఁగుటకుఁ గవి ప్రత్యుత్పన్నుఁడు గావలెను; చూచిన సన్నివేశమును దగిన శబ్దార్థకల్పనముచే సృజింపవలెనన్న నెంతటి శబ్దాధికారము వలయునో యూహింపుఁడు: శుద్ధమైన వచస్సుతో సమగ్రవస్తుచిత్రణముఁజేసి తా నెంతటి సానుభూతి పొందెనో యంతటి యనుభవము సామాజికునకుఁ గూడ నందించినప్పుడే కవి కృతార్థుఁడగును. కావున కవి క్రాంతదర్శియై నిశితగ్రహణ కౌశలముచే స్ఫుటవ్యక్తి కలిగి యుండవలెను. వ్యక్తిలేని ద్రష్ట ప్రయోజకుఁడు కాఁడు.

కార్లైలు పండితుఁడు కవిని ప్రవక్తగా వ్యవహరించి

నాఁడు. మానవసమాజము నుత్తమ మార్గమునఁ దన పవిత్ర వచస్సులతో నడిపించువాఁడుకవి. జాతి సంస్కృతికి నుపాధ్యాయుఁ డెంతెటి బాధ్యత వహింపవలెనో యంతటి బాధ్యతో మానవ కల్యాణమునకుఁ గవి వహించును. కవి సమాజమును దనతోఁ దీసికొనిపోయి యాదర్శమూర్తులను జూపి, యలరించి, వాని ననుసరింపఁజేయును. ఇట్టివో సమాజము గూడ కవి నాదరింపవలెను. సామాజికులు కేవలము పామరులై కవి విశిష్టత నెఱుఁగక యాతని దూషింపరాదు. విద్యావంతులై, వివేచనాజ్ఞానము కలిగి, సహృదయత్వ మలవఱచుకొని సామాజికులు కవిని సమీపించుట కర్హత సంపాదించుకొనవలెను. కవి సామాజికు లీవిధముగాఁ బరస్పరానుభూతి కలిగియుండిన గాని శోభ లేదు.

పూర్వకవులు చిత్రించిన సన్నివేశములు సమాజమునకు సహజములు గావనియు, వాస్తవిక జగత్తు నతిక్రమించి, భావాంబరవీధులలో విహరించుట దోషమనియు, యథాదర్శనముగాఁ జిత్రింపవలెఁ గాని సమాజమునకు దూరముగా నుండరాదనియు నిటీవల కొందఱు వాదించుచున్నారు. కవి దృష్టికిని సామాన్యుని దృష్టికిని భేదమున్నట్లు తెలియవలెను. వాస్తవిక కథనమునకన్న నుదాత్తకథనమే బోధనమున కనుకూలించును. లౌకికమునుండి యలౌకికమునకుఁ బాత్రముల నడిపించుఁ గవి, సమాజమును స్వర్గమును గలిపి ముడివేయును. ప్రవరునివంటి యింద్రియ నిగ్రహము కలవాఁడును, సీతవంటి పతివ్రతయు లోకవిరుద్ధములని శంకించువారునున్నారు. లోకము

నకుఁ గవిత్వము దర్పణ మైనందువలనఁ బ్రయోజన మేమి? ఉన్నది యున్నట్లు వర్ణించుచో కవి యేల మనకు? అట్లే కవిత్వము దర్పణమైన నుపదేశమునకు బదులుగా నుద్రేకమును, సంస్కరణమునకు మారుగా జుగుప్సను కవి కలిగించునేమో! కవి కేవల సామాజికుఁడై పోయిన ప్రయోజనము లేదుగదా! దేశకాల పరిస్థితులను గమనించియే ప్రతి యుగమునఁ గవి ప్రవక్తయై ప్రవర్తిలుచుండును.

ఈ సిద్ధాంతమును మరచి సమాజమునకుఁ గవి దూరముగా వర్తిలుచున్నాఁడను ప్రవాదము కొందఱు లేవదీసినారు. "ప్రజావాఙ్మయము" అనఁగా ప్రజలకొఱకు వాఙ్మయమని యర్థము. పూర్వమున్న వాఙ్మయము ప్రజలకొఱకే కాని పశువులకుఁ గాదుగదా యుద్దేశింపఁబడినది! ప్రజలన్నఁ బామరులని యర్థము చెప్పకొనినచో పామరునకు వాఙ్మయ మాతని సంస్కరించి సన్మార్గవర్తనుం జేయుటకే గదా! 'విశ్వశ్రేయః కావ్య' మని నపుడు పూర్వులు దీనినే యుద్దేశించినారు. కాని పూర్వకావ్యములు ప్రజల కందుబాటులో లేవని యందలి భాషాభావజటిలత్వమును నేఁడు దూషించుచున్నారు. నేఁడు వ్యావహారిక భాషలోఁ గవులు తమ భావముల నందించినను ప్రజాసామాన్యమున కర్థము కాలేదను వాక్యములు వినఁబడుచునే యున్నవి. సామాజికు లధికారానుగుణముగ విషయ గ్రహణము చేయవలెనే కాని కవిని దూషించి ప్రయోజనము లేదు. అన్ని కాలములలోను కవికిని పామరునకును మధ్య సహృదయుఁడైన వ్యాఖ్యాత యుండవలెను; ఉండితీరునుగూడ. సామాజి

కుడు శిక్షణము పొందవలెను. అట్లుకాక కవిని పామరు నొద్దకు దిగి రమ్మనుట పొరపాటు. దీనినే రస్కిన్ పండితుడు—

'We neither feign nor interpret, you must rise to the level of our thoughts' *

అని, సామాజకులే కవి వసించు నున్నత పథమునకు వెళ్ళవలెను గాని కవి దిగి రాలేడని చెప్పినాడు. ఈ సిద్ధాంతమునకు విపర్యాసము కలిగినచో సమాజము తమోలోకమందుండుట తటస్థించును. జాతి వ్యవస్థ క్షీణించి పోవును.

కవి భావోదాత్తతతో నేవిధమైన వివాదము పనికిరాదు. కవితాభావమున కక్షరరమ్యత నాపాదించి దానిం గళామయము చేయుటలో సజ్జాద్ జహీర్ కూడ తన సమ్మతిని—

The people demand of their artists to present these in art forms to clothe these sacred emotions"........

అనువాక్యము ద్వారా తెలిపినాడు; కాని వివదింపలేదు. భావ చిత్రణములోఁ గావ్యరూపము నంగీకరించి తీరవలసిన దే.

కవికిని సమాజమునకు నవినాభావ సంబంధము గలదు. కవి పూర్వము తానున్న దేశకాలపరిస్థితుల నాకళించుకొనియే కావ్యము రచించినాడు. నన్నయ కవితలో వైదికధర్మనిష్ఠయు, పాల్కురికివారి కావ్యములలో శైవమత ప్రాబల్యమును, తిక్కనార్యుని గంటములో దేశీయ ప్రభావమును, శ్రీనాథుని క్రీడాభిరామములో సంఘవ్యవస్థ, రాయలనాటి కావ్యములలో సమాజసౌఖ్యము, వీరేశలింగము రచనములలోఁ బ్రాచ్య

* Ruskin's Lectures—Sesame.

పాశ్చాత్యసంస్కృతీ సంఘర్షణము ముద్రితములైనవి. కావున నే సాంఘికచరిత్ర వ్రాయుట కాసంఘ వాఙ్మయము దోడ్పడు నను సూత్రము వచ్చినది. సంఘజీవితము ప్రతిబింబింపని రచనమే యుండజాలదు.

నేఁడు ప్రబోధ వాఙ్మయము వచ్చుచున్నదనిన, నది యీనాటి జాతియొక్క నిద్రాణావస్థను దెలుపును. ప్రబోధ వాఙ్మయమే సాహిత్యమని తలఁచుట యవివేకము. ప్రబోధ వాఙ్మయము తాత్కాలిక ప్రయోజనము గలది. ప్రజలను ప్రబోధించి యెన్ని దినములు కార్యశూరులుగా నిలువఁబెట్ట గలము? విజ్ఞానవ్యాప్తి విరివిగా జరుగవలెను. ప్రజలందఱు తమ విజ్ఞానపాదములపైఁ దాము నిలువగలశక్తి యలవఱచు కొనిననాఁడు, కవిసందేశ మర్థమగుటయేకాక యుత్తమసాధనములో శాశ్వతఫలము లందగలుగుదురు. విద్యావ్యాప్తికై పాటుపడక కేవల ప్రబోధము సాగించిన ముక్తిలేదు. విద్యావంతునకు సాహిత్యము సమధికమైన జ్ఞానమునిచ్చి పరమానంద సంధాన మొనగూర్చును. ప్రబోధము మనుజునిలో సహజమైన యాకాంక్షను బోడమనీయదు. కావున దాని ప్రభావ మల్ప కాల పరిమితము. అయినను సాహిత్యసృష్టి ప్రబోధవాఙ్మయ రచనయు నేకకాలావచ్ఛేదకములుగా జరుగవలసియే యున్నవి.

ఈనాఁడు మన సంఘము దుస్థితిలో నున్నది. తుచ్ఛ కామమునకు గుఱియై యది జంతుప్రాయ మగుచున్నది. వర్గవైమనస్యములు మిక్కుటములై నైకమత్యములేక యున్నది. అసూయాహంకారములు హద్దుపద్దు లేక పెరుగుచున్నవి.

ధైర్య పౌరుషము లడుగంటినవి. సమాజములో శాంతిలేదు. స్వేచ్ఛాకాంక్ష ప్రబలినది. కాని ఫలవంత మగుటకు పరిస్థితులు ప్రతికూలములుగా నున్నవి. ఇట్టి సామాజిక దుస్థితిని సమగ్రముగాఁ బరిశీలించి, విశ్వమానవకల్యాణముఁ జేకూర్చునట్టి, శాంతిని నెలకొల్పునట్టి, సంఘైకమత్యమును ప్రబోధించునట్టి యుత్తమ కవి యీనాఁ డవతరింపవలసి యున్నాఁడు. అతఁడు ప్రపంచ కవి కాఁగలఁడు. అతని యాధికారికమగు ప్రవచనములతోడనే యీనాఁటి సామాజిక దుస్థితి తొలఁగి పోవును. ఆ మహాకవి కొఱకై నిరీక్షింతముగాత !

(హైదరాబాదు రేడియో నిలయమునుండి 5—6—1945 తేదీన ప్రసారితమైన నా ప్రసంగ వ్యాసము.)

౪

విమర్శకుఁడు - కళోపాసకుఁడు

విమర్శక కళోపాసకుల కర్తవ్యతాబాధ్యతలను వారి వారి ముఖ్యోద్దేశములకుఁ దోడగు వివిధోపాయములను, వారి యుత్కృష్టాదర్శములకు మార్గదర్శకములగు విషయములను, తదితరవిషయముల నవగాహనము చేసికొనుటకుఁ బూర్వము విమర్శనమనఁగా నేమియో, కళయనఁగా నెట్టిదో, యెట్టివాఁడు విమర్శకుఁడనియు, కళోపాసకుఁడనియు బిలువంబడెడివో నెఱుంగుట మన కవశ్యకర్తవ్యమై యున్నయది.

సూక్ష్మదృష్టిఁ బరిశీలించిన విమర్శకునకును, కళోపాసకునకును సన్నిహితసంబంధ మున్నట్లుఁ దెలియనగును. నిజముగఁ గళోపాసనము, కళాదృష్టి, కావ్యాదులయందుఁ బ్రవేశము గలిగియుండి, గొప్ప రసికుఁడైనవాఁడే విమర్శనాకార్యమునకుఁగాని, కళారాధనమునకుఁగాని గడంగుట కర్హుఁడగును. దీనింబట్టి విమర్శకునకును, కళోపాసకునకును నొకేవిధమగు పరికరము లుండవలయునని మనము తెలిసికొందుము. ఒక్కొక్కతఱిఁ గళోపాసకుఁడే విమర్శనమునకుఁ గడంగుట సంభవించును. కళోపాసకుఁడు కావ్యాదులం [illegible] బరిశీలించి, యందలి లోపాలోపములను గుర్తించుట కెక్కుడవకాశమున్నది. తాను గుర్తించి, యితరజనంబుల కెఱుకచేయుటయే విమర్శనాదర్శము. ఈ విధంబున విమర్శనము కళోపాసకుని కలముపై నాధారపడిన గుణాగుణపరిశీలనముగా నెంచవచ్చును.

ప్రత్యేకముగా నీ రెంటినిఁ బరికింతము గావుత! ఈ కార్యాచరణమునకుం గడంగుటలో రెంటికిని గల సాధర్మ్య వైధర్మ్యములను సులభమార్గమునఁ గన్గొన వీలగునను నాశయము ప్రబలియున్నది.

మున్ముందుగ 'విమర్శన' మన్న నెట్టిదో విపులముగఁ బరిశీలింతము. ఈ పదము ననేకు లనేక విధముల నిర్వచించి యున్నారు. ఎవరికిఁ దోచినటులు వారు వ్రాయుచుండ నేఁటికి విమర్శన మను పదమునకు భిన్నాభిప్రాయము లేర్పడి, విమర్శకుఁడన్న కేవలముఁ గావ్యములవట్ల రక్కసుఁడని భావించునంతటి భీతిని నెలకొల్పినది. నేఁడు ప్రతివిమర్శకుఁ డను 'విమర్శన' మను పదమునకు భిన్నమైన నిర్వచన మొసంగుచున్నాఁడు. లక్ష్య మేదియు లేక, నోటికి వచ్చి నటులు, కలము నడచిన రీతిని వ్రేలుచుండు విమర్శకు లనే కులఁ గాంచుచున్నారము. సంప్రదాయార్థములో విమర్శ కుఁడు దోషాన్వేషిగా నెంచఁబడుచున్నాఁడు. కొందఱు కావ్యాది కళలయందలి గుణదోష విశేషములను బరికించి, యున్నదియున్నట్లు దెలుపువాఁడు విమర్శకుఁడని యూహించు చున్నారు. మఱి కొందఱు కృతియందలి విశేషములనే హెచ్చ రించుచు, కవిని, కృతిని యథోచితముగ నభినందించుట విమర్శన మనుచున్నారు. ఒక వస్తువును గైకొని యందలి కవితామాధుర్యమునుగాని లేక రసోత్కృష్టతనుగాని, చమ త్కృతులను, తదితరాన్వయములను సహాయముగఁ గొని యితర వస్తువులను వీనితోఁ బోల్చి యేది మిన్నయో నిర్ణ

యించు తత్త్వమే విమర్శకతత్త్వ మని కొందఱు నుడువు చున్నారు. దీనికి సంబంధించిన వాక్యమే 'విమర్శన మొక యానుషంగిక పరీక్ష' యనునది.

విమర్శకుఁడు నిజముగా నిష్పక్షపాతబుద్ధితో నెద్దేనిఁ బరిశీలింపవలెను. లేదేని యయ్యది విమర్శన మనిపించు కొనక, కేవలము కవిపై నున్న యభిమానమువలనఁగాని లేక యాతనిపై నిరసనభావమువలనఁగాని పురస్కరింపఁబడిన కలముయొక్క నడకగా నెంచఁబడును. బాగుగాఁ బరిశీలించిన నేఁడు వెలువడు విమర్శనములలోఁజాలవఱకు నీ నిర్వచనము నకుఁ దోడగునవే యని గ్రహింపఁగల్గుదుము! ఒకానొకఁడు తన విమర్శనమం దొక కవిని, ఆతని కృతిని ఖండించినచో, నా కవిపైనున్న యభిమానముచే వేఱొకఁడు దానిని తిరిగి ఖండించుచు, మఱియొక విమర్శన మావిమర్శపై వ్రాయఁబూను కొనుట సామాన్యముగ మనము గాంచుచున్న విషయమే. తుదకీ విమర్శనములు వ్యక్తిగతమా కక్షల వెలిబుచ్చు మార్గ ములుగా నుపయోగింపఁబడుచున్నవి. క్రమముగ వ్యక్తిద్వేష మునకుఁ గారణభూతమై విషపరిణామము నొందుచు ముఖ్యోద్దేశమునకు దూర మగుచున్నవి. ఈ సందర్భమున నొక విషయముఁ జెప్పవలసియున్నది. విమర్శనము కృతుల కనువర్తించునది కాని కృతికర్తల కనువర్తించునది కాదని ప్రతి విమర్శకుఁడును గ్రహింపవలెను. కృతిలో నున్న గుణ దోషములఁ గాంచుటేకాని కృతికర్తల గుణదోషముల నెంచుట విమర్శనా పద్ధతికి విరుద్ధము. నేఁటి విమర్శకులలోఁ గొందఱు

కిందనే గ్రహింపలేకున్నారు. విమర్శకుఁ డెప్పటికిని కృతికర్తపైఁ దనకున్న యభిప్రాయము ననుసరించి మాత్రమే కృతిపైఁ దనయభిప్రాయమే ప్రతిబింబించునట్టుల వ్రాయఁ బూనుకొనఁడు. 'Judge not others that thou be judged' అను వచనము ప్రతి విమర్శకుఁడును గమనింపఁ దగినది.

నిజమైన విమర్శనములోఁ గలహములకుఁ గారణంబు లగు విషయంబులుండక 'విషయవిభజనము, వ్యాకరణార్థ పరిశీలనము, నిరుక్తము, భావవ్యాఖ్యానము, పరిష్కరణము మున్నగు నితర విషయములు చేరుచున్నవి. వీని నన్నింటి మీఁదను కౌశలము వడసియుండువాఁడే సరియైన విమర్శకుఁడు. అనఁగా విమర్శకుఁడు సర్వతోముఖుఁడై విజ్ఞాన సర్వస్వసాధకుఁడై యుండవలె నన్నమాట !

విమర్శనమందు చారిత్రక, శాస్త్ర, కావ్య విమర్శనములని ప్రత్యేక విభాగము లున్నవి. విమర్శకులలో నిరు తెగలవారున్నారు. ౧. ఉన్నదాని నున్నటులు విపులీకరించి యర్థమును (కవి తలంచిన రీతి) చెప్పువారు. ౨. ప్రత్యేక వాక్యములను, సందర్భములఁ గైకొని ఖండించువారు. విమర్శకులకు గర్వము హెచ్చఁగా నహంభావముతోఁ గూడి, యున్నదాని విపులీకరించుటే యేమి ప్రయోజనకత్వమని తమ యభిప్రాయములఁ జొనిపి, స్వీయ పాండిత్యప్రకర్షకుఁ బ్రయత్నములు సల్పుచు ఘర్షణములలోనికి దిగుదురు; అట్టిచో వీరు రెండవ తెగలోని వారుగాఁ బరిగణింపఁబడెదరు. విమర్శనోద్దేశము గుర్తెఱింగి, తత్పద్ధతుల నరసి, దాని కనువగు పరికర

ముల సమకూర్చుకొని తదుద్దేశమునకుఁ బూనుకొనిన విమర్శ నము సార్థకనామముతోఁ బరగుననుట నిస్సందేహము. ఇట్లు సర్వలక్షణ లక్షితుఁడై సకల పరికర సమన్వితుఁడై పఱగు నాతని విమర్శన ముదాహరణముగఁ గైకొన సాహసింప వచ్చును.

విమర్శనమే ప్రత్యేక వాఙ్మయ స్వరూపము దాల్చు చున్నది. గూఢార్థమును బ్రకాశింపఁజేయుట, ప్రజలకుఁ గళా సౌందర్యమును వెల్లడించి, కావ్యాదులయందు, కళోపాసన లందు నభిరుచి యాదరాభిమానము లేర్పఱచుట, విమర్శనము యొక్క ముఖ్యాశయములు. కనుక విమర్శకుఁడు పైనుదాహ రించిన పరికరములతోడను, మహదాశయములతోడను, నిష్ప క్షపాతబుద్ధితోడను, విషయ వ్యక్తీకరణమే ప్రధాన కర్తవ్య ముగా నెంచుచుఁ దాఁగైకొనిన దానిలోని లోపాలోపముల నవలోకించి చదువరులకుఁ జూపుచుండవలెను. విమర్శనమని నామం బిడుట కట్టె తఱి గాని సమంజసము గాదు. లేనియెడల 'ప్రశంస' యనియో, లేక 'రంధ్రాన్వేషణ' మనియో, వారి వ్రాఁతలకు నామంబిడిన ఘర్షణమునకుఁ దావుండదు !

ఇఁకఁ గళనుగూర్చి కళోపాసకుల గుఱించి తెలిసికొనవలసి యున్నది. ప్రథమమున 'కళ' యను పదమును నిర్వచించి పిదప దాని వివిధశాఖలు, వానినారాధించు పద్ధతులను గ్రహింతము:

"జీవన సామ్రాజ్యము యొక్క మానసిక రూపమును ప్రదర్శించుటయే కళ"—అని యొక మహాపురుషుఁడు సెలవిచ్చి

యున్నాఁడు.* చతుష్షష్టి కళలున్నట్లుల మనకుఁ దెలియుచున్నవి. కాని వాని నన్నింటిని గ్రహింపఁగల్గునంతటి యవకాశము మన కిప్పుడు లేదు. ఈ యఱువదినాల్గు కళలలో లలితకళలుగా నెన్నఁబడుచున్న వానిఁ గైకొని తెనుఁగుచేతిం బరిశీలింతము :—

కవిత్వము, చిత్రలేఖనము, తక్షణము, సంగీతము, శిల్పము, నాట్యము— లలితకళలుగా నెన్నఁబడుచున్నవి. మన భారతదేశమున లలితకళలపై నున్న యాదరము, తత్కౌన్నత్యము, మఱి యే యితర దేశమందును గాన్పింపదు. భారతదేశము శిల్ప శాస్త్రములో నద్వితీయము; సంగీతములో సాటి; కవనమందు కన్నెజ్జ; చిత్రలేఖన మందు చాతురీధురీణ; తక్షణములో తార. ఇట్టి యైశ్వర్యము లభింపఁజేసిన విశేష నైపుణీ దురంధరు లెందఱో మన భారతదేశము నాదర్శ ప్రాయముగాఁ జేసినందులకు వారు వంద్యులు. అధునాతన యుగమునఁ బాశ్చాత్య దేశములందు లలితకళల కెట్టి యాదరము కలదో యించుక గమనించినవారు, విదేశమునందే వీని జననమనియు, నచ్చటనే కళ యౌన్నత్యము గడించినదనియు, సరియైన పరామర్శ లేక, యభిప్రాయపడుచున్నారు. యథాతథముగ, నేవిజ్ఞానమును గైకొనినను బూర్వము భరతదేశమందు వరలిన దే కాని యన్యముగాదు. సంస్కృతము, గణిత శాస్త్రము, ఖగోళశాస్త్రము, సాముద్రికశాస్త్రము, ప్రకృతి శాస్త్రము, వేదాంతము, తర్కశాస్త్రము, వైద్యశాస్త్రము, తదితర శాస్త్రములును — పైనుదాహరించిన లలితకళలు

* 'Art is the presentation of real in its mental aspect'.

మొదలుగాఁగల వన్నియు, భారత భూమిలో జనన మొందినవే! నేఁటికి వాని నితర దేశంబులనుండి నేర్చుకొనుచుంటిమని, సర్వవిజ్ఞానము వారి ధనమే యని తలంచునంతటి దౌర్భాగ్యము గలుగుట యెంతయు శోచనీయము. ప్రాచీన విజ్ఞానమును విస్మరించు దుస్థితి వెల్లివిరియుట విచిత్రము గాకేమున్నది? మన ప్రాచీన శాస్త్రముల నభినందించుచు, 'పొరుగింటి పుల్లకూరరుచి' యన్న సామెతను నేటి భారతీయులలో నవనాగరకులమని గర్వపడువారు సార్థక పఱచుచున్నారు. నిజము గ్రహించిన మనము మన శాస్త్రములను నిల్పుకొన లేక, పఠింప లేక, యితరుల కందఁజేసి, నేఁడు తిరిగి వానినే యితరులచేతను బోధింపఁబడవలసిన స్థితిలో నుంటిమి కదా! ఏమి యీ వైపరీత్యము!

ఇఁక నొక్కొక్క లలితకళలను గ్రహించి యొకనాఁటి తదున్నతిం బరికింతము!

కవిత్వము: మన భారతదేశము కవనములోఁ గన్నెఱ్ఱ యంటిమి : నిజమున కంతియే. భావగాంభీర్యమునందుఁగాని, భావార్థ ప్రకర్షమందుఁ గాని, రసికత్వమునఁ గాని, నడక పొందికలోఁ గాని, యలంకారపు టందమునఁ గాని యితర దేశముల కవులు మన కవులతో సాటి రారు. శృంగార రసవర్ణనలలో మన కవుల కవనములు తేనెసోనల మెక్కినవి. కవి చమత్కృతు లపూర్వములు. వచనము లొక్కపరి చిప్పిలఁజేయు సాహిత్యములో మనవారి ప్రజ్ఞాగౌరవములు. ప్రబంధరచనలు ద్వారా కావ్యరచనలు మన కవివరుల మనంబులనే మొలకలెత్తినవి.

షేక్స్పియర్ వ్రాసిన 'మిడ్ సమ్మర్ నైట్సు డ్రీము', 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' లను చూచి మన కవులను నిరసింపనక్కరలేదు. వానికి దీటుగ పింగళి సూరన మనకొసంగిన 'కళాపూర్ణోదయ' మున్నది. వస్తువస్తుతే ప్రకృత్యుపాసకుడని మన దేశపు నవ నాగరకులు తలంప నవసరము లేనట్లు మనకవులంపటు నట్టి వారిని కనుగొందుము. ఇందులకు మనవారి ప్రబంధములలోని ప్రకృతి వర్ణనములే ప్రమాణములు. అంతవఱకేల? వేదముల యందే ప్రకృత్యుపాసనములు కుప్పతిప్పలుగనున్నవి. కాళిదాస కవి ప్రకృత్యుపాసనమందేమి, వ్యంగ్యప్రధానమగు శృంగారరస పోషణమందేమి యసమానుఁడు. కనుక ప్రాచీనకవుల కవనము లెట్లు నీతిబోధకములై, వర్ణనాపూర్ణములై, భగవద్భక్తినిఁ బురికొల్పు విషయములతో వరలినవో, నేఁటి భావ కవులు గూడ ప్రాచీన సంప్రదాయముల వదలక క్రొత్త నడవడితో సులభమార్గమున, నుత్తమాశయములతో వ్రాయుచున్నారు. ఇహాపరముల సాధించు సాహిత్యము భారతీయులదే కాని తదితరులది కాదు.

చిత్రలేఖనము : భారతదేశము చిత్రలేఖనమందు చాలఁ దీర్ఘకీర్తి యుంటిమి. ఈ వచన మూరక వ్రాసినదికాదు. నిజముగ నీ కళౌన్నత్యమును గమనింపవలె ననిన హైదరాబాదు రాష్ట్రమునందలి ఔరంగాబాదు జిల్లాలో (ప్రస్తుత మాంధ్ర ప్రదేశములోఁ జేరిన) 'అంజతా' చిత్రములే తార్కాణంబులు. ప్రాచీన కళౌన్నత్యమును, వైదగ్ధ్యమును ప్రజలు విస్మరించునట్టి దినంబు లేతెంచినను, ఆ చిత్రములు నేఁటికిని

సజీవములుగనుండి చెక్కు చెదరక, వినూతనము లేమో యని చూపరుల భ్రమింపఁజేయు చున్నవి. నిజముగఁ జిత్రరచన మనిన నానాఁటి చిత్రకారులదే! చిత్రకళాపోషణ మనిన నాఁటి మహీశులదే! కళోపాసన మన్న నాఁటివారిదే! నిజముగ మనుష్యుని వర్ణించినంత, నావర్ణనమును విని చిత్రించునట్టి కళాకౌశలముగల చిత్రకారు లుండువారలు. చిత్రకళకుఁ గావలసిన వస్తుసామగ్రిని సైతము వారే నిర్మించు కొనెడి వారు. ఆనాఁ డుపయుక్తములైన వర్ణరచనానైపుణికి నేఁటి శాస్త్రవేత్తలు విభ్రాంతి చెందుచున్నారు. ఆ వర్ణములు నేఁటివఱకుఁ బ్రత్యగ్రముగ నుండుట వారిని చకితులఁ గావించు చున్నది. భారతీయ చిత్రరచనము ప్రపంచ విఖ్యాతి నందినది. అంగాంగీభావ నిర్వాహణమందు, వివిధభావ చిత్రణమందు, వెలుఁగునీడలయందు, నవయవసౌష్ఠవ సౌకుమార్య వైవిధ్య నివేదనమందు, సంవిధాన కల్పనమందు భారతీయ చిత్రకారు లప్రతిమాన వైలక్షణ్యమును బ్రకటించి చరిత్రలో శాశ్వతస్థాన మలంకరించినారు. ఆనాఁటి చిత్రకారుల కళౌన్నత్యమును వెల్లడిఁజేయు 'అజంతా' చిత్రములు నేత్రోత్సవదాయకంబులు. ప్రాచీన కళౌన్నత్యమును బ్రజల కందఱకును జూపుటకొఱకై తగు సౌకర్యము లేర్పఱచిన హైదరాబాదు ఆంధ్రప్రదేశ ప్రభుత్వము నిప్పట్ల నభినందింప వలసియున్నది.

తక్షణము : ఇందలి నైపుణ్యమును గ్రహింపవలె ననినఁ బ్రాచీన కట్టడములనే గమనింపవలెను. ద్వారము లందును, జాలి స్తంభముల మీఁదను గానవగు చెక్కడము

శిల్పాఁడేని ననుకరింపఁ జాలదు. ఆనాఁటి యుద్ధములలో నుపయోగింపఁబడిన ఖడ్గముల పిడులపైనను, డాలుల మీఁదను, కవచములపైనను గొప్ప తక్షకులచేఁ జెక్కఁబడిన పనితనము నేఁటికిని మనము వస్తుప్రదర్శనశాలలలోఁ గాంచఁగల్గుదుము. ఫిరంగి గొట్టముల మీఁదను నాఁటి తక్షకుల నైపుణ్యము మెఱయుచున్నది. ఆగొట్టముల ముఖములే సింహతలాటములుగనో, ఎద్దుతలలుగనో చెక్కినట్లు గానఁబడుచున్నవి. ఎల్లోరా గుహాలు మొదలైనవి మన తక్షకుల కళావైభవమును ప్రకటించునవి.

సంగీతము : నాట్యము :- 'గీతం వాద్యం చ నృత్యం చ త్రయం సంగీత ముచ్యతే' యను శాస్త్రజ్ఞుల వాక్యానుసారముగ సంగీతము గీత వాద్య నృత్య సమ్మేళనము. నాట్యమునే 'భరత' మని నుడువుట కూడ వినుచున్నారము. అనఁగా భావ, రాగ, తాళయుక్తమైనది భరతమని భావము. సంగీతము మన దేశమునకుఁ గ్రొత్తదికాదు. ఇది వేదకాలమునాఁటి నుండి యున్నట్లు సామవేదమువలనఁ దెలియనగును. సంగీతమును తరణోపాయంబున కనువగునదిగా నెంచి, త్యాగరాజు, దీక్షితులు, శ్యామశాస్త్రిమున్నగువారు దానిం జేపట్టి స్థిరకీర్తిం బడసిరి. కర్ణాటకసంగీతమని పేరుగన్నది భారతీయుల దక్షిణాది సంప్రదాయసిద్ధమగు సంగీతము. కర్ణపేయముగ నుండినదిగాన దాని కీ పేరు సిద్ధించినదని పెద్ద లనుచున్నారు. సంగీతమునకు దక్షిణభారత (కర్ణాట) దేశము ప్రఖ్యాతినందినది. నాదబ్రహ్మ నుపాసించి యీ కళద్వారా మోక్షసాధన మొనర్చిన యోగ్యు

లున్నారు. ఇవ్విధముగ భగవత్సన్నిధిఁ జేర్చు సుపాయము మీ సంగీతకళ యందున్నట్లు మహానుభావులు దర్శించి ప్రతిపాదించి యున్నారు. త్యాగయ్యకీర్తనలు, దీక్షితులకృతులు, క్షేత్రయ, పదములు నేటికిని రసజ్ఞుల నలరించుచునే యున్నవి. నృత్త్య నృత్య-తాండవ, లాస్య భేదములచే నాట్య మొప్పారుచున్నది.

శిల్పము : ఏతదౌన్నత్యము ప్రాచీన దేవాలయాదుల యందు గాననగును. ఇందులకు మన దక్షిణదేశమే పేర్కొనఁ దగినది. అమరావతి, నాగార్జునకొండ యిత్యాది చారిత్రక స్థలములలో నద్భుతమగు శిల్పసంపద కనుగొననగును. ఆంధ్ర శిల్పకళావైదగ్ధ్యము వేనోళ్ళఁ జాటునట్టి శిల్పము లవి. శిల్ప హృదయము నెఱిఁగి సానుభూతితోఁ దిలకించువారికి వీని ప్రత్యేకత పొడగట్టును. ఒక్క స్తంభములో శిల్పిచూపు పనితనమునకుఁగాని, ఒక కొండను శిల్పభవనముగాఁ మలచుట లోని కౌశలమునకుఁగాని యెవరైనను జోహారు లర్పింప వలసినదే. ఇంతటి ఘనమైనది భారతీయ శిల్పము!

కళోపాసనము యొక్క ముఖ్యతత్త్వ మీశ్వరోపాస నమే. కళయొక్క పరమావధి భగవంతుని నిరూపించుటయే. మనకుఁ గళాపోషకు లత్యావశ్యకము. ప్రాచీన సాంప్రదాయ ముల విస్మరింపక, యుదాత్తాభిప్రాయములతోడఁ బ్రాచీనులు జూపిన పథములనే పోవుచు నొకప్పటి భారతీయ ప్రతిభను, విజ్ఞానమును, గళౌన్నత్యమును సంస్కరించి వానిం బునరుద్ధ రించుట యవశ్య కర్తవ్యము.

[1938 'దివ్యవాణి' లోను, ఏప్రిల్ 1940 'భారతి' లోను ప్రకటితము.]

౫

కవి - చిత్రకారుఁడు

వస్తు స్వరూప నిరూపణ మందుఁ గుంచెను బహు జాగరూకతతో నుపయోగించి, రేఖలు సరిగా వ్రాసి యెంతయో తిప్పలు బడుచుండుట చిత్రకారులకు సహజము. వర్ణముచే చిత్రము నద్దవలెనన్న బహు సూక్ష్మముగా దాని యెడ లోపము గాన రాకుండునట్టుల కుంచెచే నట్టిట్టు వ్రాసి సమముగఁ జేయును. వస్తు నిర్దేశమందుఁ బ్రసిద్ధుఁడే నిజమైన చిత్రకారుఁడు. ఈ వస్తు స్వరూప నిరూపణ మరయుటకు బుద్ధి కౌశలమే ప్రథమ సోపానము. గార్దభాకారము వైచి, దానిని శునకముగా గ్రహింపుఁడనుట కేవలము చిత్రకారుని యసామర్థ్యమును సూచించును. ఒక చిత్రకారుని చిత్రము మెప్పువడసిన దనిన నాతఁడు గొప్పవాఁడనియే తలంపవచ్చును. కరుణారసమును వ్యక్తీకరించుటలోఁ జిత్రమందు రౌద్రముం జూపిన సమంజసముగాదు. కొందఱు చిత్రకారులు వారి చిత్రపటముల ప్రక్కనే నామంబిడుచుందురు. కాని వాని నామములు వ్యక్తీకరించు భావము లప్పుడప్పుడు కానరామి, నామం బిడుచుండుట యాచారమైనది; కాని 'నామము నా కొంపదీసె' నను లోకోక్తియు వినుచుందుము !

చిత్రకారుఁ డెంతటి జాగరూకతతో మెలఁగునో యదే విధముగ, లేక యంతకన్న నెక్కుడుగఁ గవి శ్రద్ధ వహించుచుండును. ఈతని ముఖ్యాశయము గూడ వస్తునిర్దేశమే ! కవి - చిత్రకారు లిరువు రొకే యాశయముతోఁ బనిచేయు

చుందురు. ఒకఁడు గ్రహణశక్తిని నేత్రరూపమునఁ గలుగఁ జేయును. వేఱొకఁడు శ్రవణరూపమునఁ గలుగఁజేయును. ఇరువురును హృదయానందముఁ జేకూర్పవలెనను నభిమతిము తోడనే కృషి సల్పెదరు. చిత్రకారుఁడు వ్రాసిన గీతలో జీవరేఖ యంతర్వాహినిగాఁ బ్రవహించును. ముఖ్యముగ భావనలతో నవస్థావస్థలను గనిపెట్టి, రసానుభూతి పొంగి పొరలియుండుటకుఁ జిత్రకారుఁడు పాటుపడును. కవి సయిత మౌచితి యను వెలుంగు కరమున నిడికొని, యవస్థను తద్వ్యక్తిచే గమనించి, భావనాయంత్రముచే వస్తునిర్దేశము గావించును. సాధారణముగాఁ దాము లిఖించిన గీతములను గాని, చిత్రములనుగాని జనాళిగాంచి, తా మేవిధములగు భావములందు వ్యక్తీకరించిరో యవే భావములను గ్రహించి, తా మే విధములగు నూహలను చదువరుల — లేక — చూపరుల మనంబులందు జనింపఁజేయ సమకట్టిరో యా యూహాలే ప్రజల మనంబులఁ బ్రతిబింబితములైన యెడలఁ గవియొక్కయుఁ జిత్రకారునియొక్కయు నభిమతములు సఫలీకృతము లయ్యె నన్నమాట !

కవి యొక పాత్రను ధీరోదాత్తునిగఁ బోషించుచుండుచు నా భావమునుండి తొలగింపఁజేసి రసాభాసము గలుగఁ జేసిన నాతని పాత్రపోషణ మనౌచితి యను మృత్యువాతఁ బడినదాను. చిత్రకారుఁడు నైతము సింహమును దానితోక పై నక్క యున్నటులఁ జిత్రించిన నసంభావ్యమగును ! రెండవ విషయ మవస్థానుగుణముగ లిఖించుట : ఉదాహరణమునకుఁ

గవి యవస్థానుగుణముగా లిఖింపనిచో నెట్లుండునో చూతము: రాముఁడు సీతను విపినంబుల డించి రమ్మని లక్ష్మణుని కాజ్ఞాపించుట, మరల జానకితోఁ గలియుటయో, 'అయ్యో! విడవలసివచ్చెనే' అని విలపించుటయో చేసినట్లు చిత్రించినచో నది కేవల మవస్థానుగుణ మగును.

తదితర లలితకళలకువలెనే కవిత్వ చిత్రలేఖనములకుఁ గూడఁ బ్రజల నైతికాధ్యాత్మికాభ్యున్నతియే లక్ష్యము. అందుచే నివి యెల్లకాలము నొకే విధముగ నుల్లసిలు ననుట యసంగతము; అవి దేశ కాల పరిస్థితులఁ బట్టి వివిధములై, యాయా దేశీయుల నైతికాధ్యాత్మికాది వ్యవస్థలనుబట్టి మారుచునే తదభ్యున్నతిఁ గలుగఁజేయును. అట్లే ప్రాచీనయుగములందుఁ బ్రజల విజ్ఞానావస్థ వ్యక్తమగు నటుల సంస్కృతకావ్యములకుఁ బ్రాముఖ్య ముండెడిది. ఆంధ్రులలో రానురాను సంస్కృత కావ్యములపై నభిరుచి సన్నగిల సంస్కృత పదభూయిష్ఠములగు తెలుఁగు కావ్యములు బయలు వెడలెను. మఱికొంత కాలమునకు జాను తెనుఁగు కావ్యముల కాదరము మెండయ్యెను. కడపట నధునాతన యుగమున వ్యవస్థాంతరమును దెలుపుఁ దేటలగు చిట్టిపొట్టికైతలకును, ఛందోనియమ మంతగా లేని భావగీతములకును బ్రాముఖ్యము ప్రబలినది. అది యీనాఁటి వారి విజ్ఞానావస్థను దెల్పును. వారు మహోత్తర కావ్యములలోని (ఛందోబద్ధ) మహదాశయముల నర్థము చేసికొనలేకపోయినను 'ఎంకి పాటలలో' సువ్యక్తములగు మధురాశయముల నవగతము చేసికొనఁ గల్గుదురు. భాషాయోష

శాస్త్రచోదితాచారముల నతిక్రమించి, 'విటురాలి విధమున వెడలె' ననుట కవితలోని యుత్కృష్టభావముల నున్న తాశయముల గ్రహింపనేరమికిం దార్కాణము. పతితులగువారిం బైకెత్తిం గవితావధూటి చేయూతనొసంగుటకై నడుమువంచిన మాత్రమున నామె గౌరవహీన గానేరదు. అట్టి యామెను పతిత యనువారు భాషాబహిష్కారమున కర్హులు.

అవ్విధముగనే ప్రాచీనయుగముల వర్ణచిత్రముల యున్నతాసన మీనాఁడు రేఖాచిత్రముల కొసఁగఁబడినది. ఇవి భావవిహీనము లనిగాని, నియమరహితము లనిగాని యనుట సమంజసముగాదు. వర్ణచిత్రములకు వర్ణములు, కుంచె మొదలగు పరికరములు గావలె. కాని, రేఖాచిత్రములకు, లేఖిని, ఫలకము లుండినఁజాలును. ఒక వర్ణ మొక్కొక తావునందు దిద్దిన నెంత గంభీరముగానుండునో యటులనే నవయౌవనుఁడౌ పురుషుని చిత్రమునం దొక రేఖచే ముదుసలిగాఁ జేయఁగల శక్తి రేఖలో నున్నది. కనుక ప్రాచీన కవిత్వమందును, చిత్రలేఖన మందును మార్పు కలిగినది. ఇది కేవలము కాలానుగుణమగు మార్పని మనము తెలిసికొనియే యున్నాము.

దేశీయులకు రాను రాను కాలముయొక్క విలువ తెలియుచున్నది; పెద్ద పెద్ద ప్రబంధములుగాని, గ్రంథములుగాని, చూచి, చదువునంతటి వ్యవధి యున్నటులఁ గానరాదు. కనుకనే భావగీతముల కాదరము గలుగుచున్నది. ప్రజలకు సౌకుమార్యము ప్రబలినది. గంభీరములగు వానింజూచు నంతటి—లేక—ఎదుర్కొను నంతటి ధైర్యము లేదు. పెద్దన వ్రాసిన

గానచరిత్రము నామూలాగ్రముగఁ జదివి యానందించిన మానవు లెందఱో చూచిన నొకలెక్కకు రారని చెప్పవచ్చును. ఎందుచేత? రసార్ద్రములైన ఘట్టముల వఱకే జనుల యానము: అప్పటికిని మధ్యలో 'అటజని కాంచె భూమిసురుఁ డంబరచుంబి శిరస్సరఝ్ఝరీ పటల ముహుర్ముహుర్' అను పద్యము వచ్చిన వదలివేయుటయే! వదలివేయుటయే కాక, 'నారికేళపాక మేమిటోయ్' అనుమాటలతో నాకవిత్వమును కొందఱు తూలనాడెదరు. అట్టి పరిస్థితులలో భావగీతము లుప్పతిల్లి వీరి లోటును దీర్చి మెప్పుఁ బడసినవి. అటులనే ప్రాచీనచిత్రముల నుండు వర్ణములఁ జూచి యసహ్యపడు నంతటి సౌకుమార్య మేర్పడినది. దీనింబట్టి కవి, చిత్రకారులు కాలానుగుణముగఁ బ్రజాభిరుచిం బట్టి ప్రబల నైతికాధ్యాత్మికాభ్యుదయమునకై పాటు పడుచుందురని గ్రహింపవలయును.

కవియుఁ జిత్రకారుఁడు నొకే యాశయముతో ద్వివిధములగు కార్యముల నెరవేర్చుచున్నారని యెఱింగితిమి గదా! కవియొక్క కథలనైనను, గీతములనైనను చిత్రరూపమున వెలిబుచ్చి, చిత్రకారుడు గ్రహణశక్తికిఁ దోడ్పడును. అట్టితఱి కవియే చిత్రకారుఁడైనచో వస్తునిర్దేశ మెక్కుడుగ రాణించును గదా! అటులగా కవిత్వ చిత్రలేఖనము లను రెండు కళ లొకే వ్యక్తి కలవడినచో దాను చెప్పఁదలచినదాని రెండు విధముల నాతఁడే వ్యక్తీకరించును. దీని కుదాహరణములఁ జూచినచో కవితకును జిత్రలేఖనమునకును సన్నిహిత సంబంధ మెంత యుండునో గ్రహింపవీలగును. కవికిని చిత్రకారునకుఁ దోడ్పడు

ప్రకృతికిని కవితా చిత్రలేఖనములకు నెట్టి సంబంధ మున్నదో యూహింతురుగాక. అరుణోదయమును గవి వర్ణించును; చిత్రకారుఁడు చిత్రించును. ఈచిత్రము ప్రక్కనే గీతము నుంచిన నవి పరస్పర దోహదభూతములై కర్తృభావములు సులభముగ వ్యక్తమగుట కవకాశము లొనగూర్చును. కవికుమారునకుఁ జిత్రకారునకుఁ బ్రకృతి యెంత సహాయకర మగు వస్తువో తెలియును. సాధారణముగాఁ గవి చిత్రకారులకుఁ బరిసర దృశ్యములు తమ కృతులకు ప్రేరకములుగాఁ బరిణమించుచుండును. కావున లలితకళోపాసకులు ప్రకృత్యుపాసనము ప్రథమ కర్తవ్యముగా నెఱుఁగవలెను. ప్రకృతి ప్రభావ రహితములైన చిత్రకావ్యములు నిర్జీవములే !

[రచన : నవంబరు 1937; 10-8-1938 ఆంధ్ర వారపత్రికలోఁ బ్రకటితము]

౬

పదకవిత్వము

కవిత్వము లలితకళ లన్నిటిలో నగ్రస్థానము వహించుచున్నదని పండితుల సిద్ధాంతము. సంగీతములో నున్న హృదయద్రవీకరణశక్తిని, చిత్రలేఖనమందలి రూపకల్పనము, నాట్యమందలి చేష్టావైచిత్రుల నిముడ్చుకొని భావనాత్మకమై కవిత యొప్పారును. చిత్తరువులలో వానివలెఁగాక కవితలోఁ జిత్రితములైన పాత్రలు సచేతనములు. అవ్యక్తమధురగీతి యంతర్వాహినిగాఁ గవితలోఁ బ్రవహించుచుండును. దీనిని గమనించియే కార్లైలుపండితుఁడు కవిత గీతాత్మకమైన భావమని నిర్వచించినాఁడు*. కవిత్వమునకు భావ, వస్తు, రచనలు ప్రధానాంశములు. వీనిలో దేని ప్రభావము మిక్కుటమైన దాని పేర కవిత్వము బరగుచుండును. అట్లు వచ్చినవే భావకవిత్వ, వస్తుకవిత్వము లనునవి. రచనములో శబ్దార్థములే ప్రధానములు. మధురమంజుల గానయోగ్యమైన యక్షరములకే మైత్రి గల్పించుట రచన మందలి విశిష్టగుణము. రమ్యాక్షరాపచయము, శ్రవణానందకల్పనము లొనర్చుట కవికార్యము. ముఖ్యముగాఁ బదకవిత్వమం దీవిధమైన రచనాసౌందర్య మొలుకుచుండును; అయ్యది శ్రవణసుఖము నిచ్చుచు, హృదయమును ద్రవీభూత మొనర్చి మానవుని సంస్కరించును.

పదకవిత్వము మాత్రాఛందముకలిగి, శబ్దకాఠిన్యము లేక సరసమగు పదములతోఁగూడి, గానయోగ్యమై, రాగ

---

* Poetry, we will call, is musical thought.

రంజితమై, జాతీయాచార వ్యవహారములకుఁ బ్రతిబింబమై, చక్కని నానుడులకుఁ బలుకుబళ్ళ కాశ్రయమై, మానవుల కష్ట నిష్ఠురముల మరపించునదై, పండితపామరరంజకమై వర్తిలు నది. జాతిప్రబోధమునకు, నుద్దీపనమునకు నీపదకవిత తోడ్పడుచుండును. ఇట్టి కవిత ప్రతి భాషావాఙ్మయములో నుండును. కాని తెలుఁగు పదకవిత కొక విశిష్టత యున్నది. సహజసారళ్యసంశోభితమును, మృదుమధురగాన యోగ్యము నగు తెలుఁగు పదములలో నాదసౌందర్యమున్నట్లు తెలిసి కొందుము. పాశ్చాత్యులు సైతము మన భాషను మెచ్చు కొనిన కారణమిదియే![1]

మన దేశములోఁ బద కవిత్వ మనాదిగాఁ, ననుస్యూత ముగా వర్తిలుచునే వచ్చినది. ప్రాక్తన మానవుఁడు ప్రకృతి శోభకు పరవశుఁడై యనిర్వచనీయమగు నానందమును బొంది యుండును. తన మనోభావమును బ్రదర్శించుట కాతఁడు చిందులు ద్రొక్కి చప్పట్లను చరచి, శబ్దరహితమైన నాద మాలపించియుండునని భావింపఁగలము[2]. అజ్ఞాతావస్థ లోని మానవుని మనసు పరిశీలించిన నది శిశుమానసమువలె, నవనీత సదృశమైనదని తత్త్వజ్ఞులు చెప్పుదురు. శిశుప్రాయుఁడు దన యానందమును పైవిధముగనే ప్రదర్శించునట్లు ప్రత్యక్ష ముగాఁ జూడఁగలము. సృష్ట్యాదినుండియు నిశిత నిర్ఝరమా మానవుని భావానుభవము లయాన్వితమైన భాషలోనే

1 Telugu is the Italian of the East.

2 Moulton's Theory

వ్యక్తి నగుచుండుట తథ్యము.* ఈ ధర్మానుగుణముగనే వాల్మీకి శోకము శ్లోకత్వ మందినది. ఈ విధముగా నుద్భవించిన గీతి యుద్రేకపూరితమై యుండి రాగ రంజిత మగును. ఇట్టి గుణము పదకవిత్వములోనే యుండుట కెక్కు వవకాశ మున్నది. కాని పద్యములో నుండుటకు వీలు లేదు. పదకవిత్వ ముద్రేకోత్సాహ ప్రేరితములగు కర్తృభావములు కలదగుటచేఁ బఠితృ, శ్రోతృ హృదయములలో నా భావములు సూటిగా వెడలి, నిశితముగా నాటుకొని, వేగముగా నుద్దిష్ట రసానుభూతిఁ బొందించును. ఇంత త్వరితముగా బోధించు గుణము మాత్రా ఛందముల కున్నంతగా గణఛందముల కేలనో లేదు. ఇది పదకవిత్వమున కున్న విశిష్టగుణము.

ఈ విధమైన పదకవిత్వము రాజాస్థాన గౌరవము నొందలేదు.♦ పొందలేదని విచార మక్కరలేదు. రాజసభలలో నంతయుఁ గృత్రిమ వాతావరణము. అం దాదరము నొందు కవులు, కవిత్వముఁగూడ స్వేచ్ఛారహితులై రాజుల కనుసన్నల మెలఁగుచుందురు. కాని పదకవిత్వము ప్రజాసామాన్యము పాలిటి పెన్నిధి. రాజాదరముతో దీనికి నిమిత్తము లేదు. ప్రజల కానందముఁ జేకూర్చి, వారిచే మన్ననలు నొందుచు, వారిని నిరాడంబర జీవులుగాఁ, దేజోమూర్తులుగా, నుత్తమ శీలురుగా సంస్కరించుటయే దాని యుద్దేశము. ఈ పదకవితా

* **Ever since man has been born, all deep and sustained feeling is seen to express itself in rythmical language.**

—S. Mill.

♦ 'అనాదృత వాఙ్మయ'మను శ్రీ మల్లంపల్లివారి వ్యాసము చూడఁదగినది.

నిర్మాతలుగూడఁ బ్రజాపరమునే వాంఛించిరి గాని రాజాశ్రితులకు లోఁబడినట్లు గాన్పింపరు. అట్లు కానిచో వారి కవితలో నంతటి యౌజ్జ్వల్యము స్వచ్ఛత స్వాతంత్ర్యభావము లుండుట కవకాశ మెట్లు పొసఁగును? ఈ పదకర్తలు కీర్తికాములు కారనియు, స్వేచ్ఛాజీవులనియు, సుకుమార హృదయులనియు, ముముక్షువు లనియు, వారి వారి రచనలఁబట్టి తెలిసికొందుము. అనేక ప్రాచీన పదములకుఁ గర్తలెవరో మనకుఁ దెలియుట లేదు. కాని యా పాటలు మంచి ప్రచారము నందినట్లు గ్రహింపఁగలము. ఇందు వారి స్వార్థరహిత బుద్ధిని, పరార్థ సేవను మనము జూడఁ గల్గుదుము. ఈపదకవిత్వ మింతకాలము ప్రజల నాలుకలపైననే వర్తిలుచుఁ బ్రాచుర్యముఁ బొందుచున్నదనిన నా కవితా ప్రభావ మెంతటిదో గదా!

తదితర దేశములవలెఁగాక భారతదేశము ప్రధానముగా వ్యావసాయిక దేశము. పనిపాటలవారీ దేశమం దెక్కువగా నున్నారు. యంత్రయుగము రాకపూర్వము పనివారల కలసట కలుగనీయక నీ పదకవిత వారికి నుత్సాహ మిచ్చుచుండెడిది. మన కీ నాఁటికిని పల్లెలలో నీవిధముగాఁ బదకవిత్వ ముపయోగ పడుచుండుట గాంచెదము. పాశ్చాత్య దేశములలోవలెఁ గాక మన దేశములో పారలౌకికచింతయే ప్రముఖమై యొప్పారునది. కావున మన దేశ కవిత్వములో నాధ్యాత్మికవిచార మెక్కుడుగాఁ గన్పించును. వర్షాకాలములలోఁ బ్రవహించు నదీనదములు పుష్ప ఫలలతాదులచే శోభితమగు వనములు, సముద్రతీరములు, ఉద్యానవనములు, పర్వతప్రదేశములు, కొండకోనలు, కీరశారికాది

విహారపతములు భారతీయ ప్రకృతిలోనివి ! పాశ్చాత్యుల కీవిధ మైన సహజప్రకృతిశోభ లేదు. ఈ ప్రకృతిశోభ భారతీయ కవిత్వములోఁ బ్రతిబింబించుచుండును. పదకవిత్వములో శృంగార గీతములు ప్రకృతిప్రభావ విలసితములే. ధైర్యపౌరుషములలో భారత దేశము ప్రశస్తికెక్కినది. అనేక వీరు లసమానముగా రణరంగమునఁ బోరాడి మృతజీవులైనారు. కవితలో నీ విషయమును స్థానముఁగొన్నది. ఈవిధముగా భారత దేశము పార్థ్క్యము గలది. తదనుసారిగాఁ గవిత్వకూడఁదదితర దేశములకవిత కన్న విలక్షణమైనది. ప్రకృతి సౌందర్యము, తత్త్వజిజ్ఞాస, వీరగాథలు భారత దేశపు స్వత్త్వములు. ప్రాచీన పదములను బరిశీలించినచో వీర, శృంగార, తత్త్వపరములుగా నవి యున్నట్లు కన్పించును.

మన పదకవిత్వములో నుపాదేయమగు మాత్రా ఛందస్సు దేశీయమైనది. తదితర గణ ఛందస్సులవలె సంస్కృత లక్షణానుసారి కాక యిది విలక్షణమైన తెలుఁగు వారి సొమ్ము. ద్విపదలు. త్రిపదలు, చౌపదులు, షట్పదులు, రగడలు, అక్కరలు మొదలైనవి దేశీయ ఛందస్సులు. ప్రాచీన పదకవిత్వ మంతయుఁ బైవానియందే చెప్పఁబడినది. కీర్తనలు, దరువులు, పాటలు, పదములు, గేయములు, గీతములని యీ పదకవిత్వములో ననేక తరగతులకుఁ జెందిన రచనము లున్నవి. వీనిం బాడుటకుఁ బ్రత్యేక ఘణుతులు, నియమిత సమయములు, కొన్ని వృత్తిసంఘము లుద్దేశింపఁబడినవి. అనాదినుండి యీ పదకవిత్వమును మన దేశీయులు తమ తమ

వంశ పారంపర్యముగా సంపాదించు కొనుచు వేదములవలె భద్రపరచినారు.

ఆంధ్రసాహిత్య చరిత్ర నవలోకించుచో నీ పదకవితా ప్రశంస యందందుఁ గన్పించుచున్నట్లు తెలియుదుము. పంద్రెండవ శతాబ్దమునాఁటికి మన సాహితీ ప్రపంచములోనికి శైవ కవులు ప్రవేశించినారు. వీరు భాషావిప్లవము తెచ్చిపెట్టినారు. ప్రజలలో వీరశైవమత వ్యాప్తి కలిగించుటకుఁ గావ్యముం జేపట్టినారు. సంస్కృతపదభూయిష్ఠ రచన ప్రజల కందుబాటులోనుండదని 'జాను తెనుఁగు' భాషలో వ్రాయ మొదలిడినారు. వృత్తములకు బదులుగా దేశీయఛందమైన ద్విపదలోఁ గావ్యముల వ్రాసి, మత ప్రచారమునకు దేశీయ ఛందస్సు, వ్యావహారిక భాష లత్యంతోపస్కారములని కనిపెట్టినారు.* శైవపరములైన గీతముల నేకము లల్లఁబడి శ్రీశైలముం బోవు యాత్రికులవలన, భక్తులవలనఁ బ్రాచుర్యమందినట్లు పండితారాధ్య చరిత్రలో వ్రాయఁబడినది. తుమ్మెదపదములు, నివాళిపదములు, ఫాలేశుపదములు, ప్రభాతపదములు, పర్వతపదములు, ఆనందపదములు, గొబ్బిపదములు, వెన్నెలపదములు, కోవెలపదములు, విరాళిపదములు, సెజ్జవర్ణన పదములు మున్నగున వెన్నియో భక్తులచేఁ బాడఁబడుచుండెడివట !

తరువాతకాలములో గోన బుద్ధ భూవిభుని రంగనాథ

---

*«ఒప్పైన ద్విపద కావ్యోక్తి నా జనదు, అరూఢ గద్య పద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ఠరచన, మానుగా సర్వసామాన్యంబుగామి, జానుఁ దెనుఁగు విశేషము ప్రసన్నతకు» —పండితారాధ్య చరిత్రము.

రామాయణము ద్విపదకావ్యముగా వెలసి 'తోలుబొమ్మలాట' ద్వారా ప్రజల కంఠపాఠములోనికి వచ్చినది. ఇట్లే గౌరన, రాఘవార్యుల హరిశ్చంద్ర, నలోపాఖ్యానములు ద్విపదకావ్యములుగా నవతరించినవి. శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్రమును ద్విపదకావ్యముగా నిర్మించి పదకవితావాఙ్మయములో శాశ్వతస్థానము నలంకరించినాఁడు. సమాజములో భావావేశము ప్రేరేచు సన్నివేశములు పదకవితావస్తువుగాఁ బరిణమించి ఖ్యాతి నుద్ఘోషించుచుండును. ఇట్టివే కాటమరాజుకథ, బాలనాగమ్మకథ, బొబ్బిలికథ, కామమ్మకథ మొదలైనవి.

పదునాఱవ శతాబ్దము నాఁటికి ప్రబంధప్రక్రియకు గౌరవము హెచ్చినను పదకవిత వర్ధిలుచునే వచ్చినట్లా కాలమునకుఁ జెందిన తాళ్ళపాక చిన్నన రచించిన వెంకటేశ్వర స్తుతి పదములు[1], ద్విపదరచనలు ఋజువుపఱచును. కందుకూరి రుద్రకవి[2] కూడ నష్టపదులు రచించి పదవాఙ్మయమునకు నివాళి పట్టినట్లు తెలియుచున్నది. ఇట్లే రాయలకాలమందును పదకవిత వరలినట్లును, ప్రబంధమం దాదరముచే నది మరుగునపడుచు వచ్చినట్లును గన్పించును.

పిమ్మట పదునేడు, పదునెనిమిదవ శతాబ్దములలో నాయకరాజుల పరిపాలనమునందు గీతికినాదరము మెండాయెను. గేయవాఙ్మయము విరివిగాఁ బెరిగినది. యక్షగానము లుద్భ

1. దీని వంతటిని సంపుటములుగా శ్రీ తిరుపతి దేవస్థానమువారు ప్రచురించి యున్నారు.

2. కొందఱీతనిని నాయకరాజుల కాలములోనివాఁడని చెప్పుచున్నారు.

వించి మాత్రాఛందస్సున కవకాశము మిక్కుటముగా నిచ్చినవి. సంగీతమునకు రాజస్థానములలో నత్యంత గౌరవము లభించిన దినములవి. శహాజీకాలములో తిమ్మయ ద్విపదభారతమును రచించినాడు. తరువాత శరభోజీ కాలములో (1711–'28) త్యాగరాజు భక్తిపారవశ్యమున కీర్తనము లనేకము రచించియున్నాడు. విజయ రాఘవ నాయకుని కాలమునకు జయదేవుని గీతగోవిందపద్ధతిని క్షేత్రయ తన పదములను రసవంతముగా నల్లినాడు. ఇవి రాధాకృష్ణుల శృంగారమును వర్ణించునవై నేటికిని ప్రచారములోనున్నవి. తరువాత ముద్దుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రులు మొదలైనవారు త్యాగరాజు ననుసరించి, తరంగములను, కీర్తనములను రచించినారు. ముద్దుపళని కూడ రసవంతముగా సప్తపదులను వ్రాసినది.* మొత్తముమీద తెలుగు తీయదనము, నాదగౌరవములు నాటికవులు తిన్నగా దెలిసికొని తమ పదములలో దిద్దినారనియే చెప్పవలెను.

తరువాతకాలములో బదకవిత్వ మపరిమితముగా వృద్ధి జెందినది. అధ్యాత్మరామాయణ కీర్తనములు, రామదాసు కీర్తనములు, స్త్రీలపాటలు, భజనకీర్తనములు, తత్త్వగీతములు మున్నగునవి యెన్నియో రచింపబడినవి. పదకవిత్వములో స్త్రీల పాటలు విలక్షణమైన స్థానమును వహించునవి. మన

* క్రీ.శ. 15వ శతాబ్దికి జెందిన (త్యాగరాజాదులకు బూర్వమే) తాళ్లపాక అన్నమయ్యగారి సంకీర్తన రేకులు తిరుపతి దేవస్థానము వారి యాజమాన్యమున వ్యాప్తిలోనికి వచ్చినవి.

జాతిజీవన మంతయు వానిలో ముద్రితమైనట్లు గ్రహింపఁగలము. జోలపాటలు, ఏలపాటలు, తలుపుదగ్గరపాటలు, మంగళహారతులు, మేలుకొలుపులు, వరసపాటలు, లాలిపాటలు, నలుగుపాటలు, బూజంబంతి పాటలు, చెండాట పాటలు, అప్పగింత పాటలు, మొదలైనవి జాతీయజీవనమునకు నందలి యాచార వ్యవహారములకుఁ బ్రతిబింబములు. ఇవిగాక, అక్కలపాటలు, నాగానుబొమ్మపాటలు మొదలైనవి తెలుఁగువారి యాచారవ్యవహార విశ్వాసములను జాటుచుండును. వీనిని పురుషులేకాక స్త్రీలుగూడ నెందరెందఱో రచించినారు. ఊడుపుపాటలు, నూర్పిళ్ళపాటలు, దంపుళ్ళపాటలు, గొబ్బిళ్ళపాటలు, పడవ పాటలు మొదలైనవి నేఁటికిని పరిచారములోనుండి వ్యావసాయిక జీవితమును జాటుచున్నవి.* పోతులూరి వీరబ్రహ్మాంతత్త్వములు, 'జీవా' అనియు, 'మనసా' అనియు, 'చిలుకా' అనియు మకుటము గల తత్త్వగీతము లనేకము లున్నవి. తులసిపాటలు, దండకములు, గోవిందనామాలు మొదలైనవి భక్తిపరములైనవి కలవు. బుడబుక్కల పాట, గంగిరెద్దు పాట, గొబ్బిపాట, బతకమ్మపాట మున్నగునవి కొన్నికాలము లందే విన్పించుచుండును. దాగుడుమూతలు, వెన్నెల కుప్పలు, చెమ్మచెక్కలు, గుడుగుడు గుంజం, కాళ్ళాగజ్జ, కోలాటము మొదలైన యాటలాడుచు పాటలు పాడుకొనుట యాంధ్ర బాలికల సంప్రదాయము. ఊర్మిళాదేవి నిద్ర, సీత

---

* ఆచార్య కోరాడ రామకృష్ణయ్యగారి "దేశిరచనలు" అను వ్యాసము వారి వ్యాస సంపుటములోఁ జూడఁదగినది.

సీమంతము, లక్ష్మీదేవర నవ్వు, లంకాయాగము, కుశలా యకము, సత్యభామ సరసము, ద్రౌపదీ వస్త్రాపహరణము మొదలైన పాటలు మన పురాణాది గ్రంథములలోని విషయములను బురస్కరించుకొని వ్రాయఁబడినవి. ఇవి స్త్రీలను విజ్ఞానవతులుగాఁ జేయు తలంపుగల యీకోవలవారి యత్నఫలము. దాసు శ్రీరాము పండితుఁడు జావళీలు, కీర్తనలు రచించి ఖ్యాతి వడసినాఁడు. తిరగా వెంకట రామయ్య, గాలి సుబ్బారాయుఁడు, వెంకమాంబ, నరసమాంబ, రామ లక్ష్మమ్మలు — ఇటీవలి పదకర్తలలోఁ గొందఱు.

ఈ శతాబ్దములోఁ బదకవిత్వమున కెన్నఁడులేని యాదరము చేకూరినది. ఆంగ్ల సాహిత్యావలోకనమువలన మొదట మన సంప్రదాయమును నిరసించినను, తరువాత క్రమముగా స్వీయ సంస్కృతిపైఁ బ్రత్యయము హెచ్చినది. దేశీయ వస్తువులపై నభిమానము జనించినది. అట్లే సజాతీయమైన మాత్రా ఛందమునకు, జాతీయ సుకుమారము కలిగిన వ్యావహారిక భాషకును గౌరవ మభివృద్ధిఁ జెందినది. తత్పరిణామ విశేషమే గేయ కవితావిర్భావము. మన ప్రాచీన కవిత్వ చరిత్ర, జాతిజీవనము, సంప్రదాయములను దెలిసికొనవలెనను నాకాంక్ష పొడమినది. తన్నిమిత్తము పరిశోధనములు జరుగుచున్నవి. ఇది శుభసూచకమే! ఈశతాబ్దములో ననేకులు గీతములను, గేయములను వ్రాయుచున్నారు.*

* నా రచించిన 'శారదా విలాస' మను గ్రంథములోఁ 'గేయవాఙ్మయము-స్థూలపరిశీలన' మనెడి వ్యాసము చూడఁదగును.

దేశభక్తి ప్రబోధ గీతములను వ్రాసిన వారిలో గరిమెళ్ళ సత్యనారాయణ, మంగిపూడి వెంకటశాస్త్రి గారలం బేర్కొని తీరవలెను. ప్రణయపరముగా నండూరి వెంకటసుబ్బారావు గారు రచించిన 'ఎంకి పాటల' కున్న గౌరవ మింతింతని చెప్ప లేము. భక్తిగీతములు హరినాథ సాయిబాబాల పరముగా వెలువడినవి. ఈసందర్భమున వెంప్యాల సీతారామయ్యగారు పేర్కొనదగినవారు. నవ్యులలో శ్రీయుతులు అడవి బాపి రాజు, బసవరాజు అప్పారావు, కవికొండల వెంకటరావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రయాగ నరసింహశాస్త్రి, ప్రభృతు లెందరో పదములను రచించి ఖ్యాతి గడించినారు.*

పదకవిత్వ మీవిధముగా మన సాహిత్యములో సనా దిగా వర్తిలుచుఁ బ్రజల సానుభూతిఁ బొందుచున్నది. దీనిని పిచ్చుగుంటలవారు, జంగములు, గొల్లలు, చెంచువారు, పగటి వేషధారులు, దాసరులు మున్నగువారు వృత్తిసంఘ ములుగాఁ జేరి పదకవిత్వమును శ్రావ్యముగాఁ బాడుచుఁ నేళ్ళ తరబడిగా దానిని భద్రపరచినారు. పూర్వులకున్న జ్ఞాపకశక్తి యవధానగుణము లీనాఁటివారికి లేవు. అదియునుగాక ముద్ర ణాది సౌకర్యములు వచ్చినందువలన ముఖస్థ మొనర్పవలసిన యావశ్యకతయుఁ దప్పిపోయినది. మానవుని నాగరకత వృద్ధియై

* ఆధునిక వాగ్గేయకారులలో శ్రీ రజనీకాంతారావు, శ్రీ బాలమురళీకృష్ణ పేరెన్నిక వహించినారు. శ్రీ వుయ్యూర్యర మహారాజావారి, శ్రీమాన్ తిరుమల నల్లాన్ చక్రవర్తి వేంకట నారాయణాచార్యులవారి కీర్తనలును విద్వత్సంస్తవనీయములు.

వల్లెవేయుట న్యూనతగా భావించునంతటి సౌకుమార్య మబ్బినది. ఇవి యన్నియుఁ గారణములుగాఁ బదకవిత్వమే బ్రతుకు తెరువుగాఁ జూచుకొనుచున్న వైవృత్తిసంఘముల కాదరము క్రమముగా క్షీణించినది. తదితర వర్ణములవారే విధముగా నీ పాశ్చాత్య నాగరకతా సంసర్గమువలన తమ తమ ధర్మముల విడచి 'సర్వం జగన్నాథం' వలె సాంకర్యమునకు లోనైరో, యట్లే యీ నిరాదరముం జూచి భరింపలేక క్రమముగా నావృత్తులను మాని యాంగ్లవిద్యాభ్యాసము మొదలిడి యందరిలోఁ గలసిపోయిరి. అంతటితోఁ బదకవిత్వ మడుగంటినది! విద్యార్జనమునకుఁ బల్లెలనుండి ప్రజలు పట్టణముల కెప్పుడు వచ్చిరో యప్పుడే పదకవిత్వమునకుఁ బ్రచారము నాశమైనది. నేఁడు ప్రాచీన పదకవితా వైభవము నరయుటకు సరియైన యవకాశములు లభించుటలేదు. ఆ ప్రాచీన సంప్రదాయము వదలలేక యెచటనైన నీ వృత్తి సంఘములున్నను, పదకవిత్వపు సమగ్రస్వరూపము దాటిపోయినట్లే. ఒకజాతి పదకవిత్వము నశించిపోయినచో నాజాతి సంస్కృతి కూడ నాశమైనట్లే భావింపవలెను.

కావున సాహితీసేవకులు ఈ ప్రాచీన పదకవిత్వమును సేకరించుటలో వారి కాలము వ్యయింపవలసియున్నది. శ్రమకోర్చి యూరూరు తిరిగి, ప్రాచీన పదములను, కీర్తనలను పాటల నాయాయి స్థలములందున్న వృద్ధులనుండి, పనిపాటల వారినుండి గ్రహించి వ్రాసికొని యొకచోఁ గూర్చుట మన జాతి కర్తవ్యము; ప్రతిమానవుఁడు తన బాధ్యత యిది యని

ప్రోత్సహింపవలెను. ఇట్టి సంకలనము సంఘజీవితమును చిత్రించు చరిత్రకారుని కత్యంతోపయుక్తమగుటయే కాక, స్వచ్ఛమై జాతీయమైన తెలుఁగుభాషాస్వరూపము నందించిన దగును. ఈ పదములను సేకరించి ప్రచురించినను వానిం బాడవలసిన సందర్భములలోఁ బాడుచుండకపోయిన ప్రాచుర్యము లేకపోవును. సంఘముల ద్వారా వృత్తిసంఘములం బోషింపవలెను. అప్పుడు గాని తత్పోషణము సంప్రాప్తముగాదు. కావున నిట్టి పదకవితా సంపుట మొదటి కూర్చి ప్రకటించి ప్రాచుర్యము గల్గించుట మన ప్రజలమీఁద నున్నది.[1] పదసాహిత్యమునకు నివాళి పట్టెడి సాహిత్యార్చకులు బహుధా రావలసియున్నారు. దేవేంద్రసత్యార్థి, నేదునూరి గంగాధరం*, తేకుమళ్ళ కామేశ్వరరావు గారలు చాలవర కీ మార్గములోఁ గృషి చేసినారు.

ఇటీవల విద్యలేని ప్రజలపై సానుభూతి హెచ్చుచున్నది; ప్రజావాఙ్మయము వ్రాయవలయు ననెడి యభిప్రాయము గల్గినది. దేశభాషాభిమానములు మిక్కుటమైనవి.

---

1. నీ చక్కని సాంప్రదాయమును—కమ్మని పలుకుబడిని—విశిష్టమైన భాషామర్యాదను—చవులూరు జాతిఛందస్సులను—నీ జన్మహక్కుగా పోరాడి రక్షించుకోవలసిన అవసరముమాత్ర మున్నది. (శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి: ఆంధ్ర ఉగాది. సంచిక—బహుధాన్య).

* 'సెలయేరు' అను పేర నొక పాటల సంపుటము వీరు సంపాదించినది, శ్రీ "ఎల్లోరా" సంపాదించిన మరొక సంపుటి, యిటీవల ప్రకటితమై వచ్చినవి.

ప్రజలలో విజ్ఞానవ్యాప్తికై దీక్షవూనినవారు కాలయాపన చేయక యీ పదకవిత్వమును సేకరించుచో ప్రాచీన పదకర్త లిచ్చిన సంపదయొక్క విలువను గుర్తించి సేవ చేసినట్లగుదురు.[1] ఇట్టి కార్యమునకుఁ బ్రస్తుతకాల మత్యంత మనుకూలించును. సాహితీసేవకు లుత్సాహముతో నీ కాలమును సద్వినియోగ మొనర్తురను నాశ పొడముచున్నది.[2]

[రచన : 1945 జూన్ ; 1946 లో సాహితీ సమితి రజతోత్సవ సభ (గుంటూరు) లో నేను చదివిన వ్యాసము]

1 ఇటీవల రేడియో కేంద్రములు విరివిగా జానపదగేయముల ప్రసారము చేయుచుండుట యొప్పదగిన విషయము. శ్రీయుతులు చిలుకూరి-అడివి-దిడుగు-అనిశెట్టి-యద్రోజు-ప్రయాగ మొదలైనవారు కొన్ని సేకరించి యున్నారు. బి. వి. నరసింహారావుగారు ప్రత్యేకముగా బాలగేయములను రచించుచు చక్కని కృషి గావించుచున్నారు.

2 ఉస్మానియా విశ్వవిద్యాలయములో శ్రీ రామరాజుగారు తెలంగాణములోని జానపదవాఙ్మయముపై కృషి చేసి యిటీవలనే "డాక్టరేటు" గ్రహించిరి. శ్రీ హరి ఆది శేషువు గారు "జానపద గేయ వాఙ్మయ పరిచయము" వ్రాసి తెలుగు భాషా సమితి బహుమతిఁ బడసినారు.

.

౭
ప్రబంధ వాఙ్మయము

వాఙ్మయము యొక్క స్వరూప నిర్ణయ సందర్భమున ననేక ప్రమాణములఁ బట్టి యనేక భేదములను మన యాలంకారికులు నిర్ణయించినారు. ఛందోలక్షణము ననుసరించి కావ్యములు గద్యాత్మకము లనియుఁ బద్యాత్మకము లనియు, గద్య పద్యాత్మకము లనియు మూఁడు విధములుగాఁ బరిగణింపఁబడినవి. ఈ గద్యపద్యాత్మకమను కావ్యజాతిలోఁ జేరునదే ప్రబంధము. కాని గద్యపద్యాత్మకమైన ప్రతికావ్యము ప్రబంధము కానేరదు. చంపువులు, నాటకములు, పురాణములు, ఇతిహాసములు—గద్యపద్యాత్మకమైన కావ్యప్రక్రియకుఁ జెందినవే. కాని భిన్నలక్షణములు కలిగిన వీని నధిగమించి, విశిష్టమైన స్థానము నందుకొనినది ప్రబంధము.

కావ్యమునకు భావ వస్తు రచనలు ప్రధానమైనవిగా పెద్దలు ప్రతిపాదించినారు.[1] ప్రబంధమం దితరకావ్యభేదదాల కన్న వస్తువు నాలంబముగాఁజేసికొని, భావరచనముల కెక్కుడు స్థాన మొసఁగినట్లు గమనింతుము. ప్రబంధోచితమైన వస్తువును గ్రహించుటలో విశిష్టత లేకపోలేదు. అట్టి వస్తువు యొక్క యునికియే కాక తద్దేహమున కావశ్యకమగు సంధి సామగ్రి, సౌందర్యాపాదకములౌ యితరావయవ సౌష్ఠవము

---

1 శ్రీయుతులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వడుగంటి సీతారామయ్యగారలు.

లుండవలెను; అప్పుడే యది ప్రబంధ మగును.* కావ్యమం దంగాంగీభావము లేనిదే సౌందర్యము సంపూర్ణము గాదు. కావ్యమందలి ప్రత్యవయవమునకును, వస్తువునకును, ప్రకృష్టమైన బంధ ముండును గనుకనే యీ శిల్పమూర్తికి ప్రబంధమను పేరువచ్చినది. 'ఈప్రబంధ మాంధ్రవాఙ్మయ వనములో నుద్యానము వంటిది'గ సాహిత్యవేత్తలు పరిగణించినారు.

కావ్యమీమాంసఁ జేసిన పూర్వ లాక్షణికుల మతములన్నియు, నించుమించు 'ప్రబంధముల' కన్వయించుననియే చెప్పవచ్చును. 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్' అను జగన్నాథుని నిర్వచనము నిలచియున్నది కదా! పూర్వు లెవ రెవ రేయే యంశములకుఁ బ్రాధాన్య మిచ్చి నిర్వచించినను, వారెల్లరు కావ్యములోని బీజభూతమగు నభిప్రాయమం దేకీభవించియే యున్నారు. కావ్య సామాన్య లక్షణములే కాక ప్రబంధమను మహాకావ్యమునకు లక్షణము వేఱుగ నిర్వచించిన విధ మారీతి యున్నది : పురాణేతిహాసములలోని యుపాఖ్యానమును జేపట్టి స్వకపోలకల్పనలచే దానిఁ బెంపుచేసి, యష్టాదశ వర్ణన లందందుఁ జొన్పించి, రసాభివ్యక్తికిని, పాత్రచిత్రణమునకు నెక్కుడు ప్రాధాన్య మొసంగి, శబ్దార్థాలంకార సహితముగా సాగించిన రచనమును బ్రబంధ మనినారు. ఈ వచన

* 1948 లోఁ బ్రకటితమైన బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి 'తెలుఁగు మెఱుఁగు' అను గ్రంథములో 'ఆంధ్రకవిత—ప్రబంధయుగము' అను వ్యాసము చూడఁదగినది.

మునకుఁ దగినట్లుగాఁ బూర్వ లాక్షణికోదాహృత శ్లోకముల నిట నుదాహరించెదను. అష్టాదశ వర్ణనముల నుగ్గడించుచు—

'సంధ్యా సూర్యేందు రజనీ ప్రదోషధ్వాంత వాసరాః
ప్రాత ర్మధ్యాహ్న మృగయా శైలర్తు వన సాగరాః
సంభోగ విప్రలంభౌచ, ముని స్వర్గ పు రాధ్వరాః
రణ ప్రయాణోపయమ మంత్ర పుత్రోదయాదయః
వర్ణనీయా యథాయోగం సాంగోపాంగా అమీ ఇహ'

అని పేర్కొనినాఁ డొక లాక్షణికుఁడు. సర్వ ప్రబంధ సామాన్య లక్షణముగా—

'ఆదౌ నమస్క్రియాఽఽశీర్వా వస్తు నిర్దేశ ఏవవా
క్వచిన్నిందా ఖలాదీనాం సతాంచ గుణ కీర్తనమ్'

అనియు నిర్దేశించిరి. పాత్రనిర్మాణ సౌకర్యార్థమై యుదాత్త నాయకుని చరిత్ర గ్రహింపవలయునని—

'స్వర్గ బంధో మహాకావ్యం తత్రైకో నాయక స్సురః
సద్వంశః క్షత్రియోవాఽపి..................
ఏకవంశ భవా భూపాః కులజా బహవోపివా'

అను శ్లోకమందు వచించెను.

అప్పకవియుఁ బై శ్లోకార్థములనే తన లక్షణ పద్యమందుఁ జొప్పించెను. కాని, యష్టాదశ వర్ణనములకు మాఱుగాఁ నిరువది రెండువర్ణనలఁ జెప్పవలయునని సంఖ్యను బెంచినాఁడు.

పురమును ఋతుషట్కమును బ్రయాణంబును
శైలంబు వేటయు సాగరంబు
మౌనీంద్ర పుణ్యాశ్రమంబును మంత్రంబు
ద్యూతంబు పిదప నద్భుత రణంబు

విజయంబు మత్స్యావసజ వికారంబును
వన విహారంబును వారి కేళి
కన్యాంగ సౌందర్య కథనంబు హిమకరా
భ్యుదయంబు విప్రలంభోదితంబు
పద్మ మిత్రోదయంబును బరిణయంబు
సురతమును దౌహ్యాదంబును సుత జననము
ననఁగ నిరువదిరెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయుఁ 'బ్రబంధంబు' శ్రీనివాస-

'ప్రబంధ' పదము మనకుఁ జాల ప్రాచీనముగా నుండినట్లు తిక్కనప్రయోగము సాక్ష్యమిచ్చుచున్నది. 'ప్రబంధమండలి' అను ప్రయోగము యొక్క యర్థప్రమాణము గ్రహించుట యిట నవసరము. భారతమును బ్రబంధ మండలి యనుటలోఁ దిక్కన దృష్టి యితఃపూర్వము మనము నిర్వచించిన ప్రబంధ శబ్దమునకుఁ దులనాగునదిగా నున్నట్లు స్పష్టము. తిక్కన యొక్కొక పర్వము నొక్కొక ప్రత్యేక ప్రబంధముగా నొనరింపవలె నను దృష్టితో రచించెను.[1] ప్రబంధోచితమైన పాత్ర చిత్రణము తిక్కన రచనములో సువేద్యము తిక్కన ద్రౌపదిపాత్ర చిత్రణమే మనుచరిత్రములో వరూథిని పాత్రమును జిత్రించుటకు పెద్దనకు కౌశలము నిచ్చినదనవలెను. పాత్ర చిత్రణమునకుఁ దెలుఁగులోఁ దిక్కనయే ప్రథమ శిల్పి! కనుక, ప్రబంధబీజము

1 విరాటపర్వము నందలి 'కీచకవధా' ఘట్టము ప్రధానముగా నొక ప్రబంధ మగును.

ప్రాతామ్నాయ క్షేత్రమునఁ దిక్కనచే నాటఁబడినట్లు కన్పడుచున్నది.

శంభుదాసుని గ్రంథములో సైతము ప్రబంధ శబ్దము గాన్పించుచున్నది. అదియునుంగాక, యెఱ్ఱాప్రెగ్గడకుఁ "ప్రబంధ పరమేశ్వరుఁడ"ను బిరుదనామముగలదు. ఇతని నృసింహాపురాణము పేరునకుఁ బురాణమేకాని సత్యమునకుఁ బ్రబంధమగును. ప్రబంధోచితమైన పాత్రచిత్రణము నెట్లు తిక్కన సాధించినాఁడో యెఱ్ఱాప్రెగ్గడ వర్ణనముల నట్లు తన రచనములందు ప్రస్ఫుటముగా వెలయించినాఁడని గ్రహింపఁగల్గుదుము.

ఇవ్విధముగాఁ బ్రబంధ బీజము కవిత్రయకాలమునాఁటికే నాటఁబడినట్లు తెనుఁగు సాహిత్య క్షేత్రజ్ఞులు తెలిసికొనఁ గల్గుదురు. శ్రీనాథుని యుగమునందుఁ బెరిగి పెద్దదై ప్రబంధ వృక్షము పెంపు వహించినది; తరువాత శ్రీకృష్ణ దేవరాయల పోషణమునఁ జిగిర్చి శాఖోపశాఖలుగా విస్తరించి పూవులు పూచి ఫలవంతమై విలసిల్లినది !

పూర్వోక్తమగు ప్రబంధశబ్ద నిర్వచనమున కెల్లెడల సరియగు కావ్యము శ్రీనాథుని గ్రంథములలో లేకపోలేదు. అతని శృంగారనైషధము ప్రబంధమగును. ఇంతలి యితివృత్తము లోకప్రసిద్ధమైనది. దీనికి మాతృక భారతములోని నలదమయంత్యుపాఖ్యానమును గావ్యముగా నిర్మించిన హర్షకృతనైషధము. స్వకపోలకల్పనలతో శ్రీనాథుఁడు శృంగారనైషధాంధ్రీకరణము నపూర్వముగా నిర్వహించెను. వస్త్వాస్త్రీలనమందేమి, సంభాషణా చాతుర్యమందేమి, పాత్రనిర్మాణ

పోషణాది కార్యములందేమి, వర్ణనాకౌశలమందేమి శ్రీనాథు డప్రతిమాన నైపుణ్యమును బ్రదర్శించినాఁడు కాని, ప్రబంధతా రోపణము పూర్తిగాఁ జేయుటకు శృంగారనైషధ మనువాద మగుట తావొసఁగినది గాదు. ప్రబంధములు సర్వదా స్వతంత్రములై యుండవలెను గదా!

శ్రీనాథ రచితేతర గ్రంథములను బరిశీలించినచో హరవిలాసమునందు వస్త్వైక్యము లేకయు, భీమ కాశీఖండము లందలి వస్తువు స్థలపురాణ మగుటయు, సమగ్ర ప్రబంధ లక్షణమునకు నిలువనివిగా నున్నవి. ఇవ్విధముగానే శ్రీనాథ యుగమందలి యితర కవికృత గ్రంథములను గైకొన్నను, కొన్ని యనువాదము లగుటవలనఁ గొన్ని చిత్రాఖ్యానము లగుటవలన, మఱికొన్ని నాటకోచితమైన సంభాషణాదికమునే కలిగియుండుటవలన, నేవియు సమగ్ర ప్రబంధమున కుదాహరణ ములు కాలేకపోయినవి. ప్రబంధాంగములలోఁ గొన్ని కొన్ని యా యా గ్రంథములలోఁ గన్పించుచుండునే కాని సర్వాంగ పరిపూర్ణ స్వరూప సంధానము వీనియెడఁ గన్పింపదు.

ఆంధ్రులు గర్వింపఁదగిన కాలము కృష్ణరాయల పరి పాలనా సమయము. దానిని స్వర్ణయుగ మనవచ్చును. రాజ కీయములో, సాహిత్యములో నత్యున్నత స్థానము గడించిన యుగ మది. ప్రబంధసుందరికి సకలాభరణములు రాయల పోషణమందే లభించినవి. కృష్ణరాయలే స్వయముగా నీ సుందరి నలంకరించినాఁడు. తన యాస్థానమందలి రసజ్ఞులైన కవిసత్తములచే నలంకరింపఁజేసినాఁడు. ఆ సంపూర్ణ కళావిశేష

మును జూచి మురిసిపోయినాఁడు !

శ్రీకృష్ణరాయల పోషణమున సర్వాలక్షణ సమన్వితమైన ప్రబంధమూర్తి విలసిల్లినది. అష్టాదశ వర్ణనముల శోభ జెంది, శృంగారరస ప్రధానమై, యర్థాతిశాయియైన శబ్దరచన కలిగి, యాలంకారిక సాంకేతికములకు విధేయమై, యనతి విస్తృత మగు నితివృత్తముతో, భాషాంతరీకరణమునకు భిన్నముగా నుండి, పాత్ర సంపోషణమును బరిగణించు స్వతంత్ర గ్రంథము ప్రబంధమని పెద్దల నిర్వచనము.[1] ఈ నిర్వచనమునకు సరి తూగు గ్రంథము పెద్దనకవి కృత మనుచరిత్రము. మనుచరిత్రమే పెద్దన కగ్రతాంబూలము సాహితీలోకమున లభింపఁజేసినది. వస్త్వైక్యమందేమి, వర్ణనములందేమి, యంగాంగీరస పోషణమం దేమి, సన్నివేశ కల్పనమందేమి, పెద్దనామాత్యుఁడు పెద్ద గాక పోలేదు. వరూథిని[2] సాహితీలోకములో స్థిరనివాస మేర్పఱచు కొన్నది ; ప్రశాంతమూర్తియగు ప్రవరుఁడు పవిత్రస్థానము నలంకరించినాఁడు. పాత్రచిత్రణములో నల్లసానివాని నల్లిబిల్లి గొనువాఁ డితరుఁడు లేఁ డనవలసివచ్చును. పాండితిలో నితనిఁ దలదన్నినట్లు గన్పించు వసుచరిత్రకారుఁడు సైతము పెద్దన ననుసరించినవాఁడే గదా ! పెద్దన కైతకు మెఱుంగులు దిద్ది రామ రాజభూషణుఁడు సెబా సనిపించుకొనినాఁడు ! కవులను గిలిగింత పెట్టు కవితాభావములను బ్రదర్శించినాఁడు పెద్దన ;

1. ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారి నిర్వచనము.

2. నా రచించిన 'సాహిత్య సంపద' యను గ్రంథములో 'వరూథిని వన్నె చిన్నె'లను వ్యాసమును జూడఁదగును.

పండితులను బట్టి చూచు శబ్దచమత్కృతి సర్వత్ర ప్రయోగించినాఁడు, రామరాజభూషణుఁడు. ప్రబంధము పరాకోటి వసుచరిత్రమందే[1] యందినదని నిశ్చయముగఁ జెప్పవచ్చును. కల్పనాజాతము హెచ్చుగనుండుటచే కళాపూర్ణోదయమును[2] ప్రబంధమనఁజాలము. పాండురంగ మహాత్మ్య, శ్రీ కాళహస్తి మహాత్మ్యములు స్థలపురాణము లగుట సమగ్ర ప్రబంధములు కాఁజాలవు. అయినను వానిలో నిగమశర్మోపాఖ్యానము, తిన్నని వృత్తాంతములు[3] ప్రబంధోచిత వస్తుతత్త్వము గలవి; పాత్రపోషణమునకు నెక్కుడవకాశములు గలిగియున్నవి. రామాభ్యుదయ, పారిజాతాపహరణములును ప్రబంధములే యగును. పారిజాతాపహరణమునఁ బ్రథమాశ్వాసము ప్రాధాన్యము వహించినట్లు కన్పించును. రామాభ్యుదయము సంస్కృతములోఁ గావ్యప్రక్రియను నడచినది; సుందర ప్రబంధ యోగ్యత లనేకము లిందున్నవి. ఇవ్విధముగా శ్రీకృష్ణదేవరాయల పోషణమున ప్రబంధ సుందరి సర్వాలంకారభూషితయైనట్లు తెలిసికొంటిమి.

వసుచరిత్రవంటి శిఖరప్రాయమైన ప్రబంధము వెలసిన పిమ్మట, దాని దీటౌను కావ్య మింకొకటి యుద్భవింపలేదు.

1. వసుచరిత్ర సంస్కృతీకరింపఁబడుట గర్వకారణము.
2. శ్రీ జి. వి. కృష్ణరావుగారు కళాపూర్ణోదయమందుఁ గానవగు జీవిత విశేషములఁ బరిశోధించి యిటీవల మద్రాసు విశ్వవిద్యాలయమందు 'డాక్టరేటు' పొందిరి. ఆంగ్లమున వీరి గ్రంథము వెలువడినది.
3. నా రచించిన 'మాధుకీ మహిమ' యను గ్రంథములో 'కన్నప్ప కథ' యను వ్యాసము జూడునది.

తరువాతి వెలసిన ప్రబంధము లన్నియు, మహావృక్షముక్రింద మొలచిన చిన్నచిన్న మొక్కలవలెఁ గాంతివిహీనము లాయెను. వసుచరిత్ర తరువాత నట్టి ప్రబంధము జన్మింపలేదు. తరువాత వచ్చిన కవుల కది యాదర్శప్రాయ మైనది. ఆ దినములలోఁ బ్రబంధమార్గమున రచించిననే కావ్యముల కాదరము కలిగెడిది. అందుచే ననుసరణము లనివార్యము లాయెను. ఇట్టి గ్రంథములు కుప్పతిప్పలుగ నున్నవి. గ్రంథ నామములందును దాస్యము తప్పలేదు. కవిజన రంజనము, రసికజన మనోభిరామము, కవిరాజ మనోరంజనము లోనగువిధము నామములు గదా!

ఈ యనుసరణములందు పెద్దననుండి వచ్చుచున్న కవిసమయములు, వర్ణనాక్రమము, పద్యముల యెత్తుగడలు, సన్నివేశకల్పనములు, యథాతథముగ దిగుమతి యైనవి.[1] నంది తిమ్మయ మూర్తికవు లట్లుగాక మూలములకు మెఱుగు పెట్టిగాని యా వర్ణనాదికమును దమ గ్రంథములందుఁ జొన్పింపరు. సమర్థులైన కవులు చేయుపద్ధతి యట్టిది. కాకవు లనుకరణముల తోడనే నామము గడించుటకై కడంగుదురు. ప్రబంధమే చర్విత‌చర్వణ మైనపుడు, తద్గతవర్ణనములు వట్లైన, వినూత్నానందమును బ్రసాదించుట దుస్సాధ్యమే కదా! కావున నీయనుసరణలవలనఁ బ్రబంధములందు క్షీణదశ యొకటి వచ్చినదని చెప్పవలెను. ఆంధ్రసారస్వతములోఁ బదునెనిమిది, పందొమ్మిది శతాబ్దములలో నీ దశ వరలినది.

1. చూ: 'వసుచరిత్ర విమర్శనము : అనుక్రమణిక'—కళాప్రపూర్ణ బ్రహ్మశ్రీ పర్ఖుల చిన సీతారామస్వామిశాస్త్రిగారు:
ఝ

నాయకరాజుల ప్రాభవమున వెలసిన సారస్వతములో విశిష్టప్రబంధములు లేకపోలేదు. అనంతభూపాలుని కకుత్స్థ విజయము, సవరము చిన నారాయణప్పనాయని కువలయాశ్వ చరిత్రము పెన్నుదగినవి. వీనిలో నైతము పెద్దన సూరనల భావరచనల కనుసరణములు ద్యోతిలును. అయినను వీనికిఁ బ్రత్యేకస్థాన మీయవలసియే యున్నది. ముద్దుపళని రచించిన శృంగారప్రబంధమగు రాధికాసాంత్వనము నెన్నక నాయక రాజయుగమును ముగించుటకు వీలులేదు. శృంగార ప్రబంధ ములలో సాంత్వన కావ్యములలో నిది మేలుపూస. కాని యేవ్యావగు భావ చిత్రణ మీ గ్రంథమున నుంటయే దీనికి సరసు లిచ్చిన దోషము. ఏతత్కారణముచే నిది క్షీణదశకు నాందివంటి ప్రబంధమైనదిగా భావింతుము.

ఈ కాలమునకుఁ జెందిన ప్రబంధములలో నసభ్య శృంగారమే మిక్కుటమై వరలినది. విజయనగర సామ్రాజ్య మంతరించిన తరువాత దాని క్రిందనున్న సామంతు లందఱు స్వతంత్ర ప్రభువులైరి. వీ రహంకారముతో విఱ్ఱవీగి విషయ లాలసతకు లోనై కాలము గడపిరి. వీరి ప్రాపువడసిన కవులు రాజుల చిత్తవృత్తుల ననుసరించి కావ్యముల వ్రాయవలసి వచ్చినది. ఈ కారణమువలననే పచ్చిశృంగారము నాఁటి కావ్యములలో ప్రత్తిగతమైనది.[1] అట్టి ప్రబంధములు తారా శశాంక విజయము, బిల్హణీయము, హంసవింశతి మొదలైనవి.

---

1 A Hand Book of Telugu Literature (See Page-52) by Prof. Kuruganti Sitaramaiya.

ఆంధ్రసాహిత్యములో క్షీణదశ యని పేరొందినను, ఎన్నఁదగిన ప్రబంధము లీ కాలమం దుద్భవింపకపోలేదు. కాని వానిని మహోన్నతమైన కృతులుగా నెన్నలేము. ఆంధ్ర సాహిత్యములో వానికిని స్థాన మున్నటులే చెప్పవలెను. అవి విజయవిలాసము, ఉత్తర రామాయణము, మొల్ల రామాయణములు. విజయవిలాసమున నాయకుఁ డొకఁడే కాని నాయికలు పల్వురు. ఇందు వస్త్వైక్యము లేనట్లు ద్యోతిలినను ఏక నాయకాశ్రయ మగుటచే నొకింత ప్రబంధ చిహ్న మున్నటులే పేర్కొనవచ్చును. ఉత్తర రామాయణము లోని వస్తువు ప్రబంధమునకు సుదూరమైనను నందలి రచన ములో కంకంటి పాపరాజు ప్రబంధ బీజముల నాటినాఁడు. పాత్ర చిత్రణములో సన్నివేశ కల్పనములో సంభాషణాది నిర్వాహణములో నంతట ప్రబంధమూర్తి ప్రతిబింబించునట్లు రచనము చేసినాఁడు [1]. కథాకథనాత్మకమగు రామాయణము ప్రబంధముగా నవతరింపఁజేసిన వారిలో అయ్యలరాజు రామ భద్రుఁడు, కంకంటి పాపరాజు లగ్రస్థాన మలంకరింతురు. కుమ్మరి మొల్ల కవయిత్రులలో నున్నతస్థాన మాక్రమించు నని చెప్పవలెను. చారిత్రక ప్రబంధ మీ కాలములోనే తల యెత్తినది. కుమార ధూర్జటి వ్రాసిన కృష్ణరాయ విజయము, రంగాజమ్మ వ్రాసిన మన్నారుదాస విలాసము లుదాహర ణములు.

1 "సాహిత్య సంపద" యను నా గ్రంథములో 'జానకీ శోకము— ప్రబంధ సరణి' యనెడి వ్యాసము చూడఁదగును.

ఇఁక నాధునికకాలములోఁ బ్రవర్తిలుచున్న సారస్వతమందు ప్రబంధ రచన మటనట గోచరించుచునే యున్నది. ప్రబంధమూర్తిపై సేవ జనించుచున్నను, ఒక ప్రక్క ప్రబంధ రచనము సాగుచునే యున్నట్లు గమనింతుము. శ్రీయుతులు పింగళి లక్ష్మీకాంతము, కాటూరి వేంకటేశ్వరరావు గారలు వ్రాసిన "సౌందరనందు" మొక విలక్షణమైన నవీన ప్రబంధము. ఈ నూతన యుగమునఁ బ్రబంధమూర్తి కొక నవ్యాభరణము సేకూర్చినారీ కవులు. చారిత్రక ప్రబంధములీ యుగముననే సర్వాంగసుందరముగ వెలయుచున్నవి. శ్రీ తిరుపతి వేంకటకవుల "బుద్ధ చరిత్రము", దుర్భాక రాజశేఖర శతావధాని గారు రచించిన 'రాణా ప్రతాపసింహ చరిత్ర' యు, గడియారము వేంకటశాస్త్రిగారి 'శివభారతము' నుత్కృష్ట చారిత్రక ప్రబంధముల కుదాహరణములు. పళ్లెపూర్ణప్రజ్ఞాచార్యులవారి "కాదంబరి" పరిగణింపఁ దగినది. పాణిని, పతంజలి, కాత్యాయనుల చరిత్రములను, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు 'మునిత్రయ చరిత్ర' మను పేర రసవత్ప్రబంధమును రచించినారు. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగా రాంధ్రుల చరితను గ్రహించి మహాకావ్యముగా "ఆంధ్ర పురాణము" నల్లుట ప్రశంసార్హము.*

---

* శ్రీ శౌరి నరసింహ శాస్త్రిగారు 'దేవీభాగవతము'ను, శ్రీ నుదిగొండ నాగవీరయ్య శాస్త్రిగారు 'శివపురాణము'ను, శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు 'రామాయణ కల్పవృక్షము'ను, శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారు 'ఆత్మకథ'ను, శ్రీ కొండవీటి వేంకట కవిగారు 'నెహ్రూ చరిత్ర'ను వ్రాసి గణనకెక్కినారు.

నిది ప్రాచుర్యము జూపిన నీనాఁటికిని ప్రబంధ ప్రక్రియకు సహృదయ సానుభూతి యున్నట్లు స్ఫురించుచున్నది. వీరగాథలను దేశచరిత్ర నాధారముగఁ బ్రబంధీకరించుట కనువైన కాల మిదియని చెప్పవచ్చును.

ప్రబంధ వాఙ్మయము నొక్కమా రవలోకించిన, సంస్కృత భాషావాఙ్మయ వాతావరణము బాగుగ జీర్ణించుకొనఁబడిన ఆంధ్రవాఙ్మయములోఁ దిక్కన ప్రబంధబీజమును నాటినట్లును, దానికిఁ పాదుచేసి నీరు బోసినవాఁడు శంభుదాసన్నట్లును, ఎరువు వేసి పెంచినవాఁడు శ్రీనాథుఁ డన్నట్లును, పూతపూయునట్లు చేసినవాఁడు పెద్దన యన్నట్లును, ప్రబంధ వృక్షము బహు శాఖాయుతమై శోభిల్ల ఫలవంత మొనర్చినది, రామరాజభూషణు డన్నట్లును గమనింపఁగల్గుదుము. పిమ్మట చిన్న చిన్న మొక్కలు జనించినను నవి తదున్నత వృక్షచ్ఛాయలో వాడిపోయినట్లు, కొన్నిమాత్రము గిట్టినట్లును దెలిసికొంటిమి. ఆంధ్రులు కవితా రచనములో నింతవఱకుఁ బ్రత్యేకించి సాధించిన కావ్యప్రక్రియలలో, 'ప్రబంధము'న సిద్ధహస్తులై రనుటలో సందేహము లేదు.[1] ఇది గర్వకారణముగదా!

(రచన : 1943 నవంబరు)

---

1 ఆంధ్ర విశ్వవిద్యాలయములో శ్రీ కాకర్ల వేంకట రామ నరసింహంగారు ప్రబంధములనుగూర్చి ప్రత్యేక కృషిసల్పి "డాక్టరేటు" పొందియున్నారు.

౧

ఆంధ్రవచనస్వరూపము

సూత్రగ్రథనము

మొదటి భాగము

కావ్యముయొక్క స్వరూప, జాతీయ యోజనలఁ జేసి నపు డనేక ప్రమాణములఁబట్టి యనేక భేదములను (types) పాశ్చాత్యులును, మన యాలంకారికులును నిర్ణయించినారు. ఆ ప్రమాణములలోఁ ఛందస్థితిఁ గావ్యములతోఁ గర్తృ సంబంధము, వస్తుతత్త్వము లు ముఖ్యములు. ఇందాది ప్రమాణమగు ఛందస్థితి ననుసరించి–కావ్యము త్రివిధములుగా విభజించినారు; గద్యాత్మకమనియు, పద్యాత్మకమనియు, నుభయాత్మకమనియు నివి చెలఁగుచున్నవి.

ఇఁకఁ బద్యమునకును[1] గద్యమునకు నున్న భేదము నరయుదము. ఇవి రెండును గావ్యశబ్దవాచ్యములే. ప్రాచీనాలంకారికులు నిర్వచించిన కావ్యత్వ మీ రెంటఁ బ్రవర్తిల్లును. అయిన భేద మెచట? పద్య మావేశపూరితమై, యుదాత్త విషయాన్వితమై, వ్యంగ్య మర్యాదాశ్రయమై, రసప్రధానమై వెలుఁగుచుండును. గద్యమట్లుగాక, వస్తుస్వరూపయాథార్థ్యము గలిగి, స్వభావోక్తి ప్రధాన నియమముగాఁ గలిగి, యన్వయ సౌలభ్యసహితముగా నపేక్షమాత్రముననే చెప్పెడి ప్రకృతాను

1 ఇట గద్య మనఁగా వచన (Prose) మని వాడుక.

పారిస్తమైన భాసిల్లును. ఈ భేదమునే వివరించుచు 'ఆర్నాల్డు'

"The rhythm and measure of poetry elevated to a regularity, certainty, and force very different from rhythm and measure, which can pervade prose, is a part of its perfection" అని వచించెను.

గద్యము పద్యముకంటె భిన్నమైనది; అది బాహిరముగా యంత్రమువలె నుండునది. పద్యమట్లుగాక స్వాగ్రత భావమును నియమబద్ధముగా, లయాన్వితముగా (Rythmical) నుంచునది. గద్యము దీనికి భిన్నమై, ఛందోనియమములు లేక, విరామాదులు లేక, యనేక గతుల నడుచును. ఈ రెంటికి భూజలధుల కున్న భేదమున్నది. అనఁగా నొకటి ద్రవరూపము గలిగి చలనశక్తి కలిగినది. రెండవది ఘనీభవించి స్థిరత్వమును బొందునది. గద్య పద్య భేదము కేవలము భౌతిక విభేదమే కాని వేఱుకాదు. అనఁగా, మనము పర్యాలోచించునవి మానసికసంబంధ విషయములు గనుక, నీ భేదము మానసిక తత్త్వ సంబంధమైన భేదముగా నున్నది. చిత్తప్రవృత్తి ననుసరించు నొక ప్రక్రియ పద్యము. వేఱొక ప్రక్రియ గద్యము. పద్యము సృష్టిస్వరూప పరిణామము. గద్యము నిర్మాణస్వరూప పరిణామము. సృష్టి యనఁగాఁ బ్రతిభాసమన్వితమైనది. భావావేశములోఁ బదములు పుట్టుచుండును. పదములకు నిర్దేశింపఁబడిన యర్థములుగాక, ఛాయాభేదములతో నవి నూత్నపదములగుచుండును. భావమునకును, పదమునకును మధ్య నెట్టి విరామము నుండదు. భావమే పదమగును; పదమే భావమును

సూచించును. ఇట్టి యవినాభావ సంబంధ మీ పద్యరచనములో భావపదములకు వర్తించును.

వచన రచనములోఁ బదములన్నియు యథాస్థితము లుగా నిలిచి యుండును. వాని కున్న యర్థములోనే యవి వర్తిలును. నిర్మాణకార్యమునకుఁ గడంగి నపు డుపకరణము లన్నియు సిద్ధముగా నున్నట్లు, పదము లన్నియు యంత్రమువలె సకాలమున కవి తమ స్థలముల నాక్రమించుచుండును. వచన సృష్టి కార్య మొక ప్రణాళిక ననుగమించునది. దాని కొక క్రమ (logic) మున్నట్లు స్పష్టము.

పద్యమందు భావోద్రేకమున కనుగుణముగాఁ బదములు భాసిల్లును గాని యొక నియమముగా నుండవు. కావున రచన ములో నిట్టి భావావేశమున కనుగుణముగా వచ్చు పదములు దొరలినచోట నా వచనము వచనముగాక, కవిత్వమే యగును. కార్లైలు వచించిన— 'Poetry is musical thought' అను వచనానుసారిగా రసభావమును బొందు శబ్దార్థ స్వరూపమును బ్రదర్శించు నట్టిదైన నది కావ్యమే యగును. విశ్వనాథకవి రాజు— 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అని పల్కిన వచనము గూడఁ దత్తుల్యమైనది. వచన రచనములో శబ్ద స్వరూపము నెఱిఁగి, గాని శక్తి (Force) లేక వ్యాప్తినిఁ దెలిసి, యథాస్థాన ములో, సముచితమైన సందర్భములోఁ బొదగవలెను. వచన రచనమునకు శబ్దార్థ స్వరూపజ్ఞాన మావశ్యకము. రచయితకు శబ్దాధికారము లేనిదే వచనరచనము రాణింపదు.

పద్యమెట్లు భావప్రధానము గలదియో, గద్యమట్లర్థ

ప్రధానము గలది.

పద్యము సయితము గద్యముయొక్క లక్షణము కలిగి యుండవచ్చును. అట్లే గద్యపద్యలక్షణములను (ఒక గణబద్ధత యందుగాక) గ్రహింపనగును. ఇట్టి ప్రక్రియా విశేష ద్వయములో నాద్యంబగు పద్యము లనేకములు గలవు. అట్టి పద్యములు నామమాత్రములే కాని వేఱుగావు. ఉదాహరణమునకు-

ధర్మనిధియైన యీతండ్రి దశరథావ
నీశుఁ డొకనాఁడు నిజ పురోహితునిఁ జూడఁ
దలఁచి రథమెక్కి సూతకృత్యంబు నేను
బూనఁగ వశిష్ఠముని వనంబునకుఁబోయి. (ఉ.రా.)

ఇట్టివి యనేకములు గానగును.

కవితావస్తువు లేక రసభావము లేకయే రచింపఁబడిన ఛందోనువర్తియైన రచనము కవిత్వ మనిపించుకొనక యాత్మలేని శరీరమువలెనుండును. కాఁబట్టి కవిత యనునది భావమందున్నది గాని, రచనములో లేదని చెప్పవచ్చును. పద్యమందలి గణనియమము శబ్దాలంకారము వంటిది. గద్య మం దట్టి లోపమును బోనాడుటకై దానిని శబ్దాలంకార సహితముగను సమాస గుంఫితముగను రచించినట్లు కన్పించుచున్నది. వృత్తఘటితములు, పద్యనిర్మితములే కావ్యములుగాఁ బరిగణించినచో స్మృతులు, వైద్యగ్రంథములుగూడ మహా కావ్యములు కావలెను. కావుననే "గద్యం నికషం కవీనాం వదంతి" అని ప్రాచీనులు నిశ్చయించిరి. గణనియమము లేని లోపమును బోనాడుటకై రచించినదే – 'ఓజస్సమాస భూయస్త్వ మేత ద్గద్యస్య

జీవితమ్' అను వాక్యము. ఈ లక్షణము ననుసరించిన గద్య కావ్యములు సంస్కృతమున నున్నవి. పద్యరచనములో నున్నట్టిది యీ కవితాభావమున కొకతొడవు నగుచుండుటయే.

"Verse is apparelled only being but on ornament"

—*Sir Philip Sidney.*

కావ్యసృష్టికి ననుభూతి ప్రధానము. కవి తాను జూచిన వస్తువులలోని సౌందర్యాదికముల ననుభవించి, తిరిగి వ్యక్తీకరించును. ఈ వాక్యే 'రసభావము' తనంతట దాల్చెడి శబ్దాకస్వరూపము. ప్రాక్తన మానవుడు ప్రకృతి సౌందర్యమునకు ముగ్ధుడై గంతులువేసి, పదము పాడెనని గ్రహింపగల్గుదుము. వాల్మీకిశ్లోకము శ్లోకరూపమునే ధరించినది; కాని గద్యరూపము గాదు. కావున నానందానుభూతిం బొందినపుడు లయాన్వితమైన గీతియే వెలువడును. ఇందలి సూక్ష్మధర్మ మేమన గీతి హృదయజన్యము. గద్యము బుద్ధి (Reason) జన్యము. హృదయప్రవీకరణము కళవలనం గల్గును; బుద్ధి నైశిత్యము శాస్త్రమువలనం బొడమును. పైం క్రమమును బట్టి, బుద్ధి కంటె పూర్వము హృదయ వికసనము సహజము గాన, గీతియే ముందు పొడసూపునది.

It is a sort of common place of literary history that verse is always older than prose; and in the case of most literatures—especially modern ones—it is almost demonstrably so. —*Saintsbury.*

సారస్వతము వివిధశాఖా విరాజితము. ప్రతిశాఖయుం

పరిపూర్ణతఁ జెందినఁగాని సారస్వతముయొక్క సమగ్ర స్వరూపము ద్యోతకముకాదు. అభివృద్ధియనునది యేకదేశమైనను, క్రమానుగతముగ లేకపోయినను రుచింపదు. అందుచే నేవిభాగమైనను స్వయంపూర్ణమై, క్రమాభివృద్ధినిఁ బొంది సమగ్ర సారస్వతమునకు దోహదభూతమై వఱలవలెను. గద్యపద్యములను ప్రక్రియాద్వయములో గద్యమునకుఁ జాల దినములవఱకాదరము కలుగలేదు. అందుచే వచనరచన మెక్కుడుగా నే విషయమున కుపస్కారకము కాలేకపోయెను. వచనము విషయబోధనానువర్తి. ఇం దలంకారములకుఁ బ్రాధాన్యము లేదు. ఉద్దిష్ట విషయ మెప్పుడును హృదయమున సూటిగాఁ జొచ్చుటకు వచనరచయిత ప్రయత్నించును. ఈ రచనములో వాచ్యార్థమే ప్రధానము. లక్ష్య వ్యంగ్యార్థము లప్రధానములు. లక్ష్య వ్యంగ్యార్థములు వచ్చినా నది గద్యములో నున్న కవిత్వ మనిపించుకొనునేమోకాని, కేవల వచనమగుటకు వీలులేదు.* అట్లే విషయస్వరూప బోధకమై సదృశ వస్తువుల నెన్నినపు డట్టివి యలంకారము లనిపించుకొన్నను, అలంకార బాహుళ్యము కలుగదని మాత్రము చెప్పవలెను. శబ్దచిత్రములు–అర్థ చిత్రములు శైలీ భేదములలో వచనమందుఁ గన్పించినను, కేవల వచనస్వరూప మదికాదని ప్రాజ్ఞులు తెలిసికొందురు. అనుస్యూతముగా వచ్చు భావములను యథాతథముగా గ్రహించి కాపాడునది వచనము.

---

* 'శారదా విలాసము' ను నా గ్రంథమందు 'గద్య కవిత్వము' గూర్చిన వ్యాసమును జూడ నగును.

వచనము సాహిత్యమున ముఖ్యమైన శాఖ. భావమును నిగూఢము గావించి చిక్కులకు బెట్టుటకును, చెప్పదలcచిన భావము నా పదజాలములో నా ఛందో విరామములోc జెప్పలేకుండుటకును పద్య మున్నది. వచన రచనములో స్వేచ్ఛగలదు. రచయిత తన భావమును విస్తరించి బోధింపనగును! కేవల విషయమే ప్రధానమైన రచనము వచనము.

వచన మెక్కుడుగా శాస్త్రరచనములం దుపయోగపడును. మానవజీవితమును సరిగాc దెలియవలె ననినగాని, తెలుపవలె ననినగాని వచనమే చక్కని వాహిక (Medium). ఈభావములకే ప్రాకృతప్రాప్తి కావ్యకర్తల పద్యములద్వారా వానిని కళ యను రసాయనముగాc దయారుచేయును. శాస్త్ర కళల కున్న విభేదమే గద్యపద్యముల కున్నట్లు గ్రహింపనగును.

"When life is the criterion and not art, the prose of a nation is far more important than its poetry"

—*Evans.*

చరిత్రలందు గాని, తత్త్వవిషయక మీమాంసలందు గాని గద్యమే యుపాదేయము గాని పద్యము రాణింపదు. కావున వచనరచనము తత్త్వవేత్తలకుc జరిత్రకారులకు నుపయోగపడును గాని కవుల కంతగా నుపయోగకారి కాదు. పద్యస్వభావ లక్షణములc బొన్ని గద్యమును కవులు తమ నవలలయందు, వ్యాసములందు, నాటకములందు వినియోగించు కొనవలెను. అచ్చటచ్చట ననేక కావ్యభేదములలో నుపయోగింపcబడుచు వచ్చిన వచనమును బర్యాలోచించుట క్లిష్టమే.

In literature prose embraces all forms of oratary and of representative discourse and the prose drama. —*New Standard Dictionary*.

ఇందుఁ బ్రతిపాదితమైన సంప్రదాయ మాంధ్ర వాఙ్మయములో నతి ప్రాచీనమైనదిగా గ్రహింపఁగల్గుదుము.

ఆంధ్ర సారస్వతము నవలోకించుటకుఁ బూర్వము ముఖ్యముగా రెండు భాగములుగాఁ గాలమును భాగించుట యవసరము. ఆంధ్రమునకు సంస్కృత భాషవలన వచ్చిన ప్రాబల్యము: ఆంధ్రమున కాంగ్లభాషా ప్రాబల్యము. ఇట్టి విభాగమువలన నే విషయములైనఁ జక్కఁగా సమున్మీలింప సావకాశ మేర్పడును.

పదునెనిమిదవ శతాబ్దము తుదివఱకు సంస్కృతభాషా ప్రాబల్య మాంధ్రమున నింతింతయని చెప్పరాదు. సంస్కృతానుసరణము, అనుకరణము, అనువాదములే తప్ప ప్రత్యేక ప్రతిభను జూపు సమగ్రప్రక్రియ యొకటియైనను నాంధ్రమున నవతరింపలేదు. ఒకింత యత్నము జరిగినదనిన 'ప్రబంధము'పట్ల నేమేని జరిగియుండును; అంతియే. అచటనుగూడ మాతృకలు సంస్కృతము లోనివే. ఇట్లు సంస్కృతములోని ఛందశ్ప్రకరణములు, కావ్యములు, వైదికవాఙ్మయము—ఇవి యననేల—ఆంధ్రములోనికి యథాతథములుగా నవతరించినవి. కావ్యభేదములన్నియు సంస్కృతమునుండి తెలుఁగులోనికి దిగుమతియైనవి. కావున సంస్కృత సంప్రదాయములు (భాషా శాస్త్రములు) తెలియని మానవునకుఁ తెలుఁగు సారస్వతము దరిఁజేసుట

కధికారము లేకుండినది. రాను రాను, ఆ పరిభాష, సంప్రదాయములు కేవల మాంధ్రభాషకుఁ జెందినవను భ్రాంతికూడఁ గలుగుచున్నది. ఇవ్విధముగా నాంధ్రభాషపై సంస్కృతభాష యొక్క ప్రభావము వరలినది.

ఇప్పటికి రెండు శతాబ్దములనుండి మనభాషపై నాంగ్ల భాషాచ్ఛాయలు, సంప్రదాయములు పడుట మొదలిడినవి; సంస్కృతము మనభాషపై నెట్టియధికారము మున్ను పూనెనో యట్టి యధికారమునే యాంగ్లభాష వహించినది. క్రమక్రమముగా నాంగ్ల సారస్వతములోని గ్రంథము లవతరించుటకన్న, ఆ భాషలోని విధానమును, ఆ సారస్వతములోని వెలుఁగు జిలుఁగులు నెక్కుడుగా నాంధ్రమున కవతరింపఁజేయఁబడినవి. ఇట్లవతరింపఁబడిన ప్రక్రియలలో నవల ప్రథమగణ్యము. తరువాతి ఉపన్యాసము, కథానిక, విమర్శనము, జీవితచరిత్ర మున్నగునవి తెలుఁగుభాషలో నవతరించినవి. వచన స్వరూపమొకవిధముగాఁ జోటుచేసికొనిన దనిన నది పందొమ్మిదవ శతాబ్దమందే యని చెప్పవచ్చును.

ఇవ్విధముగా సంస్కృతాంగ్ల సారస్వతముల ప్రభావము నవగతముఁ జేసికొన్న పిమ్మటఁ దెలుఁగు రచనలలోని వచనస్వరూపము నారయుట సమంజసము :

అంతకుఁ బూర్వము కావ్యములు గానరాకుండుటచే నజ్ఞాతయుగము*నాఁటి గద్యసంప్రదాయము తెలియవలెనన్న

* "ప్రాచీనాంధ్ర శాసనములు — ఛందోవికాసము" అను విషయమును గూర్చి పరిశోధనము సలిపి శ్రీ తంగిరాల వెంకటనారాయణ శాస్త్రిగా రాంధ్ర విశ్వవిద్యాలయమందు 'డాక్టరేటు' నిటీవల గ్రహించిరి.

మనకు శాసనములే యాధారభూతములు. నన్నయకుఁ బూర్వము వరలుచున్న తెలుఁగు శాసనములనుఁ బరిశీలించి నచో నవి యన్నియు సంస్కృత శాసనములవలెనే రచింపఁ బడినట్లు కానవచ్చును. ఈ శాసనములలోఁ బ్రాచిత్యముగాఁ దెలుఁగు వాడఁబడియున్నది.[1] దాన మొసఁగఁబడిన భూమి యొక్క యెల్లల నిర్ణయమునఁ దెలుఁగుపదము లుపయోగింపఁబడినవి. మిగిలిన భాగ మంతయు సంస్కృత పదభూయిష్ఠము. దీర్ఘసమాస సంభరితము. శబ్దాలంకార పూరితమునై సంస్కృత శాసనముల కెవ్విధమునను దీసిపోవక వర్తిలుచున్నది; సంస్కృతవర్ణక్రమము పొడసూపుచున్నది :[2]

ఉదా :......(వి) జయాది (త్యపాదప) (ద్మ) భ్రమ రాయమాన శ్రీమత్కొడెయరాజు గుణగణాభరణుణ్ణ (వ) న కాని ఈస్వ (శ్వ) రున (కుం) గార్తికేయుండుబోలె చావష్టి కల (లా) విసా (శా) రదు (ణ్డు) పట్టరంగులు అయ్యమ పెగ్గడ లుం గర (న). మ్మన పట్టరంగును ఈ ధమ్మన్ని (వ్వన్) (హా) నోద్యోగమ్మన (కు) బృహస్పతి సమానులయ్న పెగ్గడకా (కడెయ) గారి (కొడు) కు (బె) జెయరాజ సమ (ర్థు) ణ్డని ఆత్మాన్మతంబునం బన్చిన ప్రసా (దం) బని సమస్త రా (జ్యభా) ర నిరూపిత మహామంత్రాధి పతి (మ) (హే) శ్వర పక్షపాతి దేవబ్రాహ్మణగురు (భ) క్తి

1. వానిలో ఎక్కడ ఏ తెలుఁగు పద మయినను కనబడుట సంభవించిన యెడల మనకుఁ బెన్నిధి దొరకినట్లే. —మల్లంపల్లి, ఆంధ్ర : ఉగాది సంచిక.

2. ముండూరుగ్రామే; చెఱకుమడ్డుశ్చ.

వరుణ్డు స (సే) క్తి (క్షత్రియ) గంధస్తంబు నియ రాజు రాజ బెజయేశ్వరంబుగల స (శ) నివ్వాన్ (హా) నంబుసేసి దిన (శి) గుడ్లుం బ్రాకారంబు మటంబును నెమియించి.

[రెండవ ప్రక్క]

......(బున్వా)......ప్రచ్చినవ (వారు)...దంబు (సల్పి) నవ (వా)రుడి......(ం) బుగ ద్యంబుల నలస (శ్వా) స్వ (శ్వ) తంబు......(యను) ఇ (ఈ) భూమిలోన.

మూఁడవ విజయాదిత్యునాఁటి ధర్మపరము శాసనము.

తెలుఁగు కవితావతరణము మెట్లు సంస్కృతానువర్తియై వరలినదో, యట్లే తెలుఁగు శాసనములపట్లను సంస్కృత ఛాయపడుట తప్పలేదు. కావున శాసనములందు లభించు తెలుఁగు గద్యభాగములు నామమాత్రాకములేకాని, స్వచ్ఛందమైన తెలుఁగు రచనముయొక్క స్వరూపమును బ్రదర్శించునవి కావని సిద్ధాంతీకరింపవచ్చును.[1]

ఇఁక నాంధ్ర సారస్వతములో నాదికవి యగు నన్నయ రచనమును జూచినచో నందు సంస్కృతపదబాహుళ్య సమాస సంఘటనములు గాన్పించును. ఆతని భారతము చంపూ కావ్యముగా బయలుదేరినది. ఇచట చంపూకావ్యమున గద్యపద్యములకు సమానస్థాన మీయఁబడినది. కనుక పద్యముతోఁ గూడి యెడమగా నడిచిన యీ గద్యమంతయుఁ గవితాపదార్థ

---

1. 'రెండో మూడో పద్యములుగల శాసనములు తప్ప నన్నయకుఁ బూర్వకాలపుఁ దెలుఁగుభాషా స్వరూపమును దెలియఁజేయు నాధారములు గానరాకున్నవి.' —డాక్టర్ చిలుకూరి నారాయణ రావు గారు

పోయియుండుటచే కాని నిరూపింప సాధ్యము కాదు. కావున తెనుఁగువచనము నన్నయనాఁటినుండియే పద్యములో కలిసి పోయి వచ్చుచునే యున్నదని తెలియుచున్నది.

నన్నయ నాఁటి నుండియే 'గద్య' మను పదమున కొక విలక్షణార్థమున్నట్లు మనకుఁ దెలియును. గద్యము వచనము నకుఁ బర్యాయపదముగాఁ బ్రయుక్తమగుచున్నది. కాని 'గద్య' మను ప్రత్యేక ప్రక్రియ మన కొకటి నిర్దిష్టాకారముతో నున్నట్లు గమనింపఁగలుగుదుము. కావ్యములలోఁ బ్రతి యాశ్వాసాంతమున 'గద్య' పొడగట్టును. దీని ప్రయోజనము లేవియనఁగా, నా కావ్యకర్తృవంశ గురు నామాదికములను కావ్య సంజ్ఞా యా యాశ్వాసములలోఁ బ్రతిపాదితమైన విషయ ములను దెలియఁజేయుటయే: అనఁగా నేఁటి కావ్యములలో 'విషయ సూచిక' లను శీర్షికక్రింద వచ్చు వస్తువు. గ్రంథోపరిభాగమున వచ్చెడఁబడునట్టి కావ్యకర్తృనామాదికము లీగద్యములు ప్రాచీన కాలములోఁ జివర నిర్వర్తించెడి వన్నమాట! కావున వీని యందుఁ గవితాభావ ముండుటకు వీలులేదు. విషయబోధనమే ప్రధానోద్దేశము. అందువలన నీ గద్యమందుఁ గవిత్వము లేక పోఁగా కేవల వచనముయొక్క స్వరూపము కించి ద్వ్యక్త మగును. కాని, యీ గద్యములు కేవల వచనములు కానేరవు. గద్యభాగము సమాసభూయిష్ఠమై, యనుప్రాసాలంకార యుక్తమై పద్యములో నుండు శ్రుతికి దీటైన లయ కలిగి విరా జిల్లుచుండును. ఈ శబ్దాలంకార, సమాస, శ్రుతి, లయలు గద్య పరిణామములోఁ బొందిన నూత్నావకాశములు. కావున నివి

యున్నియుఁ బ్రతి గద్యలోను గానరావు;కొన్ని కొన్ని యన్నిట మిన్నలై చెన్నొందుచుండును.

గద్యము విషయసూచికగా వర్తించునట్లున్న నన్నయ గద్య చూడుఁడు :—

"ఇది సకల సుకవిజన వినుత నన్నయభట్ట ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబునందు సభాపర్వంబున ధర్మరాజునకు సభాప్రాప్తియుఁ గింకర దర్శనంబును, నారదు వలన లోకపాలుర సభా శ్రవణంబును, రాజసూయ మహాధ్వరారంభంబును, జరాసంధ వధయు, గిరివ్రజ నిరుద్ధులయిన రాజులం గృష్ణుండు విడిపించుటయు రాజసూయంబు నన్నది ప్రథమాశ్వాసము."

— సభాపర్వము

ఇట్టి గద్యలు ముఖ్యములుగాఁ బురాణములం దుండుట సహజము. మార్కండేయ పురాణము, సమీర కుమార విజయము, భాగవతము మున్నగుకథాకథనపద్ధతి (Narration) గల గ్రంథము లిందుల కుదాహరణము లగును.

ఇఁక వంశ నామాదికముల వచించుటలో శబ్దాలంకారములు గలవి కొన్ని గద్యలు చూడుఁడు:—

"శ్రీ మ దుభయ కవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విధేయ తిక్కన నామధేయ ప్రణీతం బయిన......"

"శ్రీ కమలనాభ పౌత్ర మారయామాత్య పుత్ర సుకవిజన విధేయ శ్రీనాథ నామధేయ ప్రణీతం బైన........"

'సకల గుణసనాథ సోమనాథ ప్రణీతంబైన...'

'శ్రీమదఖిల కవిమిత్ర పెదయన్నయామాత్య పుత్ర శారదా దర్పణాభిధేయ అక్కన నామధేయ...'

ఇట్లే చాలమంది కవులు తమ గద్యలను రచించిరి.

కవు లాశ్వాసాంతగద్యములలోఁ దమ యిష్టదేవతా సూచనమును జేయుచుందురు; ఇందులకుఁ గొన్ని :—

'శ్రీమత్కాళహస్తీశ్వర చరణ కమల సేవాపరాయణ సింగమ రమానారాయణ జక్కయనారాయణ తనూభవ పరాఙ్ముఖ ధూర్జటి...'

"శ్రీమత్పరమపదనాథ నిరవధిక కృపా పరిపాక పరిచిత సరసకవితాసనాథ రామకృష్ణ కవినాథ..."

ఇట్లే రామరాజభూషణుఁడు, కూచిమంచి తిమ్మకవి మున్నగుకవు లనేకులు తమ యుపాస్యదేవతలఁగూర్చి గద్యమం దుల్లేఖించిరి. ఈ గద్యభాగమువలనఁ గవి జీవితమునుగూర్చి యించుమంత చరిత్ర తెలియుట యుపయోగము. ఈ గద్య రచయిత కొన్నియెడల కావ్యకర్తయే కావచ్చును. కొన్నిపట్ల నా కావ్యముయొక్క ప్రతులను వ్రాసికొనినవారే వ్రాసి యుండవచ్చును. ఈ రెండవయంశమును స్వీకరించుట కాదా వ్రాఁతప్రతులం దాశ్వాసాంత గద్యలలో విశేషముల నామాది కములుగూడఁ గన్పట్టుచున్నవి. ఇట్టి 'గద్య' యను ప్రక్రియ ప్రతి గ్రంథమందును బొడగట్టి మన సారస్వతములోఁ బ్రత్యేక స్థానమును గడించినది. ఈ గద్యస్వరూపము కేవల వచనమున కును, కేవల పద్యమునకును మధ్యస్థితి నాక్రమించుచున్నది. వీనిలోఁ గొన్ని గద్యలం బాడుదురు. ఆ చదువు పద్ధతియే

భిన్నము. తెలుఁగు సారస్వతపుఁ దొలిదినములకే 'సద్రగద్య' మొదలైనవి యున్నవి. కీనిలో లయ (Rythm) ఉన్నదనియే తలంపవలెను.*

మన సారస్వతములో 'దండకము' లనునవి కన్పించు చున్నవి. ఏవిధముగా కవితాభావములేని పద్యము వచనముగా ముందుఁ గాంచితిమో, అట్లే 'దండకము' వచనముగా భాసించినను లయ (Rythm) కలది గనుక పద్యతుల్యమగు చున్నది. ఈ దండకములు నమస్కార గద్యలకుఁ దుల్యములు. నన్నయ తరువాత పాల్కురికి సోమనాథుని కాలముననే గద్య ప్రబంధములు విరివిగా నుండి సంస్కృతపద బాహుళ్యమువలన జనసామాన్యమునకు రుచింపకపోయినట్లు పండితారాధ్య చరిత్రలో —

"ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ, పూరిత సంస్కృత భూయిష్ఠరచనమానుగా సర్వసామాన్యంబుగామి, జాను తెనుంగు విశేషము ప్రసన్నతకు..."

మఱియు బసవపురాణములో —

'ఉరుతర గద్య పద్యోక్తుల కంటె, సరసమై పరగిన జాను తెనుంగు చర్చింపగా సర్వసామాన్యమగుట'

అనెడి యుదాహరణములనుండి తెలియవచ్చును. ఇటఁ జెప్పిన గద్య గ్రంథము లేమాయెనో వ్యంగ్యముగా నున్నవి. లేక 'గద్య పద్యోక్తి' యనియు, 'గద్యపద్య ప్రబంధ పూరిత

* కావ్యము అనిపించుకొనిన వచనములు గద్యములు. కావ్యేతర వచనములు వచనములే! — ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.

[illegible] భూయిష్ఠ రచన' అనుచుఁ గొన్ని ప్రసిద్ధ గద్య పద్యములచేఁ జెన్నొందు చంపువనియేమో యుద్దేశము!'

కాలముగాఁ దెలుఁగు సారస్వతముం జూచినచో రెండుగ నది విభాగింపఁబడినట్లు తెలియఁదగును. సంస్కృతి ప్రభావము భాసించిన నాఁటినుండి వెలసిన సాహిత్యమును రెండు శీర్షికలక్రింద విభాగింపవచ్చును. మొదటిది పురాణరచనము (కథాకథనము = The Narrative) రెండవది—ప్రబంధరచనము (వర్ణనాత్మకము = The Descriptive). ఈ రెండు ప్రక్రియలలోనే కవి రచనాశక్తిచే, సవకాశానుగుణముగ వైవిధ్యమును బొందఁ గలుగును. ఇందులకుఁ బురాణస్థగాథలం బ్రబంధవస్తువుగా స్వీకరించి, నిర్వహింపఁబడిన ప్రబంధములఁ గాంచినఁ దెలియును.

ఇఁక పురాణ ప్రబంధ వచనములను బరిశీలింపవలయును. అప్పుడు వచన వాఙ్మయమున నభివృద్ధి పొందెనో, లేదో తెలియవచ్చును.

పురాణములలోను, ప్రబంధములలోను గన్పించు వచనములు భిన్నస్వరూపములను బొందినవి. పురాణ వచనము పద్యముల మధ్య నెడనెడఁ గన్పట్టును. ఈవచనము కేవలము రెండుపద్యముల నడుమగాక, రెండు సన్నివేశముల సంబంధ వాక్యముగాఁ గాని వినియోగపడును. ఒక్కొక్కచోట నిరువురి సంభాషణము పద్యములలోఁ జిత్రించిన, నాయా పాత్రలను సూచించుటకై వచన ముపయుక్తమైనది. ఇట్టివిధానముతో వచనము పురాణములోను, ప్రబంధమందును విరి

విగాఁ గన్పించు చున్నది. పురాణవచనము పురాణపద్యము వలెనే సుబోధకము (ఆఖ్యానాత్మకము). అల్ప పద వాక్య మయము. అయ్యది నిరాడంబరముగను, నాతి దీర్ఘముగను, విషయప్రధానముగను, కథాగమన వేగముతోడను నడచు చుండును. కాని ప్రబంధములలో వచనమున కొక ప్రత్యేకత యున్నది. ప్రబంధవచనము దీర్ఘముగను, ఆలంకారికముగను వర్ణనాత్మకముగను, సమాస గుంఫిత ఘనశైలితోడను, పద్యము నందువలె శబ్దాలంకారములతోడను విజృంభించియుండును. కాని, భాగవత వచనము మాత్ర మిట సరితూగదు; అది పురాణ వచనమువలె భాసిలక, ప్రబంధరీతి ననుసరించినది. ప్రబంధ వచనములో కథా వేగమునకై త్వరపడుట లేదు. మీదుమిక్కిలి కథాస్రవంతి యీ వచనమను పర్వతమునొద్ద నొక్కుమ్మడియాగి, తదుపరి యీ వచనపర్వతము నధిగమించి చనుచుండెను. కథలోని సన్నివేశముల నెక్కుడుగా వర్ణించు టయే ప్రబంధకవిత్వ లక్ష్యము. కనుక, కథావేగమున కాతని పద్య రచనముగాని పూనుకొనదు. సన్నివేశ (Incident) ప్రస్తారమే కవి యుద్దేశ్యము. ఇట్టి ప్రబంధవచనములలో నెక్కుడు స్వభావోక్తి యొప్పును.

ఈ విధముగాఁ బద్యమునకు భిన్నమైన వచనరచనము మనకుఁ దొలుదొలుత శాసనములం దంకురించి, తరువాత చంపూ కావ్యమైన భారతములోఁ బద్యముతో నెడనెడ నడచుచు వచ్చుచు కావ్యాంతములందు విలక్షణముగా 'గద్య' లను పేరఁ బరుగుచుఁ గావ్యము లనిపించుకొను. గద్యలలోఁ

బాహ్యస్వరూపము, ప్రబంధ యుగమునాటికి నలంకారముల గ్రహించి విశిష్ట రూపము నొందినట్లు తెలియుదుము. ఎట్లైనను ప్రబంధ యుగము తర్వాతనే వచన ప్రయోగము సంపూర్ణముగా నుద్ధరింపఁబడినట్లు నమ్మవలసియున్నది. ఆంగ్ల విద్యా ప్రభావము కారణముగా గత రెండు శతాబ్దములనుండి వచన రచనము మనకు సర్వోపయోగ్య మగుచున్నట్లు గమనింతుము. ఈ క్రమ పరిణామము పోలికతో నింక ముందు గమనింతముగాత :

౮

ఆంధ్ర వచన స్వరూపము

అన్వయము

రెండవ భాగము

నన్నయభట్టుగాని, తిక్కన ఎఱ్ఱనార్యులుగాని వచనమును కథాకథన పద్ధతికి ననుగుణమై గౌణమైన వాహిక (medium) గా స్వీకరించినట్లు ద్యోతిలును. ఇఁక వారి రచనములో మాత్రము భేదము వర్తించుచున్నది. ఇది వారి వారి స్వాత్మీయత (Personality) లం బురస్కరించుకొని వచ్చిన శైలీ వైవిధ్య విన్యాస విలసనమే. భారతరచనములో నన్నయ యే విధమైన వ్యాఖ్యానాత్మక శైలిం బ్రదర్శించెనో, తిక్కన యెట్టి నాటకీయశైలిని నడిపించెనో, యెఱ్ఱన యేవిధమైన వర్ణనాత్మకశైలిని పుణికిపుచ్చుకొనెనో, యట్టి శైలీవైవిధ్య మాకవుల వచన రచనములందును దగుమాత్రముగఁ గన్పించుచునే యున్నది. అనఁగా నన్నయ వచనమునకుఁ గథా కథనశక్తి యున్నట్లు, తిక్కనయజ్వవచనమునకు సంభాషణాశక్తియున్నట్లు, ఎఱ్ఱనామాత్యుని వచనమునకు వర్ణనాశక్తియున్నట్లును గ్రహించిన మొట్టమొదటి ద్రష్టలని యెఱుంగవలెను. ఈవిధముగా వచనము త్రిముఖముగాఁ దిరుగఁగలదని తీర్చిదిద్దిన వా రా కవిత్రయమువారే. కాని ముఖ్యముగా వచనములకు వారిరచనలలోఁ బ్రాముఖ్యము లేదనుటకు వీలులేదు. వచనగ్రంథములానాఁటికే యున్నట్లు శైవకవుల పొత్తములలో హత్తింపఁబడియున్నది. ఆ తర్వాత వచ్చిన తిక్కనామాత్యునకుఁ బిన యుత్తర రామా

యణమును రచించు తలంపుఁ బుట్టినప్పుడు వచనరహితముగా రచనము సాగించవలెనను దీక్ష వహించుటనుబట్టి యీనాఁటి వచన స్వరూపము ద్యోతకము కాఁగలదు. నాఁటి దీర్ఘవచనములను సాగించుట ఎఱ్ఱనామాత్యుఁడు తీసిన దారియే. ప్రబంధోచిత వర్ణనలను నృసింహ పురాణ హరివంశములందు విలోకించిన వాఁడాతఁడే. వచనములో భావవ్యక్తీకరణ శక్తియున్నట్లు నన్నయవచనముల వలనఁ దెలియును; సంభాషణా చాతురి వచన రచనమున కున్నట్లు తిక్కన పరిశీలించెను; భావప్రస్తారమునకుఁగాని, భావవ్యాఖ్యానమునకుఁగాని వచన ముపయుక్తమగునని శంభుదాసుఁడు కనిపెట్టెను. ఇవ్విధముగా కవిత్రయ వచన రచన మూఁడు చిన్నెలు పొంది చెలువారుచున్నది.

కవిత్రయమువారి ననుగమించిన కవులలో ననేకులు వచనములందును వారి మార్గముల ననుసరించినవారే. కాక పోయిన, వచనమునకున్న మూఁడు శక్తులను (పైఁ జెప్పఁబడిన శక్తుల) పరిశీలించి, ముప్పేట ఛాయలను సంక్రమింపఁజేసికొన్న వారనేకులున్నారు.

మరల కవిత్వములోఁగాని వచనములోఁగాని ప్రత్యేక విశిష్టతలు వచ్చిన వనిన శ్రీనాథుని హస్తములందే యని చెప్పవలయు.

కవితలో శ్రీనాథుని కాలమున నొక మార్పు వచ్చినట్లు సూచించితిని. కవిత్రయముచే దిద్దిపెట్టఁబడిన పురాణ[లేకయితిహాస] వైఖరి కొంతకాలము వర్ధిలి, శ్రీనాథుని నాఁటికి గావ్యఫణితిలోనికిఁ బరివర్తనము పొందినది. ఈ వైఖరీ భేదముతో

పాటుగ రచనా పద్ధతిలోను భేదము వచ్చినది. స్వతంత్రాలంకారములచే నా కావ్యయోష నలంకరించుట శ్రీనాథునితో మొదలుపెట్టఁబడెను. మూలమును యథాతథముగా ననుసరించుట లేతని రచనములో స్వల్పము. శ్రీనాథుఁ డెటనున్నను తన వ్యక్తిత్వమును జూపెట్టును. నైషధకావ్యమందలి యనువాద పద్ధతి యిందుల కుదాహరణము. కొన్ని శ్లోకముల ననువదించుటలో వచనముగా నవతరింపఁజేసినాఁడు. దానిలో నాతని యశక్తతగాక, యా మూలశ్లోకములోని వాచ్యత (Baldness) యే కారణ మనవలసియున్నది.

ఉదా : కిమస్యరోమ్ణాం కపటేన కోటిభిః విధిర్న రేఖాభిరజీగణ
ద్గుణాన్ నరోమకూపౌఘమిషా జగత్కృతా కృతాశ్చ
కిం దూషణ శూన్య బిందవః॥

మొదలైన శ్లోకములను వచనమందుంచెఁ జూడుఁడు :

"......రోమకోటి కపటంబున హాటకగర్భుండు పాటించిన సుగుణగణనా రేఖ లవయవంబులం బొలుపారె"–శృం.నై.

ఇవ్విధముగా శ్రీనాథుఁడు వచనముయొక్క ప్రయోజనమును గ్రహించెను; కథాకథనమున కెక్కుడుగా వచనమే యుపయోగకారియని తెలిసినాఁడు. అందుచేతనే శ్రీహర్షుని శ్లోకములను వచనమందు దింపినాఁడు. ఇదిగాక శ్రీనాథుఁడు కావ్య ఫణితి ననుసరించినవాఁడు కనుక, యది వచనమందును కోరలినది. దీర్ఘసమాసములతో వచనము నలంకరించినాఁడు. వర్ణనములను మఱింత బరువు గావించినాఁడు. అనుప్రాసాలంకారములఁ జొన్పి, శ్రవః పేయతలకై పాటుబడినాఁడు. ఈ క్రింది వచన ముదాహరణ మగును :

"కాంచీయు నవఖండమండలంబగు మహీమండలంబునకు మకరకుండల తాటంకంబునుం బోలె శ్రీమేశ్వర మండలంబు పాయకునం ద్రిలింగోర్వ్యాల తలంబుల నంది, వింధ్యాచలపాదంబునం గేదారకుం భక్తోద్ధార స్థానంబుల కుపమానంబనంజాలి, యేలేటి యేటి కాలువల వలన నదీమాతృకంబులగు పంటపలంబులు సలిల ధౌత కలధౌత శిలాశకల సంకోచ కరణంబులై యంకురించినవియు..."

శ్రీనాథుండు కాశీఖండంబున 'సదాచార నిరూపణము', 'స్త్రీధర్మ నిరూపణము', 'యోగ నిరూపణము' లను శేయు నప్పు డెక్కువగా వచనము ప్రయోగించి వచన ప్రాశస్త్యమును నిరూపించెను. ఇట్టి నీతిబోధలకు, శాస్త్రవిషయములకును వచనమే యుపాదేయమని గ్రహించినట్లు స్పష్టముగదా! ఈతని జటిల వచన రచనము జూడుడు:

"ఆ రాజరాజు రాజేశ్వభవ హరి పురందరాది బృందారక మకుటసంధానిత వికచ మందార కుసుమ మాలా మకరంద బిందుధారా ధౌత చరణారవింద మందరాచల మంథాన మథ్యమాన దుగ్ధజలధి గర్భ విస్ఫూర్త కాలకూట కబళిత భవపిండ గండూష కళంకిత కంఠ మూలోపకంఠన కుంత్రోక్త భువన రక్షా దాక్షిణ్య దాక్షాయణీ కుచకలశ వాక్ కేళి"—కాశీ. ఖం. చ.

ఇట్లు శ్రీనాథుని చేతిలో వచన మొక నూత్న మర్యాదాశ్రయి యైనదని సిద్ధాంతము. పోతన శ్రీనాథుని సమకాలీనుండైనను, 'భాగవతము' కావ్యము కాదు గనుక యితిహాస వైఖరినే తన రచనములోఁ బ్రతిపాదించి ప్రయోగించినాఁడు.

కాని పోతన కవిత్వములో గడించుకొనిన ప్రత్యేకత, గద్య మందును పొందినాఁడని చెప్పవలయును. అంత్యానుప్రాసముతో రచించు పద్ధతి యీతని సొమ్ము. వర్ణనములందు దీర్ఘసమాస యుక్తముగను, కథాకథనమందు లలితపదములతోడను రచన మును సల్పఁగల సవ్యసాచి పోతన. చూడుఁడు :

"...జలధర నినదశంఖ శార్ఙ్గ సుదర్శన గదాదండ ఖడ్గాక్షయ బాణ తూణీర విభ్రాజితుండు......"

(భాగవతము 8 స్కం.)

ఇఁక శ్రీనాథుని తరువాతవారు గతానుగతికంబుగ నాతని రచనమునే యనుకరించి రనవలెను. పిల్లలమఱ్ఱి పిన వీరన శాకుంతల కథను స్వీకరించినపుడు శ్రీనాథుని భాషాంతరీకరణ పద్ధతినే యనుసరించెను. జక్కన, అనంతామాత్యులు తమ రచనలలోఁ గథాకథన పద్ధతికి ననువైన రచనము సల్పి, వచనములను దదనుగుణముగా నిర్వహించిరి. జక్కన తన 'విక్రమార్క చరిత్రము'లోఁ బ్రథమాశ్వాసమునఁ బురవర్ణనమును వచనంబులో నిలిపినాఁడు. దీనిఁబట్టి వర్ణనాత్మకమైన శైలి వచనములో నెంతవఱకు నెగ్గునో నిరూపిత మగును. జక్కన వచనములు సమాస సంభరితములు, శబ్దాలంకార విలసితములును. శ్రీనాథుని వచనరచనము ననుగమించినా రాతని తరువాత కవులు.

కవిత్రయమువారి తరువాత మరల శ్రీనాథుఁడే తెలుఁగు సాహిత్యమున కొక తీర్పు దిద్దినాఁడు. అది పెద్దన కాలము వఱకు సాగినది. పిమ్మట పెద్దన పెద్దవాఁడైనాఁడు. కృష్ణరాయల దర్బారు సాహితీరంగస్థల మైనది. ఎఱ్ఱాప్రెగ్గడచే

శంకుస్థాపనము చేయఁబడె. శ్రీనాథునిచేఁ బదికట్టములు సమకూర్పఁబడె, పెద్దనచే ప్రబంధ సౌధనిర్మాణము గావింపఁబడినది. తరువాతి వసుచరిత్రకారుఁడు సౌధాంతర్భాగములకన్న సౌధోపరిభాగముల నలంకరించినాఁడు. తరువాతి కవులందఱు ఆ సౌధములలోనే వర్తించిరిగాని, మించి యేమియుఁ జేయలేదనవలెను. ఇట్లు పదునెనిమిదవ శతాబ్దము వఱకు సాగినది. ప్రబంధములలోని వచనము, పైన నుడివినట్లుగాఁ బ్రబంధ పద్ధతులనే నడచినది. అల్లనుసారము లేనిచో సమతి (Balance) యుండనేరదు. పెద్దన పెట్టిన యొఱవడిన కథాకథనమందును, కథాసన్నివేశ కల్పనమందును, అంగాంగిరస నిర్వాహణములందును, విషయ విభజనమందును, తరువాతి కవులు చాలవఱ కనుకరించిరి; ఇట్టి రచనము గతానుగతికమై కవి సమయము (Poetic convention) వలెఁ బరిణమించినది. ఈ ప్రబంధములలో ద్వితీయాశ్వాసమునఁ (నించుమించు) దప్పక యొక దీర్ఘవచనము పొసఁగియున్నది. దీని వైశిష్ట్య మేమన: శబ్దాలంకారము తప్పక యుండుట; యమకము, అనుప్రాసములు వరలుచుండుట; ఇవి సమాసములతోడను వర్ణనా సందర్భములతోడను రచింపఁబడుట. ఉదాహరణములుగాఁ జూడుఁడు:

కోలాహల పర్వత వర్ణనము జేయుచు వసుచరిత్రకారుఁడు—'మఱియు నిక్కులాచల సంతానంబు, సంతాన కుసుమ వాసనా సమాగత సారంగసంగీత భంగీ తరంగంబు లుపాంగంబులుగాఁ బాడు వేల్పుగాణల పాణీరిత మాణిక్య

వీణా మధుర రావామృతంబులఁ గరఁగి, పెచ్చు పెరుగుచుఁ బ్రచ్ఛ బచ్చెలచాయలు మెచ్చులుసేయఁ బచ్చికల నచ్చికల విచ్చల విడిఁ గ్రుచ్చుకొని మోసవనుంకించు నంకవు రాజింక జంకించి......' వసుచరిత్రలో వేఁటను వర్ణించు సమయం బున పెద్దన పెద్ద వచన రచనమున కుద్యుక్తుఁడాయె. ఈవచ నము ననుప్రాసాలంకారములతో నున్నది.

ముక్కుతిమ్మన యొద్దికగా తన ముద్దుపలుకులతో గద్యమును దిద్ది పెద్దనామల కద్ది యనిపించె :

'అంధకార బలీంద్ర నిర్మథన ధురంధర సమయమధు మథన చరణాంగుష్ఠనిష్ఠ్యూత గగనసరిదంబు పూరంబుల కను బింబంబులై......' అను రచన ముదాహరణము చాలును.

పింగళి సూరన వ్యాఖ్యానశైలిలో రచనమును సల్పి నాఁడు. అతని కళాపూర్ణోదయ మిందలి కుదాహరణ మగును. ఇందలి వచనములలో ముఖ్యముగా పేర్కొనఁదగినది కథలోని కల్పనల యథావిష్కరణ సమయమందు విరచించిన వచనము. సరస్వతీ చతుర్ముఖుల విలాసమును విప్పి చెప్పినప్పుడు వచనమే యుపాదేయమని తలంచినాఁడు సూరన. ఇట్టిక్లిష్ట విషయము పద్యమందుకన్న వచనరచనము విపులముగా వివరింపనగును గదా !

ఇట ధూర్జటిని గూర్చియుఁ జెప్పవలసి యున్నది :

ధూర్జటి చాల స్వతంత్రుఁడు. కృష్ణరాయల కాల ములో నున్నను, అతని కంకితము చేయక కాళహస్తీశ్వరు నకే కైత సమర్పించిన ప్రత్యేకత గలవాఁడు. ఈతఁడు తన

కవిత్వమందును స్వాతంత్ర్యము వహించెను. ఇతఁడు తన వచనరచనములో యుద్ధమును వర్ణించుతఱి, వేఁటకు వెడలు స్త్రీ సంపర్కము లందును, సహజ ప్రతిభతో స్వభావోక్తి ప్రధానముగా రచించెను.

రామకృష్ణుఁడు తన పాండురంగ మాహాత్మ్యములో వచన రచన సన్నివేశములను వర్ణనోచిత పద్ధతుల కండ్లకుఁ గట్టినట్లు చేసెను. నిగమశర్మ యక్క వచ్చిన సందర్భమున నాయింట జరిగిన విశేషములను చక్కగా వచనంబునఁ బొందుపఱచినాఁడు. 'పాండురంగవిభుని పదగుంఫనము' ప్రతి ఘట్టమునఁ గన్పించును. ఈ పై సందర్భమున నూత్న వచనములో రామకృష్ణుఁడు నిగమశర్మ శరీరముయొక్క కర్కశత్వమును ఒకవిచిత్రబంధమునకుఁ బోల్చి తన హాస్యాధిక్యమును ప్రకటించెను. పాత్రచిత్రణమందు వచన మెంత దోహద భూతమో యుదాహరించినాఁడనవలెను.

ఆంధ్ర కవికులభోజుఁడైన శ్రీకృష్ణరాయలు రచించిన ఆముక్తమాల్యదలో ననేకవచనములు గన్పించును. కృష్ణ రాయలు వర్ణనలం దుత్తమోత్తమ రచయిత యని ప్రాజ్ఞుల తలంపు. ఆముక్తమాల్యదలో నీవిషయమున నుదాహరణ ములు మిక్కుటము. మతసంప్రదాయ సిద్ధాంతములను రాయలు చక్కగా నెఱిఁగియుండెను. వానిని తన గ్రంథమం దంతటను వెదజల్లినాఁడు. ఆముక్తమాల్యదలోని వచనరచనము జూచినచో తత్త్వవిషయికమైన బోధన మంతటిని వచనమే చక్కగా నిర్వహించినదని తేలును. ఇవ్విధముగాఁ బ్రబంధ

ములలో వర్ణనములకు, తత్త్వవిషయము లాదిగాఁగల శాస్త్ర విషయములకు వచనమే యుపాదేయముగాని పద్యము కాదని ఋజు వయినది.

ఇంక దక్షిణాంధ్ర వాఙ్మయములో వచనస్థాన స్వరూప ములను గమనింతము. వచనములోఁ గ్రంథగ్రాహ్యముగాఁ గావ్య సృష్టి యీ నాయకరాజ యుగమునందే జరిగినది. పద్య కావ్యముకన్న వచనకావ్య మెక్కువగా సులభగ్రాహ్య మని కవు లెఱింగిరి. అనేక ప్రక్రియాభేదము లీ యుగమం దుద్భ వించినవి. యక్షగాన మీనాఁటిదే. గీతికి (Lyric) ప్రాధా న్యము వచ్చిన దీ దినములందే. ఆనాఁటి కవులు గతానుగతి కముగా గాక, ప్రత్యేకమార్గమును ద్రొక్కి తమ ప్రతిభను నసమానముగా నందఁజేయవలెనని సంకల్పించిరి. తదనుగుణ ముగా సార్వభౌముల సాహితీపిపాస చేతులం గలపినది. కృష్ణ రాయలవలె రఘునాథరాయలుగూడ సాహితీద్రష్ట; స్రష్ట. నాయకరాజయుగమున వెలువడిన గ్రంథములలోఁ బ్రబంధము లున్నను నవి పిల్లవసుచరిత్రలవలె గతానుగతికములుగాక ప్రత్యేకస్థానమును బొందగల్గినవై చెలఁగుచున్నవి. వచనము లంత క్లిష్టములు గాక సుబోధ వచనరచనమునకు మార్గదర్శక ములై వ్యావహారిక భాషాప్రయోగములతోఁ బొసఁగు చున్నవి.

This prose is interesting contrast with the classical prose, and is full of colloquial idiom (of Taylor's Oriental Historical Manuscripts).

—*Prof. S. Kurugantī.*

వచనరచనమునకుఁ గడంగినవారిలో 'రాయవాచక' కర్తను,[1] పేరెన్నిచి బాలసరస్వతిని పేర్కొనక తప్పదు. బాలసరస్వతి 'వ్యాఖ్యాన' మను ప్రక్రియను తెలుఁగులో నవతరింపఁజేసినాఁడు. కసెపె పెదరాజు, సముఖము వేంకటకృష్ణప్పనాయకుఁడు ముఖ్యముగా వచనగ్రంథముల రచించిరి. కంకంటి పాపరాజు ప్రబంధసరళిలో రామాయణకావ్యవిరచనము సల్పినను, తనకాలము నాఁటి వచనశైలి యుత్తర గ్రంథములోఁ బ్రతిఫలింపకపోలేదు.

ఈ యుగమందు వెలసిన రచయితల రచనమందలి వచనములను గాంచెదను : కంకంటిపాపరాజు వ్రాసిన యుత్తర రామాయణములో వచనము స్వభావోక్తి ప్రధానముగను, వాస్తవిక చిత్రణముల కనుగుణముగను బొడము చున్నది. ఉదాహరణముగా. జానకీ శోకఘట్టమున జానకి లక్ష్మణునిచే రామాజ్ఞ నెఱిఁగి, యవశయై చేష్టుడియున్నతఱి నామె యవస్థను వచనములో నెట్లు చిత్రించెనో కానవగును:—

"...పడి చేష్టడి బడిబడిం బొరలుచు బడలికనొంది తెలివొందక తెంపుగడియలుండి కొండొక తెలిసి వెండియు నలసి యవశయై దీనదశం బొరసి, కృశాంగి మరలఁ గన్ను దొరలి విచ్చి, విచ్చలవిడి వెడలెడి యశ్రుధారా ప్రవాహంబులు చెక్కుటద్దములపై జాలువాఱ..., పురపురఁ బొక్కుచుఁ దాల్మిఁదూలి స్రుక్కుచు

1. రాయవాచకము మధుర సేనాపతిచే రచింపఁబడినది. ఇందలి భాష వ్యవహార సిద్ధమైనది: "రథోత్సవమునకు విజయంచేయవలెను; అది విన్నపం చేయంగ దగ్గరవున్న దళవాయకుఁబుం ఆతీరున్నే రాయలవారు విచ్చేసి వున్నారు." ఈ యుదాహరణము చాలును.

లేచి కూర్చుండి...వెక్కి వెక్కి యేడ్చుచు...తలయూచుచు దలయూచుట విడిచి, ముక్కుపై వ్రేలు గీలుకొలుపుచు... హాహాకారంబు సలుపుచు..."

ఇట్లే రంభను రావణుఁడు మానభంగ మొనర్చిన పిమ్మట నారంభయొక్క దుర్దశ వర్ణించినాఁడు వచనమందు:—

"బెబ్బులి వాతికిం జిక్కియుఁ జిక్కక మగిడిన హరిణి కరణి రాహుముఖ గహ్వరంబునం బడి బయలు వెడలిన చంద్ర కళ చందంబున... చెదరిన ముంగురులతోఁ, బెదరిన బెళుకు చూపులతోఁ బ్రిదిలిన నీవీబంధంబుతో వదలిన కేశపాశం బుతోఁ బగిలిన బింబాధరంబుతో నొగిలిన చెక్కుటద్దంబు లతో...వాడిన విరిసరులతో వీడిన భూషణంబులతో... ఆకారంబు దాల్చి వచ్చిన శోకరసాధిదేవతవలె" నున్నదని వర్ణించె. ఇట వర్ణితములైన యవస్థలను సూచించుటకు సంత రింపఁబడిన క్రియాపదంబులు రెండు రెండుగా ననుప్రాసాలంకార సహితములుగా నుండి నడకలో బిగువును జాటుచున్నవి.

సముఖము వేంకట కృష్ణప్పనాయకుఁడు తెనుగు వచన స్వరూపము తిన్నగాఁ దెలుపుటకై సారంగధర చరిత్ర, జైమినీభారతము లను వచనకావ్యముల రచించెను. ఈతని వచనరచనము సులలితపద సమన్వితమై క్లిష్టాన్వయములు లేక 'కులుకు కోకిల నణంచు గళరవంబు, పలుకుల సొంపు' గలిగి తెనుఁగు తీయదనమును దేటదనమును, దీర్చిదిద్ది నట్లుండును. సంభాషణావిధానమును జిత్రించుటలోనైత మీ వచనము నిరాడంబరముగా సరసముగా నుండును.

"జననీ! తక్కినవారికిం బలె యింత యుపచారంబేమి టికి? ఏను నీకుమారుండను గానే యనుటయు నా పువ్వుబోడి, బొమ్మంచు కెమ్మోవి చిగురుం జిగురుగవు మొలకలు గులుక, కప్పురంపు పేడియంపు తావి ఘుమ్మమన, తేనియ చినుకు లొలుక నిట్లు పలికె : ఓ జగన్మోహనాంగ! నా కుమారుండ వగుదువు; నిక్కంబు పలికితివి. నీదు సుగుణత్వంబును, నీ పక్కదనంబు నీ సౌందర్యంబు నిచ్చలులు నిచ్చలు పలుక విని వీనులకు విందులయ్యె. ఇప్పుడు కనుంగొనుటచేఁ గన్నులకుం బండువయ్యె..."

కంకంటి పాపరాజు రచించిన వచనభారతము, మఱి కర్త లెవరో తెలియని వచనములు, 'భారత చిత్రకథలు', 'భేతాళ పంచవింశతి' మొదలైన అనేకము లున్నవి. విజయరంగ చొక్కనాథుఁడు 'మాఘమాహాత్మ్యము', 'శ్రీరంగమాహా త్మ్యము' లను వచనకావ్యములు రచించెను. రామాయణ భాగవతములును వచనములోని కవతరింపఁబడినవి. శ్యామ రాయకవి వచన రామాయణమును, పుష్పగిరి తిమ్మన వచన భాగవతమును గూర్చిరి.

ఈ విధముగా వచనరచనము విరివిగాఁ బదునేడు పదు నెనిమిది శతాబ్దులలో జరిగినది. వ్యావహారిక భాషా ప్రాధా న్యము చాల గ్రంథములలో నున్నట్లు తెలియఁగలము. నాఁటి యక్షగానములలోని వచనముగూడ వ్యావహారికమే. వచన గ్రంథములకు ముఖ్యముగా సుబోధకత్వమే ప్రోత్సాహమిచ్చి నది. ప్రజల కందుబాటులో సాహిత్యము నుంచుటకుగాను

దక్షిణాంధ్ర వాఙ్మయము పుట్టినట్లు ద్యోతిలును. భారతభాగ వత రామాయణములను వచనముగ నందుంచుట, యక్ష గానముద్వారా ప్రజాభిరుచిని చూఱగొనుటలు తార్కాణ ములుగదా!

పూర్వోక్త ప్రకార మాంధ్ర భాష మీఁద నాంగ్ల భాషా ప్రాబల్యము పందొమ్మిదవ శతాబ్ది మధ్యకాలమునకు బాగుగా వచ్చినది. *ఆంగ్ల వచన రచన మాంధ్రుల ననేకుల ముగ్ధులఁ జేసినది. అట్టి వాఙ్మయ మాంధ్ర భాషలో నిర్మింప కుతూహలము సాహితీ సేవకులకు జనించినది. ఇట్టి స్థితిలో చిన్నయసూరి సర్వాతిశాయియైన గుణము కలిగించి వచన రచనము చేసినాఁడు. ఆంగ్ల పాఠశాలలలోఁ దెలుఁగు చదివెడి విద్యార్థుల కుపయుక్తములగు సులభ వచనములను రాయ దుర్గము వేంకటసరసయ్య ప్రారంభించెను. చిన్నయసూరి దృష్టియు నట్టిదే. కాని సూరి యాశ్రితము దొడ్డది! అలంకా రికమైన వన్నెచిన్నెల నాపాదించి, శైలీ సంపద ఘటించి, విరచించుటంజేసి 'నీతిచంద్రిక' పిన్నలకేగాక పెద్దలకు నాద రణీయమైన గ్రంథ మాయెను. వచన రచనములో 'నీతి చంద్రిక' మకుటాయమానమైనది. ఆంగ్ల వచన రచనము ననుసరించి, వాక్య విరామాదులను పాటించి రచించిన ప్రథ మాంధ్ర వచన రచయిత చిన్నయసూరి. సంస్కృతాంధ్ర ములను సొగసుగాఁ బొందింపఁగల శక్తిమంతుఁడు సూరి;

* 'వర్తమానాంధ్ర వచన రచన' మను వ్యాసము 'శారదా విలాస' మను నా గ్రంథమునఁ జూడ నగును.

భావముగాని, భాషగాని శబ్దప్రయోగపటిమయే గంభీరముగ సరి తూఁగఁగల ప్రతిభాశాలి. నన్నయభట్టు పద్య రచనమం దెట్టి దిట్టయో, వచన రచనమందు సూరి యంతటి దిట్ట!

చిన్నయసూరి ప్రారంభించిన గ్రంథమును పూర్తిచేయు తలంపుతో వీరేశలింగము పంతులు కొక్కొండ వెంకటరత్నం పంతులు ప్రయత్నించిరి. వెంకటరత్నము పంతులు వచనము చెఱకు పాకమునఁ బడినది. వీరేశలింగము పంతులు చిన్నయ సూరి వలెనే వ్రాయుటకై యత్నించి చాలవఱకు నాతని మరిపించఁగలిగెను; కాని యది వీరేశలింగముపంతులు సహజశైలి కాదని, యాతని యితర వచనమును జూచినచో బోధపడఁగలదు. వచనమును సర్వజనభోగ్యమైన వస్తువుగాఁ జేసి కేవల మాధునిక మగు వచనమునకు కందుకూరి మార్గదర్శియయ్యెను. కావున నాధునిక వచనమునకు మూలపురుషుఁడు వీరేశలింగము పంతులే యనవలెను. ఆంగ్ల ప్రభావము పూర్తిగాఁ బ్రతిఫలించిన దాతని రచనమంతటను; ఆంధ్రమున 'కథానిక'ను దప్ప మిగిలిన వచన మార్గముల ననుసరించినవాఁడు పంతులే. నవల, విమర్శనము, చరిత్ర, ప్రహసనము, వ్యాసము, ఉపన్యాసము మొదలైన వచన ప్రక్రియాభేదముల నన్నింటి నవతరింపఁ జేసిన గురువు వీరేశలింగము పంతులు. వీరి గ్రంథములన్నియుఁ గావ్యములు గాక, విజ్ఞానోపలబ్ధి కక్కఱకు వచ్చునవిగా నున్నవి. స్వీయచరిత్ర వీరేశలింగము పంతులు వారితోడనే యాంధ్రమున నవతరించినది. పూర్వమున్న యాలంకారిక, శాబ్దిక విమర్శనమును మాని, గ్రంథములపై నాధునికవిమర్శ

నలు సల్పిన యాదిగురువు పంతులుగారే! నవలా వాఙ్మయమునకు శ్రీకారము చుట్టిన మహానుభావులుకూడ వారే! విమర్శనమందు కందుకూరితో పాటు గురజాడ శ్రీరామమూర్తి పంతులు కూడ నెన్నఁదగినవాఁడు. వీరేశలింగము పంతుల కున్న నిష్పాక్షికాభిప్రాయము, నిశిత పరిశీలనా దృష్టి శ్రీరామమూర్తిగారి కున్నట్లు తోఁచదు; కాని కవుల చరిత్ర వ్రాసిన వారిలో నగ్రగణ్యుఁడు శ్రీరామమూర్తిగారన్న విషయము మఱువరానిది.

ఇట్టి విధముగా నూతన మార్గమున వచనము వీరేశలింగము పంతులవారి ముంజేతి ఘంటకటక మన నాధునికయుగమున వర్తిలినది. ఆధునిక యుగమునందలి వచనస్వరూపము నెఱుఁగుటకు ముఖ్యముగా విషయ విభజన (Analysis) మవసరమని తోఁచును. వచనములో వచ్చిన వివిధశాఖల క్రింద వివిధ రచయితల కృషిని, తత్స్వరూపము నెన్నుట యుచితము గదా!

వచనము బహు విషయముల కాలవాలమైనది. నవల, కథ, ఉపన్యాసము, విమర్శనము, చరిత్ర, శాస్త్రము, వ్యాసము— యివి వచనముయొక్క ముఖములు. వీని నాదరించి రచన సల్పిన వారి నెఱుంగుదము :

ఆనాఁడు వీరేశలింగము పంతులు పెట్టిన భిక్ష నేఁటికిని నవల విషయమునఁ బోసఁగుచునేయున్నది. కాని రచనములో, స్వరూపములో, కథాసన్నివేశ కల్పనములో మార్పులగుపించుచున్నవి. 'నవల' అను పదముమాత్ర మట్లేయున్నది.

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు నవల రచయితలలోఁ బ్రథమగణ్యులు.[1] వీరి రచనము హృద్యమైనది. వీరేశలింగము గారి రచనములోని సారళ్యముతో పాటు వీరి రచనమున సౌకుమార్య మబ్బినది. వీరి హాస్యముకూడఁ గమ్మమేలైనదే. "రామచంద్ర విజయము, గణపతి, సౌందర్యతిలక, శాపము, సుధాశరచ్చంద్రములు" వీరి గొప్ప నవలలు. చారిత్రక నవలా కర్తలలో చిలకమర్తివా రద్వితీయులేమో యనునట్లు 'హేమలత,' 'రాజస్థాన కథావళి' వెలుఁగుచుండును.

నవల రచయితల సంఖ్య బాలుగాఁ నాంధ్రమునఁ బెరిగిపోయినది. ఇట్లు తండోపతండములుగా వచ్చుచున్న వీనిలో నన్నింటి చెప్పి తెన్నుట కర్తవ్యముగాదు. ఈ రచయితలంబఱు వచనరచనమునకుఁ దోషకారులయే చెప్పవలయును. కొందఱు భాష చాల పటిలముగాఁ జేసి ప్రయోగించిరి; కొందఱు గ్రామ్యవాక్యములోఁ బింకముగా రచించిరి. వేంకట పార్వతీశ కవులు పేరెన్నికగన్న నవలా రచయితలు. వీరి 'ప్రమదావనము' చక్కని యాంధ్రనవల. వేంకట పార్వతీశ కవులు నవలకొఱకు విశిష్టమైన వచనము రచన నాపాదించి, పండిత పామర హృద్యముగా రచనము సాగించిరి. ఈమధ్యవచ్చిన నవలాకారులలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. శ్రీ అడవి బాపిరాజు, శ్రీ నోరి నరసింహశాస్త్రి మున్నగువారు సుబోధమైన

1 "కవుల ప్రతిభకు నికషాయమానమగు గద్యప్రబంధ రచనమున వన్నెకెక్కిన యల్పసంఖ్యాకులగు నాంధ్రకవులలో గణనీయు లం..."
—ఆంధ్ర విశ్వవిద్యాలయ "కళాప్రపూర్ణ" పట్టప్రదానోత్సవ ప్రసంగము.

శైలిని సాధింపఁజూచిరి.

నవలా రచనములో వచనము చాలకాలము వఱకు, అనఁగా గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషావాదము నుద్ఘాటించక పూర్వము, గ్రాంథికములోనే భాసిల్లినది. గ్రాంథిక వచనమును వశము జేసికొనినవా రరుదు. కృత్రిమ భాష గాక, వ్యాకరణ సాధ్యములౌ పదములను, కారకములను ప్రయోగించునట్టి భాషకాక, వ్యవహారమునకు సమీపముగా నుండి భాష ప్రయోగించిన నది చాల హృద్యముగా నుండును. వ్యావహారికము పేర వ్రాయఁబడుచున్న నేటి గ్రంథములలోఁ గాని, భాషించు నుపన్యాసములలోఁ గాని యున్న భాష సామాన్య జనుల కెంతవఱకు సుబోధకముగా నున్నదో ప్రాజ్ఞులు, ద్రష్టలు తెలియఁగలరు. అది మాండలిక భేదములతో మూర్తీభవించినపట్లు దురవబోధ మగునన్నట్లును దెలిసిన విషయమే గదా! క్రియా పదములను మాత్రము త్రుంచి, సమాసభూయిష్ఠరచనము సల్పుచున్న వారున్నారు.* ఇట్లుగాక సామాన్యమానవున కర్థమగు లలిత శైలితో గ్రాంథికము నారాధించినవారు కందుకూరివారని చెప్పవలెను. ఇయ్యది

* శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారి వచన రచనము తొలుత చాలక్లిష్టమై వచన ప్రయోజనమునకు సుదూరమై వర్తిలెను.

శ్రీ జమ్మలమడక మాధవరాయ శర్మగారి వచనరచన మిందుల కుదాహరణమై 'పింతశైలి' కలిగినదగును. «కుంతకాభినవాదుల నిత్యమననము వలన వాక్పాక యలవడినదని వీరే వ్రాసికొనిరి.... ఇది ఒక క్రొత్త శైలి».

— శ్రీ వేలూరి శివరామశాస్త్రి.

వారి రచనములోఁ జూపెనగును. ఈ రచనము నవలోకించిన సామాన్యులైనను సుబోధకముగా రచించుటకు వ్యావహారికమే యుక్తకరమనియు, గ్రాంథిక వచనములోఁగూడ పండిత పామర హృద్యముగా రచనము సల్పవీలున్నదనియుఁ దెలియఁగలదు. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి 'మాలపల్లి' లోని వచనము వ్యావహారికమై సుబోధకమై యొప్పుచున్నది. దీనినే తేటతెనుఁ గందుము. మాండలికములను గూర్చి Ernest Hornwitz—

"Bocks written in a dialect are slow to travel beyond the pale of the province where it is spoken but, a classical tongue like Sanskrit spreads quickly over wide geographical area."

అని వచించినాఁడు.

అయినను, నీ మాండలిక శబ్దములకు గతి కల్పించు టకొకకర్త వచ్చినఁగాని దీనివలన వచ్చు క్లేశ ముపశమింపదు.

ఇఁక నుపన్యాస రచనమునందు, పానుగంటి లక్ష్మీనరసింహాము పంతులుగారినిఁ బేర్కొనవలెను. వారి 'సాక్షి' సంపుటములలోఁగానవగు వచనస్వరూప మనన్యసాధారణము. ధారాశుద్ధి, విషయవివేచనము, ఉపన్యాసపద్ధతి, వచనరచనము లప్రతిమానములు. అందఱకును సుబోధకముగా నున్న రచన మిది; 'ఆంధ్ర ఎడిసన్' అనిపించుకొనిన సమర్థుఁడీయన.

విమర్శనములో వచన రచనమే యుపాదేయమైనది. కాని కొందఱు—శ్రీవఝు సూర్యనారాయణశాస్త్రి, శ్రీఅనంత

పంతుల రామలింగస్వామి మున్నగువారు — విమర్శకూడ పద్యములలో రచించిరి. వచనరచనము సల్పిన విమర్శకులను చారిత్రక విమర్శకులనియు, సాహిత్య విమర్శకులనియు విభజింపవలెను. సాహిత్య విమర్శకులలో — పూండ్ల రామకృష్ణయ్య, కట్టమంచి రామలింగారెడ్డి, కురుగంటి సీతారామయ్య, ముట్నూరి కృష్ణరావు, కాశీభట్ట సోదరులు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, పురాణం సూరిశాస్త్రి, శే. వెం. రాఘవయ్యంగారు మున్నగువారెందరో యున్నారు. వీ రందఱిలో ముట్నూరి కృష్ణరావుగా రనన్య సామాన్యులు, వారి 'సమీక్ష' యిందులకు నిదర్శనము. నిర్దుష్టమైన, యుదాత్తమైన వచన రచన స్వరూపమును వస్తువున కనుగుణముగా రచించి చూపిన మేధావి కృష్ణరావుగారు. వీరు 'కీట్స్' మొదలగు రచయితలతో నించుమించు చేతులు కలిపినా రనవలెను.*

మన పురాణ గ్రంథములను వచనములోనికి దింపి, సర్వోపభోగ్యములు గావించిన నోరి గురులింగశాస్త్రి, నాగపూడి కుప్పుస్వామయ్య, పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారలు మున్నగువారు స్మరణీయులు. అనేక పండితులు గ్రంథ పీఠికారూపమున విమర్శనల సల్పుచు వచ్చిరి. ఈ వచనరచనము క్లిష్టము గాదు; మేడేపల్లి వెంకటరమణాచార్యులు, దేవ

* ఆర్యధర్మ ప్రబోధము సల్పుటలో వారి శక్తి యప్రతిమానము; ఇందులకు వారు వ్రాసిన «లోవెలుగులు» సాక్ష్యమీయ సమర్థములు. తెలుగు వచన శైలులలో రాళ్ళపల్లివారి శైలి నిశితము, విశిష్టము నైనది.

రాజసుధి, జయంతి రామయ్యపంతులు, వేటూరి ప్రభాకర శాస్త్రి, శివశంకర శాస్త్రిగారలు మున్నగువార లనేక పీఠికలు రచించి వచనోపాసకులైరి.

చారిత్రకులలో శ్రీయుతులు కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణ రావు, కాశీనాథుని నాగేశ్వరరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, మారేమండ రామారావు, భావరాజు కృష్ణరావు, కుసుగంటి సీతారామయ్య, వల్లాది సూర్యనారాయణశాస్త్రి, చింగలి లక్ష్మీకాంతం, దువ్వూరి, భోగరాజు నారాయణ మూర్తి. శేషయ్య, అప్పాతరావు, వల్లూరి సూర్యనారాయణ రావు, దిగవల్లి శివరావు, మానికొండ సత్యనారాయణశాస్త్రి, కవిత్వవేది, వంగూరి సుబ్బారావు, చిలుకూరి నారాయణ రావు, కోరాడ రామకృష్ణయ్య, కోన వెంకట రాయశర్మ, చాగంటి శేషయ్య, గంటి జోగిసోమయాజులు, నిడుదవోలు వేంకటరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఖండవల్లి లక్ష్మీరంజనం, శిష్ట్లా రామకృష్ణశాస్త్రి. పిల్లలమర్రి, భూపతి లక్ష్మీనారా యణరావు, వేదం వేంకటకృష్ణశర్మ, కొడాలి లక్ష్మీనారా యణ, దివాకర్ల వేంకటావధాని మున్నగువారున్నారు. వీరిలో కొందఱు సాహిత్యచరిత్రకు, కొందఱు భాషాచరిత్రకు, * కొందఱు రాజకీయచరిత్రకుం గడంగి, సేవచేయువా రున్నారు. కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు చిరస్మరణీయులు; వీరు వచనో

* ఆచార్య గంటివారి శిష్యుండు, నా శిష్యమిత్రుండు శ్రీ భద్రిరాజు కృష్ణ మూర్తి యమెరికాలో శాస్త్రవిహిత విధానమున భాషాపరిశోధన మొన రించి యటీవల 'డాక్టరేటు' పొందినాండు.

ధనా పద్ధతికి దారితీసిరి. శాస్త్రరచయితలలో శ్రీయుతులు సి. ఆర్. రెడ్డి, ఆత్మకూరి గోవిందాచార్యులు, గుళ్ళపల్లి నారాయణమూర్తి, కాశీపట్నం కొండయ్య, వఝ్ఝలవారు, బులుసు అప్పన్న శాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, తిరు వేంగళాచార్యులు, మాధవరామశర్మ, వసంతరావు వేంకటరావు, సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి, నల్లాన చక్రవర్తుల వేంకటనారాయణాచార్యులు, విస్సా అప్పారావు, వేమవరపు భానుమూర్తి, పోణంగి శ్రీరామ అప్పారావు గారలు మున్నగువారల్పసంఖ్యాకు లున్నారు.

వీరిలోఁ గొంద ఱాలంకారికశాస్త్రమున, గొందఱు తార్కిక శాస్త్రమున, గొందఱు విజ్ఞానశాస్త్రమునఁ గొందఱు సంగీత శాస్త్రమునఁ బరిశ్రమ గావించినారు. వ్యాఖ్యాత లనేకులు వచనము నారాధించుచున్నారు.

ఇఁక వ్యాస రచనము : పత్రికాముఖముగా వెలువడు వ్యాసములన్నియు వ్యాసములు కావని మనవి. వ్యాసమనఁగా కేవల విషయ ప్రాధాన్యము కలది కాదు. ఏ చిన్నవిషయము నైనను రచయిత తన భావాధిక్యముచేఁ గేంద్రీకరించి, విస్తరించి, యంగాంగీభావ నిర్వహణము చేసి, యుదాత్తమైన శైలీ సంపదతో విరచన చేసి దాని కావ్యత్వ మాపాదింపవలెను. పద్యమువలె వ్యాసమునకుఁగూడ రసమే ప్రధానము. ఈ కారణముననే యాంగ్లసాహిత్యమున వ్యాసకర్తల రచనములను విమర్శకులు కావ్యములలోఁ జేర్చిరి. ఇట్టి వ్యాస మను ప్రక్రియ లేని లోపమును మన యాంధ్రభాషా సేవకు లిపు

[illegible] పోషించుచున్నారనవలె.

వ్యాస సంపుటము లనేకము మా మధ్య ప్రకటితములై వచ్చుచున్నట్లు గమనించెదము. వేటూరి ప్రభాకరశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్య, పిల్లలమఱ్ఱి వేంకటహనుమంతరావు, శిష్ట్లా రామకృష్ణశాస్త్రి, దేవులపల్లి రామానుజరావు, జి. వి. కృష్ణారావు, వావిలాల సోమయాజులు, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, బులుసు వేంకటేశ్వర్లు, బూర్గుల రామకృష్ణరావు, పింగళి లక్ష్మీకాంతం, చిలుకూరి పాపయ్యశాస్త్రి, కేశవపంతుల నరసింహశాస్త్రిగారలు మొదలైనవారి కృషి మెన్నదగినది.

నేఁటి 'కథానిక' నూతనముగానే వచ్చినదని పలువురభిప్రాయము; కాని ప్రాచ్యమిడి వర్తిలికథల మథించినవారు తెలియఁగలరు. మన ఆంధ్ర గృహములలో ముసలివారు చెప్పుపద్ధతియు, వచనమాధుర్యము లప్రతిమానములు. ఆసంప్రదాయమును విస్మరింపరాదు. 'కథానిక' నేఁటి సారస్వతమున ముఖ్యస్థానమాక్రమించి వచన రచయితల ననేకులఁ బ్రేరేపించుచున్నది. చింతా దీక్షితులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, భమిడిపాటి కామేశ్వరరావు, మునిమాణిక్యం నరసింహారావు, కొడవగంటి కుటుంబరావు, గోపీచంద్, "బుచ్చిబాబు," "అమరేంద్ర" గారలు మున్నగువారు ప్రసిద్ధులలోఁ గొందఱు. కథాకథన పద్ధతికి వచన మెంతవఱకుపాదేయమో వీరు నిరూపించి రనవలెను. ఇటీవల వచన నాటికలు బయలువెడలుచు, వచన రచనమునకు దోహదభూతము లగుచున్నవి.

పత్రికలు వచనము నుపాసించు నిలయములు. (Journalism) జర్నలిజము ఇతర ప్రాంతములలో గొప్ప విషయము. అది ప్రత్యేక శాస్త్రము. అట్టిది తెలుగులో బాగుగా నిటీవల వఱకు బ్రవేశింపలేదని తెలియఁగలము.

నేఁ డాంధ్రమున శాస్త్ర వాఙ్మయము వచనములోఁ దారసిలవలెనని యత్నములు జరుగుచుండుట ముదావహము. అన్నిట వ్యావహారిక భాషా రచన ముపాదేయ మగుచున్నది!

ఆంధ్ర వచన వాఙ్మయము నొక్కమారు సింహావలోకనము చేసినచో నైదు విధములైన విభజనము బొడగట్టును:

1. పద్యముతో వేఱుపఱుపరాని పురాణవచనము,
2. ప్రబంధమం దాలంకారిక శైలీవిన్యాసముతో వర్ధిలిన వచనము,
3. చిన్నయసూరి, కొక్కొండ వెంకటరత్నం పంతులు గారల జటిల గ్రాంథిక భాషా వచనరచనము,
4. వీరేశలింగము పంతులుగారి సుబోధము, సులలితము నగు వచన రచనము.
5. ప్రజానీకమున కందుబాటులో నుండునట్లు రచింపఁబడుచున్న వ్యావహారిక భాషా వచనము.

ఇవ్విధముగా నాంధ్ర వచన స్వరూపము గోచరించు చున్నది.

కావ్యము వ్రాసి కవి యనిపించుకొనుట కెట్టి యాదర మున్నదో వచనరచనము చేసియు నట్టి యాదరమునే పొందవగునని సాహితీపరులకు నా వచనవి. ఆంధ్రుల విజ్ఞానము,

సంస్కృతి, శాస్త్రములు సులభబోధకములుగా వచనరూపమున వెలువడుటకుఁ బండితులు, ప్రతిభావంతులు, పరిషత్తులు, విశ్వవిద్యాలయములు వారును పాటుబడి యాంధ్రవచనాభివృద్ధికిఁ దోడ్పడుదురు గావుత!

[డిసెంబరు 1943 లో* "హైదరాబాదాంధ్రసాహిత్య పరిషత్ప్రథమ వార్షికసభ"లో నేను చదివిన వ్యాసము; "హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్సంచిక" లోఁ బ్రకటితము.]

* 'ఆంధ్రవచన వాఙ్మయము' పై నాంధ్రి గ్రంథమాలలో శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు వ్రాసిన గ్రంథము 1954 లో వెలువడినది. ఏతద్గ్రంథ పీఠికలో నా యీ వ్యాసము ఉల్లేఖింపఁబడుట ముదావహము.

౯

అభినవ కవిత

మానవుఁడు లౌకికానందమును బొందుటకై నిత్యనవీన మార్గముల నన్వేషించుచుండును. దీనికిం దార్కాణముగా నాతని వేషభాషలలోని మార్పు గన్పించును. అట్లే సాహిత్యమందుఁగూడ నూత్నమార్గముల నాయా కవులు కాలానుగుణముగ సృజించుకొందురు. మతములోఁగూడ ననేక భేదములు ప్రతీయమానము లగుచున్నవి. సంఘసంస్కారి వచ్చి యెప్పటికప్పుడు సంఘమును పరిష్కృతుచేయుచుండును. మార్పన్నిట సహజగుణము. కాని ప్రాథమిక సూత్రముల కే విధమైన క్షతియుండకుండు నంతవఱకా మార్పు సమ్మతమగుచుండును.

నేఁడు నిత్యవ్యవహారములో 'రొమాంటిసిజమ్' అను బదము విరివిగా నుపయుక్తమగుచున్నది. సామాన్య మానవ ధర్మములకును, బ్రకృతికిని, సభ్యతకును దూరముగానుండి, యప్పటికి నస్వాభావికముగా, నసభ్యముగా, విప్లవకారకముగా సంచరించు పద్ధతిని 'రొమాంటిసిజమ్' అనుచున్నారు. సంఘములోను, సాహిత్యములో నిది యన్వయించుచున్నది. ఇట్టి పద్ధతి కాలగతిలో సహజముగా సిమిడియుండును. ప్రతి సమాజములోఁ బ్రతి సాహిత్యములో నీవిధమైన 'భావచేతన'♦ మగుపించుచునే యుండును. కాలము జడముగాదు; అది ప్రవాహమువలె చేతనమునకు లోనైనది. కాలవాహిని కెదురీదఁ

♦రొమాంటిసిజమునకు నేను వాడిన మాట.

జూచుట యవివేకము. మానవుఁ డెప్పటికప్పుడు నూతనవికాసములఁ గ్రహించుచుండవలెనే కాని మడికట్టుకొని కూరుచుండరాదు. నూతన 'భావచేతనము' సాహిత్యసమాజములలోఁ గల్గుచుండుట జాతియొక్క ప్రతిభను వెల్లడించును. ఈనాఁటి భావచేతన మఱునాటికిఁ బ్రాతవడి ప్రాచీనమగును. తత్కాలమునకు 'భావచేతనము' విప్లవభ్రాంతి చేకూర్చి కొంత యలజడి కల్గించినను, అది పరిపాటయిపోయి మానవ మనసులలో స్థిరపడిన పిమ్మట బాధలేదు. ఎంతటి 'భావచేతనమై'నను ప్రధాన మానవసూత్రముల నతిక్రమింపరాదు. అట్లతిక్రమించినచో నది జాతిలో నిలిచిపోలేదు.

మన సాహిత్యము నవలోకించినచో నెన్నెన్నియో యుద్యమములు వచ్చినట్లు తెలియుదుము. మొదట పురాణాది సంస్కృతగ్రంథముల ననుసరించుటతోఁ బ్రారంభమైనది. దాని ననువాదోద్యమ మననగును. తరువాత స్వకపోలకల్పనముల కాలవాలమైన రచనము సాగినది. దానిని కల్పనోద్యమ మనఁ జెల్లును. అటుపిమ్మట నభినవ కవిత♦ వచ్చినది. దీనినే భావోద్యమ మనవచ్చును. ఇది యాంగ్ల సాహిత్య సంసర్గము వలన వచ్చినట్లు స్పష్టము. ఆంగ్ల సాహిత్యములో నైతే నిది సంక్రమించుటకు దానిపై మఱియొక సాహిత్య ప్రభావము కారణము. ఇట్లున్న దీని మూలసూత్రములను, వికాసమును బరిశీలింతము :

♦ మనవారు 'రొమాంటిక్ పొయిట్రీ'ని— 'అభినవకవిత', 'భావకవిత' యనియుఁ బిమ్మట 'నవ్యకవిత' యనియు వ్యవహరించినారు.

కవిత్వము మానవజీవిత వాహినితోఁ బయనించునది. అది సచేతనము; నిత్యనవీనము; కవిత్వము జీవితమునకు ఛాయ వంటిదను నిర్వచన మందువలననే పొసఁగినది. మానవజీవిత మనేక కవులచేతులలో వివిధ వ్యాఖ్యానముల నంది వినూత్న పరిణామముల నందుచుండును. ఈ జీవితము క్షణికమైనను కవి తన శక్తిచే దానిని శాశ్వతముగా కావ్యభిత్తికపైఁ జిత్రించును. నశ్వరజీవితమునకు సజీవమైన ప్రతిమాస్థితి నొసఁగుటయే కళాధర్మము. ఈ విధముగాఁ జిత్రితములైన ప్రతిమ లన్నియు భిన్న ప్రకృతులు కలవిగాఁ బరిణమించుచుండుట సత్యము; కొన్ని క్రమ పరిణామమునకు దారితీయునవిగా నుండును; కొన్ని వేనితోడను సంబంధము లేక ప్రత్యేక వైలక్షణ్యము కలవిగా వర్తిలును. మఱికొన్ని వికృతరూపము లను బొంది, లోక విరుద్ధములుగా నుండును. పై వానిలోఁ గ్రమపరిణామము గల్గిన రచనములు కవితాలోకమున నెట్టి కల్లోలము గల్గింపక ప్రకాశించునవి. విశిష్టమైన వికృతి మూర్తుల ప్రకటించువారు విప్లవకారులై పృథక్త్వము కల్గి యుందురు. ఏకకాలావచ్ఛేదకములుగా నీ రెండు ప్రకృతులు సాహిత్యములో భాసించుచునే యుండును. మొదటిది స్థిరము; రెండవది చేతనము.[1] "భావనచేతన"మే మొదట ప్రభవించునది. అది క్రమముగా సమగ్ర స్వరూపమును బొంది, యొక స్థాయిఁగొని, సిద్ధమగును. ప్రతి యుద్యమ మీ విధముగనే వర్ధిలును. ఇది సాహిత్యధర్మము.

1 'మార్గ-దేశి' యని నాట్య సంగీతశాస్త్రములందలి విభాగమును మనవారు గ్రహించినారు. ఇదియు నట్టిదే.

ప్రతి భాషాసాహిత్యములో నీ ప్రవృత్తి వెలయుచునే వచ్చినది. జర్మనీదేశమందు 'కాంటు' అను తత్త్వజ్ఞుఁడు లోకతత్త్వమును విచారించి మనకు బాహిరముగాఁ గన్పించు వస్తువులలో నొక యతివస్తువు దాగియున్నదని చెప్పినాఁడు. తరువాత 'ఫిక్టె' యను మఱియొక వేత్త యా యతివస్తువును 'అహం' అనుపదార్థ మనినాఁడు. ఎవ రే సిద్ధాంత మొనర్చినను 'మానవత్వము' నశింపఁజేయరా దని 'షెల్లింగు' ప్రవచించినాఁడు. 'నొవాలి' యనువాఁడు రోమాంటిక్ కవులలో ముఖ్యుఁడై ప్రేమగాథల ననంఖ్యాకములుగాఁ జిత్రించి తనివి దీరక లోకోత్తర సౌందర్యమునకై యఱ్ఱు జాచినాఁడు. తుదకీ లోకమందు వాస్తవమైన సౌందర్యమే పొడగట్టునని విసువు జెందినాఁడు.[1] ఈ విధముగా జర్మనీ సాహిత్యములో "భావచేతన" ముద్భవించినది.

రూసో ఫ్రాన్సు దేశములో సాంఘిక రాజకీయవేత్త యగు మనీషి. ఇతఁడు స్వాతంత్ర్యోద్యమమును ప్రబోధించినాఁడు ఈతని ప్రభావమే జర్మనీ స్వాతంత్ర్య గీతముల కున్నట్లు కన్పించును. రూసో సాహిత్యవిప్లవమును దెచ్చిపెట్టినాఁడు. పూర్వ సాహిత్య సూత్రముల మీఁద సంపూర్ణముగాఁ దిరస్కార భావము రేకెత్తించినాఁడు; నిర్మానుష్యమైన ప్రకృతి నారాధించినాఁడు; కావున మానవులపై జుగుప్స యభివృద్ధి జెందినట్లు స్పష్టమగుచున్నది. రూసో వలననే సాహిత్య

1. The driving force is romantic, the goal is classic : the result is or aims to be classic, the creative art is romantic. —*Encyclcpaedia of Social Sciences.*

ములో, మతములో ధర్మచ్యుతి కలిగినది. ఈ భావోద్యమ మునకు బాగుగా దోహదమిచ్చినవాఁడు రూసో యనవలెను. ఇతఁడే "భావచేతనము"నకుఁ బ్రవక్త; ఆదినములలో రూసోను విప్లవ కారునిగాఁ బరిగణించినా రనిన నాశ్చర్యముగాదు.

క్రమముగా నింగ్లాండు దేశమున కీ గాలి సోకినది. ఆ సాహిత్యములో స్పష్టముగా నీ మార్గానుయాయు లనేకులు కన్పించుచున్నారు. కీట్సు, బైరన్, షెల్లీలలో నీ "భావచేతనము" మూర్తీభవించినది.[1] వీరు ప్రణయకవిత్వమును వ్రాసినారు. అసభ్యశృంగారము సైతము వర్ణించినారు. బైరన్ నియమోల్లంఘన మొనర్చుటలో దిట్ట; అతని కవిత్వమే దీనికి సాక్ష్యము. సంఘములో విశృంఖల విహార మొనర్చి స్వతంత్ర జీవితమును గడపి గర్వించినాఁడు. కాలిరిడ్జి, వర్డ్సువర్తులుకూడ వీరిలోఁ బరిగణింపఁదగినవారు. తరువాత వచ్చినవారిలో స్విన్బర్ను పై వారి యంశలన్నియు గ్రహించి కవితా వ్యాపారము సాగించినాఁడు.

ఈ విధముగానే భావోద్యమము ప్రతి దేశవాఙ్మయములో నుదయించినది. ప్రాచీన ధర్మముల నుల్లంఘించుట, ఛందోవ్యాకరణ నియమముల నతిక్రమించుట, స్వేచ్ఛా కాంక్ష, ప్రణయోపాసనము, ప్రకృతిపరిశీలనము, అహం

1 The romantic poets look into themselves, seeking in their own lives for strange sensations...

In the poetry of all of them, there is a sense of wonder, of life seen with new sensibilities and fresh vision.

— *B. Ifor Evans.*

[illegible] మానవత్వ చిత్రణము, పతితోద్ధరణము, ఆత్మభావ వ్యక్తీకరణము లనునవి యీ భావోద్యమముయొక్క ప్రధాన సూత్రములని తెలియును.[1] ఈ యుద్యమము సాహిత్యమునకు విలక్షణమైన నూతన మార్గమును బట్టించినది.

ఆంగ్లసాహిత్యములో వలె నీ విధమైన కవిత యీ యిరువదవశతాబ్దపు ప్రథమసంవత్సరములలో నంకురించినది. ఆంగ్లకవుల రచనలు విద్యాప్రణాళికలలో స్థానము పొందినవి. ఉన్నత కళాశాలలో నాంధ్ర విద్యార్థులు వానిని పఠించినారు. తత్ఫలితముగా వారు నాంగ్ల భావకవుల కభిమానులైనారు. మన సాహిత్యములో నట్టి యాత్మాశ్రయమైన కవిత లేదని గుర్తించినారు. ఆంగ్లవిద్యాశిక్షణమువలనఁ బాశ్చాత్యుల వేషములపైన, వారి యాచార వ్యవహారములమీద ప్రీతి జనించినది. సంఘములోఁగూడ మార్పు వచ్చినది. స్త్రీవిద్య కారణముగ సహవిద్య వచ్చినది. అతఃపూర్వము లేని నూతన సన్నివేశములు సంఘ వ్యవహారములోఁ దారిసిల్లినవి. వీనికిఁదోడు విద్యార్థుల వయసు తోడైనది.[2] యువకవులు 'స్వానుభవ భావ్యముల' చెప్పఁ దొడఁగినారు. 'ఆంగ్ల విద్యాభ్యాసకుల

1 ఈ క్రింది వచనము గమనింప దగినది :

One point seems to be significant, namely, that the classical poets care for *rasa* or sentiment whereas the moderns care for *bhava* or emotion. —*Dr. P. T. Raju.*

2. చూ. «ఆధునిక కవిత్వము : ప్రేమ»—డా. వేమూరు వేంకట రామనాథముగారి «సౌందర్య సమీక్ష» లోని వ్యాసము.

కేవల హృదయచ్ఛాయలకు స్వరూప వైచిత్రి నిర్మింపక విడువరా దనుకొనినారు. అంతకుఁబూర్వము మనసాహిత్యములోఁ గవి ఉత్తమపురుషలోఁ గవిత చెప్పలేదు. ఈ నూతన భావోద్యమము కారణముగాఁ గవి ప్రత్యక్షుఁడైనాఁడు. ఆత్మప్రణయమే కథావస్తువైనది. ఇందు విప్రలంభమే కాని సంయోగశృంగారమున కవకాశమే కానరాదు. ప్రణయోద్దీపన సామగ్రిలోఁ జేరునట్టి కోకిల, సముద్రతీరము, ఉద్యానము, శరద్రాత్రులు మున్నగునవి వారి వర్ణనమున కాస్పదమైనవి. పురాణములవలెఁ గథను జెప్పుట క్రమక్రమముగా సన్నగిలిపోయి, ప్రబంధములలోవలె శబ్దాడంబరము, సన్నివేశకల్పనము, పాత్రచిత్రణము మొదలైనవానికిఁ బ్రాధాన్యము తగ్గిపోయి, కేవల మొక్కక్షణములోఁ గలిగిన యాత్మానుభవమును జక్కని భావముతో మేళవించి యుద్వేగముతోఁ జెప్పుట నవ్యకవితాలక్షణమైనది. సంఘములోని స్వేచ్ఛాప్రవృత్తితోపాటు కవితలోఁగూడ స్వేచ్ఛాకాంక్ష పొడమినది; గానయోగ్యమైన మాత్రాఛందమునకు గౌరవము హెచ్చినది. అడుగడుగునకుఁ బ్రకృతి ప్రబోధనములను నవ్యులు గ్రహింపుచు వచ్చిరి.* గిడుగు రామమూర్తిపంతులుగారి వ్యావహారిక

* "Nature is no temptress. She is a holy teacher" అను అనిబిసెంటు వాక్యములపై గౌరవమును జూపినారు నవ్యులు.

భావకవిత్వమును గూర్చి భావకవినిగూర్చి ఆచార్య శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి వచనములను గ్రహింపుడు :

"వస్తు సంవరణమందు భావకవికి తన స్వానుభవమే యధికరణము. పూర్వ వాఙ్మయమందు లేదని వదల నక్కరలేదు. నాయికానాయకులతో

భాషావాదము వచ్చి నియమోల్లంఘన మంత్యంత కుతూహలముగల నవ్యులకుఁ బెన్నిధివలె సాక్షాత్కరించినది. ఇన్ని లక్షణములతో నభినవకవిత మన సాహిత్యములోఁ గూడ నిలిచిఁ గొన్నది.

నవ్యకవితా ప్రభాతకాంతు లాంధ్రదేశమున మొట్టమొదట తిరుపతి వేంకటకవులపైఁ బడినవి. కాని వాని ప్రభావము వారిని సంపూర్ణముగాఁ లోఁగొనలేదు. 'ప్రాచీనమార్గమునకు భరతవాక్యము, నవ్యమార్గమునకు నాందీవాక్యము,' వీరిలో [illegible]న్నవని తెలియుదుము. తరువాతనూతన 'భావచేతనము సమగ్రముగా వారి శిష్యులలోఁ గల్గినదని చెప్పవచ్చును. రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావుగార లీమార్గమునకుఁ దెలుఁగుదేశములోఁ బ్రవర్తకులనఁ జెల్లును. ఈ విధమైన కవితను 'అభినవ కవిత' యనినారు. వీ రిద్దరి కవితలోఁ బైఁ

ఆలంకారికుల లక్షణము ననుకూలించునా ప్రతికూలించునా యని విచారింప నవసరము లేదు. ....

భావకవిత్వమందు స్త్రీ మాతృపీఠమునం దాసీనురాలగును. కవి కాముకునివలెఁ గామింపక పల్లివలెఁ దగ్గరకుఁ బోవును. భావకవి ప్రకృతి శిల్పప్పటును పూజ్యబుద్ధితో సమీపించును. స్థూలవస్తు భ్రాంతితోఁ జేరఁబోఁడు. తనకు ఇష్టదేవత దేశము. అతఁడు ఆర్యులవలె ఆత్మగతినే ప్రమాణముగా నంగీకరించుచున్నాఁడు. అంతర్మనన రసస్పందముగాక కవితాదర్శనము కాదని భావకవి విశ్వాసము. అందుచేత శబ్దప్రయోగమందును, రూపకల్పనయందును గూడ నతఁడు ఆత్మపరతంత్రుఁడు కాక విధిలేదు. హృదయాకాశమందు విహరించు శబ్దవిహంగము ఈ యనుభవ విన్యాసమునే పక్షచాలనమందును స్వరకల్పనయందును ప్రదర్శించుచున్నది.—అఖిలాంధ్ర కవిపండిత సమ్మేళనములో నధ్యక్షోపన్యాసము.

పేర్కొనిన లక్షణము లన్నియు ద్యోతకములగును. రాయప్రోలు వారి* 'లలిత' (1909), 'తృణకంకణము' (1912) లభినవకవితా సంపూర్ణోదాహరణములు. వీనిలో భావ వస్తురచనములలో మార్పు గాన్పించినది. అదే కాలములో కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారలు కూడ ఆ ధోరణిలో రచనము సల్పిరి. అటు పిమ్మట సాహితీ సమితి ప్రథమ సభ్యులు[1], శ్రీయుతులు పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు, దువ్వూరి రామిరెడ్డి, అబ్బూరి రామకృష్ణరావు, మంగిపూడి వెంకటశర్మ, అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావుగారలు మొదలైనవారు నూత్న భావచేతనకు లోనై రచనలు సాగించినారు.

---

* 'అభినవ కవితామండలి' అని పెట్టి నవ్య కావ్యము లను రాయప్రోలువారు తిరువల్లిక్కేణి—మద్రాసు నుండి వరుసగాఁ బ్రచురించినారు.

1. 'సాహితీసమితి' అను పేర నొక సంస్థ శ్రీతల్లావఝ్ఝల శివశంకర శాస్త్రిగారి సభాపతిత్వముక్రింద 1919 ప్రాంతములో స్థాపింపఁబడినది. నవ్య సాహిత్యమునకీ సమితి సభ్యులు చేసినకృషియెన్నఁదగినది. నలుమూలలనున్న ప్రతిభావంతులఁ జేరదీసి, వారివారి కవితాప్రయత్నములఁ బరిశీలించి వాని నేకముఖముగా 'సాహితి'— 'సఖి' అను పత్రికలద్వారా మనల కందించిన శాస్త్రిగారు ప్రశంసనీయులు. "నవ్యసాహిత్య పరిషత్" స్థాపనమునకును వీరు ముఖ్యకారకులై తదభ్యుదయమునకుఁ జాల పాటుపడిరి. 1920 తరువాత మొన్న మొన్నటివరకు శ్రీశాస్త్రిగారి ప్రభావములేని రచయితగాని రచనముగాని తెలుగు సీమలో రాలేదన నతిశయోక్తి కానేరదు :

It can be said without fear of exaggeration that there is no modern writer in Telugu land who has not been influenced by Sastry to some extent.-*Nori* (*Triveni-March* 1938)

ఆంగ్లసాహిత్యములోని షెల్లీ, కీట్సు, బైరన్ మొదలైన కవుల రొమాంటిక్ రచనల ప్రభావము* ప్రత్యక్షముగనో, పరోక్షముగనో వీరి యందరిపైఁ బడినట్లు తెలియుదుము. అనాదిగా నాంధ్ర సాహిత్యముపై సంస్కృత ప్రభావమే మిక్కుటముగా నుండుటచేఁ బ్రథమ దినములలో సంప్రదాయజ్ఞులు, లాక్షణికులునైన పండితులీ నూతనోద్యమము నంత నెదిరించిరి. ముఖ్యముగా కథావస్తువులోని వైచిత్రి, భావములోని స్వేచ్ఛ, రచనములో ఛందోఽలంకార వ్యాకరణ నియమోల్లంఘనము, వీరిని కలఁచివేసినవి. వీరి రచనల వలన నాంధ్రసాహిత్యము పాడైపోయినట్లు భావించినారు; వ్యుత్పన్నత లేనివారని నవ్యుల నిందించినారు. కాని పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, వెల్లాల శివశంకర శాస్త్రిగారలు మొదలైన పండితులీ భావకవిత్వమునకు దోహదులై నిలిచి దీనిని నిలువఁ బ్రోచినారని చెప్పవలెను.

---

* శ్రీ కొత్తపల్లి వీరభద్రరావుగారు నవ్యాంధ్ర కవితలో పాశ్చాత్య ప్రభావమునుగూర్చి పరిశోధనము గావించి యిటీవల నాంధ్ర విశ్వవిద్యాలయమందు 'డాక్టరేటు' పొందిరి.

సాహితీక్రాంతి ప్రథమ రథ్యులలో శ్రీయుతులు చింతా దీక్షితులు, మునిమాణిక్యం నరసింహారావు, మొక్కపాటి నరసింహశాస్త్రి, శ్రీనివాస శిరోమణిగారలు కథా రచయితలుగాను; శ్రీయుతులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, కొమాండూరి కృష్ణమాచార్యులు, చామర్తి రాజశేఖరరావు, పూర్ణశర్మ, కొండపాటి వెంకటసుబ్బయ్య, కోపల్లె శివకామేశ్వరరావు గారలు ఖండ కావ్యకర్తలుగాను; శ్రీయుతులు నోరి నరసింహశాస్త్రి, శివశంకరశాస్త్రి గారలు కావ్యకర్తలుగానేకాక, ప్రధానముగా నాటకకర్తలుగాను, నవలాకర్తలుగాను ప్రఖ్యాతి వహించినారు.

ఈ యభినవ కవితా మార్గమునకుఁ దరువాత కాలములో ననుయాయులు[1] ప్రబలినారు. ఈనాఁటికిని యువకవు లనేకు లీ పద్ధతినే యనుసరించి రచనలఁ జేయుచున్నారు. సాహితీ

తరువాత సభ్యులలో శ్రీయుతులు అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణగారలు నవలాకర్తలుగా నుత్తమస్థానము నాక్రమించినారు. ఈ విధముగా ఖండకావ్యము, కథానిక, నాటిక, నవల మొదలైన నూత్నప్రక్రియలను సాధించి తరువాత వారికి మార్గదర్శకులై సాహితీ సమితి కవులు ప్రవర్తించినట్లు గమనింపఁగలము. నేఁటికిని నూత్న సభ్యులతో నీసంస్థ పుష్టి జెంది వర్ధిల్లుచున్నది.

1. వేంకట పార్వతీశ్వర కవులు, పెనుమర్తి సోదరులు, శ్రీనివాససోదరులు, సన్నిధానం పితృపుత్రులు, భారతుల, పంద్యారం, పూడిపెద్ది, శ్రీ శ్రీ, పువ్వాడ, పురిపండా, అత్తిలి, అధికార్ల, దివాకర్ల, అంబటిపూడి, వావిలాల, కరుణశ్రీ, కృత్తివాస తీర్థులు, గణపతిశాస్త్రి, సహదేవ, సామవేదం, సంపత్, శివరాం, సింగరాచార్య, మల్లవరపు, జమదగ్ని, పైడిపాటి, పుట్టపర్తి, రామనాథం, ఆయాచితుల, ఇంద్రకంటి, మాధవశర్మ, కాకర్ల, రజనీ, పిల్లలమర్రి, గాదిరాజు, నండూరు, ఎక్కిరాల, దిగుమర్తి, మల్లెల, యస్వీ, సింగరాజు, స్ఫూర్తిశ్రీ, బాలగంగాధర తిలక్, పాలెపు వెంకటరత్నం, వాశం, బొడ్డు, అద్దేపల్లి, నాయని, తుమ్మల, ఏటుకూరి, పట్టికొండ, జి. వి. కృష్ణరావు, జాషువా, ఫరీదు, రామానుజరావు, జమ్మలమడక సోదరులు, మేడిపల్లి, మోచర్ల, చలమచర్ల, బూర్గుల, భాగి, వేదాంతకవి, దుర్గయ్య, సి. నారాయణరెడ్డి, విద్వాన్ విశ్వం, కొండవీటి కవి, భీమన్న, కేతవరపు మొదలైనవారు భావ కవులలోఁ గొందఱు.

స్త్రీలలో స్థానాపతి రుక్మిణమ్మ, విశ్వసుందరమ్మ, విశాలాక్షి, బంగారమ్మ, సీతాకుమారి, ఇందుమతీదేవి, వసలక్ష్మమ్మ, లక్ష్మీకాంతమ్మ, సరస్వతీదేవి, కృష్ణకుమారి మొదలైనవారు పేర్కొనఁదగిన కవయిత్రులు.

సమితి యనేక యువ సమితులకు ♦ మార్గదర్శకమైనది. ఇంత యేల? అభినవకవిత యాంధ్రదేశముయొక్క మూలమూలల వ్యాప్తిజెందిన దనిన నతిశయోక్తి కాదు. ఈ యుద్యమము నిలువ ద్రొక్కికొనినదని చెప్పుట కింతకంటె నేమి దృష్టాంతము కావలెను!

ఆంధ్రభాషలో భావోద్యమము కారణముగా బయలు దేరిన సాహిత్య ప్రవాహమును పరిశీలించినచో నవి వివిధ మార్గములలోఁ బ్రవహించినట్లు తెలిసికొందుము. ఆయామార్గ ములకు స్రష్టలు లేకపోలేదు. ఒక్కొక్కమార్గమున కనుచరు లెవ్వరు బయలుదేరిరో, అప్పటి కవి నిలకడఁ జెందినట్లు గ్రహింపవలెను. నవ్యాంధ్రకవిత్వములోఁ బొడసూపుచున్న భిన్న మార్గముల నీ క్రింది విధముగా నెన్నవచ్చును :

1. ఇంగ్లీషు కవిత్వమున కనువాదములు.
2. ఆంధ్రులు ప్రాచీన ప్రాభవమును తలఁచి ప్రబోధించు రచనములు.
3. ఆత్మపరమగు ప్రణయమును చిత్రించు కవిత; స్త్రీ వ్యక్తిని గౌరవించు రచనములు.
4. ఆంధ్రులకు సన్నిహితములగు నాచార వ్యవహారము లను వర్ణించు కవిత.

♦ విశాఖ పట్టణమున "కవితా సమితి", సికిందరాబాదున "సాధన సమితి", ఏలూరులో "సాహిత్యమండలి", చందూరులో "సాహితీ మేఖల", నరసరావుపేటలో "నవ్యకళా పరిషత్తు", గుంటూరులో "శోత్సాహ సమితి" మున్నగునవి.

5. ఆత్మీయ భావములకుఁ బ్రకృతియందలి రహస్యములను జోడించిన రచనము; అర్థధర్మ ప్రతిపాదనము సూత్రముగా నున్న కవిత.
6. భారతదేశ స్వాతంత్ర్య రక్తితోఁగూడిన జాతీయభావ ప్రబోధక రచనములు.
7. సంఘసంస్కారము నిమిత్తముగా వచ్చిన రచనములు.
8. పతితోద్ధరణమే సూత్రముగా నున్న కవిత.
9. ఉత్తమ మానవత్వ సిద్ధికొఱకు సత్యాహింసలు సూత్రములుగా నున్న కవిత్వము.
10. లౌకిక సౌఖ్యమే ప్రధాన ధర్మమని ప్రబోధించు రచనములు.

ఇఁక నీవిధమైన దశవిధ మార్గములకుఁ బ్రవర్తకులనఁదగు వారినిగూర్చి, వారి యనుయాయులనుగూర్చి తెలిసికొందము:

మొదటి మూఁడు మార్గములకును రాయప్రోలువారు ప్రవర్తకులని చెప్పుకొనవలెను. ఆంగ్లములోని 'హెర్మిట్' అను కావ్యమును నవ్యకవితా సరణిలో 'లలిత' అను పేరుతో ననువదించి రాయప్రోలువారు ప్రథమ మార్గమునకు శ్రీకారమును జుట్టినారు.♦ అదిగాక యాంధ్ర దిగ్జయ స్తంభమును జ్ఞప్తికిఁ దెచ్చి తిరిగి దానినిఁ బ్రతిష్ఠింపఁజూచిన ప్రథమాంధ్ర నవ్యకవి

♦ ఆచార్య శ్రీగంటి జోగి సోమయాజులుగారు 'రామచంద్రుని హంపీయాత్ర' అను పేర నొక నవ్యకావ్యము రచించిరి. సంస్కృతాంగ్ల సభ్యతల ప్రభావ మీ రచనమం దంతట గోచరించుచున్నది. చూ : నా రచించిన "సాహిత్య సంపద" యను గ్రంథములో 'హంపి హాయాల'నెడి వ్యాసము.

కూడ నాయనే.[1] ఇటు పిమ్మటనే కొడాలివారి "హంపీ క్షేత్రము"[2], విశ్వనాథవారి "ఆంధ్ర ప్రశస్తి", తుమ్మలవారి "రాష్ట్రగానము"[3], వెంకటరత్న కవిగారి "ఆంధ్ర స్మృతి" జోడేప్రాడి వారి "ఆంధ్ర తేజము" మొదలైన రచనములు వచ్చినవి. ప్రణయపరములైన భావముల నూహించి యందు వినూత్న మార్గమును సృజించిన నవ్యుఁడు కూడ రాయప్రోలువారే నవ్యకవితలో నియమోల్లంఘన మొక సూత్రముగా నెన్నితిమి. రాయప్రోలు సుబ్బారాయ కవి శృంగార రసమును గూర్చి ప్రత్యేక సిద్ధాంతమును గల్పింపఁజూచినాఁడు. శృంగార రససిద్ధికి నాయికానాయకులకు మధ్యనున్న మోహామే

---

1. అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాఁడు
ఓరుగల్లున రాజవీర లాంఛనముగాఁ బలు శస్త్రశాలలు నిలుపునాఁడు
విద్యానగర రాజవీథులఁ గవితకు పెండ్లి పందిళ్లు కప్పించునాఁడు
పాట్నాకికి సమీపమున నాంధ్రసామ్రాజ్య దిగ్జయస్తంభ మెత్తించునాఁడు
ఆంధ్ర సంతతికే మహితాభిమాన దివ్యదీక్షా సుఖస్ఫూర్తి తీవరించె
నా మహావేశమద్దించి యాంధ్రులార! చల్లుఁ డాంధ్రలోకమున
నక్షతలు నేఁడు!

2. శిలలు ద్రవించి యేడ్చినవి శీర్ణములైనవి తుంగభద్రలో
పల బడి గోపురంబులు సభాస్థలులైనవి కొండముచ్చు గుం
పులకు చరిత్రలో మునిఁగిపోయిన యాంధ్ర వసుంధరాధిపో
జ్జ్వల విజయప్రతాప రచనం బొక స్వప్నకథావశేషమై.

3. ఒకనాఁ డాంధ్రధరా విరోధి నరపాలోదగ్ర సేనా శిరః
ప్రకరంబుల్ విదళించి తద్రుధిర ధారానిర్ఝర స్నాతులై
కకుబంతంబుల మీరనెత్తిన పతాకన్ నేఁడు చిత్తంబులో
నొకమారెంచుఁడు రక్తమగ్నిసఖమై యుప్పొంగి ఘూర్ణిల్లగన్.

స్థాయిభావముగ నుండసక్కర లేదనియు సోదరీసోదరుల మధ్య నున్నట్టి వాత్సల్యము, స్వామి సేవకుల మధ్యనున్న భక్తియు స్థాయీభావము లగుట కభ్యంతరము కల్పింపరాదని సూచించినాఁడు.[1] ఆయన కావ్యము లీ సూత్రమున కుదాహరణము లగును. తమోగుణము తోడను రజోగుణముతోడ నున్న మోహము లేక కామము క్షాళితమైనగాని పవిత్రమైన ప్రేమగాఁ బరిణమింపదు. అదియే యుత్తమమైన శుద్ధసత్త్వప్రేమ యగును. ఆంగ్లములోని 'Love is Divine' అను భావము, భగవంతుఁడు ప్రేమస్వరూపుఁడను సూక్తియు నట్టి శుద్ధ ప్రేమ కే వర్తించునవి. అందువలననే మాలిన్యరహితమైన ప్రణయభావము ప్రణవస్థితికిఁ దీసికొనిపోవు నను విశ్వాసము రాయప్రోలువారి కున్నట్లు కనుగొందుము.* ఈ విధముగా మొదటి మూఁడు మార్గములకు సుబ్బారావుగారు ప్రవక్తలైనారు.

ఆంధ్రులకు జాతీయములైన యాచార వ్యవహారములకుఁ జక్కని రూపు కట్టుటకు బసవరాజు అప్పారాయకవి మొదట ప్రయత్నించినాఁడు. సామాన్యములైన సంఘటనములకుదాత్తత కల్పించి కవితా భావమును బొదిగి రచింపఁగల

1. కుల శుభాంగీ పయోధీర కుసుమ మందు
మోహమధువె గవేషించె మున్న సుకవి;
సాత్త్విక ప్రేమ కోశ పేశలము అయిన
వత్సలామృత రుచులను వలచె నేఁడు. —రమ్యాలోకము.

* చూ: నా రచించిన "సాహిత్య సమీక్ష" యను గ్రంథములో 85-89 పుటలు.

సమర్థుఁడు బసవరాజు అప్పారాయకవి, ఆయన వ్రాసిన "నాగుల చవితి[1], వటపత్రశాయి" మొదలైన గేయములు చక్కని యుదాహరణములు. ఈ భావమును పెంపొందింపఁ జేసిన వారు లేకపోలేదు. కొడాలి ఆంజనేయులు గారు వ్రాసిన 'పెండ్లికూతురు'[2]-బొడ్డు బాపిరాజుగారు వ్రాసిన 'అప్పగింతలు' - విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసిన 'మూగనోము' - రాయప్రోలువారి 'సంక్రాంతి' - బాపిరాజుగారి 'గంగిరెద్దు'[3]-పిల్లలమర్రివారి 'గొబ్బి పండుగ, సంక్రాంతి'[4]-

1. అటుకొండ యిటుకొండ ఆరెంటినడుమ । నాగుల్లకొండలో నాట్యమాడేటి
దివ్యసుందర నాగ దేహియన్నాము । కనిపెట్టి మమ్మెప్పుడు కాపాడవోయి!
నాగుల్ల చవితికి నాగేంద్ర, నీకు । పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

2. త్వాదృశ బాలికల్ తలుపు దగ్గర బాటలువాడు పెద్దము
త్తైదులు, భర్త పేరడిగినప్పుడు లీల దొలంగు ముగ్ధతన్
వేదపడంగ 'వంతుమన పెండ్లి కుమారుని' దన్న నీదు ల
జ్జా దరహాస చంద్రికలు శాశ్వతమై వెదజల్లు గావుతన్.

3. ప్రభువు గారికీ దణ్ణం పెట్టూ
పాదంవచ్చీ భక్తిని పెట్టూ
పట్టుశాలువలు కప్పేదరంటూ
కాసులు మువ్వలు కట్టేదరంటూ
డూ డూ డూ డూ యెంకన్నా !

వీరి "గోధూళి" లోని "పిలుపు - ఆకుమళ్లు - పంటపదం - పాలి" అను గేయములీ ధోరణికిఁ జెందినవై జానపద శోభను వెలార్చుచుండును.

4. భవునేత్ర విగతానల జ్వాలలు లా । క్రూరాహి ముఖగత జిహ్వాలు లా
భుగభుగ మండే భోగి మంటలివి । శుభములు కూర్పగ కొలుతము రారండి!
— రాగ రేఖలు.

కవికొండలవారి 'కోతలపాట' మొదలైనవి యీ శ్రేణికిఁ జెందిన నవే. ఈ విధమైన హృదయంగమమైన జాతీయ భావమునకు (నేఁ డెవరు నంగీకరింపరేమో కాని!) బసవరాజు వారి ప్రభావము లేకపోలేదని తలంతును.

నవ్య కవులు ముఖ్యముగా ప్రకృత్యుపాసకులు. ఆత్మభావమునకుఁ బ్రకృతిలోనున్న గుప్త భావములను జోడింపఁగల ప్రతిభ, నవ్యకవులలోఁ జాలవఱకున్నట్లు ద్యోతిలును. ప్రకృతియే నవ్యులలో నుద్రేకము నుత్సాహమునుగూర్చి కవితావేశమునకు బాధ్యత వహించుచున్నది. ప్రకృతిలోని వస్తువుల రెంటినిఁ గైకొని వానిం దన గావ్యములో నాయికా నాయకులుగా రూపక కల్పనముచేసి చిత్రించుటలోఁ బ్రధానుఁడు రామరాజభూషణుఁడు. అతని వసుచరిత్రమే యిందులకుఁ దార్కాణము. నవ్యపథములో నట్టిభావమునే గేయ మర్యాదలలో నడిపించిన విశ్వనాథవారు గణనీయులు. ప్రకృత్యుపాసనమున కత్యంత స్థానము గల్పింపఁ జూచిన నవ్య కవులలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ప్రధానులు. రవీంద్రుని కవిత్వములో సైతము ప్రకృతి యత్యున్నత స్థానము గొన్నట్లు కనుగొందుము. ప్రకృతి రహస్యములతో నాత్మభావమును సమన్వయించుటలో నున్నది ప్రతిభ.* శ్రీ విశ్వనాథవారి 'కిన్నెరసాని పాటలు'

---

* కృష్ణశాస్త్రిగారి "ఊర్వశి - ప్రవాసము - కృష్ణపక్షము" లఁ జదివినంతనే యచ్చమైన యుత్తమ 'భావకవి' మనకు భాసింపఁగలఁడు. చూ: నా వ్యాసము—"భావ కవికుల గురువు" (షష్టిపూర్తిసంపుటము)

పై సిద్ధాంతమును స్థిరీకరించు రచనము.[1] వీరువ్రాసిన 'కోకిలమ్మ పెళ్ళి' కూడ నట్టి రచనమే. కాని యం దన్యాపదేశముగఁ జక్కని యుపదేశ మిచ్చుట కలదు. సంప్రదాయము[2] ఆచార ధర్మములు వీరికి ననుల్లంఘనీయములు. వీరి రచనములన్నియు నీ విధమైన యాచారధర్మప్రతిపాదనా సమర్థములైనట్లగుపించును. నవ్యకవిత్వములో నిట్టి ధర్మనిష్ఠ కీతఁడే యుపదేష్టయని చెప్పవలెను. కాబట్టి నవ్యకవిత్వములో వీరిది విలక్షణమైన మార్గమునకుఁ జెందిన భావముగా నెన్నవచ్చును.

కవిత్వములోఁ గాలానుగతముగా మార్పెట్లు వచ్చుచున్నదో సంఘములోనైతఁ మాటులనే క్రమపరిణామము కన్పించుచున్నది. ముఖ్యముగా నవ్యులలో సంఘసంస్కారమును సూత్రముగాఁ బెట్టుకొని కృషి చేసినవారు వీరేశలింగము పంతులు. వీ రుపన్యాసములతోడను, వచన రచనములతోడను

1. తూర్పులో తెల్లనై తోచెఁ దుమ్మకాంత
తొలిమావి లేబూత దూసెను పికికాంత
తలలపై ఁతవాలు తళతళా మెరిసేటి
పల్లె తాచులు దూకి నాట్యమాడేటట్లు
మెరిసింది కిన్నెరా పిట్టల్లు ఒరిసిందికిన్నెరా! —కిన్నెరసాని పాటలు.

చూ : "కిన్నెరసాని సాయగమ"—నా "సాహిత్య సంపదలో"

2. లేతబుజ్జాలు కొక్కిరిస్తే
అతగాళ్ళతో యేమిగానీ
తాత తాతలనాటి కతలూ
త్రవ్వి పోస్తానోయ్ ! —కోకిలమ్మ పెళ్ళి.

తత్ప్రచారమునకుఁ బూనుకొనిరి గాని కవిత్వమును వాహికగా గ్రహింపనైరి. దీనిని గురజాడ అప్పారాయ కవి పూరించినాఁడు. నవ్య కవితా పద్ధతులతో సంఘ సంస్కార ణాభిప్రాయమును వ్యక్తీకరింపఁ బ్రయత్నించిన ప్రథమ నవ్యకవి గురజాడ కవియే! నూత్న గేయ ఛందస్సును సృజించి "ముత్యాల సరము"లను రచించినాఁడు. వీనిఁ జదివినవారికిఁ బై సంస్కారభావము తెలియకపోదు. ఇదిగాక గురజాడకవి మఱియొక మార్గమునకును గురువని చెప్పవలెను :

భారత దేశము మొన్న మొన్నటివఱకుఁ బారతంత్ర్యమునకు గురియైనది గదా! దీనికిఁ జకితుఁడుగాని కవి భారత దేశమున నుండరాదు. హిందీ భాషాకవులలోను, వంగ భాషాకవుల లోను బై భావమునకుఁ జకితులై స్వాతంత్ర్య గీతముల నాలపించి ప్రజలఁ బ్రబోధింపఁజూచినవా రనేకు లున్నారు. మన భాషాకవులలో నంతగా దీక్షబూనినవా రరుదుగా నున్నారని చెప్పకతీరదు. ఇట్టివారిలో గురజాడకవి యెన్నఁదగినవాఁడు. మతవైషమ్యముల దొలగించి స్వాతంత్ర్యాకాంక్ష కలిగించుటకై యాతఁడు ప్రబోధించినాఁడు.[1] దేశస్వాతంత్ర్యోద్యమములోఁ బాల్గొన్న జాతీయ కవులలో శ్రీయుతులు గరిమెళ్ళ

1. చట్టపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడవ వలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతము లన్నీ మెలగ వలెనోయ్ ! —ముత్యాల సరములు.

సత్యనారాయణ,[1] వంగిప్రోడి వెంకటశర్మ, బలిజేపల్లి లక్ష్మీకాంతము,[2] చిలకమర్తి లక్ష్మీనరసింహం, శివశంకరశాస్త్రి, మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి, మల్లావధాని గారలు మున్నగువా రున్నారు. వీరిలో గురజాడవారి గీతములకన్న గరిమెళ్ళవారి పాటల కానాటి ప్రచార మింతింతని చెప్పలేము.

---

1. దండాలండోయ్, మే ముందలే మండోయ్ బాబు!
ఉప్పుకును పన్ను బాబు
పప్పుకును పన్ను బాబు
కొప్పుకాస్త దేవుడికి
ఒప్పుకొంటె పన్ను బాబు - దండాలండోయ్!

అండకొని దీవించు భరతమాతా రెండుకందలేండ్ల కింద భరతమాతా - అల్ల కంపినోడు దిగినాడె భరతమాతా దిగియూరకున్నాడ భరతమాతా - మాకు దిప్పచేతి కిచ్చాడె భరతమాతా! —శ్రీ గరిమెళ్ళ.

2. అంగడుల నన్ని యున్నవి యల్లనోట
గడ్డ యచటనుఁ దార్కాణ గానవయ్యె
భారతవర్షంబు నా కల్పతరువె కాని
యనుభవము మాత్ర మొరుల పాలయ్యె నకట!

ప్రాజ్యంబైన స్వరాజ్య మీ క్రతువునన్ ప్రాపించు సర్వప్రజా
భోజ్యం బియ్యది కేవలంబు కలమాహంబుల్ భేదముల్ దీనికై
త్యాజ్యం బొక్కటియే యదే మసిన హేయంబైన వేరాన, ధ
ర్మ జ్యోత్స్నల్ వెలువేల నిశ్చయమతిన్ దం డాత్మ లర్పింపఁగన్.

—స్వరాజ్య సమస్య.

వేదుల సత్యనారాయణశాస్త్రి♦, మారేపల్లి రామచంద్ర శాస్త్రి అడవి బాపిరాజు, గురుజాడ రాఘవశర్మ, పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారలను కొలఁదిగానో గొప్పగానో యీ భావము సంచలింపఁ జేసినట్లున్నది. కాని యీ భావమునకుఁ బుష్టి చేకూర్చిన సన్వ్యలు హెచ్చుగాఁ గన్పించుట లేదనిన నది సత్యదూరము గాదు. ఏమైనను గాంధీగారి జాతీయోద్యమము కొంత ప్రచార వాఙ్మయమును సృజింపఁజేసినది.

ఈ నవ్య కవిత్వమునకుఁ బూర్వము కావ్య రచనములో నాయికా నాయకులనుగా నుదాత్తులైనవారిని—అంబరచుంబిత శిఖరములుగల సౌధములలో హంసతూలికాతల్పముల మీఁద కాలముబుచ్చు భోగులను – ఏరుకొనుట యాచారమైనది. దీని కపవాదములుగాఁ గొన్ని రచనలు వచ్చినవి. పల్లీయులను నాయికా నాయకులనుగా ఏల గ్రహింపరాదను భావము కలిగి నండూరి సుబ్బారావుగారు "యెంకి - నాయుడుబావ" లను సృజించినారు. ఈ విధముగా పల్లీయుల హృదయసాగరములలో దాగియున్న భావరత్నములను వెలికిఁ దీసికొనివచ్చిన వవ్యుడు నండూరికవి.* పవిత్ర ప్రణయ ధర్మము పామరులకు సైతమున్నట్లు చిత్రించి దానిని బోధించుటకై యీకవి ప్రయ

♦ నీచపు దాస్య వృత్తి మన నేరని క్రూరత మాతృదేశ సే
వా చరణమ్ముఁ దనువు లర్పణ సేసినవారి పార్థివ
శ్రీ చెలువారు చోట తదస్పృశుచుల్ వికసించి వాసనల్
వీచుచు రాలి పోవగ వలెం బదుదాత్త సమాధి మృత్తికన్! —దీపావళి.

* అంతకు పూర్వము ప్రాచీన పద కవిత్వము మీఁద శ్రీ పురాణం సూరి శాస్త్రి, శ్రీ కేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి మొదలైన సహృదయులు పత్రికలలో సాదరపూర్వకముగా

క్షించినాఁడు.♦ ఉదాత్తులకు – మధ్యములకు – పామరులకు నుత్తమధర్మములఁ బ్రబోధించుటకును, వారి నాదర్శజీవితముల గడపుటకై సంస్కరించుటకును కవి ప్రయత్నించుచుండును గదా! పామరుల కభ్యున్నతి కలిగించుటకై పూనుకొన్నవారగు దుగా నున్నారు. వారి భాషలో* రమ్య రచన మొనర్చిన కొద్దిమంది కవులకు మార్గదర్శి శ్రీనండూరికవియని చెప్పవలెను. ఈ మార్గములో రచనము సల్పినవారిలో అడవి బాపిరాజుగా రెన్నఁదగినవారు; ఈయన యీ భావమునకుఁ జక్కని ప్రచా

విమర్శలు జరుపుచు వచ్చుటవలనఁ బ్రాచీనపదములను బ్రయోగించుటవలన నండూరివారికి నా విధమైన రచన చేయుటకుఁ జక్కని దహదారి యేర్పడి యుండును. — శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ.

♦ ఆనాటి నావోడు సెందురూడా
అలిగి రాలేదోయి సెందురూడా
ఎంకి! మన యిద్దరమె యెక్కాలొద్దన్నాడు
యీ వేళ యీ తోట యింక నీదన్నాడు
మాటాడుతుంటాంగ సెందురూడా
మంచిదా పోయేవు సెందురూడా
'కలకాల మీ దినమె నిలుసు మనీ' కన్నాడు
సాచ్చికైనా తాను కౌగిలీ సన్నాడు—

* ఎంకి పాటలోని భాషపైన, పాత్రలపైన వచ్చిన విమర్శలకీ దిగువ సమాధానము చాలును: "సంక్రాంతి కేకట సుబ్బారావుగారు నాయుడుబావ ఎంకిముక్క ముక్త ప్రణయ గాథలను వారి నాటుక భాషయందు పాడినందున అంతకంటె మంచిదైన నాటుక భాషనే గాని లేక కేవల పండితుల గ్రాంథిక భాషనే గాని ఉపయోగించువారు నాయుడుబావ ననుకరింపలేరు. ఆ భాషలోనే గాని నిజముగా నంత ఆకర్షణశక్తియు లేదు".
— డా. బూర్గుల రామకృష్ణారావు.

రము చేకూర్చినారు. శ్రీ ప్రయాగ నరసింహశాస్త్రి వ్రాసిన గొల్లపదములు - శ్రీపిల్లలమఱ్ఱివారి 'పాలేరుపాటలు' - శ్రీభాగి నారాయణమూర్తి వ్రాసిన 'లంబాడీపిల్ల' - శ్రీగోఖలే వ్రాసిన 'మూగజీవాలు' - శ్రీ కొనకళ్ళ వెంకటరత్నము రచించిన 'బంగారు మామ' - శ్రీ కందుకూరి రామభద్రరావు వ్రాసిన వానిలోఁ గొన్ని గేయములు - పై భావము నాశ్రయించినవే. ఈ భావమునే పతితోద్ధరణ మందుము. ఇట్లు శ్రీ నండూరికవి యొక ప్రత్యేక మార్గమునకు నొరవడి పెట్టినవాఁడైనాఁడు.

మానవజన్మ మనితరోత్తమమైనది. ఈ జగత్తులో నావరించిన మాయా తమస్సును మానవుఁడు తా నార్జించు జ్ఞానముచేఁ బటాపంచలుచేసి పరబ్రహ్మము నెఱుఁగుటలో నుత్తమసాధకుఁడు గావలెను. అరిషడ్వర్గముచేఁ బీడింపఁ బడుచు మానవుఁడు తమోరాశినుండి తప్పించుకొనలేక పోవుచున్నాఁడు. ఇంద్రియనిగ్రహ మొక్కుమ్మడిగా నలవడునది కాదు. మనసు రాగమునుండి విరాగమునకు మార్పుచెందుటకు క్రమసాధనము గావలయును. ఈక్రమపరిణామములు కల్గుటకే చతుర్విధాశ్రమములు నియమితము లైనవి. ముముక్షువు లీ యాశ్రమములలో నియమముగా నుండి తత్తద్ధర్మముల యథాక్రమముగా నిర్వర్తింపవలెను. ♦ మాయావృతమైన యీజగ

♦ కావున దుఃఖ హేతువగు కాలము పైకొని రాకమున్నె సాఖ్యావహ యోగధారణకు యత్నమొనర్పఁగ నుత్సహించి మే లొక్కఁ వలెఁగాక, మన్మథవిలోల మనస్కుఁత నింద్రియార్థ సంసేవ జొనర్పఁ జెల్ల దది చేటునకున్ మొదలింటి హేతువౌ.

— సౌందరనందము.

త్తున కావల నిల్వఁగలశక్తి యూరక లభించునా? అనాదిగా మన దేశములో నీ సిద్ధాంతములు ప్రచారములో నున్నను వీనిపై నాదరము క్రమముగా నానాఁటికి క్షీణించుచు వచ్చినది. నవ్యులకు సత్యాహింసలను సూత్రముగాఁ బెట్టుకొనిన బౌద్ధ మతముపై దృష్టిపోసాగినది. బుద్ధదేవుని జీవితమునుండి కొన్ని కొన్ని సన్నివేశములఁ జిత్రించుటకు నవ్యకవులు గడఁగినారు. శ్రీ తిరుపతి వేంకట కవులు "బుద్ధచరిత్ర" వ్రాసినప్పటికి నీ విధమైన భావమునకుఁ బ్రచారము దెచ్చినవారు, శ్రీయుతులు పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగారలే. వీరు వ్రాసిన 'సౌందరనందము'* ప్రబంధ లక్షణములు కలిగినను నవ్యకవితావాసన లేనిది కాకపోవుటచే నిట ప్రసక్తమైనది. గురువుల భావమును శిష్యులు ప్రచారములోనికిఁ దెచ్చుట సంప్రదాయమే కదా! ఈమార్గానుయాయులలో శ్రీ వేలూరి చంద్రశేఖరము 'కాంచనమాల' వ్రాసి, శ్రీ కాకర్ల రామ నరసింహాం 'సుజాత' వ్రాసి, సాధనసమితి సభ్యులలో శ్రీ ముదిగొండ సిద్ధవీర రాజలింగం 'సాధన' వ్రాసి, శ్రీసూర్యచంద్రులు "సాంధ్యగీతి" వ్రాసి, శ్రీ నంబూరు రామకృష్ణమాచార్యు 'ధర్మచక్రము' వ్రాసి, శ్రీ నాశరథి 'మహాబోధి' వ్రాసి, బౌద్ధ ధర్మవికాసమునకుఁ దోడ్పడినారు. శ్రీ సన్నిధానము సూర్య నారాయణశాస్త్రిగారు జాతక కథాగుచ్ఛము' వ్రాయుటచే నీభావము వారిని౯ బ్రేరేచినదని చెప్పక తప్పదు. శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు వ్రాసిన 'కరుణశ్రీ' (౧ భాగము) యను

* దీనిని 'ప్రేమాపనివృత్తి'ని వున్నవ లక్ష్మీనారాయణగారు మెచ్చినారు.

రమ్య కావ్యఖండ మీ సందర్భమున నుల్లేఖించుకొనందగినది. ఈవిధముగా బౌద్ధమతప్రభావము మన నవ్యకవులపై నింతగాఁ బడుటకు శ్రీ పింగళి, కాటూరి కవుల 'సౌందరనంద' కావ్యమే కారణమని చెప్పవలెను. ఈభావము* నకుఁ బ్రచారకులై నూత్న మార్గనిర్మాతలైనారీ జంటకవులు!

భారతదేశము పాశ్చాత్య దేశములవలె లౌకిక చింత ముఖ్యముగాఁగలది కాదు. మనదేశములో నేవిషయమును గ్రహింపవలెనన్నను ముందుగా దేశసంప్రదాయము నెఱుఁగ వలెను. ప్రధానముగా భారతదేశ మాధ్యాత్మిక తత్త్వము కలది. శరీరబలముకన్న మనోబలమును, సమాజమందలి గౌర వముకన్న స్వర్లోకములో గురుత్వమును, ఇంద్రియ తుష్టికన్న నింద్రియ నిగ్రహమును, ప్రపంచసౌఖ్యముకన్న పారలౌకి కానందమును భారతీయు లనాదిగాఁ గాంక్షించుచు వచ్చినారు. పాపభీతియు, దైవభక్తియు మనవారిలో మిక్కుటములు. అట్లేమన భారతీయ సంప్రదాయములో 'రేపు' అను పదమునకు యోగ్యమైన స్థానమున్నది; స్వార్థముకన్న పరహితార్థము పాటుబడువారు భారతీయులు. పాశ్చాత్య నాగరకతా సూత్ర ము లీ భావము లన్నిఁటికి వ్యతిరేకములు, అయినను మనకు

* శ్రీదుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు 'బౌద్ధవాఙ్మయ బ్రహ్మ'లై చేసిన సేవ గొప్పది. ఈకరుణ సూత్రమును బ్రతిపాదించుటకై ముస్లిము చరిత్రలో ప్రసిద్ధములైన సన్నివేశములను గ్రహించి పాఠక హృదయములు ద్రవించు నట్లు చిత్రించిన వారిలో జాషువాకవి ('ఫిరదౌసి - ముంతాజమహలు' కర్త) పువ్వాడ శేషగిరిరావు ('తాజమహలు, దారా' కర్త) గారలు సిద్ధహస్తులు.

వచ్చిన నూతన విద్యావిధానమువలనఁ గ్రమ క్రమముగాఁ బాశ్చాత్య సంప్రదాయముపై మమకారము సంక్రమింపఁ దొడఁగినది. లౌకిక చింత ప్రబలినది;* 'రేపు' అను దానికై చింతించుట సభ్యతకు దూరమైనది![1] ఇట్టి భావమును సంపూర్ణముగాఁ జిత్రించిన కావ్యము "ఉమర్ ఖయ్యామ్" యువకులకు గొప్ప మత గ్రంథమైనది.♦ ఆ భావమును బరిపాలించిన పాశ్చాత్య సభ్యత వీరి కాదర్శమై నిలిచినది. ఈ భావము సంపూర్ణముగా నేఁటి మన విద్యావిధానముద్వారా మనలో జీర్ణించుకొనిపోవుచున్నది; ఈ భావ చిత్రణమువలన మన పార్థక్యమును గోల్పోవుచున్నట్లు గమనించుటలేదు. నవ్య కవులలో నీ భావమునకు లోనుగానివారు లేరు. అయినను దీని ప్రచారకులలోఁ బారసీకభాషనుండి యనువదించి శ్రీ దువ్వూరి రామిరెడ్డికవి 'పానశాల'ను రచించి ప్రధానుఁడైనాఁడు.! ఆదిభట్ల నారాయణదాసు–రాయప్రోలువారు–

* "పరము గిరమ్ము దాని తలపై నొక దోసెడు మన్ను చల్లి సుం
దర లవలీ కపోలములఁ దాచిన ముద్దులఁ దొంగిలించి సం
బరములఁ దేలుదాము; నమాజులు పూజలు జేయనేల? రె
వ్వారయిన వచ్చినారె మృతి వాటిక కేఁగిన పూర్వ యాత్రికుల్"

1. Unborn To-morrow and dead Yesterday
Why fret about them if To-day be sweet!
— *Rubaiyat of Omar Khayyam.*

♦ చూ : డాక్టరు బూర్గుల రామకృష్ణారావుగారి «సారస్వత వ్యాస ముక్తావళి» లో 'ఉమర్ ఖయ్యాం' ను గూర్చిన వ్యాసములు.

బూర్గులవారు-మాధవపెద్దివారు-చిలుకూరివారు-రామచంద్రి అప్పారావు- 'స్ఫూర్తిశ్రీ' మున్నగువా రేతద్భావ ప్రచారకులలోఁ జేరి యే తత్కావ్యానువాదముల నొనర్చినవారు. ఇయది "ఉమర్ ఖయ్యాము రుబాయితీల" ప్రభావము నవ్యులను లోఁగొన్న విధమును దెల్పఁగలదు.

పల్లీయుల ప్రణయమును వర్ణించిన నండూరికవి భావములో నుదాత్తత యున్నదని తెలిసికొందుము. కృషీవలునిపై దృష్టి మరల్చి కవితాగానము* సల్పిన నవ్యులలో దువ్వూరికవి ప్రధానుఁడని చెప్పవలెను. వీరగాథలను గూడ వ్రాసి ప్రజలఁ బ్రబోధింపఁజూచిన కొలఁదిమందిలో శ్రీ రామిరెడ్డి యొకఁడు. కట్టమంచివారు "ముసలమ్మ మరణము" వ్రాసి దువ్వూరికవికిఁ బూర్వమే యొక మార్గమున కుపదేష్టలైనారని తెలియుదుము. కట్టమంచివారి కావ్యము దువ్వూరికవిని దిద్దియుండవోవు! వీరగాథలపై దృష్టి మరలగాఁ బల్నాటి వీరచరిత్ర జ్ఞప్తికి వచ్చి 'నాయకురాలు' అను పేరుతోఁ గావ్యములు బయలుదేరినవి. చరిత్ర ప్రసిద్ధములైన వీరులయొక్కయు, వీరమాతలయొక్కయుఁ గథ లుపాదేయములై కావ్యత్వము పొందుచున్నవి.♦ ఆంధ్రులకు నేఁడీవిధమైన ప్రబోధ మత్యా

* ఆంగ్లములో దీనిని 'Pastoral Poetry' అందురు. శ్రీ తుమ్మల, శ్రీ ఏటుకూరి కవులు వ్రాసిన ఖండకృతులలో నిట్టి కవిత కొంత కనుపించును.

శ్రీ జాషువా "నేతాజీ" ని, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ "ఝాన్సీరాణి" ని, శ్రీ ఏటుకూరి వెంకటనరసయ్య "రుద్రమదేవి"ని, శ్రీమంచికంటి వేంకటేశ్వరరావు "పృథ్వీరాజు"ను ఖండకావ్యములుగాఁ దీర్చిదిద్దినారు.

వశ్యకమైనది. రాజ్యపాలకులై వర్తిలిన జాతీయులు నేఁ డీవిధముగా గుర్తింపలేని దుస్థితిలో నుండుటచే నిట్టి వీరగాథలుగల కావ్యము లెన్నేని సృజింపవలసిన కాలముగా నిది గన్పించుచున్నది. కానిజాతిపరములుగా–దేశపరములుగా నుత్తమకావ్యముల నిర్మించుటలో మన నవ్యు లేలకో వెనుకబడుచున్నారు.

ఇట్లీ యభినవ కవిత్వము పాశ్చాత్య కవిత కనుకరణముగా నారంభమై తరువాత ప్రత్యేకత గడించుకొని భిన్న మార్గములందుఁ బొడసూపుచు నాంధ్రమున నేఁడు విలసిల్లుచున్నది. భావ వస్తు రచనలలో – ఛందోఽలంకారములలో – భాషలో – దృక్పథములో నన్నిట నవ్యత నలవఱచుకొని యభినవకవిత తెలుఁగువారికి సిద్ధమైనట్లు నిశిత పరిశీలనముపైఁ దెలిసికొందుము. ఈనాఁటి కిది యాంధ్రసాహిత్యచరిత్రలో నొక యధ్యాయమునకు యోగ్యమైన స్థానమును గడించుకొనుట కర్హత కలిగి యొప్పుచున్నది! ♦

[1946 జనవరి భారతిలోఁ బ్రకటితము]

♦ శ్రీయుతులు కురుగంటి సీతారామ భట్టాచార్య, పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావులు కలసి (1950 లో) నిర్మించిన 'నవ్యాంధ్ర సాహిత్య వీథులు' అను సమగ్రగ్రంథ మీ విషయముపై నిప్పటికి మనకున్న ప్రామాణిక గ్రంథము.

ముద్దుకృష్ణగారు సంపాదించిన 'వైతాళికులు', శివశంకరశాస్త్రిగారు సంపాదించిన 'మహోదయము', సాధనసమితి వారి 'ప్రత్యూష', దేశోద్ధారక గ్రంథమాలవారి 'ఉదయ ఘంటలు', నవ్య సాహితీసమితి వారి 'నవ్య సాహితి' అను నవి యిప్పటికి వెలువడిన నవ్యకవుల ఉత్తమ పద్య గేయ సంకలన గ్రంథములు. ఈ గ్రంథముల నవలోకించినవారికి నభినవ కవితా స్వరూపము స్థూలముగఁ బొడగట్టఁగలదు.

౧౦

రూపకవికాసము.

నాటకము

సాహిత్య మను బదము కావ్యపరమైనది. కావ్యము దృశ్య-శ్రవ్య భేదములచే ద్వివిధమైనది. దృశ్య కావ్యమునే "రూపక" మని లాక్షణికులు వ్యవహరించినారు. ధనంజయుని నిర్వచనము ప్రకారము నాట్య, రూప, రూపక మను పదములు దృశ్యకావ్యమునకుఁ జెల్లుచున్నవి. అవస్థానుకృతి నాట్యమనియు, నాట్యము దృశ్యంబగుట నది రూపకమైనదనియు, నటులయందుఁ బాత్ర సమారోపముచే వర్తిలునది గాన రూపకమైనదనియు, దశరూపక మందాతని సూత్రము. నేఁడీమూఁడు పదములు మరుగున పడిపోయి నిత్యవ్యవహారములో నాటకమను పదము మాత్రము రూఢమైనది. కాని నాటక మనునది 'అపంచాంక మాదశాంక' మను ప్రత్యేక లక్షణముగల దశవిధ రూపకములలో నొకటిగా ధనంజయుఁడు పరిగణించినాఁడు. ఈనాఁడు వ్యవహరింపఁబడు రూపకములు పై లక్షణమున కవ్యాప్త్యతివ్యాప్తి దోషములకు గురియగునవే యనుట నిశ్చయము. కాని నాటకమను పదమును సామాన్య రూపక వాచకముగా గ్రహించుచున్నట్లు గమనించిన నేదోషమును బట్టదు.*

---

* ఈ విమర్శకుఁ దావులేకయుండు 'రూపక' శబ్దమునే శీర్షికయం దుంచితిని

సాహిత్యములో రూపక మున్నతస్థాన మాక్రమించు చున్నది. మన ప్రాచీన విద్యార్థి శబ్దముల వల్లించి, యమరమాది నిఘంటువులఁ బుక్కిటఁబట్టి, కావ్యములఁ జదివిన పిమ్మటగాని నాటకములను జేపట్టుచుండెడివాఁడు. అందుచేతనే 'నాటకాన్తం హి సాహిత్యమ్' అను సూక్తి వచ్చినది! అంతియేగాక మహాకవి కార్యమును విచారించినచో శ్రవ్యకావ్య రచనమందు సాధన మొనర్చిన పిమ్మటనే దృశ్యకావ్య రచనమునకుఁ బూని నట్లు తెలియుదుము. ఈ సిద్ధాంతానుసారియే 'నాటకాన్తం కవిత్వ' మ్మను యార్యోక్తి! ఈవిధముగా సాహిత్యసృష్టిలోను, సాహిత్యాస్వాదనములోను దృశ్యకావ్య ముత్కృష్ట మైనది. శ్రవ్యకావ్య రచనముకన్న దృశ్యకావ్య నిర్మాణము కష్టతర మని దీని వలనఁ దెలియుచున్నది. రూపకము సమాహారకళ యగుటయే యిందలి రహస్యము.[1] కవితారచన మందుఁ గవికి శబ్దభావాధికారములే మిక్కుటముగా వలసియున్నవి. శ్రవ్య కావ్యమందుఁ గథా చమత్కృతియు శబ్దమాధుర్యమును ప్రాధాన్యము వహించును. కాని రూపకనిర్మాణము కవితా కళపై ననేకాక, సంగీతాభినయ రంగప్రసాధనముల మీఁద నాధారపడియున్నది. ఆయాకళలలోఁ బ్రత్యేకముగాఁ బ్రవేశము లేనిదే రూపకనిర్మాణము విజయవంతము గాదు. పైగా రూపకరచనములోఁ గవి పాత్రలతోఁ దాదాత్మ్యము పొందఁ గలుగు మానసిక శక్తి సంపాదింపవలసియుండును. ఇతి

1 Literature is an art dependent upon words, but the drama is a multiple art, using words, scenic effects music, the gestures of the actors, and orgainzing talents of a .producer. —*B. Ifor Evans.*

వృత్తము సంఘర్షణముతోఁగూడి తత్పరిష్కారముతో ముగియవలెను.[1] ఆఖ్యానములోవలెఁగాక రూపకకారుఁడు కథను కుదించుకొనవలసియుండును. రూపకములోఁ గథాకథనము సంభాషణముద్వారా జరుగవలసియున్నది గాన కథాగమన వేగమున కాటంకము రాని సహజ చతుర సంభాషణల నడపుట యందుఁదాను నిపుణుఁడై యుండవలెను; కథా, పాత్ర, రసౌచితులం బాటించు సామర్థ్య మలవఱచు కొనవలెను. నాటక ప్రయోజనమును జెప్పుచు భరతాచార్యుఁడు—

దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినాం।
విశ్రాంతి జననం కాలే నాట్య మేత న్మయా కృతమ్॥
న త చ్ఛాస్త్రం న త చ్ఛిల్పం న సా విద్యా న సా కలా।
నాఽసౌ యోగో న తత్కర్మ యన్నా ట్యేఽస్మిన్ న్న దృశ్యతే॥

అని సూత్రించినాఁడు. ఇంతటి పరమప్రయోజనసాధనమున కధికారానుభవములు మిక్కుటముగా వలసియున్నవి. ఇన్ని పొసఁగిః ను దృశ్యకావ్యముగాన నిరుప్రక్కల పదను గలిగి నదై దృశ్య శ్రవ్య గౌరవముల రెండిఁటి నందకపోయినచో లాభములేదు. ఈ రెండు ప్రయోజనములలో నేది లోపించి

---

1. The essence of drama is crisis. A play is more or less a rapidly developing crisis in destiny or circumstance and a dramatic scene is a crisis within a crisis.

—*William Archer.*

నను దాని సంపూర్ణత చెడినట్లే యెంచవలెను.[1] ప్రేక్షకుల మెప్పువడయుటకు మంది మనస్తత్వ మెఱిఁగియుండుట యత్యంతావశ్యకము.[2] ఆఖ్యానమునకును రూపకమునకు నున్న ముఖ్యభేదములలో నిది యొకటి. ఇన్ని కట్టుదిట్టము లుండుట చేతనే రూపక నిర్మాణము కష్టసాధ్యమైనది. కావుననే సాహిత్యమందు రూపకమున కగ్రస్థానము లభించినది!

అంత యుత్తమ కావ్యత్వ సిద్ధిపొందిన రూపకముల రచించుటచేతనే సంస్కృతమునఁ గాళిదాసు, భవభూతులు— ఆంగ్లమున షేక్స్పియరు, బెర్నార్డుషాలు జగత్ప్రసిద్ధులైనారు. దీనిఁబట్టి యుత్తమ కవు లనువా రుత్తమ రూపకకారులే యన వలసియున్నది.[3] కాని, మన యాంధ్రసాహిత్య మీసూత్రమున కపవాదముగా నున్నది. తెలుఁగుసాహిత్యములో రూపకము లనునవి మొన్న మొన్ననే పొడసూపినవి. కవిత్వమును జెప్పుటలో భిన్నభిన్న మార్గములు ద్రొక్కుచు వచ్చిరిగాని, మన వారు రూపక ప్రక్రియ నేలొకో సాధింపరైరి. ఆంధ్రసాహిత్యముపై సంస్కృత సాహిత్య ప్రభావము మొదటను, ఆంగ్ల

1 చూ: ఆచార్య శ్రీపింగళి లక్ష్మీకాంతముగా రిచ్చిన నాటక కళా పరిషదధ్యక్షోపన్యాసము. గౌతమ వ్యాసములు.

2 What appeals to the individual will not appeal to the multitude, and vice 'versa; so that a knowledge of the psychology of the multitude is a necessary part of the equipment of the dramatist. —*E. W. Downs.*

3 It is enough to remember that world's greatest poets are also its greatest dramatists. — *Ashley Duke.*

సాహిత్య ప్రాబల్యము తరువాత నున్నట్లు గుర్తింతుము. ఈ విధముగా రెండు భాగములఁ జేసికొని మన సాహిత్యమును పరిశీలించినచో నాంగ్ల సాహిత్యప్రభావము సోకిన తరువాతనే యించుమించుగా రూపక రచనాప్రయత్నములు తెలుఁగు నాట జరిగినట్లు స్పష్టమగును. సంస్కృత సాహిత్యములో ననేక రూపకములున్నను మనవారి నాకర్షింపకుండుట కా యా కాలములం దాయా ప్రభువులీ ప్రక్రియకు గౌరవ మీయకుండుటే హేతువగునని యూహింపవచ్చును. శ్రీనాథు సమకాలికుఁడైన పిల్లలమఱ్ఱి పినవీరన శాకుంతల నాటకమును శ్రవ్య కావ్యముగా ననువదించుటఁ జూడ నాఁటి కవులకు శ్రీనాథుని శృంగార నైషధమే యాదర్శ మాయె నన్నట్లు తలంపవలసివచ్చును. లేని శ్రవ్యకావ్యముగా మార్చుటకు వేరు హేతువు గానరాదు. ఆ యా యుగధర్మములను, ప్రభువుల యభిరుచుల ననుసరింపకపోయినచో తదాశ్రితులైన కవుల జీవితములు తెల్లవారుట యెట్లు? ప్రాచీనాంధ్ర సాహిత్యములో నున్న గ్రంథములన్నియుఁ బ్రభువుల ప్రోత్సాహముచే రచింపఁబడినవిగాని ప్రజా బాహుళ్యము బహూకరించి వ్రాయించినవి కావు. అందులకే యా సాహిత్యమంతయు నుదాత్తమై యేకసూత్రానుసారి (Typical) గా నున్నది.

పామరుల యభిరుచులను, వ్యవహారములను దెలిసికొని వారి కానందముగూర్చు రచనములఁ జేసిన కవులకు సాహిత్యములో సముచితస్థానము లేక వచ్చినది. కావుననే యట్టివారి రచనము లనేకములు కాలగతిలోఁబడి మృగ్యమైనవి. రూపక

ఘనగనే పండిత పామరులను మెప్పించునదై యుండవలెను. రాజాస్థానములం దాసనముల వాంఛించు కవుల కీ దృష్టి యుండుట సాధ్యముకాదు. అయినను పామర జనానందము గూర్చు దేశికవిత మన యాంధ్రమందుఁ బొడసూపుచునే వచ్చినది. పదకవిత్వమంతయు నట్టిదిగాఁ బూర్వము గమనించి యున్నాము. దేశీయ వృత్తములలో నాదవ్యక్తిగల సులభ పద సంపుటులతో వర్తిలిన దేశికవిత పామరులఁ బ్రబోధించి సంస్కరించుటకే యుద్దేశింపఁబడినది.

అట్టి దేశికవితలో రూపక ప్రక్రియగూడ నంకురావస్థ నొందిన ట్లూహింప వీలున్నది.[1] మన దేశములో ప్రచార మందున్న తోలుబొమ్మలాటలు ప్రదర్శనమునకుఁ బ్రాతిపదిక లేమో యని యనుమానింప వచ్చును.[2] ఈ దేశిసరణికిఁ జెందిన నాటకమే 'యక్షగాన' మను పేరుతో వర్ధిలినట్లు కనుగొందుము. యక్షగాన మననది సంస్కృత పదమైనను సంస్కృతమున నిట్టిది గానరామి పండితు లీ ప్రక్రియను బెద్ద పేరుతోఁ బిలువదలఁచి 'జక్కులపాట' యనుదానిని సంస్కృతీకరించి యుందురని శ్రీ పింగళివారి యభిమతము. జక్కుల వారను వృత్తి సంఘములలో నొక తెగకుఁ జెందినవారు. వారి విశిష్టమైన గానమును పాడుచుండుటచే నది 'జక్కుల

1 గ్రీకు నాటకముకూడ ననాగరికులైన పల్లీయుల వినోదార్థ మంకురించినట్లు తెలియుదుము.

2 The simple puppet-show is everywhere the most recent form of dramatic representation and it was in India.
—*Pichael.*

పాటే యైనది. వారే దేశి రూపకములఁ బాడుచు నభిన యించెడివారు కాబోలు!

ఈయక్షగానములు శ్రీనాథుని కాలమునాఁటికేయున్నట్లు తెలియుటకుఁ దత్ప్రశంస భీమేశ్వర పురాణమందుఁగన్పించు చున్నది.[1] క్రీడాభిరామమును వీథినాటక మని యనుచున్నారే కాని, తల్లక్షణము లెవ్వియు దాని కన్వయింపకుండుట[2] చే నది మన కే విధముగాను దోడ్పడదు. పెద్దన కాలమునకు నాటకశాల లున్నట్లు తెలియవచ్చుచున్నది గాని యితరము లైన యాధారములు లేకున్నవి. తుదకు నాయక రాజుల కాల ములో గీతికిఁ బ్రాధాన్యము వచ్చినది గాన యక్షగానము లను నవి కుప్పదిప్పలుగా నాటికవులు వ్రాసినారు.

ఈ యక్షగానముల స్వరూపము విచిత్రమైనది.[3] కథను బోధించు కీర్తనలఁ గైకొని వానికి మధ్య నటులు తమ వచన ములను గలుపునట్లు నిర్మితములైనవి కొన్ని యున్నవి; కీర్త నలతోఁబాటు దేశీయ గేయవృత్తములుజేరి కొన్నియున్నవి. తరువాత వచ్చిన కవితాప్రౌఢిమచేతను, దదితరాంగ శోభ చేతను యక్షగానములు ప్రత్యేకత గడించినవిగాఁ దెలియు

1 కీర్తింతు రద్దాని కీర్తి గంధర్వులఁ, గాంధర్వమున యక్ష గాన సరణి.
—భీమ ఖం. 3 63.

2 చూ: శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి దశరూపక పీఠిక.

3 'మధురకవితలు' అను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వ్యాసము చదవదగి నది. ఆంధ్ర విశ్వవిద్యాలయమునో శ్రీ యస్వీ జోగారావు యక్షగాన ముల గూర్చి యుటీవలఁ బరిశోధను సాగించి 'డాక్టరేటు' పొందిరి.

చున్నది. ఆ నాఁడు ప్రోత్సాహమందిన నటులలోఁ బ్రధాన ముగాఁ బల్లీయులేయుండి రనుటకు మొన్న మొన్నటివఱకుఁ బ్రచారములోనున్న వీధిభాగవతులే నిదర్శనము. కావుననే యేనాదివా రభినయించు దానిని 'ఏనాది భాగవత' మనియుఁ గూచిపూడివా రాడుదానిని 'కూచిపూడి భాగవత'* మనియుఁ బ్రజలు వ్యవహరించుచు వచ్చినారు. ఇప్పటికిని వీని స్వరూపము లచ్చటచ్చటఁ గానఁగల్గుదుము. కూచిపూడివారి భామ కలాపము గొల్లవేషములు సుప్రసిద్ధములు! వారి నుద్ధరించి యభినయకళను నిల్పుకొనవలసిన కర్తవ్యమీనాఁడు మనపై నున్నది. ఇట్లు పదునేడవ శతాబ్దము మొదలు పందొమ్మిదవ శతాబ్దమువఱకు యక్షగాన రచనము సాగుచునే వచ్చినది. ఈయక్షగానము లెక్కుడమముద్రితములుగా తంజాపుర పుస్తక భాండాగారముననే నిలిచియుండుటచే నివి ప్రాచుర్యము నొందకున్నవి. ఈశతాబ్దములో నీయక్షగాన సరణిక్రమముగా మారి 'హరికథా' రూపమును ధరించినది. బహుపాత్రాభినయమునకు యక్షగానములోవలెఁ దావులేక హరికథ లేక పాత్రాభినయమున కవకాశమిచ్చునవై వరలినవి. ఈ'హరికథ' గానజాతి కన్న విశిష్ట ప్రక్రియగా గణింపవలెను.

ఇవ్విధముగా దాదాపు గత శతాబ్దాంతము వఱకు నాంధ్రములో దేశినాటకములు గన్పించుచున్నవిగాని మార్గ నాటకములు లేకున్నవి. ఆంగ్లసాహిత్యప్రభావము క్రమముగా మనలను లోఁగొనినది. ఉత్తర దేశమునుండి గతశతాబ్దపుమధ్య

* శ్రీ దివాకర్ల రామమూర్తిగారి వ్యాసము: 'వ్యాసావళి'లోఁ జూడఁదగును.

కాలములో నాటక (ధార్వాడ) కంపెనీలు వచ్చి మన యాంధ్ర ప్రాంతమునఁ బ్రదర్శనముల నిచ్చుటచేఁ మనవారిలోఁ గొంత కదలిక బయలుదేరినది. ఇవి కారణములుగా రూపక రచనా ప్రయత్నములు విరివిగా సాగినవి. రాజమహేంద్రవరములోఁ గుంటూరులో, బళ్ళారిలో, విజయనగరములో, నెల్లూరులో నాటక కంపెనీలు వెలసినవి. వారు ప్రదర్శించు నిమిత్తము కవులు నాటకముల రచించుటకుఁ బూనినారు; ప్రథమ శకము సంస్కృతాంగ్ల నాటకముల ననువదించుటతోఁ బ్రారంభమైనది. కోరాడ రామచంద్రశాస్త్రిగారు "మంజరీ మధుకరీయ, శాకుంతల, వేణీసంహార, ముద్రారాక్షసనాటకము"లను, వావిలాల వాసుదేవశాస్త్రిగారు షేక్స్పియరు వ్రాసిన 'సీజరు'ను,* భవభూతి వ్రాసిన 'ఉత్తర రామచరితము'ను తెనుఁగున కనువదించినారు; అట్లే వీరేశలింగము పంతులు 'వెన్నిసు నగర వర్తకుఁడు', 'అభిజ్ఞాన శాకుంతలము' 'మాళవికాగ్నిమిత్రము', 'ప్రబోధచంద్రోదయము'ల ననువదించినారు. వేదము వేంకటరాయశాస్త్రిగారు 'ఉత్తరరామచరిత్ర' 'శాకుంతలము' 'రత్నావళి', 'నాగానందము'ల ననువదించిరి. తిరుపతి వేంకటకవులు "ముద్రారాక్షస, మృచ్ఛకటిక"ల ననువదించినారు; వడ్డాది సుబ్బారాయకవి 'వేణీసంహారము' విరచించినారు. ఈ విధముగా నెందరెందరో సంస్కృత నాటకముల ననువదించినారు; నేఁటికి ననువదించు

* ఇటీవల శ్రీ వావిలాల సోమయాజులు 'సీజరు, ఆంటోనియో క్లియోపాత్రలను' శ్రీ 'అమరేంద్ర' 'మాక్బెత్' నాంధ్రీకరించినారు.

చున్నారు.* ఆంగ్లనాటకానువాద మింతవిరివిగా జరుగలేదు. దీనికిఁ గారణము సంప్రదాయ భిన్నతయే కావచ్చును.

తరువాత ననువాదములకన్న స్వతంత్రనాటకముల రచింప వలెననెడి కుతూహలము కవులకుఁ గలిగినది. తత్ఫలముగాఁ బురాణగాథలను, చారిత్రకాంశములను దీసికొని నాటకరచన చేయుచువచ్చిరి. ధర్మవరము కృష్ణమాచార్యులవారి "విషాద సారంగధర, చిత్రనళీయము, ప్రహ్లాద, ప్రమీలార్జునీయము, చంద్రహాస" మొదలైనవి; కోలాచలము శ్రీనివాసరావుగారి 'తల్లికోట యుద్ధము'; బలిజేపల్లి లక్ష్మీకాంతముగారి "సత్య హరిశ్చంద్రీయము", శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి "బొబ్బిలి యుద్ధము", తిరుపతివేంకటకవుల 'పాండవోద్యోగవిజయములు'; వేదము వేంకటరాయశాస్త్రిగారి "ప్రతాపరుద్రీయము"; పానుగంటి లక్ష్మీనరసింహరావుగారి "పాదుక", రాధాకృష్ణ, "విప్రనారాయణలు"; చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి "గయోపాఖ్యానము", "పారిజాతాపహరణము", ధర్మవరము గోపాలాచార్యులవారి "రామదాసు" మొదలైనవి పై శ్రేణికిఁ జెంది ప్రయోగార్హతను బొంది ప్రజామోదము నొందిన సుప్రసిద్ధ స్వతంత్ర నాటకములు.

తరువాత సాంఘికసమస్యల నెదుర్కొనెడి నాటకముల

* భువనగిరి విజయరామయ్య, బులుసు వెంకటేశ్వర్లు, దివాకర్ల వేంకటావధాని, వల్లంపల్లి నరసయ్య, వేదము వేంకటకృష్ణశర్మ, కప్పా శ్రీఆంజనేయశాస్త్రి, భాగవతుల మార్కండేయశాస్త్రి, పంగనామముల రామచంద్రరావు గార [illegible] చెప్పఁదగినవారు.

వ్రాయ సంకల్పించినవారిలో వీరేశలింగముగారు ప్రహసనములు వ్రాసి, గురజాడ అప్పారావుగారు "కన్యాశుల్కము" వ్రాసి స్థిరకీర్తి వడసినారు. వీరేగాక, కాళ్లకూరి నారాయణరావు, బళ్ళారి రాఘవాచార్యులు, విశ్వనాథ సత్యనారాయణ గుళ్ళపల్లి నారాయణమూర్తి, వద్దాది శ్రీరామమూర్తి, కొప్పరపు సుబ్బారావు, శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి, సోమరాజు రామానుజరావు, దామరాజు పుండరీకాక్షుఁడు, ఊటుకూరి సత్యనారాయణరావు, దర్భా వెంకట కృష్ణమూర్తి, నండూరి రామకృష్ణమాచార్య, మంచికంటి వెంకటేశ్వరరావు గారలు మున్నగువా రెందరెందరో పలు విధములైన వస్తువులతో, శైలులతో నాటకములు రచించినారు.[1]

కాని, నాటక నిర్మాణమునకుఁ గావలసిన వివిధ శక్తులలో సంపూర్ణముగా నన్నిశక్తులుండి రచింపఁబడిన నాటకమూర్తి నేటికి నవతరింపలేదని చెప్పవలెను. రమణీయమైన కవితయుండి, చతురమైన సంభాషణములుండి, నిబిడమైన కథాసన్నివేశము నేరుకొని, చక్కని పాత్రోన్మీలనముచేసి, కావ్యత్వము నొందఁగలిగి, ప్రయోగ గౌరవము బడసెడి నాటక మవతరింపవలసియే యున్నది! నేఁడుపలభ్యమానములగు

1 శ్రీ వావిలాల సోమయాజులు రచించిన "నాయకురాలు," శ్రీ పింగళి నాగేంద్రరావు రచించిన "వింధ్యరాణి," శ్రీ వేదాంతకవి వ్రాసిన "తెలుగుతల్లి," శ్రీ కేశవభొట్ల వేణుగోపాలమూర్తి వ్రాసిన "పరశురామ" మను నాటకము లిటీవలఁ బెక్కుచోట్లఁ బ్రదర్శితములై వ్యాప్తిఁ జెందినవి.

నాటకములలోఁ గొన్ని లక్షణము లన్వయించునవే యున్నవి. కాకపోయిన సర్వాంగ పరిపూర్ణమగు రూపకములేని కొఱత యుండనేయున్నది. అసలు సృష్టిలోనే పరిపూర్ణతలేదు గనుక మనము విచారింపరాదేమో!

ఆంగ్లసాహిత్యపు సంపర్కమువలన మన నాటక నిర్మాణములోఁ గొన్ని సంప్రదాయములు తొలఁగిపోయినవి. "దశరూపకము"లోని లక్షణమున కేనాఁడో మనము దూర మైనాము. స్వాతంత్ర్యము ప్రబలిన కొలఁది సంగీతము హెచ్చ యినది; దశాంకములు, పంచాంకములు క్రమముగాఁ క్షీణింపఁ జొచ్చినవి. 'మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతాని కావ్యాని' యను సంప్రదాయము ప్రాఁతవడి యాంగ్లమందలి 'ట్రాజిడీ' (కరుణాకము)పై భ్రమ పుట్టినది. అరిస్టాటిలుఁ ప్రతి పాదించిన యైక్యత్రయ సూత్రము (Three Unities) నెఱిఁగి యూప్రకారము కవులు సాధనమును సాగించుచు వచ్చినారు. రంగస్థల నిర్మాణములోఁగూడఁ బాశ్చాత్యులే మనలను దిద్దు చున్నారు.* వారి గురుత్వము సంపూర్ణముగా నేఁటి మన రూప కముల మీఁద నున్నట్లు తెలియఁగలము. ఇఁకనైనఁ మన ప్రాచీన లాక్షణికు లేర్పఱచిన సూత్రముల ననుసరించి భారత

* శ్రీ కుర్మా వేణుగోపాలస్వామిగారి యవిశ్రాంత కృషి ప్రోత్సాహములవలన నాంధ్రదేశమున «ఆరుబయట రంగస్థలములు» (open-air theateres) ఏర్పడి యౌత్సాహిక నటుల నాకర్షించినవి. ఇవ్విధముగా నాంధ్ర నాటకరంగమున నూతన శకము ప్రారంభమైనది!

దేశపుం బ్రత్యేకతం జాటుటకుం బూనుకొని భరతశాస్త్ర* మందలి రంగస్థలమును దెలిసి తదనుగుణములైన నాటకశాలల రచించుటకు మనవారు శ్రద్ధ వహింపవలసియున్నది. దేశి నాటకములైన యక్షగాన వీధి భాగవతముల నాదరించుచు మార్గనాటక నిర్మాణమునకై పరిశ్రమల చేయవలసియున్నది. అట్లు చేసినచో మన కవులు సాహిత్యములో నుత్తమ ప్రక్రియను సాధించి యేతల్లోపమును దొలగించిన వారగుదురు.

[రచన : నవంబరు 1945]

---

* భరతుని నాట్యశాస్త్రమును శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారు 'నాట్యవేద' మనియు, శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు 'నాట్యశాస్త్ర' మనియు నాంధ్రమున వ్రాసి యిటీవలనే ప్రచురించినారు.

౧౦

రూపకవికాసము

ఏకాంకిక

మానవులు నిత్యనవ్యతాగవేషణులు. ఈ ధర్మము కవులకును వర్తించును. సాహిత్యములో నే యుగమున కా యుగము నూతనముగాఁగన్పించును. ఒక్కొక్క యుగములో నొక్కొక్క ప్రత్యేకత, విశిష్టత గడించినది సాహిత్యము. రానురాను నేఁటికి నవయుగము వచ్చినది.

ఈ యుగములో వచ్చిన నవ్యసాహిత్యములో మూఁడు విశిష్టరూపము లున్నవి. అవి: ఖండకావ్య, కథానికా, ఏకాంకికలు. లోతుగాఁ బరిశీలించిన నీమూఁడును మనకుఁ గ్రొత్తవి కావనినట్లును, పూర్వము మనకున్న కావ్యభేదముల కివి ప్రాతిపదిక లనునట్లు గోచరించును. ఎట్లనగాఁ బ్రబంధమునకు ఖండకావ్యము, నవలకుఁ గథానిక, నాటకమున కేకాంకిక సూక్ష్మరూపములు; పూర్వరూపములును!

ప్రబంధము—నవల—నాటకము – ఈ మూఁడును విస్తృతమైన వస్తుప్రకలవి. వీనిలోఁ బ్రాసంగికములు, నుదాహరణములు, చిత్రకథలు, నధికవర్ణనములు మొదలైనవి యెన్నియో యిమిడి వస్తువిస్తృతికి దోహదము చేయును. కాని నవ్యయుగములో వచ్చిన ఖండకావ్యము, కథానిక, ఏకాంకిక లట్లుకావు. వీనిలో వస్తువు సూక్ష్మమైనది. రచనమే చాలఁ బ్రధాన

మైనది. ఈ రచనములో నుద్వేగము, సౌజ్జ్వల్యము కలిగి, ప్రధాన విషయమును సూటిగా, సరళముగా, సులభముగా బోధించుశక్తి యుండవలెను. వీనిలో నుండునది యొక్క సన్నివేశమే. ఆ యొక్క సన్నివేశము రచనాప్రభావమువలన హృదయమును చప్పున నాకర్షించి, రసానుభూతిని పొందఁజేయవలెను. నవ్యయుగములో వచ్చిన యీ మూఁడురూపములు స్వల్పకాలపరిమితములు. అత్యల్ప వస్తువుతో ననంత మగు రససిద్ధినిఁ బొడింపవలెను. సూక్ష్మములో మోక్షము పొందించుట వీనిసూత్రము; నవ్యుల యత్నమును.

పూర్వము మనకీ విధమైన సాహిత్యమున్నదా యను ప్రశ్న కున్నదనియే సమాధానము. కాని యీ యుగములోఁ దిరిగినన్ని మలుపులును, వచ్చినన్ని మెఱుఁగులు నపుడు లేవనియే యొప్పుకొనవలెను. మనపూర్వ ప్రబంధములలో నున్న వర్ణనము లన్నియుఁ బ్రత్యేకముగా గ్రహించిన ఖండకావ్యములుగను, పురాణములలో నున్న ప్రాసంగికము లన్నియుఁ గథానికలుగను, రూపకభేదములలో ధనంజయాదులు లక్షీకరించిన వీథి, అంకము భాణము, ప్రహసనముల నేకాంకికలుఁగను పరిగణింపవచ్చును. ఇవి యీ విధముగా మనకు విజాతీయములుగాక, సజాతీయములే యన్నట్లు తెలియుచున్నది. ఇప్పుడున్న స్వయం సంపూర్ణత్వము, కళావిషయకము లైనవైక్యతలు పూర్వము లేవు. అనఁగా,నాయాకావ్యములలో నవి యంగములుగ నున్నవి. కాని, ప్రత్యేక కళాసిద్ధి పొందగలుగు 'అంగి'గా నిలువలేకపోయినవని స్పష్టముగాఁ దెలి

యును. ఆయా ఘట్టములనే నవ్యులు గ్రహించి చిత్రించినవుడు పూర్వసాహిత్యములో లెక్కకుమీరి యిట్టి సన్నివేశములున్న వని ద్యోతకమగును. కనుక నాంగ్లములోని ఏకాంకికా లక్షణ ములను వీనికి ననువర్తింపఁ జేయవలసివచ్చును. ఇప్పుడు నవ్య సాహిత్యోద్యానమున వికసించిన మూఁడు పుష్పములు పాశ్చాత్యభావ పురస్కృతములు.*

ముందు మనవిచేసిన ఏకాంకనాటికలో నొక్క సన్నివేశమే యుండవలెను. నాటకకారుఁడన్ని యంకము లలోఁ దీసికొని రాగలుగు విభావానుభావ సాత్త్విక వ్యభి చారీ భావ సంయోగమును, నేకాంకనాటికా కారుఁ డొక్క యంకములోనే తీసికొన రావలయును. ఉదాహరణమునకుఁ జిన్నపిల్లలు చిన్న చిన్న లాటియాకు బొమ్మలతో జీవితము లోని ఘట్టములను సూచించుచు నాడుకొందురు. అనఁగా వారు మానవజీవిత మంతటికిని సూక్ష్మాకార మిచ్చు చున్నారన్నమాట! అట్లే ఏకాంకిక మహానాటకమునకు సూక్ష్మరూపమైనను,వస్తువిస్తృతిలేక-యున్న యొక్క-ఘట్టము ఘనపూరితముగాను, హృదయమును కదలించి కరగించు నదిగా నుండవలెను. పాత్రౌచితి, సంభాషణాచాతురి, కథా కథనపద్ధతి, హాస్యాపరముల సమత, వస్తువుయొక్క బీజ,

* ఆంగ్లమునుండి మోలియర్, మీటర్‌లింక్, మున్నగువారి నాటిక లనువదింపఁ బడుచున్నవి. ఇతరులతోఁ బాటు డా. గోపాలరెడ్డిగారు దీక్షగొని రవీంద్రనాథ ఠాకూరు నాటికల ననువదించినారు. రష్యన్ నాటికలు తెలుఁగులోనికి నిటీవల కొల్లలుగ దిగుమతి యగుచున్నవి.

గర్భ, నిర్వహణములు మొదలైనవి యన్నియు మహానాటక కారునివలెనే యేకాంకికా కారుఁడు ననుసరింపవలెను. ప్రయోగ, పఠనయోగ్యత లనెడి రెండు ధర్మము లేకాంకికను వర్తించును. కాని యేకాంకిక ప్రదర్శనము వైపునకే యెక్కువ మొగ్గును. ఆ ప్రదర్శనములో ననుకొనని క్రొత్త మలుపులతో వస్తువు ముగిసి సామాజికులను భయ సంభ్రమాశ్చర్యములలో ముంచివేయవలెను.

ఏకాంకికా నిర్మాణమంతయుఁ గథానికా నిర్మాణమును బోలియుండును. కాకపోయిన నా కథనే నాటకీయము చేయుట యుచట ధర్మము. అందుచేతనే "In dramatic composition, the equivalent of the short-story is the One-act play" అనినాఁడు బ్రాండరు మాథ్యూస్. ఏకాంకిక చక్కఁగా రచింపఁగల సమర్థుఁడు మహానాటక ప్రదర్శనము నానందించునట్లు శిక్షణ మిచ్చునని మారియెట్ అన్నాఁడు.

స్టీవెన్సన్, కథానికను గురించి చెప్పిన సూత్ర మేకాంకికను వర్తించునని చెప్పవచ్చును:-

1. పాత్రలనుబట్టి, వాతావరణమును, సందేశమును చిత్రించుట.

2. సందేశమును బోధించు నిమిత్తము, పాత్రలను వాతావరణమును సృష్టించుట.

3. వాతావరణమును జూచి పాత్రలను, సందేశములను గల్పించుట.

ఏకాంక నాటకము ముఖ్యముగా సంభాషణముమీఁద నాధారపడి యుండును గనుక సంభాషణములు, సూటిగాఁ జిత్రముగా, వ్యంగ్యముగాఁ బలువిధములుగనుండి పాత్ర చిత్రణములోను, కథావేగములోను దోహదము చేయ వల యును. భాషా విషయములోఁ బాత్రోచితభాష తప్పక యుపయోగింపవలెను; దీనికి ననుభవము చాల నవసరము. నాటిక యంతయు నొక సందేశము నందించుచుఁ బ్రతి యంశము నా ధర్మోన్ముఖమై యుండవలెను.

ఏకాంకికా స్వరూపమును గురించి యింతవఱకుఁ జెప్పిన దాని సారాంశమును సూత్రప్రాయముగాఁ జెప్పవలెననినచో నిట్లుండును:—

1. భావనైశిత్యము 2. ఏకాగ్రత 3. సమగ్రత 4. ఎకైక సన్నివేశము 5. పరిమిత పాత్ర సంఖ్య 6. అర్థబంధు రత 7. పాత్రోన్మీలనము 8. సరిస సంభాషణములు 9. రచనా సౌలభ్యము 10. ఐక్య త్రయ సత్త్వము 11. సందేశ దాయ కత్వము 12. ప్రయోగ గౌరవము – అను నవి యన్నియు నుండవలెను. ఇన్ని యుండియు వస్తువు సార్వజనీనమైనది కాకపోయినచో, నది యెంతయోకాలము నిలువను నిలువదు; ఉద్దిష్ట రసానుభూతినిఁ గలిగింపను గలిగింపదు. కాబట్టి విశ్వజనీ నముగా నుండుట కావ్యధర్మము.

ఇఁక తెలుఁగులో (1940 నాఁటికి) నేకాంకికా రచయిత లను,వారిరచనములను పరికింతము:ఖండకావ్య కథానికలు పెరిగి పోయినవి. ఏకాంకికారచన మిటీవలనే బయలుదేరి సాగు

చున్నట్లు కనఁబడుచున్నది. లెక్కకుఁ జాలఁ గన్పించినను, పరీక్ష కాఁగునవి చాలఁదక్కువ. ఒక్క విషయము చెప్ప వలెను: ఖండ కావ్యరచనములో మనవారు సిద్ధహస్తులైనారు; కథానికారచనములో యత్నించుచున్నారు; ఏకాంకికారచన ములోఁ బ్రాథమికావస్థలో నున్నారు.

ఏకాంకికా సాధకులలో—నోరి, తల్లావఝ్ఝల పితృ పుత్రులు, చింతా, చిలుకూరి, అబ్బూరి, విశ్వనాథకవిరాజు, మల్లాది అవధాని, రామకృష్ణశాస్త్రి, రామకృష్ణ శర్మ, శ్రీపాద, మొక్కపాటి, భమిడిపాటి, ఇంద్రగంటి, ముద్దుకృష్ణ, చలం, విశ్వనాథ, గిరి, దేవులపల్లి, రజనీ, నార్ల, జానకిరాం, కొండముది గోపాలరాయశర్మ, జి.వి.కృ., సాధనసమితిసభ్యులు కొందఱు (భాగీ, సూర్యచంద్రులు, రాజలింగం, భండారు, పి.వేం.హా. కేశవస్వామి, సన్నిధానం) మొదలైనవారున్నారు.*

వీరి రచనల నన్నిఁటినిఁ బరిశీలించినచో, ఏకాంకికలు నాలుగు విభాగములుగాఁ గన్పించుచున్నవి: 1. వచన నాటిక

* శ్రీ పి. వి. రాజమన్నారుగారు ప్రముఖ నాటికా కర్తలైరి. రేడియో నాటికలను శ్రీయుతులు కపిల కాశీపతి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేమూరి వేంకట రామనాథము, పన్యాల రంగనాథరావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, "బుచ్చిబాబు", వింజమూరి శివరామారావు, జలసూత్రం, "అమరేంద్ర", 'ఆరుద్ర', పి. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి, విశ్వం - మున్నగువారు సాధించినారు. శ్రీయుతులు మల్లంపల్లి సోమశేఖరశర్మ, భావరాజు వెంకట కృష్ణారావు, మారేమండ రామారావు గారలు చారిత్రకాంశములతో ఏకాంకికలు రచించినారు. పిల్లలకొఱకు నాటికలు వెలువడుచున్నవి.

2. గేయనాటిక 3. పద్యనాటిక 4. రేడియోనాటిక. చారిత్రక, సాంఘికములనెడి యంతర్విభాగ మున్నది. ఆయా ప్రధానరసము ననుసరించిన విభాగము కన్పించును. వీనిలో వచననాటికయే యుత్తమమయిన ట్లంగీకరింపవలెను. గేయము హృదయద్రావక గుణము కలిగినది; కాబట్టి గేయనాటిక రసానుభూతిని సత్వరముగా సమకూర్చుననియే చెప్పవలెను. 'రజనీ' గేయనాటిక లెన్నఁదగినవి. పద్యనాటికల విషయములో 'సభాపతి' (శివశంకరశాస్త్రిగారు) సిద్ధహస్తులు. రేడియో యేకాంకికకుఁ జక్కని యాలంబన మిచ్చుచున్నది.

పైఁ జెప్పిన రచయితల యేకాంకికలు నే నుల్లేఖించిన సూత్రము లన్నిఁటి నొప్పించునవికావు. కాకపోయిన నొక్కొక్కరి రచనములో కొన్ని సూత్రములు మాత్రమే కన్పించును. ఉదాహరణమునకు: శ్రీపాద సంభాషణాచాతుర్యములో, చిలుకూరి నాటకీయమైన వస్తువు నేరికొనుటలో, మొక్కపాటి రేఖాగ్రతలో ప్రతిభ చూపినారు. అట్లే ఒక్కొక్కరు కొన్ని లక్షణములు పట్టునవిగా వ్రాసినారు. కాని, సర్వాంగ సుందరముగా నన్ని లక్షణముల నొప్పించు నేకాంత నాటిక యింకను తెలుఁగులో రాలేదనియే చెప్పవలెను. నోరి వారి 'ఖేమాభిక్కసి' అను నాటికమాత్రము చాలవఱ కన్ని లక్షణములు కలిగి యాదర్శనాటికకు సమీపములో నున్నదని

చెప్పవచ్చును. సర్వలక్షణ సమన్వితమైన నాటిక తెలుఁగులో నిర్మించుటకు నవ్యులు ప్రయత్నింతురని యాసింతును.♦

[8-6-1943 తేదీన హైదరాబాదు రేడియో నిలయమునుండి నేను జేసిన మొదటి ప్రసంగము.* «హైదరాబాదు సమాచారము»లోను «ప్రజామిత్ర» ప్రకటితము.]

♦ శ్రీ ఆత్రేయ వ్రాసిన 'ఆద్దె కొంప' (N.G.O.), పులుగుండ్ల వారి తుపాను వాస్తవిక శిల్పముకలవై ప్రేక్షకుల నాకర్షించుచున్నవి. పినిశెట్టి, రామదాసు, గంగాధరం, శాస్త్రవారల ఏకాంకికలు ప్రాముఖ్యము పొందుచున్నవి. ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక రచనమునకు దోహదము చేయుచున్నది.

* నా తరువాత, డాక్టరు శ్రీ పాద గోపాలకృష్ణమూర్తిగారు 'ఏకాంకికల' వ్రాసిన 'వ్యాస పరంపరను' «ప్రతిభ - భారతి» పత్రికలలో ప్రచురించినారు. 3. నారాయణరెడ్డి గారి «రామప్ప» మనోహరమైన సంగీత రూపకము.

౧౧

సాహిత్య పరిణామము

ఓమ్

సహనావవతు సహనౌ భునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీత మస్తు
మా విద్విషావహై.

—ఆంధ్రసాహిత్యార్చకులకు నమోవాకములు—

కృతజ్ఞత:

- మీరీనాఁడు నాకుఁ జేసిన యీ గౌరవమునకుఁ గృతజ్ఞుఁడను. ఈ యధ్యక్షస్థాన మలంకరింపఁదగిన యోగ్యతాధికారములు నాకు లేవు. వయోవృద్ధులు, జ్ఞానవృద్ధు లనేకులుండగా దీనికి తగుదునని, నే నంగీకరించుట సాహస కార్యమే. నాబోటి కించిజ్ఞుని నీ సమావేశమున కధ్యక్షత వహింప నాజ్ఞచేసి మీరేమి సాధింపఁ దలచినది నే నూహింపలేను. అకారణముగా పక్షపాత మలవడినచో ప్రతిక్రియ లేదని పెద్ద లందురు. శారదాదేవి యాశీర్బలముతో, సహృదయులైన సభాసదుల సానుభూతితో నా కర్తవ్యమును శక్తివంచనలేక కొనసాగింతునని మనవి చేయుచున్నాను.

అంజలి:

ఆంధ్రులు విలక్షణమైన గుణములను గలిగిన ప్రత్యేక జాతికిఁ జెందిన వారు. విజ్ఞానమున కాంధ్రదేశ మొకప్పుడు నెలవై చెన్నొందినది. ప్రాచీనులైన నాగులకు నాంధ్రులకును సంబంధమున్నట్లు వారి యాచార వ్యవహార

ములను బట్టి యూహింప వీలున్నది. ఎతచ్చిహ్నముగా నాదిశేషు వృషాస్య దైవముగా నిల్చినాఁడు. కావుననే కాబోలు నిప్పటికిని కొన్ని జనపదము లలో నాగారు బొమ్మ గ్రామదేవతగా నారాధింపఁబడుచున్నది. మీఁద మిక్కిలి శేషువు విజ్ఞానమున కుపలక్షకము. ఆంధ్రులకును, ఆదిశేషువునకు నింతటి చక్కని సంబంధము పొసగుటచే నీ సందర్భమున ననంతుని స్తుతించు కొనుట జాతిసంప్రదాయమననుసరించి నట్లగును. ఆదికవియైన నన్నయ భట్టాచార్యుని వాక్యసరణి మన కనుశాసనము గావున నాతని పదములలోనే పల్కెదను :

> జహ్ను వన పాదపాబ్ధి కుల పర్వత పూర్ణసర స్సరస్వతీ
> సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాలి దాల్చి దు
> స్సహతర మూర్తికిన్ జలధిశాయికి శాయక శయ్యయైన య
> య్యహిపతి మత్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్.
>
> —భారతము. ఆది. ౧ ఆ. ౧౯౪

ప్ర వే శి క

ఆంధ్రులది పాలకజాతి. క్రీ. పూ. సుమారుగా 234 నుండి క్రీ. శ. 207 వఱకు నాంధ్రరాజులు దేశమును పాలించి నారు. శాతవాహను లాంధ్రులని చారిత్రకుల సిద్ధాంతము. ఈ యాంధ్రరాజుల పోషణమున వైదిక, జైన మతములు వర్ధిలినవి. కాని వైదిక మతమునే వారనుసరించుచు వచ్చినట్లు వారు చేసిన యశ్వమేధాది యాగములే ధృవపఱుచుచున్నవి. నాఁటి సంఘము వర్ణాశ్రమధర్మములకు బద్ధమై యొప్పారినది; కావుననే విషమమైన సంఘర్షణములు లేకపోయినవి. ఆనాఁటి ప్రజలు శాంతియుతమైన జీవితమును గడపినారు. శ్రద్ధాభక్తులు,

మాటమర్యాదలు, ధైర్యసాహసములు, వినయవిభూతులు వారి మనసులలో సంపూర్ణావకాశమును బొందినవి.[1] సంస్కృత భాషాసాహిత్యములే నాఁటి పండితుల యాదరము వందినవి. వాని సంప్రదాయ సూత్రాదులే యాదర్శవంతము లుగా భావితములైనవి. తరువాత హాలుఁడు ప్రాకృతమందును, గుణాఢ్యుఁడు పైశాచియందును గ్రంథములను రచించి కాబోవు తెనుఁగు సాహిత్యమునకు మార్గదర్శకులైనారు.[2] నాఁటికి నాంధ్రభాష రాజస్థాన ప్రవేశమున కర్హత గడింప లేదు. దైనందిన వ్యవహారములో నుండి జనబాహుళ్యము నాశ్రయించినదే కాని రాచరికమును, ఉత్తమ సాహిత్యము నాధారముగాఁ జేసికొన లేదు; పసితనములో నుండి యవ్యక్త మధురనాదము లీను జిలిబిలి పలుకులతోఁ బ్రజలహృదయ ముల నార్ద్రీభూతము లొనర్చుచుండినది.

సాహిత్యమునకు మతమే ప్రోద్బలము

క్రీ. శ. ఏడవ శతాబ్దమునకు—అనఁగా చాళుక్యరాజుల పరిపాలనాకాలములో నాంధ్రభాషకుఁ గ్రమముగా గౌరవము లభించినదని తెలియుటకు వారి శాసనములే నిదర్శనములు. నాఁటికి నార్థసంతి ప్రచారక ముద్ధతిమైనది. బౌద్ధ వాఙ్మయము ప్రాకృతమున విరివిగా వెలువడఁ జొచ్చినది. వైదిక మత సంప్రదాయముల నిలుపఁ బ్రోత్సహించవలసిన కర్తృత్వము హెచ్చి

1. 2. చూ: ఆంధ్రుల గుణగణములనుగూర్చియు, హాలగుణాఢ్యులగూర్చియు 'సరస్వతీ సామ్రాజ్యము' - 'సంస్కృతి సమ్మేళన సంచిక' లందు ఆచార్య శ్రీ కురుగంటి వారు వ్రాసిన వ్యాసములు.

నది. సంఘ జీవనము దేశకాల పరిస్థితుల ననుసరించి మార్పు చెందుచుండును. దీని ననుసరించియే యా యా జాతి సాహిత్యములు వర్ధిలుచుండును. పూర్వ సాహిత్యములో సంఘ జీవితము ప్రతిబింబించుట లేదని యిటీవల కొందఱభి ప్రాయపడుచున్నారు. కాని అది సరిగాదు. పదునొకండవ శతాబ్దములో* చాళుక్య నృపాలుఁడైన రాజరాజు వైదిక మతప్రచారార్థము దీక్ష బూనినాఁడు; ఆంధ్రవాగనుశాసనుఁడైన నన్నయభట్టారకుని పవిత్రవచస్సుతో నాంధ్ర భారతావతరణము సాఁగినది. మహితాత్ముఁడైన నన్నయ స్వస్థాన వేష భాషాభిమతులయి, రస ప్రలుబ్ధములయిన మనస్సులు గల వారయి పెద్దలు దేశ భాషా కావ్యముల గౌరవింపవలెనని ప్రబోధించినాఁడు. ఈవిధముగా నాంధ్రదేశ భాషాసాహిత్యములపై నాదరాభిమానము లుద్బుద్ధములైనవి.

దేశి కవిత—వితత్ప్రభావము

ఇంతలో వీరశైవమతము విజృంభించినది. తత్ప్రచారము నిమిత్తము వాఙ్మయ మాశ్రయమై వృద్ధికాఁజొచ్చినది.* ప్రజల కందుబాటులో భాషాభావము లుండవలెననెడి యభిప్రాయము బౌద్ధకాలము నాఁటికే యుదయించి యీకాలమున నభివృద్ధి నొందినది. సులభబోధకై "దేశికవిత–జాను తెనుఁగు" లత్యంత పస్కారకము లుగాఁ గనిపెట్టినారు. శబ్ద కాఠిన్యము

* ప్రాఙ్నన్నయ - నన్నయ యుగములలోని సంస్కృత వాఙ్మయమునూర్చి యిటీవలఁ బరిశోధనమూ సలిపి శ్రీ దివాకర్ల వేంకటావధాని గారు ఉస్మానియా విశ్వవిద్యాలయమందు "డాక్టరేటు" పొందిరి.

లేక సరసమగు పదములతోఁగూడి, స్వరరాగ రంజితమై, ప్రజల యాచారవ్యవహారములకుఁ బ్రతిబింబమై, జాతీయముల నిమిడ్చికొనినదై పామరుల కష్టములను మరపించి కార్యసాధనములో నుత్సాహమును బ్రసాదించునట్టిదైన పదకవిత్వమునకు బీజ మానాఁడే నాటఁబడినది. ప్రజాదరమే కవితకు లక్ష్యమనియుఁ బ్రజల సంస్కరించుటయే కవితాధర్మమనియు నానాఁడే గుర్తింపఁబడినవి ♦ ఏ రాజుల కనుసన్నలకు నానాఁటి పద కవిత బద్ధము కాలేదు. అట్లు కానిచో నాకవితలో నంతటి యుద్రేకము, స్వేచ్ఛ, స్వచ్ఛత లుండుట కవకాశము లెక్కడివి?

ఈ "దేశికవితోద్యమ" ప్రభావము తరువాత వచ్చిన తిక్కన కవితలోఁ గన్పించుచున్నది. తెలుఁగు నుడికారమును మూటకట్టుకొనిన యాతని జాతీయ రచనమే యిందులకుఁ దార్కాణము. పిమ్మట వచ్చిన ద్విపద రామాయణ హరిశ్చంద్ర నలోపాఖ్యానములుగూడ నీ'దేశి' మార్గమునకుఁ జెందినవే. శ్రీనాథునిఁగూడ నీసిద్ధాంతము లోఁబరచుకొని యాతనిచేఁ బల్నాటి వీరచరిత్రను వ్రాయించినది. ఇవి తోలుబొమ్మలాటలద్వారా వృత్తి సంఘములుగా వరలిన జంగముల

♦ చూ : కోరాడ రామకృష్ణయ్యగారి "దేశి-దక్షిణభాషా పారస్పర్యము"

"వీరశైవాంధ్ర వాఙ్మయము" గూర్చి శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి గారు పరిశోధన గ్రంథమును వ్రాసి పారితోషికము బడసినారు.

తమిళాంధ్ర భాషలలోని వీరశైవ వాఙ్మయమునుగూర్చి పరిశోధన మిటీవల సల్పి, శ్రీమతి యం. ఆదిలక్ష్మి మద్రాసు విశ్వవిద్యాలయములో యం. లిట్. పట్టము నొందెను.

ముఖమునను ప్రచారమందినవి. ప్రజల కాహ్లాదము గూర్చుచు పౌరాణిక గాధలను బోధించుచుండుటకీ ద్విపదలు తోడ్పడుచు వచ్చినవి.

కావ్యములు ప్రభుసమ్మితములు

పిమ్మట చాల కాలమువఱకు మనసాహిత్యము ప్రభుసమ్మితమైనది. కవులు సంస్కృత కావ్యానువాదములతోఁ గాలము గడుపుచువచ్చినారు. కావ్యములు పాండితీ ప్రకర్ష కాలవాలమైనవి. ప్రజల హితముపైఁగాక ప్రభు వాసంగు కానుకలపైఁ గవుల దృష్టిపడినది. ప్రభువుల సహజ సౌందర్య విలసితములగు వనములలో విహరించుటమాని కృతిమోద్యాన విహారములకు మురిసిపోవుట పరిపాటయినది. ఈ సూత్రమే కవులనుగూడఁ బరిపాలించినది. ఆద్యసత్కథలం గైకొని చిత్రించుట-కల్పనా కథలచే మురిపించుటలు జరిగినవి. రాజాశ్రయము లభించిన కవులకుఁ బ్రజలతోఁ నిమిత్తమేమి? వారికష్ట నిష్ఠురములు కావ్యవస్తువులగుట కవకాశ మెక్కడిది?

క్రమముగాఁ గవులు ప్రభువులకు మిత్రులై పొట్టలో చల్ల కదలక వర్తిలినారు; ఆ వాతావరణాను గుణముగాఁ బ్రణయ [illegible]సము హెచ్చినది. [illegible]జా[illegible]తఃపురములు కవులకు సుపరిచితములగుటచే నచటి వస్తువులు, సన్నివేశములు వారి కావ్యములలోఁ బ్రతిబింబితము లగుచు వచ్చినవి :

"నికషపాతి స్థలంబు, రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెం, మాత్మకింపయిన భోజన, ముయ్యెలమంచ, మొప్పుతెప్పరయు రసజ్ఞు, లూహ తెలియంగల లేఖక పాఠకో త్త

ముల్" దొరకెడివారు వారికి! తినమరిగినవాఁడు పస్తుండ గలఁడా మఱి? అంతటి సౌఖ్యముల నందినవారు గనుకనే నాఁడు వారి ప్రాపు నడలినంతనే శ్రీనాథ పెద్దనలు 'జీవచ్ఛవముల' విధముగా తా మున్నట్లు వ్రాసికొని విలపించినారు.

భాషాభావ కల్పనా సౌష్ఠవము

శ్రీకృష్ణరాయల కాలము తెలుఁగుజాతి వైభవమునకు సర్వవిధముల శిఖరప్రాయము. సాహిత్యమునకు భాషాభావ కల్పనాసౌష్ఠవము నానాఁటి కవులు సంపూర్ణముగాఁగల్పించిరి. తెలుఁగు సాహిత్యక్షేత్రములో విశిష్టమైన ప్రబంధవృక్షము శాఖోపశాఖలై విరాజిలి రసవత్ఫలముల నిచ్చిన దీకాలమందే!

సాహిత్య సౌధ పతనము

కృష్ణరాయల యనంతర మల్పకాలముననే విజయనగర సామ్రాజ్యము క్షీణించినది. కవు లించుమించుగా పొట్టలు పుచ్చుకొని బయలు దేరవలసి వచ్చినది. చిన్నచిన్న సామంతులు రాజులైనారు. వారికిఁ దాము చక్రవర్తులమనెడి యహంకారము పెరిగినది. విషయలాలసులై ప్రజాపరిపాలనమందలి కాంక్షకంటె బహుకాంతా పాలన మందలి ప్రీతి హెచ్చినది. వీరి ప్రాపుఁగోరిన కవులు వారి చిత్తవృత్తుల ననుసరించియే మెలఁగవలసి వచ్చినది. అందుచేతఁ బదునాఱు పదునేడు శతాబ్దములలో సాహిత్యము జుగుప్సావహమగు కేవల శృంగార వస్తుచిత్రణముతో నిండిపోయినది. ప్రబంధమే దిక్కనుచు యనుటచే కవితగతానుగతికమై పేలవమైపోయినది.

అనుకరణానుసరణములు హెచ్చైనవి. ఈ విధముగా నాంధ్ర రాజ్య వైభవముతో సాహిత్య వైభవ మడుగంటినది.

చెప్పుకొనఁదగిన యంశములు

కాని నాయకరాజుల కాలములోఁ జెప్పుకొనఁదగిన యంశము లేకపోలేదు. దేశికవిత కాదరణము మరల రగులు కొన్నది. సంగీత నాట్యముల కాస్థానములో నధిక గౌరవము లభించినది. ప్రజలమీఁద దృష్టి మరలినది; జాతీయమైన రూపక ప్రక్రియకు దోహదమీయఁబడినది. యక్షగానములు విరివిగా రచింపఁబడి ప్రదర్శింపఁబడినవి. వ్యావహారిక భాష యుపాదేయమైనది. రఘునాథరాయల పరిపాలనాకాలము నకుఁ గృష్ణరాయల పరిపాలనాకాల ముపమానమగును. అతఁడు సంగీతమును బ్రోత్సహించి పదసాహిత్యపోషకుఁడై ప్రసిద్ధి నొందినాఁడు. ఆంధ్రులు గర్వింపఁదగిన క్షేత్రయ్య పదములు, త్యాగరాజు కీర్తనము లాకాలమునకుఁ జెందినవే. వాని ననుసరించి తర్వాత దీక్షితులు, శ్యామశాస్త్రి మున్నగు వారనేకులు కీర్తనలను, పదములను రచించినారు. శృంగార భక్తిపరముగా నీ విధమైన కవిత రచింపఁబడి ప్రజలను మురి పించి సంస్కరించునదై వరలినది. నాయకరాజ యుగములోఁ బ్రజలకు విషయబోధ సులభముగాఁ జేయుటకుఁ బద్యముకన్న వచనమే యనుకూలమైన ప్రక్రియగాఁ కవులు కనిపెట్టినారు. వచనములోనున్న యన్వయ సౌలభ్యము పద్యములో నుండదు గదా! అందుచే రాయవాచకకర్త, కళువె వీరరాజు, సముఖము వేంకటకృష్ణప్ప నాయకుఁడు, విజయరంగ చొక్క-

నాథుఁడు మొదలైనవారు వచనరచనమునకుఁ బూనుకొని ప్రజాసేవ చేసినారు. ఈ విధముగా సాహిత్యమును ప్రజలకు సమీపములో నుంచి వారిని విజ్ఞానవంతులుగాఁ జేయుటకుఁ బ్రయత్నము లాకాలమందు జరిగినవి.

ఆంగ్ల సాహిత్య ప్రభావము నూతన ప్రక్రియలు

తరువాత బ్రిటిషు పరిపాలనా ఫలితముగా నాంగ్ల భాషా సాహిత్యముల ప్రభావము మనపైఁ బడినది. పందొమ్మిదవ శతాబ్దపు మధ్య కాలములో నిది మిక్కుటమైనది. సంఘములో, మతములో, సాహిత్యములో మార్పు వచ్చినది, 'క్రొత్త రోయొక వింత ప్రాఁత-రోయొక రోత' అన్నట్లుగాఁ గొంత కాలము మనవారు మోహాంబుధిలోఁ దలమున్కలు వేసి మన పార్థక్యమును విస్మరించినారు. మనకుఁగలిగిన మేలునే యెంచుకొందము. ఆంగ్లసాహిత్యములో మనకు లేని నూత్న ప్రక్రియలకు మురిసిపోయిన మన సాహితీసేవకు లట్టివి రచించుట మొదలిడినారు. 'నవల', 'ఉపన్యాసము', 'ప్రహసనము', 'విమర్శ', 'వ్యాసము', 'స్వీయచరిత్ర' మొదలైన వచన ప్రక్రియల నవతరింపఁజేసి వీరేశలింగముపంతు లాధునిక యుగ కర్తయైనాఁడు. తాను సంఘసంస్కారియై స్త్రీ జనోపయోగార్థ మనేక రచనల సాగించినాఁడు. దీనిం బురస్కరించుకొని తరువాత యనేకులు స్త్రీలకు పాటలు, కథలు వ్రాయుచు వచ్చి సులభ శైలిలో నాంధ్రజాతీయ జీవనమును పాతివ్రత్య ధర్మమును ప్రబోధించినారు. వీరేశలింగముపంతు లవతరింపఁ

జేసిన నూతన ప్రక్రియలలోఁ బసువాత నెంద రెందరో కృషి సల్పుచు వచ్చినారు.

వీరేశలింగము పంతులు గద్యశైలీ సౌలభ్య కల్పనమునకై చేసిన పరిశ్రమనే తిరుపతి వేంకట కవులు పద్యశైలీ సౌలభ్య కల్పనమునకై యొనర్చినారు. వీరి ప్రభావము యావదాంధ్ర దేశముపైఁ బడినది.

భావకవిత్వము

1910 ప్రాంతమున నాంగ్లసాహిత్యములోని 'రొమాంటిక్' కవిత మనవారి నాకర్షించినది. ఆ విధమైన ప్రత్యేక భావ కవిత[1] మన కంతవఱకు లేదని యువ విద్యార్థులు గమనించినారు. వారికి వయస్సు, వాతావరణము లనుకూలించినవి. ప్రేయసి, కోకిల, ప్రకృతులను నవ్యకవిత్వపు ముఖ్య సామగ్రిలోఁ జేర్చినారు. దీనిని "అభినవకవిత్వ" మనినారు. రాయప్రోలు సుబ్బారావుగారు వరుసగా నావిధమైన కావ్యములు ప్రచురించినారు. సంఘ సంస్కారమును జుక్కానిగాఁ బెట్టుకొని గురజాడ అప్పారాయకవి మాత్రాఛందస్సులోఁ గవితారచనము సాగించినాఁడు. పతితోద్ధరణము సూత్రముగా గ్రహించి పల్లీయులను నాయికా నాయకులుగా గ్రహించి నండూరి వెంకట సుబ్బారావుగారు 'ఎంకిపాటలు' రచించినారు. శ్రీ విశ్వనాథవారు 'కిన్నెరసాని పాటలు' వ్రాసి, పూర్వమార్గమును వదలి నవీన మార్గమందు విశ్వాసములేని కొందఱిని బౌద్ధవాఙ్మయ

1 Subjective poetry : దీనిని ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు 'ఆత్మాశ్రయ కవిత్వ' మని వ్యవహరించినారు.

మందలి సత్యాహింస లాకర్షించి కవితా వస్తువు లైనవి. సౌందరనందము, మున్నగున వట్టి రచనములే. దీని నంతటిని 'భావకవిత్వ'* మనినారు. ఇది మొదట కొంతకాలము దూషణమునకు గురియైనది; కాని తరువాత నిలువఁ ద్రొక్కుకొనినది.

వ్యావహారిక భాషావాదము

ఈ కాలముననే గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యావహారిక భాషావాదము ప్రచారములో నున్నది. మన సాహిత్యక్షేత్రములో వచన బీజ మంకురించి పెరిగి పెద్దదైన కొలఁది యాలంకారిక శైలిని పుణికి పుచ్చుకొనుచు వచ్చినది. వ్యాకరణముపై నక్కరలేని మోజు పెట్టుకొని పాండిత్యము నంతయు దీర్ఘ జటిల సమాసములలోఁ బ్రదర్శించి కొందఱు వచనమును దురవగాహ మొనర్చినారు; అది కృతక భాష యైపోయినది: పద్యమును వదలి వచనమును గ్రహించిన హేతువును విస్మరించినారు. ఈ సత్యమును దర్శించి గిడుగువారు భాషావాదమును లేవదీసినారు. ఆంధ్రసాహిత్యపరిషత్తు దీనిని ఢీకొనినది. రామమూర్తి పంతులు శత్రుకోటి నెదుర్కొనినాఁడు; ప్రజామోదము, నవ్య కవుల యనుసరణమును బడసి విజయుఁడైనాఁడు. దీనికి నిదర్శనముగా నేఁడు వ్యావహారిక భాష దేశమంతట చక్కని వ్యాప్తిలో నున్నది. పై రాయప్రోలు గురజాడ, గిడుగుల ఉపజ్ఞకమైన భాషా భావ సంస్కరణ ప్రచారము చేయుటకై "సాహితీ సమితి"♦ పుట్టి, 'సాహితీ'

* శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారీ పేరు పెట్టినారు.

♦ శ్రీ శివశంకర శాస్త్రిగారు దీనికి సభాపతి.

పత్రికను స్థాపించి, మిక్కిలి సేవ చేసినది. తత్పరిణామముగా వచ్చిన సాహిత్య ప్రక్రియలగు ఖండకావ్య, కథానికా, ఏకాంకికాదులకు సాహితీ పత్రిక దోహదమొసఁగినది. తరువాత నవ్యసాహిత్యపరిషత్తు * ఏర్పడి, 'ప్రతిభ' పుట్టి, యీ పనిని నిర్వర్తించుచు వచ్చినది. ఇది యంతయు నవ్యసాహిత్యమను పేర నేఁడు పరగుచున్నది.

పరిశోధనము-చారిత్రక విమర్శ

క్రీ. శ. 1912 ప్రాంతమునకే ప్రజలందు విజ్ఞాన వ్యాప్తికై కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు పాటుపడుచుండిరి. ఆంగ్ల సాహిత్యములో పరిశోధనము, విమర్శలత్యంతముగాఁ బెరిగినవి. ఏ భాషాసాహిత్యమునకైన నవి లేనిదే ప్రశస్తి లేదు. ఈ సత్యమును గ్రహించి పంతులుగా రా విధమైన కృషి చేయ నారంభించినారు. చారిత్రక విమర్శకు మార్గదర్శియైనారు. తరువాత కట్టమంచివారు సాహిత్య విమర్శనమునకు బీజవాపము చేసి తమ 'కవిత్వతత్త్వ విచారము' నుపాయనముగ నొసంగినారు. ఇట్లే సాహిత్య చరిత్రములు కూడ వెలసినవి. ఈవిధమైన విమర్శ మన సారస్వతమున నీ నాఁటికిని విరివిగా పెరఁగలేదు. అక్కడక్కడ చిన్న చిన్న యత్నములు జరుగుచున్నవి కాని యేకముఖముగా కొనసాగుచు నిర్మాణ పరిణతి నందుటలేదు.♦ ఈ కాలమునకే

* శ్రీ తెలికిచెర్ల వేంకటరత్నంగారు దీనికి కార్యదర్శి 'నవనీతము' పరిషత్తు పక్షమున వెలువడిన పద్య సంకలన గ్రంథము.

♦ చూ: "ఆధునికాంధ్ర సాహిత్యములో విమర్శ"—
—"ఆంధ్రభూమి" ప్రారంభసంచికలో నా వ్యాసము.

"విశ్వదాత" కాశీనాథునివా రాంధ్ర పత్రికను స్థాపించి విజ్ఞాన వ్యాప్తికిఁ గారకులైనారు.

ప్రథమ ప్రపంచ యుద్ధానంతరము మనకుఁ బ్రత్యేక విశ్వవిద్యాలయము వచ్చినది. కాని చాలకాలము (1953)వఱకు రాష్ట్రము రాలేదు. ఇది ప్రజలలోఁ జాలని యుత్సాహము నకుఁ గారణమైనది. ప్రజల హృదయములలో నంతకుముందే యాంధ్రోద్యమము బాగుగా పాదుకొన్నది. ఉపన్యాసముల ద్వారా యుద్బోధమొనర్చుట ప్రారంభమైనది. మన కవులు రాష్ట్ర ప్రబోధ గీతముల నాలపించినారు. ప్రాచీనాంధ్ర వైభవ మును త్రవ్విపోయు ప్రబోధ పద్యములు రచింపఁబడినవి. ఆనాఁటివే 'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయ ములు స్థాపించునాడు' (ఆంధ్రావళి) మొదలైన రాయప్రోలు వారి పద్యములు. కాని 1921 లో నసహాయోద్యమము వచ్చి దేశమంతట వ్యాప్తమైనది. అందులో మన రాష్ట్రోద్యమము లీనమైపోయినది; జాతీయ గీతము లనేకములు వచ్చినవి. వానిని రచించిన వారిలో గరిమెళ్ళ సత్యనారాయణగారు ముఖ్యులు. ప్రజాప్రబోధమునకు 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు, చెరుకువాడ వెంకటనరసింహంగారు మొదలైన వక్తలు పాటుపడినారు. ఈ విధముగాఁ బ్రబోధ వాఙ్మయము పెరిగినది: నేఁటికిని ఆంధ్రరాష్ట్రగానము వినిపించుచునే యున్నది. కొడాలి సుబ్బారావుగారి 'హంపి క్షేత్రము', విశ్వనాథ సత్యనారాయణగారి 'ఆంధ్రప్రశస్తి', తుమ్మల సీతారామమూర్తిగారి 'రాష్ట్రగానము' మొదలైనవి

యిందుల కుదాహరణములు.

ఇట్లుండగా యుద్ధానంతరము యూరిపు సాహిత్యము మన దేశమునకు దిగుమతి యయ్యెను: తత్పరిణామముగా శ్రీ శ్రీగారి 'అతివాస్తవికత' యంకురించినది. నారాయణ బాబుగారుకూడ నీ సరణి ననుసరించినారు. ఈ మార్గ మిప్పు డంత ప్రజల ప్రచారములో లేదు.

నేటి సాహిత్య స్థితి

ఇంతలో రెండవ ప్రపంచయుద్ధము (1939) రానే వచ్చినది; దీనితో మన దేశమునకు దెబ్బతగులునను భయము నొచ్చినది. రష్యా యుద్ధప్రవేశము ప్రజా యుద్ధమను భావ మంకురింపఁ జేసినది. అత్మ ప్రణయపరమైన నవ్య సాహిత్యముపైఁ దురుగుబాటు పొసగినది. ప్రేయసిని, కోకిలను విడిచి మన దేశస్థితినిఁ బర్యాలోచింపవలసిన కాలము వచ్చినది. ప్రభువు, వాలేసు సమానమను భావ మంకురించినది. దేశాభ్యుదయమే నేటి మనరచయితల పరమాశయమని గ్రహించినారు. ప్రజా వాఙ్మయ సూత్రము లాదర్శము లైనవి. అక్కడి సామ్యవాదము, కృషి ఘనత్వ (Dignity of Labour) సిద్ధాంతములు మనదేశమున కనూదితములైనవి; కాని నియంతృత్వరేఖ లీలగా నిందును బొడసూపుచున్నది. వీని కన్నిటికి ఫలితముగా 'అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘము' స్థాపితమైనది. అన్ని భాషాప్రాంతములలో

దీనికి నుపసంఘము లేర్పడినవి.* మన దేశములో వివిధ భాషాసాహిత్యముల నేక ముఖముగా నడుపవలెనని వీరి కుతూహలము వైమనస్యములు లేక "దేశమ్ము లంతా చెట్ట పట్టాల్ పట్టుకొని" నడవవలెనని వీరి సంకల్పము. ఆదర్శము లుత్తమము లైనవే! కాని యాచరణములోఁ బెట్టుటకుఁ బ్రయత్నము లత్యంతముగా జరుగవలసి యున్నవి.♦

నూతన చైతన్యము

ఆంధ్ర సాహిత్యలోకమున నేడు నూతన చైతన్యము కలిగిన దనక తప్పదు. దేశభాషాసేవకులను గుర్తించి వారిని గౌరవించుచున్నారు. ఇది శుభసూచకము. ప్రజలలో సాహిత్యాభిరుచి, గ్రంథపఠనాసక్తి యధికముగా నున్నవి. ఎచ్చట చూచినను సాహిత్య సమావేశములు, కవి సమ్మానములు కన్నుల పండువుగా జరుగుచున్నవి. ఎన్నెన్నియో ప్రచురణ సంఘములు, సారస్వతసమితులు పుట్టుచున్నవి. గ్రంథ ప్రచురణ మత్యంతముగా జరుగుచున్నది. పత్రికలు హెచ్చైనవి.

* 'అభ్యుదయ' అను మాసపత్రికా ముఖమున, 'కల్పన' అను సంకలన గ్రంథ ముఖమునను వెలువడిన రచనలను జూచిన వీరి కృషిఫలితము లవగతములు కాగలవు.

♦ సాహిత్యరంగములో తరువాత కాలమున నభ్యుదయ కవిత్వ మార్గమునకు శ్రీ. శ్రీ. [illegible], బాలగంగాధరతిలక్, దాశరథి, అనిసెట్టి, బెల్లంకొండ, సోమసుందర్, ఆరుద్ర, కాళోజీ, రెంటాల, రమణారెడ్డి, "బైరాగి" మొదలైన వారగ్రయాయులై యీ మహాప్రస్థానమును సాగించిరని తెలిసికొందుము.

తదనుగుణముగా రచయితలకు లెక్కయే లేకున్నది. ఈవిధముగా వాఙ్మయము విరివిగాఁ బెరుగుచున్నది. ఏ జాతిసంస్కృతియైన నా భాషాసాహిత్య ప్రచారముద్వారా జరుగుచుండును. ప్రజలు తమ సాహితీరోచిస్సులను ప్రజ్వలితము నొనర్చినచో జాత్యభ్యుదయకారకు లగుదురు. ఈ యభిప్రాయము నే మాలవ్యాజీ—

Literature was the best medium for improving the character of a nation, and by improving the vernacular literature, you will elevate the nation.

అనువాక్యములో పొందుపరచినాఁడు. కావున జాత్యభ్యుదయకారకమగు సాహిత్య మీనాఁటి మనవాఙ్మయములో నెంత యున్నదో పరిశీలించుకొనవలసి యున్నది.

సహృదయులారా! మిమ్ము నేను విసిగించితిని. సమగ్ర సాహిత్యస్వరూప సంగ్రహమును యథాశక్తిగా కాలానుగుణముగా మీకు నివేదించినాను. నావి రెండు మాటలు కొఱవడినవి, వాని నాదరముతో గ్రహింతురని విశ్వసింతును.

సాహిత్యార్చకుల కర్తవ్యము

ఈ నాఁడు సాహిత్యపోషణము ప్రజలపై నెక్కుడుగా నాధారపడియున్నది. నేటి ప్రజలలోఁ గేవలము సాహిత్యాభిరుచి కలిగినందువలనఁ బ్రయోజన మంతగా లేదు. ఉపన్యాసములను వినోదములుగా గ్రహించినచో నవి నిష్ప్రయోజనము లగును. "ఆంధ్రులలో ననేకత్వ" మను ప్రవాద మొకటి మనపై నున్నది. దీనివలననే మన సంస్థలు, ఉద్యమములు

వృద్ధినొందకున్నవి. వర్గ వైమనస్యములు లేక సహృదయులై ప్రజలు సానుభూతితోఁ దిలకించు దృష్టి నలవరచుకొనవలసి యున్నది. వివాదముల ఫలమును మనము రుచి చూచియే యున్నాము. కావున ప్రతి యాంధ్రుఁడును విద్యావంతుఁడై, లోక కావ్యాద్యవేక్షణముతో వ్యుత్పన్నుఁడు కావలెను. తన జాతి భాషా సాహిత్య సంప్రదాయములను పవిత్రముగా నెంచవలెను. సాహిత్యములో వివిధ మతములను చారిత్రక దృష్టితోఁ జూడవలెనేకాని వాత్మిక దృష్టి పనికిరాదు.

ఉత్తమమైన మానవ జన్మము లభించినందులకు మనము దానిని సద్వినియోగ మొనర్పవలెను. తదితర జీవుల వలెఁగాక మానవున కాత్మభావ వ్యక్తీకరణమునకు యోగ్యత యున్నది. అతనికి విజ్ఞాన సముపార్జనమునకు వలయుశక్తి బీజ భూతముగానున్నది. కాని మానవ జీవితము పరిమితమైనది; విజ్ఞాన మనంతమైనది. కాలముయొక్క విలువను గ్రహించి, ప్రతి మానవుఁడు తన జాతి పార్థక్యమును దెలిసికొని, సాహిత్యార్చకుఁడు కా నధికారము సంపాదింపవలెను.

ఏది మానవ లోకమునకు హితము బోధించుచు సార్వకాలికమై సార్వజనీనమై వర్తిలు సాహిత్యమో-ఏది నిమిత్తప్రయోజనము కలదియై పరిమితావకాశముగల వాఙ్మయమో వివక్షించుకొనఁగల శక్తిగడించి, యల్పమైన జీవిత కాలములో సాహిత్యము నర్చించి, యనంత రస గ్రంథుల నోపినన్ని విప్పి, యనుభవించుటకుఁ బ్రయత్నింపవలెను.

అధికారము లేనిదే రస జగత్తులోఁ బ్రవేశము లభింపదు. ఈ లోకములో సుఖము మోసములతోడను, లంచముల తోడను పొందఁగలుగుదు మేమో కాని, కావ్య జగత్తులో నానంద మట్లు సులభముగా లభింపదు, దీని నే—

'It is open to labour and to merit but to nothing else. No wealth will bribe, no name overawe, no article deceive the guardian of these Elysian gates.' అను వాక్యములో రస్కిన్ పండితుఁడు ప్రవచించినాఁడు.

కావున ప్రతి మానవుఁడును తమనాంబుధినుండి తెప్ప రిల్లి, కాలముయొక్క విలువను గుర్తించి, వ్యుత్పన్నుఁడై, ఉత్తమ సంస్కారియై, స్వస్థాన వేష భాషాభిమానము కలిగి, సాహిత్యార్చనము చేసి యాత్మ వికాసము పొంది తపస్వి గావలెను. సాహిత్యార్చకులు తా మధికారముచే మథించి దర్శించిన రస తత్త్వమును విమర్శల ద్వారా తిరిగి లోకమున కందఁజేయవలెను. ఆంధ్రసాహిత్యములోని వెలుఁగుజిలుగు లను విప్పి చూపునట్టి గ్రంథములు నేఁడు విరివిగా రావలసి యున్నవి. తాత్కాలిక ప్రయోజనమును దీర్చు కార్యముల కన్న శాశ్వతముగా మన జాత్యభ్యుదయమును జాటు కార్య ములలోఁ బ్రజాసంస్థలు, సాహిత్యపరిషత్తులు పాటుపడవలెనని సవినయముగా మనవి చేయుచున్నాను. ఏనాఁడు తానధి కారియై ప్రతి యాంధ్రుఁ డట్టి కార్యాచరణమునకు దీక్ష వహించి దానిని సాధించునో యానాఁడే తెలుఁగుజాతి సంపూ

ర్ణావకాశమును బొంది సర్వాంగసుందరముగా విరాజిల్లఁ గలదు; అంధ తమసము లనుగంటి జ్యోతిర్లోకమునకు సుగమమైన మార్గ మప్పుడుగాని యేర్పడదు. ఆ శుభప్రదమైన ముహూర్త మనతికాలములో రాగలదని విశ్వసింతును.

'అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతి ర్గమయ
మృత్యో ర్మా ౽మృతం గమయ'

[సికిందరాబాదులో 17–6–1945 తేదీనాడు నే నిచ్చిన హైదరాబాదుజిల్లా ‹‹ప్రథమ మహాంధ్ర సభా సారస్వత సమావేశము›› యధ్యక్షోపన్యాసము]

౧౨

సాహిత్యార్చనము

మానవునకు హితమును బోధించునదియు, లోకము లోని దృశ్యముల నుదాత్తములుచేసి, సకలశాస్త్రములతో సమన్వయించి యాత్మబోధచే నుత్తమ సంస్కారమును గలిగించునదియు, సాహిత్యమని మహాత్ములు నిర్వచించుచున్నారు.[1] కావ్యప్రపంచమంతటిని సాహిత్యముక్రింద పరిగణించినారు. నిత్యవ్యవహారములో జరుగుచున్న రచనావ్యాపారమంతయు విశాలావకాశము కలిగిన వాఙ్మయములోనికి వచ్చును.[2] సాహిత్య మను పదములో విశిష్టత యున్నది. మహాకవి యెంతటి పూర్ణుడో సాహిత్య మంతటి పూర్ణత్వము కలిగినది. సాహిత్య సమాలోచనామృతమును బ్రసాదించు నట్టిదని శ్లోకకారుడు సూత్రించినాడు :

సంగీత మపి సాహిత్యమ్ సరస్వత్యాః కుచద్వయమ్ ।
ఏక మాపాత మధురమ్ అన్య దాలోచనామృతమ్॥

ఇంత మహిమగల సాహిత్యమునకు సృష్టికర్త కవి. అతడుపాసకుడై, ప్రజ్ఞావంతుడై, విశ్వమానవకల్యాణార్థమై ప్రవక్తగా బ్రతియుగమున నవతరించుచుండును. ఈ కవి తాను సృజించిన సాహిత్యముద్వారా బ్రహ్మానంద సహోదరమగు రసానందానుభవమును బ్రసాదించును.

---

1 'హితేన సహితం సాహిత్యం'; 'సహితస్య భావః సాహిత్యం'.
2 చూ. 'సాహిత్యోద్దేశ్యము' లో ప్రథమభాగము.

మానవుఁడు నిరంతర సౌఖ్యాన్వేషి. లోకములోఁ దాను జేయు ప్రతికార్యములో నీసూత్ర మన్వయించును. సుఖము లౌకికమైన కారణములచేఁ గలుగు చిత్తరంజక స్థితికిఁ జెందినది. ఈ లౌకిక సుఖమునే కవి చిత్రించి దానిని లౌకికమైన యానందముగా పరివర్తనముచేయును. ఆనందము—సుఖమువలె లౌకికము, నశ్వరముగాక యుత్తమము, శాశ్వతము నగు మనోరంజకస్థితికిఁ జెందినది. లౌకికానందమున కును పారలౌకికానందమునకును మధ్యస్థితిని కావ్యానంద మాక్రమించుచున్నది. లౌకికానందము కన్న నుదాత్తమై, పారలౌకికానందమునం దాసక్తిని కల్గించునది కావ్యానందము. విజ్ఞానవంతుఁడైన మానవుఁడు లౌకిక సుఖములకు లీగిపోవక శాశ్వతానంద ప్రదాయినియగు రసమూర్తి నన్వేషించుటకు సాధనము చేయ సంకల్పించును. సాహిత్యార్చనముచే మానవుని చిత్తము సంస్కృతమై బ్రహ్మజ్ఞాన సముపార్జనమున కున్ముఖ మగును. ఈ విధముగా సాహిత్యార్చనము మోక్ష సాధనముగాఁ బర్యవసించును.

సాహిత్యార్చనమునకుఁ గడంగుటకు మున్ను మానవుఁడు కొంత యధికారము సంపాదింపవలెను. దేవతార్చన మొనర్చుటకే విధముగా భక్తి (లేక సమ్మానము) కుదరవలెనో యట్లే సాహిత్యార్చనమున కభిరుచి[1] కవివాక్యమందుఁ బ్రామాణ్యము లలవడవలెను. ఈ యభిరుచి లేని దే సాహిత్యావరణములోఁ బ్రవేశించుట, నాస్తికుఁడై దేవాలయ

1 See "Literary taste" *by* Arnold Bennett.

ప్రవేశ మొనర్చినట్లగును. వినోదముకొఱ కర్చనముచేసిన వాఁ డవహేళమునకు గురియగును. కావున నిష్కళంకమైన మనసు కలిగి విజ్ఞాన చక్షువు లందుకొని పవిత్రభావముతో సాహిత్యము నర్చింపవలెను.[1] సాహిత్యాభిరుచి యలవరచు కొన్న పిమ్మట మానవుఁడు లోకకావ్యాది పరిశీలనము వలనఁ బండితుల యుపన్యాస సాకర్ణనము వలన, సంప్రదాయజ్ఞులైన మహాత్ముల సంసర్గము వలన, చక్కని సంస్కారి కావలెను. కేవల పండితుఁడై శబ్దసాధుత్వాసాధుత్వముల నెన్నుట పాడిగాదు. రసపిపాసియై తాను, భావమునకు శబ్దార్థములు దుస్తుల వంటివని యెఱింగి యా రసభావము నందుకొనుటకు సహృదయుఁడై యత్నింపవలెను. కవిహృదయ ప్రవేశముచేసి యాతని భావమును గ్రహింపవలెనేకాని కవియొక్క దేశకాల మానసిక పరిస్థితులను ద్రోసివేయరాదు.[2] సాహిత్యార్చకుఁడు ముఖ్యముగా గమనింపఁదగిన సూత్రమిది. ముందుగాఁ గవిపై నే విధమైన కలుషభావము లుంచరాదు. గుణగ్రహణపారీణు లగుటయే సాహిత్యార్చకుల పరమ ధర్మముగాఁ బరిగణింప వలెను. బ్రహ్మానందము ననుభవించుట కెట్లు మానవు లుత్తములై యుపాసకుల గావలయునో యట్లే కావ్యానందము ననుభవించుటకు సాహిత్యార్చకులు తపస్వులురై యుండ వలెను. అధికారము నార్జింపనిదే యానందావాప్తిలేదు. సాహిత్యము మానవ లోకమునకే యుద్దేశింపఁబడినది. ఈ

1. You must love them (Poets) and show your love.
2. To enter into theirs (thoughts) observe; not to find your own expressed by them. —*Ruskin.*

యమృత భాండము నుపయోగించుకొని ఫలమందుట మానవుల విధి. భగవదర్చనమున కెంత చిత్తస్వాస్థ్యము, జిజ్ఞాస కావలెనో యంతటి కేంద్రీకరణము, రసతృష్ణ సాహిత్యార్చన మొనర్చుటకు వలసి యున్నవి.

అర్చనా ఫలితముగా సాహిత్యలోకములోని పాత్రములతో గాఢస్నేహము కలుగును. వారితోఁ గ్రమముగా తాదాత్మ్యము పొందుట తటస్థించును. అచట యాదర్శ శీలవంతులతో సహచర్య మబ్బి వారితో నానుభూతి నుండుట పొసఁగదు. ఇది కవియొక్క పాత్రచిత్రణమందలి నైశిత్యమును బట్టి యర్చకుని ఆత్మశుద్ధి, బుద్ధి తీక్ష్ణతల ననుసరించి కలుగుచుండును. ఈ విధముగా సాహిత్యార్చనము జాత్యభివృద్ధికిఁ గారక మగుచుండును.

సామాజికుని పాండిత్య పరిశీలనాశక్తుల ననుసరించి తదనుగుణముగా సాహిత్యములోనున్న యమృతము పొడముచుండును. కృషి లేనిదే ఫల మందదు. లౌకిక సౌఖ్యము పొందినట్లు లంచములతో మోసములతో నీ సాహిత్యామృతమును మానవులు పొందఁజాలరు. సాహిత్యము కావ్యపరమైనది.

కవిత్వము లయాస్ఫూర్తమైనది. ఛందస్సనునది లయను బురస్కరించుకొని వచ్చినదే. కవితలో నాద మంతర్వాహినిగాఁ బ్రవహించుచు శబ్దరూపమున బయటికిఁ గన్పించుచుండును. కవి యా శబ్దముల కుండు నర్థముల ద్వారా భావస్పందము గల్గించును. మనకున్న సాహిత్యము భావ, రాగ,

తాళమయము. భావసౌకుమార్యమును, నాదమాధుర్యమును, శబ్దవైచిత్రిని ప్రత్యేకముగాఁ బోషించుచు నలరించు కవు లున్నారు.

మన తెలుఁగుభాష సహజముగా గానయోగ్యమైనది. ల, న, స అను నక్షరములు వివిధ సంపుటములలో మేళనము పొంది మధురమంజుల నాదము నీనుచుండునని తెలియుదుము. కొన్ని యక్షరముల పౌనఃపున్యము దరువు వేసినట్లొక గతికల్గి యుండును. 'నానాసూనవితాన వాసనల నానందించు సారంగ మేలా' అను పాదములో, 'అభంగ తరంగ మృదంగ' అను స్థలములోఁ బైరెంటికి నుదాహరణము లగుపించును. శబ్ద వైచిత్రి మన ప్రబంధములలో బహుళముగాఁ గన్పించు చున్నది. భావోపాసకు లనేకులున్నారు. పోతన కవితలో భావప్రాధాన్య మగుపించును. నవ్యులు భావకవులను పేరు వడసినవారు.

"ఎనకజన్మములోన ఎవరమో నంటే
సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకీ!
ముందు మన కేజన్మ ముందోలె యంటే
తెల్ల తెల పోయింది పిల్ల నా యెంకీ!
ఎన్నాళ్ళు మనకోలె యీ సుకము లంటే
కంట నీరెట్టింది జంట నా యెంకి!"

అను పాదములలో శబ్దమున కన్న భావమునకు గౌరవ మున్నది; ప్రణయ కీర్తనములో లోకతత్త్వమును కవి పొదిగినాఁడు; భావప్రకాశము వలననే తత్త్వ స్ఫురణము

కల్గించుటకుఁ బ్రయత్నించినాఁడు. పునర్జన్మ సిద్ధాంతమును జన్మ జన్మలకుఁ దొంటి భర్తయే వలయుననెడి యుత్తమ స్త్రీ యభిలాషతో జోడించి ప్రతిపాదించినాఁడు. ఈ విధముగా నవ్యులు ముఖ్యముగా భావోపాసకులు. కావుననే వారి రచనము భావకవిత్వ మనెడి పేరుగాంచినది. సాహిత్యా ర్చకులు పక్షపాతము లేకయుండి, ప్రతి విధానములో నున్న విశిష్టతను గ్రహించు శక్తి నలవరచుకొనవలయును.

సాహిత్యము సత్యమును బోధించును; అనుభవ రహస్యముల విప్పిచెప్పును. సౌందర్య స్వరూపమును సాక్షాత్కరించును. ఇంతటి బోధచేయుటకుఁ గవియెంతటి ప్రజ్ఞావంతుఁడు గావలెనోగదా! ఇట్టి ప్రతిభావంతులు పల్వురు తమజీవితము లన్నియు ధారవోసి, తమ తపస్సుల ఫలితముగా దర్శించిన విశ్వసత్యములతోఁ గూడిన మహాకావ్య సమూహమైన సాహిత్యమును మానవలోకము పాలిటి పెన్నిధి యని వేరుగాఁ జెప్పవలెనా? ఈ నిధిని భద్రపఱుపవలసిన బాధ్యత ప్రజలపై నున్నది. దానిని దుర్వినియోగము చేయక, దాని వలన సంక్రమించు సంస్కృతి నంతటిని వారు పుణికిపుచ్చుకొన వలెను. గతానుగతికమయిన నిత్యజీవితమువలనఁ బ్రయోజనము శూన్యము. ఏజాతి తన భాషాసాహిత్యములను నిలువఁబెట్టుకొనక పోవునో యా జాతి పతనమొందును.[1]

1 "The care of the national language is at all times a sacred trust and the most important privilege of the members of a society. Every man of education should make it the object of his increasing concern to preserve his language, pure and simple, to speak it so far as in his power in all its beauty and perfection. A nation whose

ఇతర భాషాసాహిత్యముల మీఁద మోజుతో మన భాషాసాహిత్యములను న్యూనముగాఁ జూడరాదు మన సంప్రదాయమును, సభ్యతను బవిత్రముగా నెంచి వానిని నిలుపుకొనవలయును. ఏజాతియొక్క పార్థక్యమైనను భాషాసాహిత్య సంప్రదాయములమీఁద నాధారపడియుండునని తెలియవలెను. మానవుఁడు జీవనోపాధి నిమిత్తమై యేమార్గ మనుసరించినను తన జాతిసాహిత్యముతోఁ బరిచయము విధిగాఁ గల్గియుండవలెను. కేవలము పండితులకే సాహిత్యార్చన ముద్దేశితమైనదని తలంపరాదు. సాహిత్యము జాతియొక్క సమష్టినిధిగాని ప్రత్యేకవ్యక్తుల సొత్తుగాదు. లోకములో మానవులే బుద్ధిమంతులు. తామూ బుద్ధిమత్తను సాహిత్యార్చనమునకు వినియోగించి యుత్తమ సంస్కారులు కా నభిలషింపవలెను.

సమగ్ర సాహిత్యస్వరూప సాక్షాత్కారమైన పిమ్మట సాహిత్యార్చకు లొనర్పవలసిన కర్తవ్య మొకటి యున్నది. వ్యాఖ్యాత లేనిదే కవిప్రభ వెలుఁగదని యొక యాంగ్ల సూక్తి యున్నది.* విమర్శనమే కవిత నుద్దీపింపఁ జేయును. ఆంగ్లసాహిత్యము నవలోకించిన దీని యంతరార్థము వ్యక్తమగును. ఆంగ్లసాహిత్య మెంత యున్నదో దానికి మూఁడంతలు వ్యాఖ్యాన సారస్వత మున్నట్లు చూడఁగలము.

---

language becomes rude and barbarous must be on the brink of barbarism in regard to everything else. A nation which allows her language to go to ruin is parting with the best half of her intellectual independence and testifies her willingness to cease to exist." —Malavyaji

* "It is the critic that makes a poet."

కావున మన సాహిత్యము ప్రకాశించుటకు సహృదయపూర్వకమైన విమర్శకదీపిక లధికముగా వెలుగొందవలెను. అంతవఱకు మన సాహిత్యమునకుఁ బ్రశస్తి లేదు. ఈనాఁడు సాహిత్యార్చకు లా విధమైన లోపమును దీర్పవలసియున్నదని మనవి చేయుచున్నాను.

మొట్టమొదట ప్రజలకు సాహిత్యాభిరుచి యలవరచ వలసిన బాధ్యత పండితులపై నున్నది. ప్రజలందఱు విద్యావంతులైన గాని జాత్యభ్యున్నతి లేదని గమనింప వలెను. సహృదయసృష్టితో లోక కావ్యములఁ జూచి ప్రజలు వ్యుత్పన్నులు కావలెను. పిమ్మట సరియైన సాహిత్యార్చకులై, కావ్యామృతము గ్రోలి యాత్మ వికాసము చేకూర్చుకొన వలెను. పశుపక్ష్యాదులకన్న తా మొనర్చిన ఘనకార్యమేమో పరీక్షించుకొనవలెను. బ్రహ్మపదార్థాన్వేషణములో రక్తిని భక్తి శక్తులను సమకూర్చుకొనవలెను; ఉత్తమ జన్మము లభించినందులకు దానిని సద్వినియోగము చేసికొనవలెననెడి జ్ఞానము కలుగవలెను; లేనిచో తమజో పాఁపము సున్న!

సాహిత్యోత్సవమునకుఁ బవిత్రమైన, ప్రశాంతమైన మందిరములు కావలెను. గ్రంథాలయములు సరస్వత్యాలయములు. కని నెలకొల్పియున్నవాని నుద్ధరించుటయం దెంత [illegible] సేవలనుఁ జేకూర్చు [illegible]. కేవల [illegible] [illegible] కావున ప్రతి

మానవుఁడు విద్యావంతుఁడై, సరస్వత్యుపాసకుఁడై, సాహిత్యార్చనా ఫలితముగా సంస్కారియై, తనలోను సంఘములోను ప్రేమ కారుణ్యములను పండించి జాత్యభ్యున్నతికిఁ బాటుపడవలెనని యర్థించుచున్నాను.

[23–9–1944 తేదీనాఁడు వేటపాలెములోని "సారస్వత నికేతనపు రజతోత్సవ సభలో నేను గావించిన యుపన్యాస సారము.]

ఆంధ్ర శారద నీకు అక్షరాంజలులూ !
అందుకో ఆదుకో రావమ్మ మాయమ్మ !!

తరతరాల్ మాయింట తాండవించితి వంట
తలపు తెరగలవెల్లి తళుకు బెళుకుల తల్లి!
తెలుగు నేలల పైన తేనె మాగాణిని
తీయగా తేటగా తీర్చి దిద్దిన తల్లి !
పద కవితా సుదతికి మధుర గాన ఘణుతులన్
ముదముతో ముద్దుగా చదువు నేర్పిన తల్లి !
ప్రబంధ సుందరీ రసబంధుర భంగిమలూ
ప్రభలతో ప్రబలగా ప్రబోధించిన తల్లి !
నవకవితా యువతీ భావాభినయ గతులూ
శివముగా లీలలన్ పావణించిన తల్లి !
ప్రణయ రాగములోన ప్రణవ నాదము నింపి
ప్రవిమల యోగనియతి ప్రసాదించెడి తల్లి !

ఆంధ్ర శారద నీకు అక్షరాంజలులూ!
అందుకో ఆదుకో రావమ్మ మాయమ్మ!'

శుభం భూయాత్!

అనుబంధము

: కొన్ని మూలగ్రంథములు :

1.	కవిజీవితములు	శ్రీ గురజాడ శ్రీరామమూర్తి
2.	ఆంధ్రకవుల చరిత్ర	శ్రీ కందుకూరి వీరేశలింగం
3.	కవిత్వతత్త్వవిచారము	శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి
4.	విమర్శాదర్శము	శ్రీ బుర్రా శేషగిరిరావు
5.	విమర్శక పారిజాతము	శ్రీ పురాణం సూరిశాస్త్రి
6.	ఆంధ్ర వాఙ్మయచరిత్రము	శ్రీ వంగూరి సుబ్బారావు
7.	ఆంధ్రవాఙ్మయచరిత్రసంగ్రహము	శ్రీ "కవిత్వవేది"
8.	ఆధునికాంధ్రవాఙ్మయవికాసము	శ్రీ జయంతి రామయ్య
9.	ఆంధ్రగద్యచింతామణి	శ్రీ గిడుగు వేంకట రామమూర్తి
10.	సాహిత్యతత్త్వవిమర్శ	శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ
11.	సారస్వతవ్యాసములు	శ్రీ దువ్వూరి రామిరెడ్డి
12.	వ్యాస సంపుటములు	శ్రీ కోరాడ రామకృష్ణయ్య
13.	,, ,,	శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి
14.	సారస్వతోపన్యాసములు	శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
15.	సమీక్ష	శ్రీ మట్నూరి కృష్ణారావు
16.	కావ్యాత్మ	శ్రీ కె. వెం. రాఘవయ్యంగారు
17.	విమర్శవ్యాసములు	శ్రీ శిష్ట్లా రామకృష్ణశాస్త్రి
18.	విజయనగరాంధ్ర వాఙ్మయచరిత్ర	శ్రీ టేకుమళ్ల అచ్యుతరావు
19.	ఆంధ్ర వాఙ్మయ చరిత్ర	శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు
20.	నవ్యాంధ్రసాహిత్యవీథులు (ప్రథ)	శ్రీ కురుగంటి సీతారామయ్య
21.	ఆంధ్ర కవి తరంగిణి	శ్రీ చాగంటి శేషయ్య
22.	ఆంధ్రసాహిత్యచరిత్రసంగ్రహము	శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం
23.	తెలుగుకవుల చరిత్ర	శ్రీ నిడుదవోలు వేంకటరావు
24.	కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్య	శ్రీ సన్నిధానము వారు
25.	కావ్యజగత్తు	శ్రీ జి. వి. కృష్ణరావు

అభిప్రాయములు

మీరు వివిధ సాహిత్యాంశములను పరిశీలించి నిశితమైన సహృదయ రంజకమైన సాహితీ విమర్శన గావించుటచూచి సంతసించుచున్నాను.... మీ సాహిత్యకృషి ఇతోధిక సాఫల్యమును బొందును గాక యని కోరుచు మీకు నా శుభాకాంక్షలను ఆశీస్సులను అందజేస్తున్నాను.

— డాక్టరు. బూర్గుల రామకృష్ణరావు, 1-4-1956.

కన్నియ నిచ్చినట్టి కృతికన్న బహూకృతిఁ జేయ పెట్టుటం
చన్నవనీత కోమల మనస్సహితంబును కావ్య కన్యకన్
మన్ననఁ జేసి యిచ్చితివి మామకు మామవైతివయ్యా నీ
కన్నను దిట్ట వేఱొకఁడు గల్గునె పిల్లలమఱ్ఱి వంశజా!

—శ్రీ పంగనామముల ప్రసాదరావు, 26–2–1946.

శ్రీ పిల్లలమఱ్ఱి హనుమంతరాయని 'సాహిత్య సమాలోచనము' వల్ల సాహిత్యోద్యానములో వివిధ శాఖల విధానమూ, తత్వమూ గోచరమవుతవి.

—శ్రీ శివశంకరశాస్త్రి, జూన్ 1946.

Your book will help the reader to have an idea of the charm of our Literature and its historical development

—Sir C. R. Reddi.

శ్రీ హనుమంతరావుగారు బహువిషయముల నవలోకించి మఱియు నుపపత్తులం గైకొని ప్రాచీన సాహిత్య సంప్రదాయములఁ దెలిపి జిజ్ఞాసువుల కత్యంతోపకార మొనర్చి ధన్యులయిరి.

—"మంజువాణి" ఏలూరు 19–6–1949.

సమీక్షలు

౧.

ఈ కాలంలో తక్కిన విషయాలతోపాటు సాహిత్యంకూడా విప్లవోద్యమానికి గురి అయింది. చాలామంది కవిపండితులు పూర్వనియమాలని తెంచుకొని స్వేచ్ఛా విహారాలకి దారితీస్తున్నారు. అంచేత అన్ని విషయాల్లోనూ అనేక కారణాలవల్ల మార్పులు కలుగుతున్నాయి. శ్రీ హనుమంతరావుగారు అటు ప్రాచీన నియమాలనీ, ఇటు నవీన స్వేచ్ఛావిహారాన్నీ కూడా గమనిస్తూ, విమర్శిస్తూ యీ 'సాహిత్యసమాలోచనాన్ని' తెలుగువారికి అందిస్తున్నారు. ఇందులో నన్నయ మొదలు నారాయణబాబుదాకా సాహిత్యంలోని వివిధ విషయాలూ 'సర్వే' చెయ్యబడ్డాయి సంగ్రహంగా.

సాధారణంగా విద్వాంసులు ప్రాచీనపద్ధతివేపు మొగ్గు చూపిస్తారు. భాషాంతరాల సంపర్కంగల యువకులు నవ్యపద్ధతులని మెచ్చుకుంటారు. మంచి, చెడ్డలకి ప్రతీపద్ధతిలోనూ అవకాశంవుంది. నిష్పాక్షికంగా విమర్శించే వారికి రెండు పద్ధతుల్లోనూ మంచి పరిశ్రమ వుండాలి. శ్రీ హనుమంతరావుగారు అటువైపు శ్రీ కురుగంటి గురువుల శిష్యులు; ఇటువైపు ఎం. ఏ. బిరుదధారులు. వారి కలానికి రెండువైపులా పాళీలున్నాయి. అంచేత హనుమంతరావుగారు సాహిత్యాన్ని సమాలోచన చెయ్యడానికి మంచి సమర్థులు.

మరో విషయం ఏమిటంటే - సమాలోచనలు వ్రాసే విమర్శకులు సాధారణంగా ప్రశంసకి పూనుకొన్నప్పుడు ఏదో ప్రాచీన సాహిత్యంలోని అన్ని భాగాలమీదా వ్రాస్తారు. అలాకాకుండా ఒక్కొక్క విషయాన్ని గురించి సమగ్రంగా చర్చిస్తూ ఒక సిద్ధాంతానికి రావడమనే మంచిపద్ధతి. ఈ సమాలోచన కర్త ఆ పద్ధతినే అనుసరించి, తాను ఉపన్యసించి ఇచ్చిన రేడియో ఉపన్యాసాలనీ, అన్యత్రోపన్యాసాలనీ, ఉపన్యాసాలనీ, ఇతర ప్రకటితాలైన వ్యాసాలనీ కూడా సంపుటీకరించి ఇలా గ్రంథరూపంగా తెలుగులోకానికి అందిస్తున్నారు. తమకు ఎలాంటి పక్షపాతమూ, చిన్నా, పెద్దా భేదం చూడకుండా, సాహిత్యంలో స్వల్పంగా కృషిచేసినవారికి కూడా సమానమైన స్థానం చూపడం ఈ గ్రంథంలోని గొప్ప విశేషం.

శ్రీ హనుమంతరావుగారి సిద్ధాంతాలు చాలామట్టుకు గ్రాహ్యాలు. మహదాశయాలతోను, నిష్పాక్షిక బుద్ధితోనూ విషయ వ్యక్తీకరణమే, విమర్శకుడి ప్రధాన కర్తవ్యమనీ, కవి, చిత్రకారు లిద్దరికీ మానవాభ్యున్నతే ప్రధాన లక్ష్యమనినీ వీరు చెప్పిన పలుకులు బంగారు తునకలు. ఇలాంటి ఆశయాలు కల, కవి విమర్శకులు ఏది వ్రాసినా అది అందరికీ శిరోధార్యం!

శ్రీ హనుమంతరావుగారు బాగా అవలోకనంచేసి సిద్ధాంతాలని విశదీకరించారు.

శ్రీ హనుమంతరావుగారు సంక్షిప్తంగా ఆంధ్రసాహిత్యాన్ని వివరించి చెప్పడమే కాకుండా, సాహిత్య విమర్శనలను కొన్నిటిని పట్టికలో చూపారు. అది మంచిపద్ధతి. శ్రీ శివశంకర శాస్త్రిగారికవి "పరిచయము." శ్రీమల్లంపల్లివారి గ్రంథ "ప్రవేశిక" ఈ గ్రంథానికి అందం కూరుస్తున్నాయి. శ్రీమల్లంపల్లివారి ప్రబోధం కవికుమారుల కందరికీ గ్రాహ్యమైనది.

"సాహిత్య సమాలోచనం" లాంటి గ్రంథాలు మనవాఙ్మయానికి అలంకారాలనడంలో ఏమీ సందేహంలేదు. బు. వేం. ర.

— ఆంధ్రశిల్పి, మద్రాసు.

౨

శ్రీహనుమంతరావుగారు ఖండకావ్యములను, ఏకాంకనాటకములను సమీక్షాగ్రంథములు మున్నగువానిని లెక్కింటి రచించిరి. వీరి యీసాహిత్య సమాలోచనము పండితోత్తములు విమర్శకాగ్రేసరులు, చరిత్రరచనా చతురులు వారి గురూత్తములు నగు, బ్రహ్మశ్రీ వేదమూర్తి కురుగంటి సీతారామభట్టాచార్యులవారికి ప్రేమోపహారముగ నర్పించియున్నారు. ఏతద్గ్రంథమునకు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, సరసమగు ప్రవేశికను రచించిరి. శ్రీ తల్లావజ్ఝల శివశంకరశాస్త్రిగారీ కవిగారి పరిచయమును గావించిరి. ఈ కవితల్లజుడు తామప్పు డప్పు డాంధ్రసాహిత్యమును గూర్చి యొనరించిన యుపన్యాసములను, రేడియో ప్రసంగములను, మతి కొన్ని వ్యాసములను ఏర్చి చక్కని క్రమము కూర్చి యీ గ్రంథమునకు—

"సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః కుచద్వయం

ఏకమాపాత మధురం అన్య దాలోచనామృతమ్"

అను సూక్త్యనుసారము సాహిత్యసమాలోచనము అను నామ మిడిరి.

ఇందు విషయము మూడు భాగములుగ విభజింపబడియున్నది. మొదటి భాగమున సాహిత్యోద్దేశము, మాటలలో భావార్థములు, కవి—సమాజము, విమర్శకుడు కళోపాసకుడు, అను నీ సాహిత్య విషయములు వివరింపబడినవి. అందు మొదటి విషయమున సాహిత్య, సారస్వత, వాఙ్మయపదముల వివరణము, ఉద్దేశపదనిర్వచనము, మఱియు సహృదయులు, రసజ్ఞులు, ప్రతిభావన్నులు, అను పదముల వివేచనము కడుంగడు మనోహరములు. జీవితోద్దేశ సాహిత్యోద్దేశముల కైక్యము చెప్పి రసోవై సః యను శ్రుతివాక్యమును ఉభయత్ర సమన్వయించుట సహృదయ హృదయరంజకము.

"వైదిక వాఙ్మయ గాంభీర్యమే పురాణగ్రంథ రచనోద్యమమునకు కారణము. శైవ, వైష్ణవ సంఘర్షణమే వీరశైవ వైష్ణవోద్యమహేతువు. కర్మకాండాశక్తి భక్తిమార్గావలంబనమునకు మూలము. సాహిత్యమును సామాన్య జనులకందుబాటులో నుంచుటే, నవ్యసాహిత్యోద్యమసారాంశము" అని ఇందువివరింపబడియున్నది. ప్రాచీన నవీన లాక్షణికుల సాహిత్యోద్దేశములు చక్కగా ఇందు సమన్వితములై యున్నవి.

ఇక రెండవ విషయము పరికింతము:

ఇందీకవి తన శాస్త్రజ్ఞానము నుపయోగించి, యభిధాదివృత్తుల వివరించుచు వాచ్యార్థాదుల కితర పండితుల వలె శాస్త్రగ్రంథములలోని యుదాహరణములకు వ్యావహారిక వాక్యములలోనే యుదాహరణము లిచ్చుచు వాచ్యార్థ లక్ష్యార్థ వ్యంగ్యార్థములను, ఈ శక్తులను, ఎంతయు మనోహరముగ బోధించెను. ఇందుకొక మచ్చుమాట.

"కళాపూర్ణోదయములో సుగాత్రితో సఖులన్నమాట:

"మేల్ మేలు సంపదలిచ్చిన విధాత వివేక మేమి చెప్ప" ఇచట వివేకులు అను పదమునకు అవివేకులు అని వ్యంగ్యార్థము ప్రకరణలభ్యము. ఇట్టి యుదాహరణములతో నొప్పారుచున్నది. భాషా శాస్త్రమునకు సంబంధిం

చిన ప్రయోగములు, వర్ణలోపాది విషయము లెన్నో వివరింపబడియున్నవి. మూడవదగు కవి — సమాజము అను భాగమున కవి సర్వోత్కృష్టుడనియు, బ్రహ్మసమానుడనియు, కావుననే 'రవిగాంచనిచో కవిగాంచునే కదా' అన్నాడనియు తెలిపి, కవి సమాజమున కుపయోగించు తీరుకూడ నిట్లు చెప్పబడినది. కవి తాను జ్ఞానవంతుడై యెన్నో విషయముల గ్రహించి భావించి, వాని నన్నిటిని సమాజమునకు ప్రసాదించును. కవియొక్క పదాడంబరాదులచే, విషయమును పామర సమాజికులు గ్రహింపలేనిచో, వీరిద్దరి మధ్య మరియొక వ్యాఖ్యాత, సహృదయు డుండవలెను. ఉండితీరుమనియు, వాని ద్వారా పామరసమాజ మా కవి విజ్ఞానము గ్రహింప యత్నింపవలెనే గాని, కవిని, పామరుల మెట్టుకు దిగింప పూనుట తప్పనియు తెలుపుచున్నది. ఈ భావమునే పాశ్చాత్య విద్వాంసు లంగీకరించి యాచరించుచున్నట్లుదాహరింపబడియున్నది. ఇట్లు కవి, సమాజము లవినా భావ సంబంధములతో నుండినచే సామాజికుల మనస్థితి తొలగి విశ్వమానవ కళ్యాణము సమకూరునని వివరించిరి.

విమర్శకుడు, కళోపాసకుడు అను నాలవ భాగమునందు, సద్విమర్శకుడు పదములలోని గూఢార్థముల వివరించుటకు, ప్రజలకు కళా సౌందర్యమును వెల్లడించుటకు కావ్యములందు, కళోపాసనయందు, అభిరుచిని ఆదరాభిమానముల గల్గించుటకు ప్రయత్నించునని తెలిపి కళయను పదమునకు నిర్వచనము చేసిరి. చతుష్షష్టికళలలో కవిత్వము, చిత్రలేఖనము, సంగీతము, శిల్పకళ మున్నగునవి లలితకళలుగా నెన్నబడుచున్నవి. అవి భారతదేశమున జన్మించినవి, వృద్ధినొందినవి. హిందూదేశము సకల లలితకళల కాటపట్టని వానివాని విశేషస్థలములు చక్కగా వివరించిరి. ఇంతేకాక శాస్త్రములకు, విద్యలకు కళలకు, మన భారతభూమియే జన్మభూమియని ఘంటాపథముగ నుడివిరి.

ఇంక రెండవ భాగమున ముఖ్యముగ పదకవితను గూర్చి చెప్పుచు, "భావ, వస్తు, రచనలు కవితలో ప్రధానములుగ నుండును. అందేది ప్రబలముగ నుండిన నాపేరు వడయును. అట్లే భావకవిత, వస్తుకవిత యనుపేర్లు

వెలిగాను." అని చెప్పెను. భారతదేశము వ్యాసపాయక దేశమువలెనే శాస్త్రము: కవయోగించు పదకవిత, మాత్రాఛందముతో వర్తిల్లు చున్నదనియు, పారిజాత శతాబ్దినాటికి ప్రబంధకవిత ప్రబలినను, తాళ్ళపాక చిన్నన్నగారి పదరచనలు, ద్విపదరచనలు, అష్టపదులు, బయలుదేరు చున్నవనియు తెలిపిరి.

పిదప ప్రబంధకవితను గూర్చి — రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం —అను జగన్నాథుని కావ్యలక్షణమును, ఇతరుల ప్రాచీన కావ్యలక్షణముల నన్నిటిని చూపి పూర్వకాలము నుండి, వారునుండిన ప్రబంధపదమునకు, అనేక ప్రబంధముల నుదాహరించుచు లక్షణములను చెప్పెను. పిమ్మట ఆంధ్ర వచన స్వరూపమును తెలుపబూని, దానిని గాత్రగ్రంథము, సమన్వయము అను శైలితో విభజించిరి. అందు మొదటి భాగమున వారు చూపిన గద్య పద్య మిశ్రవచనము అనేకవిధములగు గద్యముల నుదాహరించు టత్యంత మనోహరము.

రెండవ భాగమందు అన్వయమను పేరుతో నాటి నన్నయ మొదలు నేటి కొంతమంది కవుల వరకు నెవరెవరే యే విధమైన గ్రంథములు రచించిరో తెలిపి లోకోపకార మొనరించిరి.

ఇక నవీన కవితలో కాలిడిరి. శ్రీ తిరుపతి వెంకటకవుల కవిత ప్రాచీన కవితకు భరత వాక్యము. నవ్యకవితకు నాందియు కాగా, దీనికి ముఖ్యముగ గురుజాడ వారు, రాయప్రోలు ప్రవక్తలైనపిదప కట్టమంచి, కాటూరి. పింగళి, దేవులపల్లి మొదలగువారు దీనిని వర్ధిల్ల జేసిరి. ఈ నవ్య కవితలో పరిణామములు చెప్పి యెవరెవరేయే మార్గము ననుసరించిరో చక్కగ నుదాహరించిరి. ఇందులోనే రూపక వికాసమొకటి. అందు రెండు భాగములు చెప్పిరి. మొదటి భాగమున రూపక భేదములు, భరతాచార్యులు చెప్పిన దృశ్యకావ్యలక్షణ ప్రయోజనములు, తెలుపబడినవి. ఈ దృశ్య కావ్యములు చాల నుత్తమకావ్యములు. ఇట్టి యుత్తమ కావ్యరచననే కాళిదాసు, భవభూతి, షేక్స్పియరు మొదలగువారుత్తమ కవులైరి. రెండవ భాగమున సంస్కృతములో ఖండకావ్య, కథానిక, ఏకాంకికములు ప్రాచీనములే

యని, ప్రబంధ, నవల, నాటకము లందంతర్భాగమం జెప్పి సంస్కృతోత్తమ గుణములతో నేకాంకికల రచించిన వారు తల్లావఝ్ఝుల, నోరి, చింతా మొదలగు వారని పెక్కుర జేర్కొనిరి.

ఇక మూడవ భాగము. ఇది యొక యద్భుతోపన్యాసము. ఇందించుక సాహిత్య పరిణామము చూపబడినది. ఆంధ్రరాజుల పాలనము, దేశకవిత, తత్ప్రభావము, ఆంగ్లసాహిత్య ప్రచారము వలన గలిగిన నూతన కల్పనము, భావకవిత్వము మొదలగునవిందు వర్ణింపబడినవి.

దీనిం బట్టి, శారదా వాపీతమున కిది యొక దివ్య కుసుమము. నూతన కావ్య మనుట కావంతయు సంశయము లేదు. ఇది కళాశాలా విద్యార్థుల జ్ఞానాభివృద్ధి కెంతో తోడ్పడగలదని నాహృదయము.

—భావరాజు వేంకట కృష్ణారావు, మద్రాసు. 26–6–1946.

3

ఈ రచయిత సాహిత్య విషయముల నుసమాలోచించి వ్యాసరూపమున బ్రకటించెను. వాని గ్రథన మీ గ్రంథము.

ఇందలి వ్యాసములు కొన్ని రేడియో కేంద్రములనుండి ప్రసారితములు. కొన్ని సభలలో జదువబడినవి. కొన్ని పత్రికలందు ప్రచురితములు. ఒకటి రెండు నవీనములు. ఇందు మూడుభాగములు కలవు. మొదటిది సూత్రగ్రథనము, రెండవది వికాసము, మూడవది అర్చనము. వాని తుదిని యనుబంధము కలదు. నేటి సాహిత్యరంగమున ప్రాత నియమములు సడలినవి. ప్రతిభ నూతనమార్గముల బ్రవహించుచున్నది. కాని నియతులు స్ఫుటము కాలేదు. పథకములు సృజింపబడలేదు. ఇట్టి కాలమున సజ్జ్వలవంతమైన విమర్శలు సాహిత్యమునకు శాస్త్రీయ సత్యపరిణామ వికాస పరిశీలనము అవసరము. అట్టి దృష్టితో నీ గ్రంథరచనము ప్రయోజనకారి యగుచున్నది.

ఇందు మొదటిభాగమున సాహిత్యమర్మము, భావగాంభీర్యము, కవి

సమాజ సంబంధము, వినూత్నకవసృష్టి, లలితకళా హాస్యము అను విషయములు విపులముగ దెలుపబడినవి. ప్రాచీనాలంకారికుల మతము లక్ష్యలక్షణ ముదాహరింపబడినవి. నవీనుల హృదయములును వానిలో హత్తింపబడినవి.

రెండవ భాగమున పద్యప్రబంధ వచన రచనాభంగిమలు దేశకాలపరిస్థితులతో జూపబడినవి. నవ్యకవితా రూప వికాసములు—వివరించి ప్రదర్శింపబడినవి. సాహిత్యపరిణామార్చనము మూడవభాగమున జూపబడినది. ప్రాచీన సాహిత్య స్వరూపావగతి నవ్యమార్గాభ్యుదయమునకు సోపానము. సుసంస్పందిత హృదయాలకు మాత్రమే గోచరించే రీతి ధ్వని వక్రోక్త్యౌచిత్యాది స్వరూప ప్రదర్శనము సాహిత్యపరులను బాలురను నర్తింపజేసి వారిలో రసోన్ముఖతను కలిగిస్తుంది. సాహిత్యసాధకుల కిది హస్తావలంబనమును. ఇందలి వ్యాసములు భిన్నకాలములందు భిన్నవాతావరణముల ననుసరించి రచింపబడినవి.

ప్రాచీన సాహిత్యమును సాహిత్యమీమాంసలను తెలియని నవ్యకవుల కీగ్రంథమెంతేని సహకరించును. సర్వతోముఖమైన సాహిత్యమీమాంసా రచన మాంధ్రభాషలో సిద్ధించుట కియ్యది సోపానము కాగలదు.

—ఆలిండియా రేడియో : విజయవాడ, 7–6–1960.

౪

సహృదయ సమీక్ష

"సాహిత్యసమాలోచనము" శ్రీ పిల్లలమర్రి వేంకటహనుమంతరావు గారు ఆంధ్ర శారదాంబకు సమర్పించిన శిరస్త్ర నవ్యకుసుమము. సాహిత్యసృష్టి సంస్కారములలో విశిష్టమైన సాహిత్యప్రక్రియా స్వరూప నిరూపణములో 'సాహిత్యసమాలోచనము' ఉత్తమోత్తమము. శ్రీ హనుమంతరావుగారు ఆంధ్రాంగ్ల భాషాశాస్త్రములు అంతట ఆంగ్లసాహిత్యములోని అనల్పములైన వివిధ విషయముల పరిజ్ఞానముతో ఆంధ్రసాహిత్య ప్రక్రియా స్వరూపమునకు కొంత సమగ్ర రూపకల్పన మొనరించిరి.

ఒకరు కవి కావచ్చును. మరియొకరు విమర్శకులు కావచ్చును. వేరొకరు నాటకరచయితగా పేరుగాంచవచ్చును. మరికొందరు గేయకవులుగా ప్రఖ్యాతి బడయవచ్చును. కొందరు మహాపండితులు కావచ్చును. ఇతరులు కొంతమంది కథానికా రచయితలుగా, నవలాకర్తలుగా ప్రసిద్ధి గాంచవచ్చును. శ్రీ పిల్లలమర్రి కవి, విమర్శకుడు, నాటకరచయిత, కథానికారచయిత, భాషావేత్త, సాహిత్యద్రష్ట. ఆయన వక్త, ప్రవక్త.

"సూత్రగ్రహణము", "ప్రక్రియాస్వరూపము", "స్థూలపరిశీలనము" ఇవి సాహిత్యసమాలోచనాంతర్గత ప్రవిభాగములు. సూత్రగ్రహణములో సాహిత్యలక్ష్యమును వివరించి, సాహిత్యమునందును సమాజమునందును కవికి కళాకారునికి గల స్థానమును స్థూలముగా వివరించిరి. ప్రక్రియాస్వరూపములో పదకవిత్వ సంపూర్ణస్వరూపమును, ప్రబంధవాఙ్మయలక్షణమును ప్రబంధీకరింపబడినవి. ఇక "ఆంధ్రవచన స్వరూపము"ను వ్యాసమే ఒక ప్రత్యేక గ్రంథము. ఇతివృత్తములో, రసములో, భాషలో, భావములో నవీన కవిత్వమునకు ప్రాచీన కవిత్వమునకు గల విభిన్నలక్షణములను "అభినవకవిత"లో కవి ప్రతిపాదించిరి. పాశ్చాత్య వాఙ్మయ ప్రభావ భవములుగా ఆంధ్ర సాహిత్యములో నొక సుస్పష్టస్థానమును ఆక్రమించుకొనిన ఏకాంకికల రూపకవికాస పరిణామ నిరూపణము అత్యుత్తమముగా నున్నది. ఇక మిగిలినది సాహిత్యపరిణామము, సాహిత్యార్చనములను గురించి స్థూల పరిశీలనము.

"పరిచయకర్తగా, గుణగ్రహణ పారీణుడుగా, పండితుగా, వ్యాఖ్యాతగా న్యాయమూర్తిగా విషయ వివేచనమునందు రసాభివ్యక్తి వఱకు గల వివిధ స్థితులతోను, సామాన్య పాఠకుని నడిపించి, శిక్షణమొసగి, యలరించి, యానందమును బంచి యుప్పొంగిపోవుస్థితి కల్గించునట్టి యుత్తమ దార్శనికుడే విమర్శకుడు" అని శ్రీ హనుమంతరావుగారి 'శారదా విలాసము'లో వివరింపబడిన విమర్శకునిలక్షణము. 'సాహిత్య సమాలోచనము'లో పాఠకులకు శ్రీ పిల్లలమర్రి ఇట్టే సాక్షాత్కరింతురు. సాహిత్య సమాలోచనములో సాహిత్య సంప్రదాయ ప్రబోధము సవిమర్శకముగా సాగినది. దాని నిట్లు

సంగ్రహింపవచ్చును.

సాహిత్య సమాలోచనములో గమనింపదగినవి ముఖ్యాంశములు మూడు. 1. సాహిత్యకృతులను సూత్రించు విధానము 2. సాహిత్య ప్రక్రియా ప్రబోధములోని విలక్షణత 3. ఆంధ్ర సాహిత్య క్రమవికాస నిరూపణము లోని వైలక్షణ్యము.

సాహిత్యసూత్రములు సార్వకాలిక సార్వత్రికములైన విషయములచే సూత్రితమై యుండవలెను. లక్ష్యలక్షణ సమన్వయము చేయునప్పుడు వివేచనాత్మకమైన రీతి సంభావింప నగును.

"సంభావనాస్యాదుత్ప్రేక్షా" అని ఉత్ప్రేక్షాలంకార లక్షణము. ఇది సూత్రము. పాఠకమునకు సమష్టిగా భావ వ్యక్తికి వివేచనాత్మక పద ప్రభాసితము. ఇక దీనిని సోదాహరణముగ లక్ష్యలక్షణ సమన్వయ మొనరించుట ఎంతయైనను గావింపవచ్చును. అల్ప పదములతో అనల్పార్థ వచనము [illegible] సాధ్యముకాదు. శ్రీ పింగళివారు సూత్రప్రబోధములో ప్రతిభా ప్రపూర్ణులై కానవత్తురు.

"భావప్రకాశనమే కవి యత్నము. వస్తుతత్త్వస్వరూప ప్రకటనమే విమర్శకుని బాధ్యత."

"కళోపాసనమూ ముఖ్యాతిత్వమూ ఈశ్వరోపాసనము"

"వ్యాఖ్యాత లేనిదే కవి ప్రతిభ వెలుగదు."

"సాహిత్యము సత్యమును బోధించి, అనుభవ రహస్యములను విప్పి చెప్పును."

సాహిత్య సమాలోచనము నిట్లు సహృదయతతో సమాలోచింప వచ్చును.

సూత్ర ప్రతిపాదనము :

సాహిత్యోత్కర్ష విచారణము సూత్ర ప్రతిపాదనల వలన ప్రధానముగా సంపాదింపబడినది "సహితస్య భావః సాహిత్యమ్" "సత్యం శివం సుందరం"

అను పరమాశయముల నిమిడ్చికొని ఉత్తమసందేశ సంభాషితమైనది సాహిత్యము. 'సాహిత్యము సౌందర్యమూర్తి.' సాహిత్యము రాజస తామస ప్రవృత్తులను లీనమొనరించి శుద్ధసత్వమును ప్రకాశింపచేసి, తన్మూలమున సౌందర్యాలోకనమున కవ్వాతనిచ్చును. ఇట్లెన్ని యైనను గాంచవచ్చును. "విమర్శకుడు-కళోపాసకుడు" అను వ్యాసములో నంతర్యాత్మమైయున్న లలితకళా ప్రాభవ ప్రభావనిరూపణము. కవి కళానైపుణ్యము సువ్యక్తమొనర్చును. కవి చిత్రకారుడు; హృదయాంతస్థిత భావములను భాషలో వ్యక్తమొనర్చు మేటి చిత్రకారుడు. సూత్రసంపుటితమలో శ్రీ హనుమంతరావు గారు చిత్రకారులుగా కనిపించుటను పండితులు గ్రహింపగలరు.

ప్రక్రియా స్వరూపము :

"పదకవిత్వము" ఆంధ్రసాహిత్యములో అనల్పమైనది. ఏతత్స్వరూప నిరూపణమును, ప్రాచీనాధునిక పదకవితా వైలక్షణ్యమును కవి కమనీయముగా నిరూపించిరి.

'ప్రబంధము' ఆంధ్ర సాహిత్యచరిత్రలో అపూర్వసృష్టి. అప్పకవిచే లక్షీకరింపబడిన ప్రబంధలక్షణముల నుదాహరించి తిక్కనమహాకవి, శ్రీనాథ కవిసార్వభౌముల ప్రబంధోచిత రచనావిధానమును నిరూపించి, ఆంధ్ర సాహిత్యములో స్వర్ణయుగముగా సర్వపండిత సంభావితమైన కృష్ణరాయ యుగ ప్రాభవమును ప్రబంధీకరించి, నవ నవ ప్రబంధముల నుల్లేఖించి, ప్రబంధవాఙ్మయ ప్రభావమును ప్రబోధించిన విధానము శ్రీ పిల్లలమర్రి వివరణాత్మక సులభశైలీపాటవమును స్పష్టమొనర్చును.

అసలు కవిత్వమనగ నేమో, కవి లక్షణము లేవియో, 'ఇవి' అని నిరూపించుటకు వీలులేని ఈ నవకాలములో వచనలక్షణములు నిరూపించుట యపూర్వము. గద్యమే వచనము. పద్యరచన ముత్తమమా లేక గద్యరచన ముత్తమమా కాక గద్యపద్యాత్మకమైన నవసృష్టియే సహృదయ హృదయ రంజకము కాగలదా? వీని కెట్లు సమాధానమిచ్చుట? పద్యలక్షణములనిన గణ యతి ప్రాస లుండవలెనని చెప్పి, చంపకమాల యనియో, ఉత్పలమాల

యనియో, చేసిన వచ్చును. కాని గద్యము ఎట్టిదైననేని తన్నిరూప స్వభావములను వ్యక్తమొనర్చు మహాకావ్యము. గద్యలక్షణములను సూత్రబద్ధమొనర్చుట సాహసము. భిన్నరూపములలోనున్న వచనమును స్వప్రతిభా ప్రభావితులై తమంతట తామేవ ప్రదేశములను ఎవరికివారు నిరూపించుకొన వలసినదే.

శ్రీ హనుమంతరావుగారు సునిశితమైన విమర్శకదృష్టితో ఆంధ్ర సాహిత్యాంతర్గత వచన స్వరూపమును రూపొందించినారు. దాని నిట్లు సంగ్రహించుట సంభావ్యము. ఆంధ్ర వచన వాఙ్మయమును ఐదు భాగములుగా విభజించవచ్చును. 1. పద్యములో వేసపడరాని పురాణవచనము భారత భాగవత రామాయణాదులలోని వచనము. 2. ప్రబంధమందాలంకారిక శైలీవిన్యాసములతో వర్ధిల్లిన వచనము. శృంగార నైషధము, మనుచరిత్ర వసుచరిత్రాది మహాప్రబంధములలోని వచనము. 3. చిన్నయసూరి, కొక్కొండ వేంకటరత్నం పంతులుగారల గ్రాంథిక భాషావచనము. 4. వీరేశలింగము పంతులుగారి సుబోధకము సులలితమగు వచన రచనము. 5. ప్రజానీకమున కందుబాటులో నుండునట్లు రచింపబడుచున్న వ్యావహారిక భాషావచనము. ఎంత సమగ్రమైన వచన స్వరూప నిరూపణము! ఈ వ్యాసము ఒక ప్రత్యేకగ్రంథమైనను ఆంధ్రలోకమును అలరించియుండెడిది. అది అట్లు కావలెనని నాకాంక్ష; ఆకాంక్ష.

ఇక 'అభినవ కవిత': ఈనాడు కవిగానివారెవరు? 'నేను' అని వ్రాయ గలిగినవారు అందరు కవులే! అభినవకవితా లక్షణములు. ఇవి-యని ప్రత్యేకముగా నిర్ణయించుట కష్టతరము. అందువలననే పిల్లలమర్రివారు సుదీర్ఘమైన ఉపన్యాస మొనర్పవలసి వచ్చినది. ఏది సత్యకవిత్వము? గేయ కవిత్వమా- ప్రేమకవిత్వమా కరుణ కవిత్వమా - విప్లవాత్మకమైన కవిత్వమా - వీనిలో ఏది సత్యకవిత్వము. సర్వమును సత్యకవిత్వమే. సత్యకవిత్వము సర్వసమస్తమైనది. ఇట్టి అభినవ కవిత్వమునకు సంపూర్ణమైన ఆఖ్యాయిక ఈ 'అభినవ కవిత'. ఇది శ్లాఘనీయము.

మిగిలినది రూపకవికాసము, అసలు నాటిక, ఏకాంకిక-ఇవి పాశ్చాత్య

వాఙ్మయ ప్రభావభవము లు. తెలుగులో కొన్నికొన్ని ఇదివఱకున్నను మొన్న మొన్న లెక్కలేనన్ని ఆవిర్భవించినవి. ఏతత్స్వరూపక వికాస నిరూపణము సహృదయ హృదయ రంజకము కాగలదు. ఇట్లింకెంతయైనను సమాలోచనము చేయవచ్చును.

స్థూలపరిశీలనము :

చారిత్రాత్మకముగా ఆంధ్రసాహిత్య క్రమపరిణామ నిరూపణము సర్వ పండితలోక సంపూర్ణసౌహృదయము బడయగలదు. తరువాత సాహిత్యా న్వేషా విశేషములు సంగ్రహముగ నిరూపింపబడినవి. ఇది సాహిత్యార్థు లకు 'సాహిత్య సమాలోచనము' సముఖమున సాక్షాత్కరించుకొను సమగ్ర సాహిత్య స్వరూపము. సర్వవిద్యార్థి లోకము సంభావించు వ్యాస సముచ్చ యము సాహిత్య సమాలోచనము.

చివరిమాట :

శ్రీ పిల్లలమఱ్ఱి వారిది శారదా పీఠము. ఆంధ్ర శారదకు నవ్యా లంకరణము సాహిత్య సమాలోచనము. అది ఈదినము ఆంధ్ర విద్యార్థుల మధుర మంజుల హృదయ రంజక మయినది. అట్లే సాహిత్యసంపదలో - మాధురీమహిమలో — సాహిత్యసమీక్షలో — శారదా విలాసములో — అంతర్లీనమై అంతర్యామితమైయున్న ఉత్తమ సాహిత్య సాహిత్య సమా లోచన మొనరించు శుభదినము « తెలుగు విద్యార్థి »కి పర్వదినము.

—మహతీ శంకర్, "తెలుగు విద్యార్థి".

వెల్‌కం ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్, బ్రాడీపేట గుంటూరు-2